ఈనాడు

హైదరాబాద్ 2-1-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 143

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



సేద్యానికి నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభం నేపథ్యంలో ప్రగతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును ఆలింగనం చేసుకున్న సీఎం కేసీఆర్

అద్భుత విజయం

విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్

- సేద్యానికి నిరంతర కరెంటుతో రైతుల్లో ఆనందం
- దేశంలోనే 24 గంటలు ఉచితంగా ఇస్తున్న రాష్ట్రం తెలంగాణే..
- రాష్ట్రానికి గొప్ప ఖ్యాతిని సముపార్జించి పెట్టారు.. -2లో
- అధికారుల అభినందన కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్

భూదస్త్రాల ప్రక్షాళన విజయవంతం: సీఎం -2లో

‘రైతులకు 24 గంటల(నిరంతర) విద్యుత్ సరఫరా చేయడం మూడున్నరేళ్ల వయసున్న సరికొత్త రాష్ట్రమైన తెలంగాణ సాధించిన అద్భుత విజయం. నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది. రైతులు అనుభవించిన కరెంటు కష్టాలకు శాశ్వత విముక్తి కల్పించాలనే లక్ష్యంతో వ్యయప్రయాసలకోర్చి 24 గంటలు సరఫరా చేస్తున్నాం. తెరాస ఎన్నికల ప్రణాళికలో కూడా హామీ ఇవ్వలేదు. అయినా రైతులకోసం ఉచిత విద్యుత్తు ఇవ్వాలని నిర్ణయించాం’ - సీఎం కేసీఆర్



ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సోమవారం రాత్రి భేటీ అయిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్

దేశానికి తెలంగాణ ఆదర్శం: పవన్ కల్యాణ్

కేసీఆర్‌తో ప్రగతిభవన్‌లో గంటన్నర పాటు భేటీ -2లో



సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ‘టీఎస్ కాప్’ మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో అదనపు డీజీపీ అంజనీకుమార్, రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు

పోలీసుల పనంతా ఫోన్లోనే!

- ప్రత్యేక యాప్ ఆవిష్కరించిన డీజీపీ మహేందర్‌రెడ్డి -6లో
- ప్రపంచంలోనే తొలిసారి
- గస్తీ, దర్యాప్తు, నేరగాళ్ల గుర్తింపు దీని ద్వారానే..

రండి.. రాజకీయ మార్పు తీసుకొద్దాం..!
వెబ్‌సైట్‌ను ప్రారంభించిన రజనీకాంత్


3లో

జన్యు మార్పిడి పంటలపై శాస్త్రీయ అధ్యయనం ఏదీ!

అసహాయ కేంద్రం

- సీఎం హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసినా స్పందన కరవు
- అనిశా తప్ప పట్టించుకునే వారే లేరు
- పరిష్కారం కాని సమస్యలు
- సీఎం అసంతృప్తి.. విచారణకు ఆదేశాలు

- హలో.. ముఖ్యమంత్రి గారి హెల్ప్‌లైనా! సార్ మా ఊళ్లో మూడు రోజులుగా నీటి సరఫరా లేదు.
- ఈ నెల పింఛన్ ఇంకా రాలేదు.
- మా ఊరికి బస్సు ఆపేశారు.
- మా పోలీసుస్టేషన్ ఎస్సై దురుసుగా ప్రవర్తిస్తున్నారు.
- రోడ్డును ఆక్రమించి ఇల్లు కడుతున్నారు.
- ధ్రువపత్రాలకు పైసలు అడుగుతున్నారు.
- చేపల మార్కెట్‌లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి.



తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ కేంద్రమైన 040- 23454071 నంబర్ ఫోన్‌కు వచ్చే ఫిర్యాదుల పరంపర ఇది. భారీ ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా అందులో పరిష్కారానికి నోచుకున్నవి ఐదు శాతం కూడా లేకపోవడం గమనార్హం. ఫోన్ చేసి చేసి విసిగిపోయి చివరికి ఫోన్ చేయడం మానేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో తేలింది. సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం, నిర్వహణపరమైన సమస్యలే ఇందుకు కారణమని విశ్లేషించింది.

ముఖ్యమంత్రి సహాయ కేంద్రం గురించి 2015 జనవరి 11న వరంగల్‌లో సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఎవరైనా లంచం అడిగితే ఫిర్యాదు చేయమన్నారు. ఆ రోజు నుంచి ఈ నంబర్‌కు ఫోన్లు వెల్లువెత్తుతున్నాయి. మొదట్లో అవినీతి, లంచాల గురించి ఫిర్యాదు చేసిన ప్రజలు ఆ తర్వాత అన్ని సమస్యలను చెబుతున్నారు. రద్దీ కారణంగా 30 లైన్లను దీనికి అనుసంధానించారు. మొదటి 20 రోజుల్లోనే 37,259 కాల్స్ వచ్చాయి. దీనిని సమీక్షించిన సీఎం కేసీఆర్.. ఫోన్ ద్వారా దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే పరిష్కారం లేకపోవడంతో ఫోన్ చేసే వాళ్లూ తగ్గుతున్నారు. మొదట్లో నెలకు 37 వేల కాల్స్ వచ్చేవి. క్రమంగా తగ్గి నెలకు రెండు వేల వరకు మాత్రమే వస్తున్నాయి. డిసెంబరులో 796 కాల్స్ మాత్రమే వచ్చాయి. ఇటీవల సహాయకేంద్రంపై సమీక్షించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. గణాంకాలు చూసి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కారణాలు విశ్లేషించి (మిగతా 2లో)

ఎందుకిలా జరుగుతోంది?

సీఎం ఆదేశాలతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 2015 నుంచి ఇప్పటి వరకు 2,19,832 కాల్స్ వచ్చాయి. వాటిలో కొన్ని నంబర్లకు అధికారులు ఫోన్లు చేసి ఆరా తీశారు. ఫిర్యాదుదారుల్లో ఎక్కువ మంది తమ సమస్యలు పరిష్కారం కాలేదని సమాధానమిచ్చారు. అధికారులు పరిశీలించి అది వాస్తవమేనని తేల్చారు. ఫోన్ చేస్తే సిబ్బంది ఆ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఆ తర్వాత పట్టించుకోవడం లేదని తేలింది.

అమ్మకు ధిలాసా

- మహిళల్లో గర్భనిరోధానికి ‘అంతర’
- ప్రసవం వెంటనే ఇచ్చే ఇంజక్షన్
- మూడు నెలలకోసారి కొనసాగింపు
- సర్కారు వైద్యంలో తొలిసారి అమలు



ఈనాడు – హైదరాబాద్

కుటుంబ నియంత్రణలో మహిళల కోసం ‘అంతర’ పేరిట సరికొత్త విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సర్కారు ఆసుపత్రుల్లో ప్రసవించిన మహిళలకు తొలిసారిగా ‘గర్భనిరోధక ఇంజక్షన్’ను అందుబాటులోకి తెచ్చింది. మూడు నెలలకోసారి దీనిని స్వీకరించేలా ప్రోత్సహిస్తోంది. ఇప్పటివరకూ గర్భం దాల్చకుండా నోటిమాత్ర, కండోమ్, గర్భసంచిలోకి అమర్చే పరికరం (ఐయూడీ) వాడుకలో ఉన్నాయి. కుటుంబ నియంత్రణలో తెలంగాణ 1.8 (ఇద్దరు పిల్లలు కంటే తక్కువ) రేటుతో మెరుగైన ఫలితాలనే సాధించింది. అయితే, వెనుకబడిన ప్రాంతాల్లో పిల్లల మధ్య ఎడం తక్కువగా ఉంటోంది. కాన్పు అయిన ఆరు నెలల్లోపే తిరిగి గర్భం దాల్చుతున్నారు. ఇది మహిళల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుంది. తరచూ గర్భస్రావాలు కావడం వల్ల ప్రాణాపాయాలకూ ఆస్కారముంటుంది. దీన్ని నివారించడానికి ‘గర్భనిరోధక ఇంజక్షన్’ చక్కగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఎలా ఉపయోగం?

- మూడు నెలలకోసారి ‘మెడ్రాక్సీ ప్రొజెస్టెరోన్ ఎసిటేట్(ఎంపీఏ) ఇంజక్షన్ తీసుకోవాలి.
- ఐయూడీని గర్భసంచిలో అమర్చుకోవాల్సిన పనిలేదు.
- ఈ ఇంజక్షన్‌ను ఆపేసిన మూడు నెలల తర్వాత తిరిగి గర్భం దాల్చేందుకు అవకాశం ఉంటుంది.
- సాధారణంగా ఇంజక్షన్ ఆపేసిన 7-10 నెలల్లో గర్భం దాల్చడానికి అవకాశాలుండగా... సగటున 4-6 నెలల్లోనే గర్భధారణ జరుగుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి.
- రక్తహీనతను తగ్గించడం, ఎండోమెట్రియల్, అండాశయ క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవడం, గర్భాశయంలో కణితులను నివారించడం తదితర ప్రయోజనాలు ఈ ఇంజక్షన్ వల్ల ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.
- అండాల ఉత్పత్తిని ఎంపీఏ అడ్డుకుంటుంది. గర్భాశయంలో ఎండోమెట్రియం పొరను సన్నగా మారుస్తుంది. వీర్యకణాలు గర్భాశయంలోనికి వెళ్లకుండా గర్భసంచి ముఖద్వారం వద్ద జిగురును మందంగా మారుస్తుంది. దీనిద్వారా 99.7% ఫలితాలు నమోదైనట్లు నిపుణులు చెబుతున్నారు.

సమస్యలేమైనా...?

- ఈ ఇంజక్షన్‌ను స్వీకరించడం వల్ల గర్భసంచి, అండాశయాలపై ఏ దుష్ప్రభావమూ ఉండదు. పునరుత్పత్తి (మిగతా 2లో)

శిశువుకు భరోసా

- నవజాత శిశువుల శ్వాసకోశ సమస్యకు కొత్త పరిష్కారం
- గర్భస్థ దశలో మలం మింగిన బిడ్డలకు ముక్కు ద్వారా ప్రాణ వాయువు అందించే ప్రక్రియ
- తెలంగాణ వైద్యుల అధ్యయనంలో మెరుగైన ఫలితాలు
- తాజా ‘జామా’లో ప్రచురితం

ఈనాడు – హైదరాబాద్

ప్రసవానికి ముందు తల్లి కడుపులో ఉండగానే కొందరు శిశువులు మల విసర్జన చేయడంతో పాటు..ఆ మలినాన్ని మింగుతారు. ఇలాంటి పిల్లల్లో పుట్టగానే శ్వాస సమస్యలు ఎదురై ఉక్కిరిబిక్కిరి అవుతారు. వైద్య పరిభాషలో దీన్ని ‘మెకోనియం ఆస్పిరేషన్ సిండ్రోమ్(ఎంఏఎస్-మాస్)’ అంటారు. ఇలాంటి చిన్నారులకు అత్యవసరంగా శ్వాస అందించేందుకు ప్రస్తుతం



ముక్కుద్వారా చిన్నారికి ప్రాణవాయువు

‘వెంటిలేటర్’ చికిత్సను అందజేస్తున్నారు.

ఇలాంటి అవసరం లేకుండానే ‘నిర్దేశిత ఒత్తిడితో నిరంతర ప్రాణవాయు సరఫరా(కంటిన్యువస్ పాజిటివ్ ఎయిర్ వే ప్రెజర్, సీపాప్)’ విధానంలో ఆక్సిజన్ అందించడం ద్వారా శిశువులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని తాజా అధ్యయనంలో వెల్లడైంది. తెలంగాణకు చెందిన శ్రీనివాస్ ముర్కి, తేజో ప్రతాప్ ఓలేటి, బస్వరాజ్ తాండూర్, సచిన్ నఖేడే..తదితరులతో కూడిన వైద్యబృందం రెండేళ్లపాటు ఫెర్నాండేజ్, విజయ మేరీ, దుర్రూ షెహవర్ ఆసుపత్రుల్లో 135 మంది ఇలాంటి సమస్యతో బాధపడుతున్న చిన్నారులపై అధ్యయనం చేసింది. ‘మాస్’ చిన్నారుల్లో సుమారు 30-40 శాతం మందికి సాధారణంగా వెంటిలేటర్ అవసరమవుతుండగా ‘సీపాప్’ విధానాన్ని అవలంబించడం ద్వారా వెంటిలేటర్ వినియోగ శాతం 3-4కు తగ్గిందని అధ్యయనం వెల్లడించింది. దీనికి సంబంధించిన అధ్యయన పత్రం డిసెంబరు 4, 2017న ప్రతిష్ఠాత్మక ‘జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్(జామా) పిడియాట్రిక్స్’లో ప్రచురితమైంది.

ఎలా ఉపయోగం?

- మాస్ శిశువుల్లో శ్వాసకోశాలు మూసుకుపోతాయి. అవి చేసే పనిని వెంటిలేటర్లే చేయాల్సి వస్తుంది కాబట్టి (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఆయన నిద్రపోతున్నప్పుడు కూడా అంతే!

భూసేకరణ పరిహారం చెల్లింపులో అమలుకాని కోర్టు ఆదేశాలు

- హైకోర్టుకు లేఖ రాసిన జిల్లా జడ్జి
- జిల్లా కోర్టుల నుంచి సమాచారం సేకరించిన హైకోర్టు రిజిస్ట్రీ
- రెండు రాష్ట్రాల్లో అపరిష్కృతంగా 3,032 పిటిషన్లు
- 4 వారాల్లో నివేదిక సమర్పించాలని రెండు రాష్ట్రాల సీఎస్‌లకు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ప్రజావసరాల కోసం భూమిని సేకరించిన ప్రభుత్వం వాటికి తగిన పరిహారం ఇవ్వకపోగా, చెల్లించాలంటూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులూ అమలు కావడం లేదు. అధికారుల స్థాయిలో పరిష్కారమవ్వాల్సిన పరిహారం వివాదాలు కోర్టులకు చేరుతున్నాయి. చివరికి కోర్టులు పరిహారం చెల్లించాలంటూ ఉత్తర్వులు ఇచ్చినా అమలవ్వడం లేదు. భూసేకరణ పరిహారానికి సంబంధించి రెండు రాష్ట్రాల్లోని కోర్టుల్లో 3,032 పిటిషన్లు అపరిష్కృతంగా ఉన్నాయి. ఒక్క మహబూబ్‌నగర్‌లోనే 1,204 పిటిషన్లు అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ అంశంపై న్యాయవ్యవస్థ జోక్యంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పరిహారం చెల్లించాలంటూ కింది కోర్టులు ఇచ్చిన ఉత్తర్వుల అమలు కోసం దాఖలైన పిటిషన్లు(ఈపీ) ఎక్కువగా ఉన్నాయంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి గత ఏడాది జూన్ 24న ఉమ్మడి హైకోర్టుకు లేఖ రాయగా, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ పిల్ కమిటీకి నివేదించారు. పిల్ కమిటీలోని (మిగతా 2లో)

పాక్‌కు ఇచ్చింది చాలు

- ఇప్పటికే రూ.లక్షల కోట్లు ధారపోశాం
- ప్రతిఫలంగా అబద్ధాలు, నమ్మక ద్రోహాలే ఎదురయ్యాయి
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ట్రంప్


-5లో

సాయం చేసినా.. వంచనే మిగిలింది!

అమెరికా సహకారాన్ని దుర్వినియోగం చేసిన పాక్

-‘ఈనాడు’ ప్రత్యేక కథనం 5లో

మాకొద్దీ ఇంజినీరింగ్



- యంత్ర విద్యలో దారుణంగా పడిపోయిన సీట్ల భర్తీ
- తెలంగాణలో 42% కళాశాలల్లో చేరింది 6 శాతమే
- ఏపీలోని మూడోవంతు విద్యా సంస్థల్లో చేరికలు 11 శాతమే
- దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ దారుణంగా పడిపోతూ వస్తోంది. 2016-17 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా మూడోవంతు విద్యా సంస్థల్లో సగటున 13% సీట్లు మాత్రమే భర్తీ అయినట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ సోమవారం వెల్లడించింది. తెలంగాణలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ 266 కళాశాలల్లో 41,628 సీట్లు ఉండగా..112లో కేవలం 6 శాతం (2,874) మంది మాత్రమే చేరినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని 325 విద్యా సంస్థల్లో 47,640 సీట్లకుగానూ 109లో కేవలం 5,687 సీట్లు (11.98%)మాత్రమే భర్తీ అయినట్లు తెలిపింది.

దక్షిణాదిలో అథమం: కేంద్రం వెల్లడించిన గణాంకాల మేరకు దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో (మిగతా 2లో)

దేశానికి తెలంగాణ ఆదర్శం

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వడం అద్భుతం ● కేసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు ● ఇక్కడి పథకాలను ఏపీలోనూ అమలు చేయాలి: పవన్ కల్యాణ్

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయడం అద్భుతమని, ముఖ్యమంత్రి కేసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దీనిని కేంద్రం, ఇతర రాష్ట్రాలు ఒక అధ్యయనాంశంగా(కేస్ స్టడీ)గా తీసుకోవాలని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను, పాలనాతీరును ఏపీలోనూ అమలు చేయాలన్నారు.

కీలక అంశాలపై చర్చ

సోమవారం రాత్రి ప్రగతిభవన్‌లో ఆయన సీఎం కేసీఆర్‌తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. పాలన, రాజకీయపరమైన అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల గురించీ చర్చించినట్లు తెలిసింది. ఆయన నివాసంలో దాదాపు గంటన్నర పాటు భేటీ జరిగింది. సాయంత్రం ఆరుగంటలకు కేసీఆర్‌ను కలిసేందుకు పవన్ ప్రగతిభవన్ వచ్చారు. సీఎం కార్యాలయ అధికారులు కేసీఆర్‌కు సమాచారం ఇవ్వగానే ఆయన స్పందించి, పవన్‌ను తననివాస భవనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. గంట తర్వాత కేసీఆర్ రాజ్‌భవన్‌కు రాగా అప్పటి వరకు పవన్ సీఎం కార్యాలయ అధికారులతో మాట్లాడుతూ ఉన్నారు. సీఎం రాగానే పవన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, అదనపు అడ్వొకేట్ జనరల్ రామచంద్రరావు, తెరాసనేత శ్రావణ్‌రెడ్డిలను సీఎం పరిచయం చేశారు. పల్లా తమ ఇంటిని కొనుగోలు చేశారని పవన్ చెప్పగా, మీ ఇల్లు ఆయన ఇష్టపడి తీసుకున్నారంటూ కేసీఆర్ చమత్కరించారు. అనంతరం ఇద్దరూ సమావేశమయ్యారు.

రైతులకు సరైన న్యాయం

రైతులకు సరైన న్యాయం చేశారని కేసీఆర్‌ను పవన్ ప్రశంసించినట్లు తెలిసింది. రైతులు పడే కష్టానికి ఎంత చేసినా తక్కువేనని, వారి సమస్యల పరిష్కారానికి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అభినందించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ఈ విధానం ఉండాలని, తాను వీలైతే ప్రధానిని కలిసి ఈ విషయం చెబుతానని అన్నట్లు సమాచారం. కేసీఆర్ ఆయనకు సమాధానమిస్తూ, తాను రైతునని, వారి కష్టాలు, నష్టాలు తనకు తెలుసన్నారు. కరెంటును పూర్తి స్థాయిలో అందించడం వల్ల రైతులకు మంచి భరోసా వస్తుందని, ప్రభుత్వం తమకు అండగా ఉందనే ఆత్మవిశ్వాసం ఉంటుందని చెప్పారు. ఉచిత విద్యుత్ ఆర్థికభారమైనా లోటు లేకుండా అమలుచేయాలని నిర్ణయించామని, దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేసిందని చెప్పారు. ఎకరానికి రూ.8వేల పెట్టుబడి సాయం అద్భుతమైన పథకంగా నిలుస్తుందని కేసీఆర్ అన్నారు. పవన్ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలను అద్భుతంగా నిర్వహించారని అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మిషన్ భగీరథ పథకం ప్రజలకు అవసరమైనవేనన్నారు. తెలంగాణలోని యువతకు మరింత చేయూతనివ్వాలని, విద్యార్థులకు సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ ద్వారానే గాక ఇతర మార్గాల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టామని కేసీఆర్ అన్నారు. విద్యార్థులకు రుసుముల భారం ఇతర సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రయోజనకరమైన చదువులు అందించేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సుపరిపాలనను, ప్రజారంజక విధానాలకు తాము మద్దతు ఇస్తామని, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొస్తామని పవన్ చెప్పగా కేసీఆర్ ఆహ్వానించినట్లు తెలిసింది. సామాజిక సమస్యల మీద చురుగ్గా స్పందిస్తున్నారని కేసీఆర్ పవన్‌ను మెచ్చుకున్నట్లు సమాచారం.

అభినందించేందుకు వచ్చా
జనసేన అధినేత

కేసీఆర్‌తో సమావేశం అనంతరం పవన్ కల్యాణ్ ప్రగతి భవన్ బయట విలేకరులతో మాట్లాడారు. "సీఎంను నూతన సంవత్సరం సందర్భంగా కలిశాను. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ విషయంపై ఆయనను అభినందించేందుకే వెళ్లాను. నిరంతర విద్యుత్ సరఫరా చూసి ఆశ్చర్యపోయా. తెలంగాణలో విద్యుత్ సరఫరా అసాధ్యమని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కానీ, కేసీఆర్ దానిని అమలు చేసిన తీరు నాకు నచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు నాకు చాలా సందేహాలుండేవి. ఆయనను కలిసినప్పుడు ఇది ఎలా సాధ్యమైందో అడిగి తెలుసుకున్నాను. నేను ఏపీలో పర్యటించినప్పుడు.. హక్కుల సాధనకు కేసీఆర్ స్ఫూర్తిని చూసి నేర్చుకోవాలని చెబుతుంటా. ఉద్యమ పార్టీగా, తెరాస మీద, ఆపార్టీ నాయకుల మీద నాకు మొదటి నుంచి గౌరవం ఉంది. ఇరు రాష్ట్రాలలోని సమస్యలను పరస్పరం చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి." అని అన్నారు.

ఆయన అభియోగాలు అసత్యం: సెల్‌కాన్

ఈనాడు, హైదరాబాద్: తమ సంస్థపై వై.స్వప్నకుమార్ చేసిన అభియోగాలు అసత్యాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు చేపడతామని సెల్‌కాన్ యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన 2015లో తమ సంస్థ నుంచి ఇష్టపూర్వకంగా బయటకు వెళ్లిపోయారని పేర్కొంది. కేవలం కక్షసాధింపు చర్యగా సెల్‌కాన్‌పై బురద చల్లే కార్యక్రమం స్వప్నకుమార్ చేపట్టారని ఆ ప్రకటనలో పేర్కొంది.

మాకొద్దీ ఇంజినీరింగ్

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక సీట్లు మిగిలిపోతున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లోని 398 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1.66 లక్షల సీట్లకు గానూ. 20 వేలు(12%) మాత్రమే భర్తీ కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. కర్ణాటక, కేరళల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. కర్ణాటకలోని 198 కళాశాలలకు 18లో మాత్రమే 80 శాతం సీట్లు, కేరళలో 176కి 34లో 84% సీట్లు భర్తీ కాలేదు. అత్యధిక సీట్లు మిగిలిపోయిన కళాశాలల సంఖ్యలో(177) తమిళనాడు దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో ఉత్తరప్రదేశ్ (169), మహారాష్ట్ర (139) ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 3,325 కళాశాలలకు గానూ 1267లో 86% సీట్లు మిగిలిపోవడం గమనార్హం.

భూదస్త్రాల ప్రక్షాళన విజయవంతం

- రెవెన్యూ ఉద్యోగుల కృషితో ప్రభుత్వానికి మంచి పేరు: కేసీఆర్

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులు అహర్నిశలు కృషి చేయడంతోనే భూదస్త్రాల ప్రక్షాళన విజయవంతమైందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) డైరీని ప్రగతిభవన్‌లో సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ప్రక్షాళన స్ఫూర్తితో రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందేలా కృషి చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌కు సూచించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన సీఎంను కోరగా త్వరలోనే ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఉద్యోగులు ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సీఎం పిలుపునిచ్చారు. మరో కార్యక్రమంలో ట్రెసా ప్రతినిధులు గవర్నర్ నర్సింహన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశ్వరరావు, నిరంజన్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, మునీరుద్దీన్, ఎల్లారెడ్డి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక పరిషత్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి: అర్చక సమాఖ్య

రాష్ట్రంలో ధార్మిక పరిషత్‌ను వెంటనే ఏర్పాటు చేసి గాడితప్పిన దేవాలయ వ్యవస్థను, దేవాదాయ శాఖను సంస్కరించాలని అర్చక సమాఖ్య ప్రతినిధులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ప్రభుత్వం ప్రకటించిన కొత్త వేతనాలు ఇంతవరకు కొంతమంది అర్చకులకు మాత్రమే అందాయని, అందరికీ అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమాఖ్య రూపొందించిన 2018 డైరీని సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు గంగుఉపేంద్రశర్మ, భాస్కరభట్ల రామశర్మ, గట్టు శ్రీనివాసచార్యులు, రాజేశ్వరరావు, ఆర్.సంజీవరావు తదితరులు ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. 2005 తర్వాత నియమితులైన 2 వేల మంది అర్చకులు, ఇతర సిబ్బందికి కమిషనర్ అనుమతి లేనందున అక్రమ నియామకాలంటున్నారని, వారు చాలా ఏళ్లుగా పని చేస్తున్నందున సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోరారు. తమ విజ్ఞప్తులకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని సమాఖ్య ప్రతినిధులు చెప్పారు.



ట్రెసా డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, పక్కనే అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్ తదితరులు

సీఎం కేసీఆర్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు

నూతన సంవత్సర వేడుకలు సోమవారం ప్రగతిభవన్‌లో ఘనంగా జరిగాయి. ఉదయమే ముఖ్యమంత్రి కేసీఆర్ కేక్ కోసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యాలయ అధికారులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం కావడంపై ఈ సందర్భంగా సీఎం ఆనందం వ్యక్తంచేశారు. అన్ని వర్గాలు ఆనందంగా జీవించేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రముఖులు, ఉన్నతాధికారులు సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఉపముఖ్యమంత్రులు మహమూద్‌అలీ, కడియం శ్రీహరి, మంత్రులు హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుష్పగుచ్ఛాలు సమర్పించారు. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో యాదాద్రి, కొమురవెల్లి, పెద్దమ్మగుడి ఆలయాల పూజారులు సీఎంను ఆశీర్వదించారు. ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రమణాచారి, సీఎస్ ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రావు, ఆర్టీసీ ఎండీ రమణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేరి సుభాస్‌రెడ్డి, తెరాస ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, పబ్లిక్ సర్వీసు కమిషన్, బీసీ కమిషన్‌ల ఛైర్మన్లు చక్రపాణి, బీఎస్ రాములు సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, టీజీవోల ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షురాలు మమత, టీఎన్జీవోల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గ్రూపు అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని అభినందనలు తెలిపేందుకు ప్రగతిభవన్‌కు వచ్చిన సందర్శకులందరినీ సీఎం కేసీఆర్ కలిశారు.

తెలుగు రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలు నెరవేరాలి: గవర్నర్

నూతన సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు శుభం కలగాలని, వారి ఆకాంక్షలు నెరవేరాలని గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు రెండూ ప్రగతి పథంలో నడుస్తున్నాయని తెలిపారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో సోమవారం ఉత్సవాలను నిర్వహించారు. గవర్నర్ దంపతులతో పాటు అధికారులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల సేపు ఇద్దరూ సమావేశమయ్యారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభం, పథకం లక్ష్యాలు, అమలు ఇతర కార్యక్రమాల గురించి సీఎం వివరించారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు, సీఎస్, డీజీపీ, ఏపీ మండలి మాజీ ఛైర్మన్ చక్రపాణి తదితరులు గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం కేసీఆర్

అమ్మకు ధిలాసా

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థను దెబ్బతీయదు.

- పాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపించదు.
- ఇంజక్షన్‌ను స్వీకరించిన తొలి మూడునెలల్లో కొందరిలో నెలసరి మధ్యలో రక్తస్రావం కనిపించొచ్చు. నెలసరి రక్తస్రావం ఎక్కువ రోజులు కొనసాగవచ్చు. ఈ సమస్యలు ఏడాదిలోగా సర్దుకుంటాయి.

కేసీఆర్ కిట్ ప్రాతిపదికన అమలు

– వాకాటి కరుణ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్



కేసీఆర్ కిట్ లబ్ధిదారుల ప్రాతిపదికన ఈ పథకాన్ని అమలుచేస్తున్నాం. కొత్త కుటుంబ నియంత్రణ విధానంపై అపోహలు తొలగించేందుకు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాం. రూ.1,500 విలువైన ఈ ఇంజక్షన్‌ను ఉచితంగానే అందజేస్తున్నాం.

అద్భుత విజయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని నేడు 24 గంటల సరఫరా చేసే స్థాయికి తీర్చిదిద్దిన ఘనత ఉద్యోగులకే దక్కుతుందని, ఇది అద్భుత విజయమని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారు. సేద్యానికి 24 గంటల విద్యుత్ సరఫరాను సోమవారం నుంచి ప్రారంభించిన సందర్భంగా విద్యుత్ సంస్థల సీఎండీలు దేవులపల్లి ప్రభాకరరావు, రఘుమారెడ్డి తదితర ఉన్నతాధికారులతో ప్రగతిభవన్‌లో సీఎం సమావేశమయ్యారు. ప్రభాకరరావును ప్రత్యేకంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. విద్యుత్ సంస్థల సంచాలకులు, సీనియర్ ఉద్యోగులను పేరుపేరునా పలుకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ దేశమంతా తెలంగాణ వైపు చూసేలా విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించారన్నారు. రాష్ట్రానికి ఇంత గొప్ప ఖ్యాతిని సముపార్జించి పెట్టినందుకు విద్యుత్ ఉద్యోగులకు అభినందనపూర్వకంగా ఈనెల నుంచి వర్తించేలా ప్రత్యేక ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రజానీకమంతా విద్యుత్ శాఖ పనితీరు పట్ల సంతృప్తితో, ఆనందంగా ఉన్నారని చెప్పారు. వచ్చే నెల లేదా మార్చి నుంచి 24 గంటల సరఫరా ప్రారంభించాలని తొలుత భావించినా.. అంతకన్నా ముందుగా జనవరి ఒకటి నుంచే యాసంగి పంటలకు అనుకూలంగా సరఫరా ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ఉచిత వ్యవసాయ విద్యుత్ ఇస్తున్నా పరిమిత గంటలే సరఫరా చేస్తున్నాయని, మరికొన్ని రాష్ట్రాల్లో 24 గంటలు ఇస్తున్నా రుసుములు వసూలు చేస్తున్నారని సీఎం తెలిపారు. పూర్తి ఉచితంగా 24 గంటలూ ఇచ్చేది తెలంగాణ తప్ప మరో రాష్ట్రం లేదన్నారు. తనకు సోమవారం ఉదయం అనేక రాష్ట్రాల నుంచి శుభాకాంక్షలు చెప్పారని, ఇది రైతుల కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని అభినందనలు తెలిపారని సీఎం కేసీఆర్ వివరించారు. పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. సీఎంను కలిసి అభినందనలు తెలిపిన వారిలో విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, సంచాలకులు నర్సింగరావు, వెంకటరాజం తదితరులున్నారు. సీఎండీ ప్రభాకరరావు మాట్లాడుతూ ఇంక్రిమెంటుపై సీఎం తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపుతుందనీ, రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని చెప్పారు. సీఎం దార్శనికత వల్లే సరఫరాను మెరుగు పరిచామన్నారు. ప్రత్యేక ఇంక్రిమెంటు ప్రకటించినందుకు సీఎం కేసీఆర్‌కు, సీఎండీ ప్రభాకరరావుకు ఉద్యోగుల తరఫున ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపినట్లు తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం అధ్యక్షుడు పద్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిబాబా తెలిపారు.



వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో విద్యుత్ సంస్థల సీఎండీలు ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి. చిత్రంలో ఇతర విద్యుత్ విభాగాల ఉన్నతాధికారులు

అసహాయ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

నివేదిక ఇవ్వాలని సూచించారు.

అనిశా ఒక్కటే..: అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులు మాత్రమే లంచం గురించి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. 2015 నుంచి 2017 వరకు మొత్తం రెండు లక్షలకు పైగా కాల్స్ రాగా 8,556 గురించి మాత్రమే విచారణ చేశారు. అవన్నీ అనిశా చేసినవే కావడం గమనార్హం. మిగిలిన శాఖలు ఈ పని కూడా చేయడం లేదు. ఫిర్యాదు చేసినవారు తర్వాత మళ్లీ ఫోన్ చేసి సమాచారం అడిగితే సిబ్బంది సమాధానం చెప్పడం లేదని ఉన్నతాధికారులు సీఎంకు నివేదించారు.

పరిష్కారం ఇలా..

- సహాయ కేంద్రం నిర్వహణ పకడ్బందీగా ఉండడానికి అన్ని శాఖలు నోడల్ అధికారులను నియమించాలి.
- ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బంది ఫిర్యాది వివరాలు తీసుకోవావాలి. దానిని నోడల్ అధికారులకు తెలపాలి. వెంటనే వారు తమ సిబ్బంది ద్వారా వాటిని పరిష్కరించాలి.
- సమస్యల పరిష్కారంపై నోడల్ అధికారులు వారం వారం సమీక్షించాలి. పరిష్కరించిన వారికి ప్రోత్సాహకాలు, పురస్కారాలు ఇవ్వాలి. నిర్లక్ష్యం చేసే వారికి తాఖీదులివ్వాలి. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

–ఈనాడు, హైదరాబాద్

శిశువుకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

వీటిని నేరుగా గొంతులోకి అమర్చుతారు.

- దీన్ని సుశిక్షితులే చేయగలుగుతారు.
- ఈ చికిత్సకు కార్పొరేట్ ఆసుపత్రులు రోజుకు సుమారు రూ.15 వేల వరకూ వసూలు చేస్తున్నాయి.
- ఖర్చు, శ్రమతో కూడుకున్న ఈ తరహా వైద్యం కోసం నగరాల్లోని పెద్ద ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఈ క్రమంలో చికిత్స ఆలస్యమై ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులెందరో.

'సీపాప్' విధానం ఎంతో చౌక

- ఈ విధానంలో వెంటిలేటర్లతో పనిలేకుండా ముక్కు ద్వారానే ప్రాణవాయువు అందిస్తారు.
- సీపాప్ పరికరాల ఖరీదు రూ.2 లక్షలకు మించదు.
- ఇవి ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని నవజాత శిశు సంరక్షణ కేంద్రాల(ఎస్ఎన్‌సీయూ)లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు వీటిని బరువు తక్కువ, నెలలు నిండకమునుపే పుట్టిన పిల్లలకు మాత్రమే వినియోగిస్తుండగా..ఇకపై మాస్ శిశువులకు వీటితోనూ చికిత్స అందించవచ్చు.
- ఖరీదు తక్కువ కాబట్టి..మండల కేంద్రాల్లోని ప్రాథమిక వైద్యశాలల్లోనూ వీటిని అందుబాటులోకి తేవచ్చు.
- శిశువుకు తొలి గంట, గంటన్నరలోపే చికిత్స ప్రారంభించడం ద్వారా ప్రాణాపాయం తప్పించవచ్చు.

అమలుకు మార్గం సుగమమయింది



ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వైద్య జర్నల్‌లో మా అధ్యయనం ప్రచురితమైంది. కాబట్టి ఈ తరహా విధానాన్ని పిల్లల వైద్యులు 'మాస్' శిశువుల్లో అమలుచేయడానికి మార్గం సుగమమైంది. దీనివల్ల పేద పిల్లలకు మెరుగైన వైద్యం అందించడం సాధ్యమవుతుంది.

– డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, అధ్యయనకర్త

భూసేకరణ పరిహారం చెల్లింపులో అమలుకాని కోర్టు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం ఆ లేఖను పరిశీలించి అన్ని జిల్లాల నుంచి అపరిష్కృతంగా ఉన్న పిటిషన్ల వివరాలు తెప్పించాలన్న సూచనను కమిటీలోని మిగిలిన న్యాయమూర్తులు ఏకీభవించారు. కమిటీ సూచనల మేరకు రిజిస్ట్రీ అన్ని జిల్లా కోర్టుల నుంచి వివరాలు తెప్పించింది. రిజిస్ట్రీకి అందిన వివరాలను కమిటీ ముందుంచగా దీన్ని సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణలోకి తీసుకుంది. పరిహారం చెల్లింపునకు సంబంధించిన పిటిషన్లపై అత్యవసరంగా చర్యలు చేపట్టాలని పిల్ కమిటీ అభిప్రాయపడింది. వీటికి సంబంధించిన కేసుల విచారణ ముందుకు సాగడం లేదనీ, ప్రభుత్వ న్యాయవాదులు పదే పదే వాయిదాలు కోరుతున్నారని పేర్కొంది. పరిహారం సొమ్మును డిపాజిట్ చేస్తారన్న భావంతో జిల్లా జడ్జీలు కూడా వాయిదాలు ఇవ్వకతప్పని పరిస్థితుల్లో ఉన్నట్లు పేర్కొంది. ఈ కేసులకు సంబంధించి జిల్లా జడ్జీలు కూడా కఠినంగా వ్యవహరించలేకపోతున్నారని, జిల్లా పాలనా యంత్రాంగం తీసుకోవాల్సిన నిర్ణయంగా వాయిదాలు ఇస్తున్నారు. ధనికులు, అధికార నేతల అండ ఉన్నవారి విషయంలో ప్రత్యేక ఉత్తర్వులు వెలువడుతుండటంతో పరిహారం పొందుతున్నారని పేర్కొంది. పరిహారం చెల్లింపునకు సంబంధించి ఏకరూప విధానం లేకపోవడంతో ఈ పిటిషన్‌ను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించాలని అభిప్రాయపడింది. ఇటీవల ఈ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం.. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల నుంచి నివేదిక కోరింది. కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయని అధికారుల తీరుపై మండిపడింది. రెండు రాష్ట్రాల్లో అపరిష్కృతంగా ఉన్న పిటిషన్లకు సంబంధించి ఏం చర్యలు తీసుకుంటున్నారు, ఎప్పటిలోగా పరిహారం చెల్లిస్తారన్న వివరాలతో 4 వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో జిల్లాల వారీగా భూసేకరణ పరిహారంపై కింది కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న పిటిషన్ల వివరాలివీ..

తెలంగాణ	
ఆదిలాబాద్	124
కరీంనగర్	92
ఖమ్మం	69
మహబూబ్‌నగర్	1204
మెదక్	100
నల్గొండ	97
నిజామాబాద్	111
రంగారెడ్డి	107
వరంగల్	53
హైదరాబాద్	46

ఆంధ్రప్రదేశ్	
అనంతపురం	95
చిత్తూరు	55
తూర్పుగోదావరి	237
గుంటూరు	65
కృష్ణ	74
కర్నూలు	286
ప్రకాశం	17
నెల్లూరు	13
శ్రీకాకుళం	16
విశాఖపట్నం	43
విజయనగరం	9
పశ్చిమగోదావరి	98
కడప	21

గ్రహం అనుగ్రహం
2-1-2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
పూర్ణిమ: ఉ. 9-03 తదుపరి బహుళపక్ష పాడ్యమి
ఆర్ద్ర నక్షత్రం: మ. 1-35 తదుపరి పునర్వసు
అమృత ఘడియలు: తె. 4-15 నుంచి 5-44 వరకు
వర్జ్యం: రా. 12-44 నుంచి 2-14 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-45 నుంచి 9-29 వరకు
తిరిగి రా. 10-45 నుంచి 11-37 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5-33

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.6	29.4
హన్మకొండ	12.0	30.0
మెదక్	12.1	32.4
కరీంనగర్	13.0	32.0
రామగుండం	13.8	31.2
హైదరాబాద్	14.9	31.5
నిజామాబాద్	15.0	31.0
మహబూబ్‌నగర్	17.6	32.7
ఖమ్మం	18.0	32.0
తిరుపతి	18.4	30.4
సూర్యాపేట	19.0	32.0

ఈనాడు

వ్యవ'సాయం' నిరుపమానం


సంక్రాంతికి పక్షం రోజుల ముందే తెలంగాణ రైతుల కళ్లల్లో దీపావళి! కొత్త సంవత్సరం అడుగిడిన తొలి నిమిషం నుంచే విద్యుత్ వెతల చెరవీడి, నానావిధ కరెంటు కష్టాల శృంఖలాలు తెగిపడి రైతన్నలకు స్వాతంత్ర్యం లభించింది. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అన్నది- కలగానే మిగిలిపోతుందనుకున్న ఓ సురుచిర స్వప్నం. రాష్ట్ర విభజన దరిమిలా కరెంటు కష్టాలు ముమ్మరించి తెలంగాణ తీవ్ర వెతల పాలవుతుందన్నది నాటి పలు జోస్యాల సారాంశం. అలాంటిది, ఎప్పటికప్పుడు అవరోధాల్ని అధిగమిస్తూ విద్యుత్ రంగ మౌలిక సదుపాయాల కోసం వేలకోట్ల రూపాయలు వ్యయీకరిస్తూ కేసీఆర్ సర్కారు పూనిన సంకల్పదీక్ష- నూతన శకారంభాన్ని సాక్షాత్కరింపజేసింది. ఇకపై కోతలు, అంతరాయాలు, అవరోధాలు ఏవీ ఉండబోవన్న కేసీఆర్ విస్పష్ట హామీతో రాష్ట్రవ్యాప్తంగా 23 లక్షల పంపు సెట్లకు ఇరవై నాలుగ్గంటలూ విద్యుత్ అందనుంది. 2014 నవంబరులోనే విద్యుత్ కోతల్ని ఎత్తివేసి- వ్యవసాయానికి తొమ్మిది గంటలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, గృహాలకు రోజంతా నాణ్యమైన సరఫరాకు సర్కారు సంకల్పం ప్రకటించడం తెలిసిందే. 2017 జులైకల్లా పాత మెదక్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో వ్యవసాయానికీ నిరంతర సరఫరా మొదలుపెట్టిన సర్కారీ యంత్రాంగం- మేలిమి సేవల కోసం విద్యుత్ సరఫరా వ్యవస్థపై రూ.12,615 కోట్లు వెచ్చించడం అబ్బురపరచేదే. ఇప్పటిదాకా రాష్ట్రంలో ఒక్కరోజులో అత్యధిక విద్యుత్ వినిమయ రికార్డు 9,300 మెగావాట్లు. రేపు మార్చిలో యాసంగి సాగు 30 లక్షల ఎకరాలుంటుందని, గరిష్ఠ కరెంటు వాడకం అన్ని వర్గాలకూ కలిపి 11వేల మెగావాట్లకు చేరవచ్చునీ అంచనా వేస్తున్నారు. ఆ డిమాండు తట్టుకోవడానికి 500 మెగావాట్ల అదనపు కొనుగోలు ఒప్పందాలూ ఖరారు చేశారు. గరిష్ఠ వినిమయ సమయంలో సరఫరా ఒత్తిళ్లను నిభాయించడం విద్యుత్ యంత్రాంగానికి, కరెంటు సంస్థల బడ్జెట్ లోట్లను భరించడం రాష్ట్రసర్కారుకు పెద్ద సవాలు కానుందిప్పుడు!

'చారిత్రక తప్పిదాలను సరిదిద్దడం ఒక్కటే కాదు, జనాభాలో అత్యధిక భాగానికి అత్యంత శీఘ్రంగా సామాజిక ఆర్థిక న్యాయాన్ని అందించడం కూడా ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం'- 2014 నవంబరులో తెలంగాణ తొట్టతొలి బడ్జెట్ ప్రసంగంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన గొప్ప లక్ష్యమిది. నేతాగణాల నుంచి మాట సాయమేగాని మూట సాయం లేక దశాబ్దాలుగా తెలుగు రైతులు బలవన్మరణాల బలిపీఠం ఎక్కుతున్న దురదృష్టకర చరిత్ర పోగుపడి ఉంది. రైతు జీవనంలో పచ్చదనం విత్తేందుకు ఏడు వేలకోట్ల రూపాయలకు పైగా వ్యయీకరణకు సిద్ధపడి, 'ఎకరాకు నాలుగు వేలు' అందించనున్న కేసీఆర్ సర్కారు- తాజాగా నిరంతర విద్యుత్ సరఫరాతో కంటి వెలుగులు నింపుతోంది. ఉచితమన్న పేరేగాని, ఉమ్మడి రాష్ట్రంలో అర్ధరాత్రి ఏ వేళలోనో రెండు విడతలుగా చేసిన విద్యుత్ సరఫరా రైతన్నల పాలిట యమపాశమైంది. పరిమిత సరఫరాతో తడిసిన మడే తడిసి, తక్కినది ఎండి రైతు కన్నీటి పర్యంతమైన దురవస్థ ఒకతీరు; కరెంటు వైర్లు తగిలి నిద్రకళ్ల రైతుల మృత్యువాత, పురుగూ పుట్రా కరచి మరెందరికో గుండెకోత- ఆ విషాదం చెప్పనలవి కాదు. నిరంతర విద్యుత్ సరఫరాతో ఆహార ఉత్పాదనలు పెరిగి రైతు జీవన ప్రమాణాలు ఇనుమడించి, గ్రామీణార్థికం గాడిన పడుతుందని ముఖ్యమంత్రి అభిలషిస్తున్నారు. వ్యవసాయ మీటర్లకు ఆటో స్టార్టర్ల అవసరం తీరిపోవడంతో రైతన్నలే స్వచ్ఛందంగా వాటిని తొలగించాలనీ ఆకాంక్షిస్తున్నారు. ఏ పంటకు ఏయే దశల్లో ఎంత నీటి తడి అవసరమో రైతులకు అవగాహన కల్పించే శాస్త్రీయ సలహా సంప్రతింపుల యంత్రాంగాన్నీ ఇదే నిష్ఠతో కేసీఆర్ సర్కారు పొలంగట్లకు చేరిస్తే- అక్షరాలా ఆ చొరవ ఉభయతారక మవుతుంది. నీటినీ విద్యుత్తునూ పొదుపుగా వాడి గరిష్ఠ ఉత్పాదనలు సాధించే దిశగా తెలంగాణ రైతు ప్రస్థానానికీ మేలుబాటలు పరవాల్సిన తరుణమిది!

ఏ దేశ ప్రగతి గణనకైనా తలసరి విద్యుత్ వాడకమే కొలమానంగా ఎదిగిన రోజులివి. జాతీయ స్థాయిలో తలసరి విద్యుత్ వాడకం 1200 యూనిట్లు; దాన్ని అధిగమించి తెలంగాణ 1505 యూనిట్లకు చేరడం గర్వకారణమే అయినా, ఏటికేడు పెరిగే వినిమయం విసిరే సవాళ్లు ఎన్నో ఉన్నాయి. పరిశ్రమలకూ అవాంతరాలకు ఆస్కారం లేని రీతిలో విద్యుత్ సరఫరా కోసం 'ఆటో రీసైక్లర్' వ్యవస్థ ఏర్పాటుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకారం చుట్టింది. వ్యవసాయం, ఎత్తిపోతలు, భగీరథ, వాణిజ్యం- పరిశ్రమలు, గృహవినియోగం... ఇలా సరఫరాను అయిదు విభాగాలుగా వర్గీకరించి, దేనికెంత అవసరమో గుర్తించి పకడ్బందీ ఏర్పాట్లు చెయ్యాలన్న ముఖ్యమంత్రి సూచన శిరోధార్యం. సేద్య సరఫరాలకిచ్చే రాయితీని రూ.5,400 కోట్లకు పెంచుతున్నామని, అవసరమైతే మరో అయిదు వందల కోట్ల రూపాయలైనా ఇస్తామని కేసీఆర్ చెబుతున్నారు. ఎత్తిపోతలకు కరెంటు రుసుముల భారం రూపాయి కూడా విద్యుత్ శాఖపై పడదని ముఖ్యమంత్రి భరోసా ఇస్తున్నా, 2017-'18లో రెండు డిస్కమ్‌ల ఆదాయలోటు రూ.9,824 కోట్లని నిరుడు ఫిబ్రవరిలోనే అంచనాలు వెలుగు చూశాయి. విద్యుత్ రుసుముల పెంపుదలకు ప్రభుత్వం ససేమిరా అనడంతో డిస్కమ్‌లు క్రమేణా లోటు ఊబిలో కూరుకుపోతున్న వాస్తవాన్ని విస్మరించకూడదు. పంపిణీ వ్యవస్థల పనితీరుపై నిరుడు మార్చిలో 'కాగ్' చేసిన ఆక్షేపణల్నీ పరిగణనలోకి తీసుకోక తప్పదు! జాతీయ సగటుతో పోలిస్తే యూనిట్ విద్యుత్ సరఫరా వ్యయం తెలంగాణలో బాగా ఎక్కువగా ఉన్న పరిస్థితినీ చక్కదిద్దాలి. నిరంతర విద్యుత్ ప్రకాశంతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తేజరిల్లి తెలంగాణ జేగీయమానమయ్యేందుకు, సరఫరా నష్టాలు తగ్గి కరెంటు సంస్థలు స్వయం ప్రకాశమయ్యేందుకు కేసీఆర్ దార్శనికత కొత్తపుంతలు తొక్కాలి!

నిధులకు నీళ్లు... విధులకు సీళ్లు

ఒకప్పుడు దేదీప్యమానంగా వెలుగొందిన జిల్లా, మండల పరిషత్తులు ఇప్పుడు కాంతిహీనమయ్యాయి. అభివృద్ధి పనులు ఏవీ చేయలేక పోతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇవి ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. కాసింత సాయం కోసం 15వ ఆర్థిక సంఘంవైపు చూస్తున్నాయి. ఎన్‌కే సింగ్ నేతృత్వంలో కొత్త ఆర్థిక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఆలస్యం- తమ సమస్యలను ఏకరువు పెడుతూ తెలంగాణలోని జిల్లా, మండల పరిషత్తుల నుంచి వినతుల పరంపర మొదలైంది. ప్రస్తుతం అమలులో ఉన్న వైవీ రెడ్డి సారథ్యంలోని 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా తాము తీవ్రంగా నష్టపోయామని, నిధుల కోసం అందరిముందు చేతులు చాచాల్సిన దుర్గతి పట్టిందని అవి ఆవేదన చెందుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను ఎన్‌కే సింగ్ కమిటీ 2019 అక్టోబరు నాటికి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. 2020 ఏప్రిల్ ఒకటి లగాయతు అవి అమలులోకి రావాల్సి ఉంది. ఆర్థిక సంఘం అన్ని రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వంతో సహా వివిధ విభాగాలు, స్థానిక సంస్థల నుంచి వినతులు స్వీకరిస్తుంది. పల్లెవాసులకు మౌలిక వసతులను కల్పించేది గ్రామ పంచాయతీలే కనుక నిధులు అన్నింటినీ నేరుగా వాటికే ఇవ్వాలని 14వ ఆర్థిక సంఘం సూత్రీకరించడం వల్ల తమకు ప్రాధాన్యం తగ్గిపోయిందని జిల్లా, మండల ప్రజాపరిషత్తులు వాపోతున్నాయి. అందువల్లే కొత్త సంఘం సిఫార్సుల విషయంలో అవి ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించాయి.



పనులు ఎక్కడివక్కడే...

పంచాయతీలకు పైస్థాయిలో జిల్లా, మండల పరిషత్తులు ఉంటాయనే విషయం ఆర్థిక సంఘానికి తెలియని విషయం కాదు. మరెందుకు వాటాలు ఇవ్వకుండా పక్కన పెట్టినట్లు? పన్నుల్లో వాటాను రాష్ట్రాలకు 32 శాతం నుంచి 42 శాతానికి పెంచినందువల్ల జిల్లా, మండల పరిషత్తుల బాధ్యతలను రాష్ట్రాలే చేపట్టాలనేది దాని వాదన. కేంద్రం కొన్ని పథకాలకు నిధులను అకస్మాత్తుగా రద్దు చేసి, వాటి తదుపరి కొనసాగింపు పైకాన్ని కూడా తాను పెంచి ఇస్తున్న పన్నుల వాటా నుంచే రాష్ట్రాలు ఖర్చుపెట్టుకోవాలని సూత్రీకరించింది. ఇలా కేంద్రం 42 శాతం వాటాను ఓ అస్త్రంగా ప్రయోగిస్తుండటంవల్ల జిల్లా పరిషత్, మండల పరిషత్ వంటి వ్యవస్థలు నీరుగారిపోయాయి. అంతకుముందు ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు వచ్చే నిధుల్లో జడ్పీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు నిర్ణీత వాటాలు ఉండేవి. జడ్పీ పెద్దన్న పాత్ర పోషిస్తూ గ్రామాల్లోని ప్రధాన రోడ్లు, గ్రామాల తాగునీటి పథకాల నిర్వహణ, పాఠశాలల్లో వసతుల కల్పన వంటి కీలక బాధ్యతలు ఎన్నింటినో చేపట్టేది. మండల పరిషత్ కూడా మంచినీటి బోర్లకు మరమ్మతులు చేయించటం, రోడ్ల నిర్మాణం వంటి విధులు నిర్వహించేది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోకి వచ్చిన 2015 ఏప్రిల్ నుంచి ఇటువంటి పనులన్నీ నిలిచిపోయాయి. అన్ని నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు వెళ్లిపోతున్నాయి. మునుపటి మాదిరిగా జిల్లా పరిషత్, మండల పరిషత్తులకు వాటాలు అందడం లేదు. అందువల్ల జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక (జడ్‌పీటీసీ, ఎంపీటీసీ) సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పనులు జరగనప్పుడు- పార్టీ గుర్తులపై ఎన్నికైన వీరిని ప్రజలు నిలదీయడం సహజం. వారికి సమాధానాలు చెప్పుకోలేక వీరంతా సతమతమవుతున్నారు. వీరి నుంచి ఎన్నికైన జిల్లా పరిషత్, మండల పరిషత్ ఛైర్‌పర్సన్లదీ అదే పరిస్థితి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎప్పుడు జడ్పీ, మండల పరిషత్ సమావేశాలను నిర్వహించినా నిధులు, విధుల అంశమే ప్రధాన చర్చనీయాంశమవుతోంది. జడ్పీ ఛైర్‌పర్సన్ల వాహనాలకు కనీసం డీజిలు ఖర్చులైనా అందని దుర్గతి ప్రస్తుతం నెలకొంది. ఒకప్పుడు కలెక్టరేట్ల మాదిరిగా భాసిల్లిన జడ్పీలు ఇప్పుడు కనీసం ప్రహరి గోడను కట్టుకోవాలన్నా ఎవరో ఒకర్ని ప్రాధేయపడాల్సిన అగత్యం ఏర్పడుతోంది. 14వ ఆర్థిక సంఘం చేసిన కొన్ని సిఫార్సులను అప్పట్లోనే అందులోని సభ్యుడు అభిజిత్ సేన్ వ్యతిరేకించారు. తన అసమ్మతిని తెలిపారు. అందుకు ఛైర్మన్ వైవీ రెడ్డి ఇచ్చిన సమాధానాన్నీ నివేదికలో పొందుపరచారు. పన్నుల్లో వాటా పెంచామనే పేరుతో కొన్ని పథకాలకు నిధులు నిలిపేయడం వల్ల తలెత్తే పరిణామాలను తన అసమ్మతి పత్రంలో అభిజిత్ ప్రస్తావించారు. అంటే, ఇప్పటి పరిస్థితిని ఆయన ముందుగానే పసిగట్టారన్న మాట.

ఉనికే ప్రశ్నార్థకం

ఆర్థిక సంఘం నిధుల్లో వాటాలు అంటూ లేనందువల్ల ఇతరత్రా తామూ ఇవ్వాల్సిన పైకాన్ని అయినా రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అందజేయగలిగితే స్థానిక సంస్థలకు కొంత ఊరట కలిగేది. తెలంగాణ విషయానికొస్తే, ఇక్కడ స్టోన్ క్రషర్లు, గ్రానైట్ క్వారీల నుంచి రాబట్టే సీనరేజి సెస్, రిజిస్ట్రేషన్ సమయంలో వసూలు చేసే బదిలీ సుంకం వంటివేవీ జిల్లా, మండల పరిషత్తులకు ప్రస్తుతం అందడం లేదు.

15వ ఆర్థిక సంఘంపైనే జిల్లా, మండల పరిషత్తుల ఆశలు

బీఆర్‌జీఎఫ్ వంటి పథకాలూ నిలిచిపోయాయి. ఉభయ రాష్ట్రాల్లో అన్ని వైపుల నుంచి తలుపులు మూసుకుపోవడంవల్లే వాటికి ప్రస్తుతం ఊపిరాడని పరిస్థితి నెలకొంది. అందువల్లే 15వ ఆర్థిక సంఘంపై జిల్లా, మండల పరిషత్తులు ఇప్పుడు గంపెడాశలు పెట్టుకొన్నాయి. నిధులు లేనప్పుడు జిల్లా, మండల పరిషత్తులను కొనసాగించడం దండగనే నైరాశ్య ధోరణీ ఆయా ప్రజాప్రతినిధుల్లో ఏర్పడుతోంది.

కేంద్ర సర్కారు 15వ ఆర్థిక సంఘానికి నిర్దేశించిన నియమనిబంధనలను పరిశీలిస్తే ఈసారి స్థానిక సంస్థల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలను బాధ్యులుగా చేసే సిఫార్సులను అది వెలువరించవచ్చని తెలుస్తోంది. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన రాష్ట్రాలకు ప్రోత్సాహక మొత్తాలు ఇచ్చేలా సిఫార్సులు చేయాల్సిందిగా నూతన ఆర్థిక సంఘానికి కేంద్రం సూచించింది. స్థానిక సంస్థలకు రాష్ట్ర సొంత ఖజానా నుంచి గ్రాంట్లు ఇవ్వడమూ ఇటువంటి కేంద్ర ప్రోత్సాహకాలకు అర్హమైన అంశాల్లో ఉంది. అంటే సీనరేజి సెస్, బదిలీ సుంకం వంటివాటిని, ప్రత్యేక సాయాలను ఇప్పటి మాదిరిగా ఏళ్లతరబడి అందజేయకుండా తాత్సారం చేస్తుంటే మాత్రం కేంద్ర ప్రోత్సాహకాలను వదులుకోవాల్సిందే. స్థానిక సంస్థల్లో మానవ వనరుల అభివృద్ధి, పౌరులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తేవటం వంటివాటితో సహా వివిధ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వాలు గ్రాంట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించినచోట ప్రజల ప్రవర్తనల్లో మార్పులు తేవటానికి రాష్ట్రాలు చేసిన కృషికీ ప్రోత్సాహకాలు ఉంటాయి. పంచాయతీల్లో రాబడి వనరులను పెంచే మార్గాలపైనా 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు చేస్తుంది. పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 42 శాతానికి పెంచిన తరవాత ఒనగూడిన ప్రయోజనాలపై అది అధ్యయనం చేస్తుంది. వాటాలు లేనందువల్ల తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామంటూ గ్రామీణ స్థానిక సంస్థల నుంచి, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వినతులు వెళ్తాయి కనుక, ఈ అంశంపైనా నూతన ఆర్థిక సంఘం దృష్టి సారించే అవకాశం ఉంది.

జిల్లా, మండల పరిషత్తులకు వాటాలు లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన నిధులు (రూ.కోట్లలో)

సంవత్సరం	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
2015-16	580	934
2016-17	908	1,462
2017-18	1,047	1,687
2018-19	1,209	1,947
2019-20	1,628	2,621
మొత్తం	5,372	8,601

పాలక వర్గాలపై ఒత్తిడి

తెలుగు రాష్ట్రాల్లో మండల వ్యవస్థ మధ్యస్తంగా ఉంది. కాబట్టి, ఇక్కడి పరిస్థితులు ప్రత్యేకంగా ఉంటాయి. ప్రభుత్వ పాలనను ప్రజల చేరువకు తీసుకెళ్లాలనే ధ్యేయంతో అమలులోకి తెచ్చిన మండల వ్యవస్థకు తగినంత ఆర్థిక పరిపుష్టి ఉన్నప్పుడే అది సజావుగా పనిచేయగలుగుతుంది. తెలంగాణలో తొమ్మిది గ్రామీణ జిల్లాల సంఖ్య 30కి ఎగబాకినందున 2019లో ప్రస్తుత తొమ్మిది జిల్లా పరిషత్తులస్థానే 30 జిల్లా పరిషత్తులు ఏర్పాటవుతాయి. అప్పటికి ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం పూర్తవుతుంది. కనుక వీటిని విడగొట్టి 30 జడ్పీలు చేస్తారు. నిర్ణీత కాలవ్యవధి ప్రకారమైతే తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ 2019లో కొత్త పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. తెలంగాణలో కొత్త మండలాలు పెద్దసంఖ్యలో ఏర్పాటైనందువల్ల వాటికీ కొత్త పాలకవర్గాలు వస్తాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, మండల పరిషత్తులు తమ విధులను సజావుగా నిర్వహించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం తప్పనిసరి. నిధులు కేంద్రమే ఇవ్వాలని రాష్ట్రం, తాను పన్నుల వాటా పెంచేసినందున రాష్ట్రమే నిధులు సమకూర్చుకోవాలన్న వితండ వాదనలకు కేంద్రం దిగితే మాత్రం స్థానిక సంస్థల పరిస్థితి మరింత దిగజారుతుంది. పర్యవసానంగా పల్లె సీమలు ఇబ్బందుల పాలవుతాయి. గ్రామాల్లోనూ పట్టణాల మాదిరిగా వసతుల కల్పనకంటూ కేంద్రం 'రూర్బన్' అనే ఒక పథకాన్ని తెచ్చి, ఎంపిక చేసిన కొన్ని జిల్లాల్లో దాన్ని అమలు చేస్తోంది. పథకాన్ని దశలవారీగా విస్తరించాలనేది కేంద్రం ఉద్దేశం. ఇటువంటి కార్యక్రమాలకు కేంద్రం ఇచ్చే మొత్తాలు చాలా తక్కువ. రాష్ట్ర ప్రభుత్వాలే అధిక వాటాను సమకూర్చాలి. నిధులకు కొరత ఉన్నప్పుడు ఇటువంటి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా ఫలితం ఉండదు. ఇప్పటికే 'సన్సద్ ఆదర్శ గ్రామ యోజన' నీరుగారింది. ఉభయ రాష్ట్రాల్లో పలువురు ఎంపీలు రెండో దశ గ్రామాలనైనా ఎంపిక చేయలేదు. నిధులు ఇవ్వకుండా అందుబాటులో ఉన్న కార్యక్రమాల నుంచే ఆదర్శ గ్రామాలకూ సొమ్ము ఖర్చుపెట్టాలంటే అన్ని చోట్లా సాధ్యంకాకపోవచ్చు. అందుకే ఆర్థిక సంఘం వంటివి సిఫార్సులు చేసేటప్పుడు, కేంద్రం వివిధ పథకాల రూపొందించే సందర్భంలో పర్యవసానాలనూ అంచనా వేయాలి. 15వ ఆర్థిక సంఘం అటువంటి పని చేస్తే తెలుగు రాష్ట్రాల్లో కొత్త పాలక వర్గాలైనా ప్రశాంతంగా పనిచేసుకోగలుగుతాయి!

– పిళ్లా సాయికుమార్



ఎ.సూర్యప్రకాశ్

తప్పుడు అభ్యర్థులపై తూటా

గుజరాత్ శాసనసభకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు 'నోటా' (నన్ ఆఫ్ ద అబోవ్) శక్తిని మొట్టమొదటిసారిగా విస్పష్టంగా చాటి చెప్పాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులెవరూ నచ్చనప్పుడు, తమ ప్రతినిధిగా ఎన్నికయ్యే అర్హత వారిలో ఎవ్వరికీ లేదని భావించినప్పుడు - పై వారెవరికీ ఓటు వేయడం లేదంటూ తేటతెల్లం చేయడానికి ఓటర్లకు కల్పించిన విశిష్ట సదుపాయమిది. ఎన్నికల యంత్రం మీది 'నోటా' మీటను నొక్కడం ద్వారా ఓటరు ఈ సదుపాయాన్ని వినియోగించుకొంటున్నాడు. బరిలోని అభ్యర్థుల పట్ల తన వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాడు. నిరసన ప్రకటిస్తున్నాడు. దేశంలో రానున్న ప్రధాన ఎన్నికలు అన్నింటిలోనూ 'నోటా' గణనీయ పాత్ర పోషించగలదనడానికి గుజరాత్ ఎన్నికల ఫలితాలే సాక్ష్యం.

ఓటర్ల నిరసన

2013లో ఒక కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దరిమిలా దేశంలో 'నోటా' శకం ప్రారంభమైంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై 'నోటా' మీటను ఏర్పాటు చేయవలసిందిగా ఎన్నికల కమిషన్‌ను అప్పట్లో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. బరిలో ఉన్న అభ్యర్థులెవరికీ ఓటు వేయకుండా ఉండే హక్కు ఓటరుకు ఇవ్వాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో అది అత్యంత ముఖ్యమని ఆనాడు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అభ్యర్థులందర్నీ తిరస్కరించే హక్కు ఓటరుకు ఇచ్చేందుకు భారత న్యాయసంఘం (లా కమిషన్ ఆఫ్ ఇండియా), ఎన్నికల కమిషన్ సైతం సుముఖత వ్యక్తపరిచాయి. 13 దేశాల్లో 'నోటా' అమలు చేస్తున్నారని, రాజకీయ పార్టీలు అభ్యర్థులను నిలబెడుతున్న తీరుపట్ల నిరసన వ్యక్తపరచడానికి, అసమ్మతి తెలియజేయడానికి ఈ సదుపాయం ఉపయోగపడుతుందని న్యాయస్థానం వివరించింది. ఎన్నికల్లో తాము నిలబెడుతున్న అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో ప్రజలు తిరస్కరిస్తున్నారని అర్థమైనప్పుడు, రాజకీయ పార్టీల్లో క్రమానుగతంగా మార్పు వస్తుందని, ప్రజలకు ఆమోదయోగ్యులైన, చిత్తశుద్ధి విశ్వసనీయతా కలిగిన అభ్యర్థులవైపే అవి మొగ్గు చూపుతాయని వ్యాఖ్యానించింది. అప్పటినుంచే దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో 'నోటా'ను ఉపయోగిస్తున్నప్పటికీ, అది ఎంత ప్రభావశీలమైనదో 2017 గుజరాత్ ఎన్నికలతోనే వెల్లడైంది.

గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో మొదటి ఇద్దరూ అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా కన్నా 'నోటా'కు పడిన ఓట్లే ఎక్కువ. 'నోటా' కన్నా తక్కువ ఓట్ల తేడాతో 12 స్థానాల్లో భాజపా అభ్యర్థులు పరాజయం పాలుకావడం గమనార్హం. కాంగ్రెస్‌కు ఓటువేయడం ఇష్టంలేదు. అలాగని భాజపా అభ్యర్థులకు ఓటువేయడానికి మనస్కరించని పరిస్థితి. తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యంకాని అలాంటి అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెట్టిన భాజపాకు నిరసన తెలపడానికే ఓటర్లు 'నోటా'కు పెద్దయెత్తున ఓటు వేశారు. వారు కాంగ్రెస్‌కు ప్రయోజనం కలుగరాదనుకొన్నారు. అదే సమయంలో తమ మనోగతమేమిటో భాజపాకు తెలియజెప్పాలనుకొన్నారు. అందుకే 'నోటా'కు భారీగా ఓట్లు వేసి భాజపాకు గట్టి హెచ్చరిక పంపారు. ఒక విధంగా- మృదువుగానే మందలించారు. ప్రజల్లో కనుక అలాంటి అసంతృప్తి లేకుండా ఉంటే, భాజపా ఆ సీట్లన్నీ లేదా వాటిలో అత్యధికం గెలుచుకొని ఉండేది. కాంగ్రెస్ పార్టీ రెండు దశాబ్దాలుగా గుజరాత్‌లో అధికారంలో లేదు. కేంద్రంలోనూ అధికారం కోల్పోయింది. సుదీర్ఘపాలన కారణంగా గుజరాత్‌లో భాజపా ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఏర్పడటంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లు, ఓట్ల శాతం



భాజపా	(49.1 శాతం; 1,44,57,152 ఓట్లు)
కాంగ్రెస్	(41.4 శాతం; 1,22,07,154 ఓట్లు)
స్వతంత్రులు	(4.3 శాతం; 12,59,713 ఓట్లు)
బీటీపీ	(0.8 శాతం; 2,22,694 ఓట్లు)
బీఎస్పీ	(0.7 శాతం; 2,04,230 ఓట్లు)
ఎన్‌సీపీ	(0.6 శాతం; 1,82,495 ఓట్లు)
ఏఐఎన్‌హెచ్‌సీపీ	(0.3 శాతం; 81,630 ఓట్లు)
ఆర్‌ఎస్‌పీఎస్	(0.2 శాతం; 44,928 ఓట్లు)
నోటా	(1.8 శాతం; 5,42,196 ఓట్లు)
ఇతరులు	(0.8 శాతం)

ఆధారం: ఎన్నికల సంఘం

ప్రాముఖ్యం పెరిగిన 'నోటా'

ఆ రాష్ట్రంలో మరోసారి భాజపా ప్రభుత్వమే ఏర్పాటైనప్పటికీ, ఆ పార్టీ సరైన అభ్యర్థులను నిలబెట్టకపోవడం వల్లే పలుస్థానాల్లో అంతిమ విజేతగా 'నోటా' నిలబడే పరిస్థితి ఉత్పన్నమైంది. పెద్దనోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) కారణంగా ప్రధానంగా వ్యాపారులైన గుజరాతీల మీద దుష్ప్రభావం పడింది. ఈ చర్యలు చేపట్టి తమను ఇబ్బంది పెట్టిన భాజపాకు వారు గట్టిగా నిరసన తెలపాలనుకున్నారు. అంతే తప్ప కాంగ్రెస్‌కు కుప్పలుకుప్పలుగా ఓట్లు వేయాలనుకోలేదు. అందుకు బదులు 'నోటా'కు ఓటు వేశారు. 'నోటా' ఓట్లు పెరగడానికి ఇది మరో కారణం. గుజరాత్‌లోని చాలా స్థానాల్లో 'నోటా' కన్నా కాంగ్రెస్ పార్టీ విజయానికి తోడ్పడిన ఓట్లు తక్కువ.

గుజరాత్ ఎన్నికల్లో భాజపా కొద్ది ఓట్ల తేడాతో పరాజయం పాలైన 12 సీట్ల సంగతి చూద్దాం. 'నోటా' కారణంగానే ఆ సీట్లను భాజపా కోల్పోవాల్సి వచ్చింది. ఛోటా ఉదయ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ 1,000కన్నా తక్కువ ఓట్ల తేడాతో గెలిచింది. అక్కడ 'నోటా'కు పడిన ఓట్లు 5870. డాంగ్స్‌లో కాంగ్రెస్ పార్టీ కేవలం 800 ఓట్ల తేడాతో విజయం సాధించింది. అక్కడ నోటా మీటనొక్కినవారి సంఖ్య 2,184. దేవధర్‌లో కాంగ్రెస్ 1,000 ఓట్ల కన్నా తక్కువ మెజారిటీతో గెలుపొందగా, అక్కడ నోటాకు 2,988 ఓట్లు పడ్డాయి. కప్రద, మన్సా, జెట్‌పూర్‌లలోనూ అలాగే జరిగింది. ఆ స్థానాల్లోనూ భాజపాను 'నోటా'నే ఓడించింది. అదెలాగంటే, కప్రదలో కాంగ్రెస్ అభ్యర్థి, భాజపా అభ్యర్థిని కేవలం 170 ఓట్ల తేడాతో ఓడించారు. అక్కడ 'నోటా'కు పడిన ఓట్లు 3,868. మాన్సా సీటును భాజపా కేవలం 524 ఓట్ల తేడాతో కోల్పోయింది. 3,000 ఓటర్లు 'నోటా' మీట నొక్కారు. జెట్‌పూర్‌లో భాజపా అభ్యర్థి 3,052 ఓట్ల తేడాతో ఓడిపోగా, అక్కడ అంతకు రెండింతలు, అంటే 6,155 ఓట్లు 'నోటా'కు పడ్డాయి. మోర్వా హడాఫ్, సోజిత్ర, వాంకనేర్, జంజోధ్‌పూర్, ధనేరా, తలాజ స్థానాలు సైతం 'నోటా' కారణంగానే భాజపా చేజారాయి. తలాజాలో కాంగ్రెస్‌పార్టీ 1,779 ఓట్ల తేడాతో విజయం సాధించగా, 'నోటా'కు 2,918 ఓట్లు పడ్డాయి. వాంకనేర్ సీటును భాజపా 1,361 ఓట్ల తేడాతో కోల్పోయింది. అక్కడ 'నోటా'కు పడిన ఓట్లు 3,170. 'నోటా' సదుపాయం కనుక లేకుండా ఉంటే భాజపా చాలా స్థానాల్లో మంచి విజయం సాధించి ఉండేదని అనిపిస్తోంది.

పార్టీలకు హెచ్చరిక

'నోటా' సంగతెలా ఉన్నా, గుజరాత్ ఎన్నికల ఫలితాలు ఇతర రాష్ట్రాల కన్నా భిన్నమైనవనడంలో సందేహం లేదు. సాధారణంగా రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా పదిశాతం వరకు ఉంటే, విజేతగా నిలిచే పార్టీ శాసనసభలో 75 నుంచి 80 శాతం దాకా స్థానాలు గెలుచుకొంటుంది. విజయఢంకా మోగిస్తుంది. కానీ గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో అలా ఎన్నడూ జరగలేదు. ఉదాహరణకు రాజస్థాన్‌లో 2013లో జరిగిన శాసనసభ ఎన్నికల సంగతి చూద్దాం. ఆ రాష్ట్రంలో మొత్తం శాసనసభ స్థానాలు 200. కాంగ్రెస్‌కు 33 శాతం ఓట్లు వచ్చాయి. 45 శాతం ఓట్లు పొందిన భాజపా 163 సీట్లు (80 శాతం) సాధించింది. కాంగ్రెస్‌కు దక్కిన సీట్లు 21 మాత్రమే. అదే ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలూ జరిగాయి. భాజపా కాంగ్రెస్‌కన్నా 8.5 శాతం ఎక్కువగా 45 శాతం ఓట్లు సాధించింది. శాసనసభలోని మొత్తం 230 స్థానాల్లో 165 (70 శాతం) కైవసం చేసుకొంది. కాంగ్రెస్‌కు 58 సీట్లు దక్కాయి. గుజరాత్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో భాజపా కాంగ్రెస్ కన్నా ఏడు శాతం ఎక్కువగా, 49 శాతం ఓట్లు పొందింది. మొత్తం 68 స్థానాల్లో 44 సీట్లు కైవసం చేసుకొని మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. గుజరాత్‌లో సైతం భాజపాకు కాంగ్రెస్ కన్నా దాదాపు అదేస్థాయిలో ఎక్కువ ఓట్లు లభించినప్పటికీ, సీట్ల సంఖ్య కోసుకుపోయింది. గుజరాత్ ఎన్నికలు విభిన్నమైనవనడానికి ఇదే నిదర్శనం. ఆ రాష్ట్రంలో భాజపాకు ఏడు శాతం ఓట్లు అధికంగా లభించినప్పటికీ, 'నోటా' కారణంగా అనేక స్థానాల్లో ఆ పార్టీ విజయావకాశాలకు గండిపడింది. అన్ని రాజకీయ పార్టీలకూ ఈ పరిస్థితి ఒక హెచ్చరిక. 'నోటా' కారణంగా భారత ఎన్నికల రాజకీయాల స్వరూప స్వభావాలే మారిపోతున్న దృశ్యం కట్టెదుట స్పష్టాతిస్పష్టంగా కనిపిస్తోంది.

(రచయిత– ప్రసారభారతి ఛైర్మన్)

ఆత్మనేత్రం

ఏకాగ్రత అంటే, మనసును ఎప్పుడూ ఒక్కచోటే ఉంచడం కాదు. పనిగట్టుకొని దానికి కళ్లెం వేయడం అంతకన్నా కాదు. మనసు అనేది ఎక్కడ కేంద్రీకృతమైందన్నదే అతి ముఖ్యం. దాన్ని ఎందుకు కేంద్రీకరించాలో గ్రహించడం అన్నింటికంటే ప్రధానం.

రాముణ్ని స్మరించాలని భావించినంత మాత్రాన ఉన్నపళంగా రమ్యత నెలకొనదు. ఆ స్మరణ ఎలా, ఎందుకు సాగించాలన్నదానిపై సాధకులు శ్రద్ధ వహించాలి. దీనికి రామాయణంలోనే ఒక చక్కటి ఉదాహరణ ఉంది. రావణుడి మేనమామ మారీచుడు. 'రామ' శబ్దం- కాదు కాదు... 'రా' అనే అక్షరం వింటే చాలు, అతడి గుండె పగిలినంత పనయ్యేది! అనుక్షణమూ రామ జపం చేసేవాడు. ఆ జ్ఞాపకం, స్మరణతోనే కాలం గడిపేవాడు. మారీచుడి దృష్టిలో జగమంతా రామమయమే కానీ- అది ప్రేమతో కాదు, భక్తితో అసలే కాదు, పూర్తిగా మరణ భయంతో!

అతడు సదా ప్రాణభీతితో వణికిపోతుండేవాడు. ఏకాగ్రత సమస్తం రాముడి మీదే ఉండేది. ఆయన ఏ క్షణంలో వచ్చి తనను సంహరిస్తాడోనని సర్వదా భయపడుతుండేవాడు. అదే నిజభక్తి అయి ఉంటే, మారీచుడు ఎంతటి రామభక్తుడయ్యేవాడో! అతడు ఎటువంటి కారణాలతో రామచంద్రుణ్ని స్మరించినా, ఆయనపై ఎంత 'ప్రగాఢ ఏకాగ్రత' కనబరచినా- చివరకు రామబాణం వల్ల హతుడయ్యాడు. ఆయనలోనే ఐక్యమయ్యాడు. అంటే, ఉద్దేశంలో అంతరాల కారణంగానే మారీచుడు ప్రాణం కోల్పోయాడు. అతడు అదే స్మరణను రాముడి పట్ల భక్తితో చేసి ఉంటే, జీవితమంతా మాధుర్యమయం అయ్యేది. ఆనంద నందనంగా మారి ఉండేది. లోకంలో అగణితమైన కీర్తి విభీషణుడిలా అతడికి లభించి ఉండేదేమో! మారీచుడి ఏకా



గ్రత, ధ్యాస, ధ్యానం- సమస్తం శత్రుభావంతో, భయంతో సాగడం వల్ల... అత్యంత అమృతమయం కావాల్సిన అతడి జీవితం దయనీయంగా కడతేరిపోయింది.

రాముడన్నా, ఆయన వ్యక్తిత్వమన్నా మారీచుడికి గౌరవమే! అందుకే 'రామో విగ్రహవాన్ ధర్మః' అని ఒక సందర్భంలో అతడు అంటాడు. అయినా, ఆయనమీది సదబిప్రాయ సూర్యుణ్ని మారీచుడి భయభూతం మబ్బులా కమ్మేసింది. సీతారాముల ఎడబాటుకు అతడే ప్రధాన కారకుడయ్యేలా చేసింది. అందువల్ల ధ్యానం అత్యంత ఉత్కృష్టమైనదైనా- అది ఎందుకు, దేనిమీద అన్నవే ప్రధాన అంశాలు.

సమయం విలువ తెలిసి మసలాలి మనిషి! ఇతర అంశాలమీద కాదు, అసలు పరమార్థం మీద ధ్యానం నిలిపితేనే అతడి జన్మ ధన్యమవుతుంది. కాలాన్ని చరితార్థం చేసుకున్నట్లవుతుంది. అమూల్య సమయాన్ని చిత్తానుసారం విభజించడం, విభాగించడం సరైనవి కావు. ఏక, ఏకైక కారణంమీద మదిని కేంద్రీకృతం చేసి ఏకాగ్రతతో ధ్యానం సాగిస్తే భగవంతుడు సొంతమవుతాడు. ధ్యానం అంటే ఆలోచనారాహిత్యమని ఎవరూ అనుకోకూడదు. మనసును శూన్యం చేయడంగానూ భావించడం ఎంతమాత్రం తగదు. ఏకాగ్రత వెనక ఉండాల్సినవి- భగవంతుడి పట్ల ఆర్తి, భక్తిపూర్వక వ్యాకులత!

దృష్టిని కేంద్రీకరించకుండా సాధకుడు ఎంత విప్పార్చి చూసినా, చర్మచక్షువులకు భగవంతుడు కనిపించడు. అతడు జ్ఞాననేత్రం తెరవాలి. అతడి ఆత్మనేత్రం వికసించాలి. బాహ్యం, ఆంతర్యం, ఆత్మ... అంతటా అన్నిదిక్కులా ఏక నేత్రంగా-సర్వ నేత్రంగా మారిన స్థితిలో దైవం కోసం సాధకుడు అన్వేషించాలి. అప్పుడే సర్వాంతర్యామి అయిన భగవానుడు, సర్వాన్నీ చూడగలిగే స్థితిలోకి చేరిన ఆ సాధక నేత్రానికి అందుతాడు!

– చక్కిలం విజయలక్ష్మి

సాయం చేసినా.. వంచనే మిగిలింది!

- అమెరికా సహకారాన్ని దుర్వినియోగం చేసిన పాక్
- తీవ్రవాదులకు అడ్డుకట్ట లేదు
- చైనా వైపు కదులుతున్న పాక్
- .. అందుకే సాయం నిలిపేయాలని నిర్ణయం



పాముకు పాలుపోసి పెంచితే ఏం జరుగుతుందో.. పాకిస్థాన్ విషయంలో అమెరికాకు అదే జరిగింది. తన అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని 70 ఏళ్లుగా(1948 నుంచి) పాకిస్థాన్‌కు వందల కోట్ల డాలర్లను సాయం రూపంలో గుమ్మరిస్తున్న అమెరికాకు.. ఆ దేశం వల్ల కలుగుతున్న నష్టం ఏమిటో ఆలస్యంగా తెలిసివచ్చాక- ఇప్పుడు తప్పును సరిదిద్దుకునే పనిలో పడింది. పాకిస్థాన్‌కు సాయాన్ని ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటిస్తున్నారు. ప్రతి చోటా అమెరికా స్వార్థం, ఆధిపత్య ధోరణి, తనకు గిట్టని దేశాలకు చెక్ పెట్టే వ్యూహం అనేక ఏళ్లుగా పాకిస్థాన్‌కు అమెరికా సాయం చేయడం వెనుక కారణాలు.

1వ దశ

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఆసియాలోని రెండు నిరుపేద దేశాలకు సాయం చేయాలని అమెరికా నిర్ణయించింది. తనకు ఎవరైతో ఉపయోగపడతారో బాగా ఆలోచించి.. ఎట్టకేలకు భారత్‌ను కాకుండా పాకిస్థాన్‌ను ఎంపికచేసుకుంది. ఆ దేశానికి నిధుల సాయం, సైనిక శిక్షణ, సైనిక సామగ్రి కేటాయింపు, నిఘా సేవలు అందించడాన్ని 1948 నుంచే ప్రారంభించింది. దీనికి కారణాలు లేకపోలేదు. పాకిస్థాన్ పొరుగునున్న అఫ్గానిస్థాన్‌లో సోవియట్ యూనియన్ అప్పటికే తన ప్రాబల్యాన్ని కలిగి ఉండటంతో.. ఆ దేశానికి చెక్ పెట్టే ఉద్దేశంతో ఇటు పాకిస్థాన్‌కు సహకరించడంతో పాటు.. అఫ్గాన్‌లోని వైరి వర్గాల్ని ఎగదోసింది. వారికి ఆయుధాలు ఇచ్చింది. నల్లమందు సాగును ప్రోత్సహించింది. ఈ ప్రాంతంపై పట్టుకు రకరకాల ఎత్తులు వేసింది.

2వ దశ

అమెరికా-పాకిస్థాన్ మధ్య 1954లో రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత పదేళ్లలో దాదాపు 50 కోట్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని, 70 కోట్ల డాలర్ల సైనిక సహాయాన్ని పాకిస్థాన్‌కు అమెరికా అందించింది. ఈ సాయాన్ని ఉపయోగించుకుని పాకిస్థాన్ నెమ్మదిగా తన సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవడం ప్రారంభించింది. పాకిస్థాన్‌కు వైరి దేశంగా ఉన్న భారత్- సోవియట్ యూనియన్‌కు మిత్ర దేశంగా ఉండటం అమెరికాకు ఎంతమాత్రం నచ్చలేదు. అందుకే పాకిస్థాన్‌కు పెద్దఎత్తున నిధులు సమకూర్చింది. 1965లో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరగడంతో...అమెరికా కొద్దిరోజులు పాక్‌కు సైనిక సాయాన్ని ఆపేసింది. పౌర సహకారాన్ని మాత్రం కొనసాగించింది.

పాకిస్థాన్‌కు అమెరికా సాయం తీరిదీ...

సంవత్సరం	సాయం (కోట్ల డాలర్లలో)
1948	7
1954	31
1965	300
1986	100
2002	160
2010	330
2015	150

3వ దశ

భారతదేశం పోఖ్రాన్‌లో జరిపిన అణుపరీక్షలతో ఒత్తిడికి గురైన పాకిస్థాన్- దీనికి పోటీగా అణ్వాయుధాల్ని సమకూర్చుకునే ఎత్తుగడలకు తెరతీసింది. రహస్యంగా యురేనియం శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తోందని గుర్తించిన అమెరికా 1979లో ఆ దేశానికి సాయాన్ని మరోమారు ఆపేసింది. సరిగ్గా ఇదే సమయంలోనే జమాతే ఇస్లామీ లాంటి ఇస్లామిక్ అతివాద గ్రూపులు పాకిస్థాన్‌లో పుట్టుకొచ్చాయి. మక్కాలోని గ్రాండ్ మాస్క్‌పై దాడికి అమెరికా, ఇజ్రాయెల్ కారణమన్న వార్తలు గుప్పుమనడంతో ఇస్లామిక్ అతివాదులు ఇస్లామాబాద్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని దహనం చేశారు. దీంతో అమెరికా-పాకిస్థాన్ మధ్య స్నేహం ముగిసిందనుకున్నారు. అయితే 1979 డిసెంబరులో అఫ్గానిస్థాన్‌పై సోవియట్ యూనియన్ దండెత్తింది. దీంతో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ పాకిస్థాన్‌కు 10 కోట్ల డాలర్ల సాయాన్ని ప్రకటించారు. దీనిని పాకిస్థాన్ నియంత జియావుల్ హక్ తిరస్కరించారు. కార్టర్ తర్వాత అమెరికా అధ్యక్షుడైన రొనాల్డ్ రీగన్ హయాంలో పాకిస్థాన్‌కు అమెరికా సాయం దాదాపు నాలుగు రెట్లయింది. ఆర్థికసాయం రూపంలో 300 కోట్ల డాలర్లు, సైనిక సాయం రూపంలో 200 కోట్ల డాలర్లు అందజేశారు. పాకిస్థాన్ ఐఎస్ఐ ద్వారా అఫ్గాన్ జిహాదీలకూ దాదాపు 300 కోట్ల డాలర్ల సాయం చేశారు. అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రంగా సాగుతున్న రోజులవి. సోవియట్ వైపు భారత్ మొగ్గుచూపడంతో... దీనికి ప్రతిగా పాకిస్థాన్‌ను సాయుధం చేయడమే లక్ష్యంగా అమెరికా సైనిక సాయం అందించింది.

4వ దశ

1980ల చివర్లో అఫ్గానిస్థాన్ నుంచి సోవియట్ వైదొలగడంతో.. పాకిస్థాన్‌పై అమెరికాకు ఆసక్తి తగ్గిపోయింది. దీంతో సాయాన్ని తగ్గించేసింది. పాకిస్థాన్ అణు పరీక్షలు జరిపిన తర్వాత 1998 నుంచి అమెరికా సాయంలో మరింత కోత విధించింది. 1991లో సోవియట్ యూనియన్ పతనమైంది. అమెరికా- సోవియట్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధమూ ముగిసింది. అమెరికా వ్యతిరేక భావజాలం కలిగిన పాకిస్థాన్ ఐఎస్ఐ మాజీ అధిపతి హమీద్ గుల్ అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్ల ఏర్పాటుకు సహకరించారు. ఆ గ్రూపుతో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ.. క్వెట్టాలో తాలిబాన్ నేతలకు పాక్ సహకరిస్తోందన్న అనుమానం అమెరికాకు బలపడింది. దీంతో అధ్యక్షుడు జార్జి బుష్ పాకిస్థాన్‌కు సైనిక సాయంలో కోత విధించారు. 2001 సెప్టెంబరులో అమెరికాపై తీవ్రవాద దాడి తర్వాత- అఫ్గానిస్థాన్‌లో అల్‌ఖైదా, తాలిబాన్లపై యుద్ధం కోసం అమెరికా భారీగా పాకిస్థాన్‌కు సైనిక సాయం చేసింది. ఆ యుద్ధంలో తాలిబాన్, అల్‌ఖైదాలపై అమెరికా విజయం సాధించినప్పటికీ.. ఆ దేశ ప్రయోజనాలపై ఉగ్రవాదులు అడపాదడపా దాడులు చేస్తూనే వచ్చారు. వీరికి పాకిస్థాన్ రహస్యంగా సహకరిస్తోందన్న అనుమానం అమెరికాలో బలపడింది. పాకిస్థాన్‌లోని అబోతాబాద్‌లో దాక్కున్న అల్‌ఖైదా అగ్రనేత ఒసామాబిన్ లాడెన్‌ను చంపేసింది.

5వ దశ

గత 15 ఏళ్లుగా భారత్-అమెరికా మధ్య బంధం బలపడింది. రెండు దేశాల మధ్య అణు ఒప్పందం కుదిరింది. వాణిజ్య సహకారం విస్తృతమయింది. ఈ స్నేహం పాకిస్థాన్‌కు కంటగింపుగా మారింది. దీంతో పాకిస్థాన్ నెమ్మదిగా చైనాతో సఖ్యతతో మెలగడం ప్రారంభించింది. ఆ దేశం నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. పాకిస్థాన్‌లో చైనా భారీగా పెట్టుబడులు పెడుతోంది. ప్రబల శక్తిగా మారిన చైనాను అడ్డుకోవాలంటే. . భారత్‌తో స్నేహంగా ఉండటమే శ్రేయస్కరమని అమెరికా భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో చైనా వైపు స్నేహహస్తం చాస్తున్న పాకిస్థాన్ నుంచి దూరంగా జరగాలని అమెరికా అనుకుంటోంది. పైపెచ్చు తమ నుంచి భారీగా సాయం పొందుతున్న పాక్- తీవ్రవాదాన్ని తుదముట్టించలేకపోందని బలంగా నమ్ముతోంది. అందుకే ఆ దేశానికి సైనిక సాయాన్ని నిలిపేస్తామని ట్రంప్ ప్రకటించారు.

- ఈనాడు, ప్రత్యేక విభాగం

పాక్‌కు ఇచ్చింది చాలు: ట్రంప్

వాషింగ్టన్: 'పాకిస్థాన్‌కు గత 15 ఏళ్లలో రూ.2.10 లక్షల కోట్లు (33 బిలియన్ల డాలర్లు)కుపైగా ఆర్థిక సాయం గుడ్డిగా అందించాం. దీంతో ఒరిగిందేమీ లేదు. అక్కడి నాయకులు మాకు అబద్ధాలు చెప్పారు. నమ్మక ద్రోహం చేశారు. వారు మమ్మల్ని తెలివితక్కువవారిగా భావిస్తున్నారు. మేం అఫ్గానిస్థాన్‌లో వేటాడుతున్న ముష్కరమూకలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఇక చాలు. .!'అంటూ పాక్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ధ్వజమెత్తారు. ఉగ్రమూకలపై చర్యలు తీసుకోవడంలో పాక్ విఫలం అవుతున్నందుకుగాను రూ.1,627.87 కోట్ల ఆర్థిక సాయాన్ని విడుదలచేయడంలో అమెరికా జాప్యం చేస్తోంది. దీన్ని పూర్తిగా రద్దుచేస్తారంటూ ఇటీవల వార్తలూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల జాతీయ వ్యూహ పత్రం విడుదల సమయంలోనూ పాక్‌ను ట్రంప్ తూర్పారబట్టారు. 'భారీగా పాక్‌కు ఆర్థిక సాయంచేస్తున్నాం. ఉగ్రవాదంపై పోరులో వారు సహకరించాల్సిందే'అని ఆయన పత్రంలో నొక్కిచెప్పారు.

పాక్ ప్రధానితో విదేశాంగ మంత్రి భేటీ: ట్రంప్ వ్యాఖ్యలపై చర్చించేందుకు పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసీతో విదేశాంగ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సమావేశమయ్యారు. పాక్ విదేశాంగ విధానంపైనా వీరు చర్చలు జరిపినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. 'ట్రంప్ వ్యాఖ్యలపై త్వరలోనే మేం స్పందిస్తాం. నిజమేంటో ప్రపంచానికి తెలుసు'అంటూ ఆసిఫ్ ఓ ట్వీట్ కూడా చేశారు.

మోదీ దౌత్యం ఫలితమే.. భాజపా: పాక్‌కు ట్రంప్ కఠిన హెచ్చరికలు పంపడంపై భారత ప్రధాని మోదీని భాజపా కొనియాడింది. మరోవైపు కాంగ్రెస్‌పై విమర్శలు కురిపించింది. 'పాక్ చేస్తున్న నమ్మక ద్రోహానికి చరమగీతం పాడేస్తామని ట్రంప్ సంకేతాలు ఇవ్వడం సంతోషకరం. రాహుల్ గాంధీ గారు ఇది మోదీ దౌత్యం ఫలితమే. మీరు భారత సైన్యంపై విమర్శలు కురిపించకుండా పాక్ నాటకాన్ని ఎప్పుడు అర్థంచేసుకుంటారు?'అని పార్టీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావ్ వ్యాఖ్యానించారు.

విదేశాంగ కార్యదర్శిగా విజయ్ గోఖలే



దిల్లీ: సీనియర్ దౌత్యవేత్త విజయ్ కేశవ్ గోఖలే భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నెల 28న పదవీ విరమణ పొందనున్న ఎస్.జైశంకర్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని నియామక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 1981 ఐఎఫ్ఎస్ బ్యాచ్ అధికారి అయిన గోఖలే.. చైనా వ్యవహారాల్లో నిపుణుడు. గత ఏడాది భారత్-చైనాల నడుమ డోక్లామ్‌లో 73 రోజుల పాటు చోటుచేసుకున్న సైనిక ప్రతిష్టంభనను చర్చల ద్వారా పరిష్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 58 ఏళ్ల గోఖలే.. ప్రస్తుతం విదేశాంగ శాఖలో ఆర్థిక సంబంధాల విభాగం కార్యదర్శిగా ఉన్నారు. 2016 జనవరి 20 నుంచి 2017 అక్టోబర్ 21 వరకూ చైనాలో భారత రాయబారిగా పని చేశారు. అంతకుముందు జర్మనీలో భారత రాయబారిగా వ్యవహరించారు. హాంకాంగ్, హనోయ్, బీజింగ్, న్యూయార్క్‌లోని భారత దౌత్యకార్యాలయాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. విదేశాంగ కార్యదర్శిగా ఆయన రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు.

నేడు రాజ్యసభకు తలాక్ బిల్లు

దిల్లీ: అక్కడికక్కడే ముమ్మారు తలాక్ చెప్పి భార్యకు విడాకులివ్వడాన్ని నేరంగా పరిగణించే బిల్లు మంగళవారం రాజ్యసభకు రాబోతోంది. దీనిని లోక్‌సభ ఇప్పటికే ఆమోదించిన విషయం తెలిసిందే. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెడతారు. ఎగువ సభలో అధికార పార్టీకి ఆధిక్యం లేనందువల్ల దీనిని అక్కడస్తంభింపజేసి, సమీక్ష నిమిత్తం పార్లమెంటరీ కమిటీకి పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును రాజ్యసభ కూడా ఆమోదిస్తే దానిని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని 'ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్' తెలిపింది.

ఐఐఎంలు డిగ్రీలు ఇవ్వవచ్చు

'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్'(ఐఐఎం)లు ఇకపై డిప్లొమాల బదులు డిగ్రీలను ప్రదానం చేయవచ్చు. దీనికి సంబంధించిన బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆమోదముద్ర వేశారు.

బొగ్గు నుంచి మిథనాల్ తయారీపై కార్యదళం

ఈనాడు, దిల్లీ: భారత్, మొజాంబిక్‌లలో లభ్యమయ్యే బొగ్గు నుంచి మిథనాల్ తయారీకి గల అవకాశాలపై అధ్యయనానికి నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ నేతృత్వంలో కార్య దళాన్ని (టాస్క్‌ఫోర్స్) కేంద్ర ఉక్కుశాఖ ఏర్పాటు చేసింది. సభ్యులుగా విశాఖ ఉక్కు సీఎండీ పి.మధుసూదన్‌తో పాటు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు సజ్జన్ జిందాల్, ఎన్ఎల్ మిత్తల్, వివిధ కేంద్ర ప్రభుత్వశాఖల కార్యదర్శులు, ప్రభుత్వరంగ సంస్థల అధిపతులను నియమించింది. కార్యదళం 60 రోజుల్లోపు నివేదిక అందించాల్సి ఉంటుంది.



మనీలాకు తూర్పున మకతి నగరాన కనిపించిన 2018లో మొట్టమొదటి సూపర్‌మూన్

సైన్స్‌కు భాష అవరోధం కారాదు: మోదీ

కోల్‌కతా: సైన్స్ సమాచారాన్ని మరింతమందికి చేరవేసి, ఆ రంగంపై యువతలో ఎక్కువగా జిజ్ఞాస రేకెత్తించడానికి ప్రాంతీయ భాషల్ని విస్తృతంగా వాడాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. భాష అనేది సదుపాయకారిగా ఉండాలే గానీ అడ్డంకిగా నిలవకూడదన్నారు. దేశంలో పరిశోధకులందరూ నవ భారతానికి వీలైన ఆవిష్కరణల్ని, నవకల్పనల్ని సాధించడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కోల్‌కతాలో జరిగే ఆచార్య సత్యేంద్రనాథ్ బోస్ 125వ జయంత్యుత్సవాల కార్యక్రమాల పూర్వరంగాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా సోమవారం ఆయన దిల్లీ నుంచి ప్రత్యక్ష ప్రసార సదస్సు పద్ధతిలో శాస్త్రవేత్తల్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల సామాజిక, ఆర్థిక అవసరాలను తీర్చే రీతిలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ విజ్ఞానాన్ని వినియోగించాలని కోరారు. పేద ప్రజల జీవితాలను ఎంతవరకు మార్చగలిగాయనే కొలబద్ద ద్వారా పరిశోధనలు, ఆవిష్కరణల తుది ఫలితాన్ని అంచనా వేయాలని ప్రధాని చెప్పారు. విభిన్నంగా ఆలోచించడం ద్వారా కొత్త దిశానిర్దేశం చేయాలని శాస్త్రవేత్తల్ని కోరారు. ఒక్కో శాస్త్రవేత్త కనీసం ఒక్కో విద్యార్థికి మార్గదర్శిగా వ్యవహరిస్తే లక్షమందిని శాస్త్రరంగంవైపు తీర్చిదిద్దవచ్చన్నారు. విద్యాసంస్థలు, పరిశోధన-అభివృద్ధి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వాటి మధ్య గట్టి సమన్వయాన్ని సాధించడం ద్వారా అనేక విజయాలు సాధించే ఆస్కారం ఉందని చెప్పారు. సరికొత్త సాంకేతిక చిక్కుముళ్లను శాస్త్రవేత్తలు సాధించాలని పిలుపునిచ్చారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ప్రధాని మోదీ

సముద్ర జలాల్లో చైనా నిఘా వ్యవస్థ!

హిందూ మహాసముద్రంలో కదలికలపై డేగ కన్ను • అమెరికాతో పోటీ పడాలనే ఆలోచన

బీజింగ్: సముద్రం లోపల శత్రుదేశానికి చెందిన జలాంతర్గాములు, క్షిపణి వ్యవస్థలను కనిపెట్టేందుకు చైనా సరికొత్త నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీన్ని హిందూ మహాసముద్రంతో సహా 'మారిటైమ్ సిల్క్ రోడ్డు' లో ఏర్పాటు చేస్తోంది. ఈ నిఘా వ్యవస్థ సముద్రం లోపల కదలికలు, నీటి సాంద్రత, సముద్ర నీటి ఉష్ణోగ్రత, సముద్ర జీవుల సమాచారం సేకరణ . ..తదితర పనులు చేయటంతో పాటు వివిధ దేశాలకు చెందిన జలాంతర్గాముల రాకపోకలపై ఒక కన్నేసి ఉంచుతుంది. ఇది ఇప్పటికే ఈ నూతన వ్యవస్థ పనిచేయటం ప్రారంభించినట్లు హాంగ్‌కాంగ్ కు చెందిన 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' వెల్లడించింది.

అంతర్జాతీయ జలాల్లో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయాలనేది చైనా ఆలోచన. దీన్ని దృష్టిలో పెట్టుకొని చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్ (సీఏఎస్) పర్యవేక్షణలో సౌత్ చైనా సీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనాలజీ ఈ నిఘా వ్యవస్థను రూపొందించింది. ఎన్నో ఏళ్ల పాటు దీనిపై పనిచేసి, పరీక్షించి చూసిన తర్వాత ఆశించిన ఫలితాలు రావటంతో దీన్ని చైనా నౌకాదళానికి అప్పగించింది. ఇప్పటి వరకూ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నట్లు సౌత్ చైనా సీ ఇన్‌స్టిట్యూట్ ఇటీవల పేర్కొంది.

దక్షిణ చైనా సముద్రం, పశ్చిమ పసిఫిక్ మహా సముద్రం, హిందూ మహా సముద్రంలో ఈ నిఘా వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ విధంగా సేకరించిన సమాచారం దక్షిణ చైనా సముద్రంలోని పార్సిల్ దీవుల్లో, దక్షిణ చైనాలోని గ్వాంగ్‌డాంగ్, దక్షిణాసియాలో నెలకొల్పిన మూడు సమాచార సేకరణ కేంద్రాలకు చేరుతుంది. అక్కడ ఈ సమాచారాన్ని విశ్లేషిస్తారు.

గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో సముద్ర దొంగల (పైరేట్స్) సమస్యను అధిగమించటానికి గత కొన్నేళ్లుగా చైనా హిందూ మహాసముద్రంలో నిఘాను అధికం చేసింది. గస్తీ పడవలను తిప్పటంతో పాటు జలాంతర్గాములను ఎంపిక చేసిన ప్రదేశాల్లో సిద్ధంగా ఉంచింది. అంతేగాక హిందూ మహాసముద్రంలో సరకు రవాణా పోర్టులను నెలకొల్పాలనే ఆలోచనతో ఉంది. ఇటువంటిదే డిజిబూతి నౌకాశ్రయం. అంతేగాక గత ఏడాదిలో శ్రీలంక నుంచి హంబన్‌తోట నౌకాశ్రయాన్ని 99 ఏళ్లకు అద్దెకు తీసుకుంది. పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ ప్రాంతంలో కల గ్వాదర్ పోర్టును అభివృద్ధి చేస్తున్న విషయం విదితమే. ఇది భారతదేశానికి మింగుడు పడని అంశం.

అంతర్జాతీయ సముద్ర జలాల్లో పెత్తనం కోసం చైనా ఎంతగా ప్రయత్నాలు చేసినప్పటికీ, ఈ విషయంలో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయటం సాధ్యం కాదని నిపుణుల అంచనా. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాకు ఉన్న సముద్ర నిఘా వ్యవస్థ, యంత్రాంగంతో పోల్చితే చైనా ఎక్కడో దిగువన ఉంటుంది. కాకపోతే ఒక దీర్ఘకాలిక ప్రయాణానికి ప్రారంభంగా చిన్న చిన్న అడుగులు వేస్తున్నాం- అని సముద్ర నిఘా వ్యవస్థ ఏర్పాటులో పాలుపంచుకున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అట్మాస్ఫియరిక్ ఫిజిక్స్ యూ యోంగ్ కియాంగ్ పేర్కొన్నారు.

అమెరికా భద్రత, వ్యూహాత్మక వ్యవహారాల అధ్యయన సంస్థ అంచనా ప్రకారం 2030 నాటికి చైనా వద్ద 260 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు ఉంటాయి. అప్పటికి అమెరికా వద్ద యుద్ధ నౌకలు, జలాంతర్గాములు 199 మాత్రమే ఉంటాయి. సముద్ర జలాల్లో ఆధిపత్య పోరాటం పెరిగి పెద్దదయ్యే కొద్దీ సముద్ర నీటిలో నిఘా వ్యవస్థ వంటి ఏర్పాట్లకు విశేష ప్రాధాన్యం ఉంటుందని ఈ సంస్థ విశ్లేషించింది.

కేఏఎస్ టాపర్ పేరు ప్రస్తావించిన ప్రధాని

ఆనందంతో తలమునకలౌతున్న కశ్మీరీ యువకుడు



అంజుమ్ బసీర్ ఖాన్ ఖట్టాక్

జమ్ము: కశ్మీరు అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (కేఏఎస్) పరీక్షల్లో అగ్రస్థానం సాధించిన అంజుమ్ బసీర్ ఖాన్ ఖట్టాక్ (27) సోమవారం ఆనందంతో తలమునకలైపోయారు. అంజుమ్ ఆనందానికి కారణం అతడి పేరును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా 'మన్ కీ బాత్'లో ప్రస్తావించడమే. 'ప్రధాని స్వయంగా నా గురించి మాట్లాడటం చెప్పలేనంత ఆనందాన్ని కలిగిస్తోంది. ఆయనకు నా కృతజ్ఞతలు. ఆయన మాటలు నాకు మరింత బలాన్నిస్తాయి. ముందుముందు సత్కార్యాలు చేయడానికి స్ఫూర్తిగా నిలుస్తాయి' అంటూ అంజుమ్ ఉద్వేగంగా చెప్పారు. పూంఛ్ జిల్లాలోని మారుమూల కుగ్రామమైన మొగ్రా బచాయికి చెందిన ఈ కుర్రాడి విజయాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఊరు విడిచి పెట్టివెళ్లినందుకు అంజుమ్ పూర్వీకుల నివాసానికి 1990లో తీవ్రవాదులు నిప్పు పెట్టారు. కుటుంబం నుంచి కనీసం ఒక్క మనిషినైనా తమకు మద్దతుగా తెలిపేలా స్పష్టం చేయాలంటూ ప్రతి ఇంటికీ ఆరోజుల్లో తీవ్రవాదుల నుంచి ఫోన్‌లు వచ్చేవి. ఆ దుష్ప్రభావం నుంచి తప్పించుకునేందుకు అతడి కుటుంబం జమ్మూకి తరలి వెళ్లిపోయింది. అక్కడే అంజుము చదువుకున్నాడు. కేఏఎస్ పరీక్షల్లో ప్రథముడిగా నిలిచారు.

పబ్ అగ్నిప్రమాదం ఘటన

ఇద్దరు మేనేజర్ల అరెస్టు

ముంబయి: ఇటీవల 14మందిని బలిగొన్న 'వన్ అబౌ' పబ్ అగ్నిప్రమాదానికి సంబంధించి పోలీసులు సోమవారం ఇద్దరు మేనేజర్లను అదుపులోకి తీసుకున్నారు. గిబ్సన్ లోపెజ్(34), కెవిన్ బవా(35) అనే పబ్ మేనేజర్లు అగ్నికీలల్లో చిక్కుకున్న అతిథులకు సాయపడటానికి బదులు.... అక్కడి నుంచి పారిపోయారన్న ఆరోపణలున్నాయి.

శత్రు వ్యోమనౌకలను చిత్తుచేసే రోబోలు



వాషింగ్టన్: భవిష్యత్తులో అంతరిక్ష యుద్ధమే తలెత్తితే శత్రు వ్యోమనౌకలను చిత్తుచేసే కొత్తతరం రోబోలను శాస్త్రవేత్తలు తయారుచేస్తున్నారు. ఇవి ఉపగ్రహాల్లో ఇంధనం నింపడం, దెబ్బతిన్న భాగాలకు మరమ్మతులు నిర్వహించడం లాంటి పనుల్లోనూ తోడ్పడే వీలుంది. కక్ష్యలో సేవా కేంద్రాలు (ఎస్ఎస్‌వో)గా పిలుస్తున్న ఈ రోబోలు ఉపగ్రహాల జీవిత కాలాన్ని గణనీయంగా పెంచే అవకాశముంది. వీటి అభివృద్ధికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా నిపుణులు అక్కడి రక్షణ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం అంతరిక్షంలో చక్కర్లు కొడుతున్న చాలా వ్యోమనౌకల వయసు పైబడటం, చిన్నచిన్న లోపాలు తలెత్తుతుండటం లాంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో.. తాజా పరిశోధన ప్రాముఖ్యం సంతరించుకొంది. అంతరిక్ష వ్యర్థాల బెడద వదిలించుకోవడంలోనూ ఈ ఎస్ఎస్‌వోలు సహకరించే వీలుంది. 2015నాటికి మానవులు తయారుచేసిన పిడికిలి కంటే పెద్దవస్తువులు 25,000కుపైగా భూకక్ష్యలో వ్యర్థంగా పడివున్నట్లు అంచనా.

అంతరిక్షంలో చిక్కిన సరికొత్త సూక్ష్మజీవుల జాడ

★ నమూనాలను భూమిపైకి పంపించకుండానే నిర్ధారించిన వ్యోమగాములు



వాషింగ్టన్: అంతరిక్షంలో సరికొత్త సూక్ష్మజీవుల జాడను వ్యోమగాములు తాజాగా గుర్తించారు. పరీక్షల కోసం నమూనాలను భూమిపైకి పంపించడానికి ముందే ఈ కొత్తరకం ప్రాణులను తొలిసారిగా వారు నిర్ధారించడం విశేషం. తాజా ప్రయోగాల్లో భాగంగా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్ ఐఎస్ఎస్‌లో వివిధ ఉపరితలాలకు గాజుపాత్రను తాకించడం ద్వారా సూక్ష్మజీవుల నమూనాలను సేకరించారు. అనంతరం భూమిపై ఉన్న శాస్త్రవేత్తల బృందం సూచనలను అనుసరిస్తూ అంతరిక్షంలోని ప్రయోగశాలలోనే పరిశోధనలు కొనసాగించారు. 'మిన్‌అయాన్' అనే పరికరం సాయంతో.. డీఎన్ఏ సీక్వెన్సింగ్ విధానంలో ఆయా సూక్ష్మజీవుల డీఎన్ఏను విశ్లేషించారు. దీంతో గతంలో ఎన్నడూ కనిపించని కొత్తరకం సూక్ష్మజీవుల ఉనికి బయటపడింది. అనంతరం ఫలితాలను ధ్రువపర్చుకునేందుకుగాను నమూనాలను భూమిపైకి పంపించారు. హ్యూస్టన్‌లోని సూక్ష్మజీవశాస్త్ర పరిశోధకులు వాటిపై విస్తృత పరిశోధనలు నిర్వహించారు. వారి ప్రయోగ ఫలితాలు విట్సన్ ఆవిష్కరణను కచ్చితత్వంతో నిర్ధారించడం గమనార్హం.

హృదయ సమస్యలను ముందుగానే పసిగట్టేందుకు స్మార్ట్ టూత్‌బ్రష్



లండన్: లాలాజలాన్ని విశ్లేషించడం ద్వారా ప్రాణాంతక గుండెజబ్బులను ముందే పసిగట్టగల సరికొత్త స్మార్ట్ టూత్‌బ్రష్ త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హృద్రోగులు పదేపదే వైద్య పరీక్షలు చేయించుకోకుండానే.. ప్రతిరోజు తమ శరీర పరిస్థితులను తెలుసుకునేందుకు ఇది దోహదపడనుంది. లాలాజలంలో సోడియం స్థాయిలను విశ్లేషించడం ద్వారా గుండె సంబంధిత సమస్యలపై ఈ స్మార్ట్ టూత్‌బ్రష్ ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తుందని స్పెయిన్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ సమాచారంతోపాటు వ్యక్తుల రక్తపోటు, హృదయ స్పందన వేగాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే.. చాలావరకు హృదయ రుగ్మతలను ముందుగానే గుర్తించవచ్చునని తెలిపారు.

జాదవ్‌తో దౌత్య భేటీ కోసం ఎదురు చూస్తున్నాం: భారత్

దిల్లీ/ ఇస్లామాబాద్: పాకిస్థాన్ జైళ్లలో మగ్గిపోతున్న కుల్‌భూషణ్ జాదవ్, ఇతర భారతీయులకు దౌత్యాధికారులతో మాట్లాడే అవకాశం కోసం తాము నిరీక్షిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ సోమవారం పేర్కొంది. తమ కారాగారాల్లో ఉన్న అవతలి పక్ష పౌరులు, మత్స్యకారుల జాబితాలను రెండు దేశాలు సోమవారం పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నట్లు తెలిపింది. పాక్‌కు సంబంధించి భారత కారాగారాల్లో ఉన్న 250 మంది పౌరులు, 94 మంది మత్స్యకారుల పేర్లను ఆ దేశానికి అందజేసినట్లు పేర్కొంది. 54 మంది పౌరులకు, నలుగురు మత్స్యకారులకు శిక్ష పూర్తయిందని తెలిపింది. వారి జాతీయతపై పాక్ నుంచి ధ్రువీకరణ కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొంది. భారత్‌కు చెందిన 58 మంది పౌరులు, 399 మత్స్యకారులు తమ జైళ్లలో ఉన్నట్లు పాక్ పేర్కొందని వివరించింది. పరస్పర కారాగారాల్లో ఉన్న పౌర ఖైదీలు, మత్స్యకారులకు సంబంధించిన మానవతా అంశాలను పరిష్కరించేందుకు భారత్ కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు భారత్, పాకిస్థాన్‌లు సోమవారం దౌత్యమార్గాల్లో అణు కేంద్రాల జాబితాలను ఇచ్చిపుచ్చుకున్నాయి.

చైనా సరిహద్దుల్లో అన్ని పోస్టులు రహదారులతో అనుసంధానం

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ వెల్లడి

నేలాంగ్ లోయ (ఉత్తరాఖండ్): చైనా-భారత్ సరిహద్దుల్లోని అన్ని పోస్టులను రహదారులతో అనుసంధానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టింది. భారత-టిబెట్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) ఫార్వార్డ్ యూనిట్ కార్యకలాపాల సన్నద్ధతను సమీక్షించిన సందర్భంగా హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో 11,614 అడుగుల ఎత్తులో మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న ఐటీబీపీ ఫార్వార్డ్ పోస్టు వద్ద ఆయన జవాన్లతో నూతనసంవత్సరం సందర్భంగా భేటీ అయ్యారు. చైనాతో సరిహద్దు సమస్యల గురించి మాట్లాడుతూ ఈ అంశంపై రెండు దేశాల మధ్య అభిప్రాయ భేదాలున్నా ఆ దేశంతో భారత్ సత్సంబంధాలు కోరుకుంటోందన్నారు. చైనా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, భారత్ కూడా వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, అందువల్ల ఈ రెండు దేశాలు ఘర్షణ కోరుకోవని స్పష్టం చేశారు.

మరింత ఉత్సాహంతో పని చేద్దాం: రావత్

దిల్లీ: రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే స్వభావం, నిస్వార్థ సేవ సహా కీలక విలువలను పరిరక్షించుకునేలా సైనిక సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేయాలని సైన్యాధిపతి బిపిన్ రావత్ సోమవారం సూచించారు. భారతదేశ శక్తిలో అత్యంత సమర్థ సాధనాల్లో ఒకటిగా సైన్యం నిలిచిపోయేలా చూడాలన్నారు. 2017లో దేశం వెలుపల నుంచి, అంతర్గతంగా ఎదురయిన సవాళ్లను సైన్యం విజయవంతంగా పరిష్కరించిందని నూతన సంవత్సర సందేశంలో పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతమయిన వైఖరి, దేశసేవకు కట్టుబడి ఉండడం, తిరుగులేని విశ్వాసం మనకు ప్రత్యేక విశిష్టతను తెచ్చిపెట్టాయని, ఆ విశిష్టతను కాపాడుకోవాలని సూచించారు.

సీఆర్పీఎఫ్ శిబిరంపై దాడిచేసిన మూడో ఉగ్రవాదీ హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్పీఎఫ్ శిబిరంపై దాడి చేసిన ఉగ్రవాదుల ఏరివేత సోమవారం ముగిసింది. భద్రతా బలగాలు మూడో ఉగ్రవాదినీ హతమార్చాయి. ఆదివారం తెల్లవారుజామున ముష్కరులు సీఆర్పీఎఫ్ శిబిరంపై దాడికి దిగిన విషయం తెలిసిందే. భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో ఆదివారం ఇద్దరు ఉగ్రవాదులు చనిపోగా వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మూడో ఉగ్రవాది మృతదేహం సోమవారం లభ్యమైంది. ఈ దాడికి పాల్పడింది తామేనని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రసంస్థ జైష్ ఇ మొహమ్మద్ ప్రకటించింది. హతులైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు పుల్వామాకు చెందిన మంజూర్ అహ్మద్ బాబా కాగా మరొకడు త్రాల్‌కు చెందిన ఫర్దీన్ అహ్మద్ ఖాండేగా గుర్తించారు. మూడో ఉగ్రవాదిని గుర్తించాల్సి ఉంది.

పోలీసుల పనంతా ఫోన్లోనే!

- ప్రత్యేక యాప్ ఆవిష్కరించిన డీజీపీ మహేందర్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్



పోలీసుల పనంతా ఇక ఫోన్లోనో, ట్యాబ్‌లోనే పూర్తయ్యే సదుపాయం వచ్చేసింది! ప్రపంచంలోనే తొలిసారిగా ఇలాంటి పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసుశాఖ సిద్ధం చేసింది. 'టీఎస్‌కాప్' పేరున ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను డీజీపీ మహేందర్‌రెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 2018ని తెలంగాణ ప్రభుత్వం 'సాంకేతిక పరిజ్ఞాన సంవత్సరం'గా ప్రకటించిన నేపథ్యంలో... తొలిరోజునే ఈ యాప్‌ను ఆవిష్కరించడం గర్వకారణమని ఆయన వెల్లడించారు. టీఎస్‌కాప్ లాభాలు, ప్రయోజనాలను ఆయన వివరించారు. ఎక్కడా లేనివిధంగా శాంతి భద్రతలు, ట్రాఫిక్, దర్యాప్తు, కోర్టు కేసులు తదితర అన్ని పోలీసు విభాగాలకూ ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.

- ప్రస్తుతమున్న 54 పోలీసు సేవలను ఇందులో పొందుపరిచారు. వీటిని భవిష్యత్తులో పెంచుకోవచ్చు. ఉదాహరణకు దర్యాప్తు అధికారికి పాత నేరస్తుల చిట్టా, వారు వాడే వాహనాలు, గతంలో వారిపై నమోదైన కేసులు, వారు నేరంచేసే తీరుపై సమాచారం కావాలి. ఏదైనా నేరం జరిగినప్పుడు ఘటనా స్థలానికి వెళ్లేలోగా... ఆ పరిసరాల్లో గతంలో జరిగిన నేరాలు, వాటికి పాల్పడినవారి వివరాలు, ప్రస్తుతం వారెక్కడ ఉంటున్నారు తదితర వివరాలన్నీ దర్యాప్తు అధికారికి తెలుస్తాయి.
- గతంలో జరిగిన నేరాల వివరాలన్నీ జియో ట్యాగింగ్ చేస్తారు. తద్వారా ఆయా ప్రాంతాలపై గస్తీ సిబ్బంది ఎక్కువగా దృష్టి సారించే వీలుంటుంది.
- పాత నేరగాళ్ల గృహాలను జియో ట్యాగింగ్ చేశారు. దీంతో వారి కదలికలను అధికారులు గమనించవచ్చు. ఏరోజు ఎంతమంది నేరస్థులను గస్తీ సిబ్బంది పర్యవేక్షించారన్నది ఉన్నతాధికారులకు తెలిసిపోతుంది. నేరస్థుల వేలిముద్రలు పోలీసు డేటాబేస్‌లో ఉంటాయి. ఈ యాప్‌ను ఉపయోగించి, అనుమానితుడి వేలి ముద్రలను చిన్న పరికరం ద్వారా పరీక్షిస్తే... అతని నేర చిట్టా కనిపిస్తుంది.
- కంట్రోల్ రూంకు అత్యవసర ఫోన్‌కాల్ వచ్చినప్పుడు సమీపంలోని గస్తీ బృందానికి సమాచారం అందుతుంది. ఈ విషయం ఉన్నతాధికారులకూ చేరుతుంది. ఎంత సేపటిలో ఘటనా స్థలానికి చేరుకోవచ్చన్నది అంచనా వేయవచ్చు. ఒకవేళ ఆలస్యమైతే, కారణాలను తెలుసుకుని చక్కదిద్దవచ్చు.
- ఘటనా స్థలంలో బలగాల అవసరం ఉన్నప్పుడు... ఒక గస్తీ బృందం ఈ యాప్ ద్వారా సమీపంలోని ఇతర బృందాలను అప్రమత్తం చేసి, రప్పించుకునే వీలుంది.
- ఎక్కడెక్కడ ఎంతమంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించారన్నది పైఅధికారుల ఫోన్లో కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో నిజంగానే అక్కడ కేటాయించినంత మంది ఉన్నారా? లేరా? అన్నది గమనించడం సులభమవుతుంది.

భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల వివరాలు కూడా..

రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకున్న నేరాలు, నేరస్థుల వివరాలు ఈ యాప్ ద్వారా ఫోన్లో తెలుస్తాయి. ఇతర రాష్ట్రాలతో అనుసంధానమైతే, అక్కడి వివరాలూ క్షణాల్లోనే ప్రత్యక్షమవుతాయి. రాజధాని మినహా ఇతర ప్రాంతాల్లోని 1,700 పోలీసు ట్యాబ్‌లలో ఈ యాప్‌ను నిక్షిప్తం చేశారు. దీని వినియోగంపై శిక్షణ చాలావరకూ పూర్తయింది.

చేనేత కార్మికులకు ఏడాదంతా నిరంతర ఉపాధి

సీఎం కేసీఆర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: చేనేత కార్మికులకు 2018 సంవత్సరమంతా నిరంతర ఉపాధి కల్పిస్తామని, వారికి పనికి తగిన వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఆప్కో మాజీ ఛైర్మన్ మండల శ్రీరాములు నేతృత్వంలో చేనేత సంఘాల ప్రతినిధులు సోమవారం ప్రగతిభవన్‌లో సీఎంను కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చేనేత సంఘాలకు బకాయిల చెల్లింపులతోపాటు ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటికే 50 శాతం సబ్సిడీతో నూలు, రంగులు, రసాయనాల సబ్సిడీ పథకం అమలు చేయడం వల్ల కార్మికులకు మేలు జరిగిందని, ఇలాంటి పథకాలను మరిన్ని అమలు చేస్తామని తెలిపారు. వరంగల్‌లోని కాకతీయ జౌళి పార్కు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే కార్మికుల కష్టాలన్నీ తొలగిపోతాయన్నారు.

మహిళలకు ప్రత్యేక విధానం అమలు చేయాలి

రాష్ట్ర పారిశ్రామిక రంగంలో మహిళల పురోగతి కోసం ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలని మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంఘం అధ్యక్షురాలు డీవీవీ శ్రీలక్ష్మివాణి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు ప్రగతిభవన్‌లో వినతిపత్రం సమర్పించారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కేసీఆర్ భేటీ

హైకోర్టు విభజనపై చర్చ!

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ అయ్యారు. సోమవారం రాత్రి సీజే నివాసంలో ఆయనను కలిశారు. కేసీఆర్ ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు విభజన అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. విభజనకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధంగా ఉందనీ, తమ తరపున అవసరమైన మేరకు సన్నాహాలు చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించినట్లు సమాచారం. మర్యాదపూర్వకంగానే కేసీఆర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిశారని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి.

కోస్టారికాలో కూలిన విమానం

10 మంది అమెరికన్లు, మరో ఇద్దరు స్థానికులు మృతి

శాన్ జోస్: క్రిస్మస్ సెలవులను ఆనందంగా గడిపేందుకు కోస్టారికాకు వచ్చిన అమెరికన్లు 10 మంది విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. వీరిలో అయిదుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. మరో ఇద్దరు విమాన సిబ్బంది కూడా ఇదే ప్రమాదంలో మృతి చెందారు. నేచర్ ఎయిర్ విమానయాన సంస్థకు చెందిన ప్రైవేటు విమానం ఆదివారం మధ్యాహ్నం పుంటా ఇస్లిటా నుంచి శాన్ జోస్‌కు బయలుదేరింది. ఆ తర్వాత కొద్ది సమయానికే ప్రమాదానికి గురై అటవీ ప్రాంతంలో కూలిపోయి మంటలు వ్యాపించాయి. విమానంలోని ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారని కోస్టారికా ప్రజా భద్రత మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

భారత్, పాక్ సలహాదారుల రహస్య భేటీ

ఇస్లామాబాద్: భారత్, పాక్‌ల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ డోభాల్, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) నసీర్ ఖాన్ జాన్‌జువాలు రహస్యంగా భేటీ అయ్యారు. థాయిలాండ్‌లో గత బుధవారం ఈ సమావేశం జరిగినట్టు డాన్ పత్రిక వెల్లడించింది. డోభాల్ ఎంతో స్నేహపూర్వకంగా, సామరస్యంగా మాట్లాడారని పాక్ అధికారి ఒకరు తెలిపారు. భవిష్యత్తులో జరగనున్న దౌత్యపర చర్చలకు ఇవి సంకేతం కానున్నాయని చెప్పారు.

అసోం తొలి ఎన్‌ఆర్‌సీ ముసాయిదా విడుదల

దిల్లీ: జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) తొలి ముసాయిదాను అసోం సోమవారం ప్రచురించింది. రాష్ట్రంలోని మొత్తం 3.29 కోట్ల దరఖాస్తుదారుల్లో 1.9 కోట్ల మంది పేర్లను ఇందులో చేర్చారు. మిగతా పేర్లపై వివిధ దశల్లో పరిశీలన జరుగుతోందని భారత రిజిస్ట్రార్ జనరల్ శైలేశ్ పేర్కొన్నారు. ఈ పరిశీలన పూర్తి కాగానే రెండో ముసాయిదాను తీసుకొస్తామని చెప్పారు. "ఇది చాలా సంక్లిష్ట ప్రక్రియ. ఒకే కుటుంబంలోని కొందరు సభ్యుల పేర్లు ఈ తొలి ముసాయిదాలో ఉండకపోవచ్చు. అయినా ఆందోళన వద్దు. మిగతా పత్రాల పరిశీలన జరుగుతోంది" అని ఎన్‌ఆర్‌సీ రాష్ట్ర సమన్వయకర్త ప్రతీక్ హజేలా పేర్కొన్నారు. ఈ ప్రక్రియ మొత్తం 2018లోగా పూర్తవుతుందని చెప్పారు.

దక్షిణ భారత హిందీ ప్రచార సభ రిజిస్ట్రార్‌కు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ నేరం రుజువు కావడంతో చెన్నైలోని దక్షిణ భారత హిందీ ప్రచార సభ పీజీ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ రిజిస్ట్రార్ ఆచార్య కె.ప్రదీప్‌కు రూ.2 వేల జరిమానా విధిస్తూ ఉమ్మడి హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో మూడు రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందంది. 2014లో పదవీ విరమణ చేసినప్పటికీ తనకు పింఛను తదితరాలు చెల్లించలేదని డి.సీతానాయుడు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు మూడు నెలల్లో బకాయిలను చెల్లించాలని గత జనవరిలో ఉత్తర్వులిచ్చింది. అయినా రిజిస్ట్రార్ అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ పి.నవీన్ రావు ఇటీవల తీర్పు వెలువరిస్తూ రిజిస్ట్రార్ ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్నారు.

చెత్తను కాల్చేస్తే పోలా!

- పలు పంచాయతీల్లో ఇదే నిర్వాకం
- గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు బేఖాతరు

ఈనాడు, హైదరాబాద్: వివిధ వ్యర్థాలతో కూడిన చెత్తను ఎట్టి పరిస్థితుల్లోనూ తగులబెట్టరాదనే గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలను తెలంగాణలోని పలు పంచాయతీలు బేఖాతరు చేస్తున్నాయి. టన్నుల కొద్దీ పేరుకుపోతున్న చెత్తను తొలగించేందుకు దహన చేయడం ఒక్కటే పరిష్కారంగా పంచాయతీ పాలక వర్గాలు భావిస్తున్నాయి. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యాలకు తీవ్ర విఘాతం కలిగించే ఇలాంటి పోకడలను అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదు. చెత్తను పరిష్కరించే పద్ధతులపై రాష్ట్ర స్థాయిలో ప్రణాళికను తయారు చేసి పంపాలంటూ గ్రీన్‌ట్రైబ్యునల్ చేసిన సూచన కూడా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. చెత్తను దహనం చేసినప్పుడు వెలువడే వాయువులు పరిసర ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. శ్వాసకోశ వ్యాధులు, కళ్లు మండటం, శరీర జీవకణాలకు ఆక్సిజన్ సక్రమంగా అందకపోవటం వంటి సమస్యలకు దారితీయొచ్చు. ఈ క్రమంలోనే ఎట్టిపరిస్థితుల్లో చెత్తను దహనం చేయకూడదంటూ 2016, డిసెంబరు 22న జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. తగులబెట్టే వారికి చెత్త పరిమాణాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.25 వేల దాకా జరిమానాల్ని విధించాలని తెలిపింది. డంపింగ్ యార్డుల వద్ద సైతం ఎవరూ చెత్తను తగులబెట్టకూడదు. తీర్పునకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి 4 నెలల్లోగా అందజేయాలని పేర్కొంది. తీర్పు వచ్చి ఏడాది గడిచినా తెలంగాణలో కాలుష్య నియంత్రణ మండలి, ఇతర శాఖల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదనడానికి ఇప్పటికీ తగులబడుతున్న చెత్తకుప్పలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఆదాయమున్న పంచాయతీలదీ అదే తీరు: డంపింగ్ యార్డుల: వరకు చెత్తను తరలించేందుకు కావాల్సిన ఆర్థిక వనరులున్న పంచాయతీలు సైతం చెత్తను ఎక్కడికక్కడ వదిలేసి దహనం చేసేందుకే ప్రాధాన్యమిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నివాసముండే రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని మణికొండ, పుప్పాలగూడ పంచాయతీల్లో సైతం నిత్యం చెత్తకుప్పలు దహనమవుతూ కనిపిస్తుంటాయి. రాష్ట్రంలో ప్రస్తుత 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 7,875 డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా స్థలాల కొరత, ప్రజల వ్యతిరేకత తదితర కారణాల వల్ల ఇప్పటికీ దాదాపు 700 మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో ఉపయోగంలోకి వచ్చినవి చాలా తక్కువ. చెత్తను దూరంగా తరలించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ పాలకవర్గాలదేనని పంచాయతీరాజ్ శాఖ అధికార వర్గాలు స్పష్టం చేశాయి. వీలైన చోటల్లా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేస్తున్నామని, చెత్తను తరలించేందుకు ప్రతి వెయ్యి జనాభాకు ఒక్కో మూడు చక్రాల వాహనం చొప్పున ఇస్తున్నామని, ఈ సదుపాయాలను పంచాయతీలు ఉపయోగించుకుంటే మేలని ఆ వర్గాలు తెలిపాయి.

హాఫీజ్ సయీద్ సంస్థలు విరాళాలు సేకరించకుండా నిషేధం

ఇస్లామాబాద్: ముంబయి అల్లర్ల సూత్రధారి హాఫీజ్ సయీద్‌కు చెందిన సంస్థలు విరాళాలు సేకరించకుండా పాకిస్థాన్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ సోమవారం నిషేధం విధించింది. హాఫీజ్ ఆధీనంలోని జమాత్ ఉద్ దవా (జేయూడీ), ఫలాహ్ ఐ ఇన్సానియత్ (ఎఫ్ఐఎఫ్)లకు ఈ నిషేధం వర్తిస్తుంది. జేయూడీ.. నిషేధిత లష్కర్ ఏ తోయిబాకు అనుబంధ సంస్థ కావడం విశేషం. పాస్‌బాన్ ఐ అహ్లే హాదిత్, పస్‌బాన్ ఐ కశ్మీర్ సంస్థలపై కూడా నిషేధం విధించింది. ఈ సంస్థలకు విరాళాలు ఇవ్వకూడదని కంపెనీలను హెచ్చరించింది. దీనిని ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు ఉంటాయని పేర్కొంది. ఉగ్రవాదం అణచివేతకు తాము నిధులు ఇస్తున్నా, పాకిస్థాన్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన మరుసటి రోజునే పాకిస్థాన్ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

విరివిగా అణ్వాయుధాల తయారీ: కిమ్

సియోల్: విరివిగా అణ్వాయుధాలు తయారు చేయనున్నట్టు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తెలిపారు. సోమవారం దేశ ప్రజలకు ఇచ్చిన నూతన సంవత్సర సందేశంలో అణ్వాయుధాలు ప్రయోగించే మీట ఎల్లప్పుడూ తన మేజాబల్లపైనే ఉంటుందని తెలిపారు. సెప్టెంబరులో హైడ్రోజన్ బాంబును ప్రయోగించామని అన్నారు. అణ్వాయుధ దేశంగా ఎదగాలన్న లక్ష్యం నెరవేరిందని చెప్పారు. దీనిని అమెరికా గుర్తించాల్సి ఉందని తెలిపారు.

విత్తన రైతు సహకార సంఘాలు

- విత్తన పంటల సాగుకు కొత్త ప్రయోగం
- రైతులతో సంఘాలు ఏర్పరచి మూల విత్తుల పంపిణీ
- పండించిన పంటలను తిరిగి కొనే ఒప్పందం
- వ్యవసాయశాఖ, జయశంకర్ వర్సిటీలు సిద్ధం

ఈనాడు - హైదరాబాద్


వ్యవసాయ వర్సిటీ పర్యవేక్షణలో సాగు చేసిన కంది పైరు

నాణ్యమైన విత్తనాలను రైతులకు తక్కువ ధరలకు లభించేలా చూసేందుకు వచ్చే వానాకాలం(ఖరీఫ్) సీజన్ నుంచి కొత్త ప్రయోగం చేయడానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సిద్ధమవుతున్నాయి. విత్తన పంటలను సాగుచేసే రైతుల సహకార సంఘం ఏర్పాటుచేసి వారికి మూల విత్తనాలను నేరుగా ఉచితంగా వర్సిటీ శాస్త్రవేత్తలు అందజేస్తారు. ఒక గ్రామంలో విత్తన పంటలకు అనువైన పొలాలను శాస్త్రవేత్తలు ఎంపిక చేసి రైతులకు అవగాహన కల్పించి, వారి పర్యవేక్షణలోనే సాగు చేయిస్తారు. అక్కడ పండే పంటను తిరిగి కొంటామని(బైబ్యాక్) ఒప్పందాలను వర్సిటీ విత్తన పరిశోధన కేంద్రాలు రైతులతో చేసుకుంటాయి. ఈవిత్తనాలను చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయిస్తారు. ఇంకా మిగిలిన వాటిని ఇతర ప్రాంతాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటారు. దీనివల్ల ప్రైవేటు విత్తన కంపెనీలు విక్రయించే గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ)కన్నా 20 నుంచి 25 శాతం దాకా తక్కువకే సమీప ప్రాంతాల్లోనే రైతులకు విత్తనాలు లభించే అవకాశముంటుంది.

ప్రయోగాత్మక సాగు.. కొనుగోలు, అమ్మకం

పాత మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం మినిగోనిపల్లిలో గతేడాది ప్రయోగాత్మకంగా కంది పంట 'ఉజ్వల'(పీఆర్‌జీ176) రకం విత్తనాల సాగు, కొనుగోలు, అమ్మకాలు జరిపారు. 45 మంది రైతులతో సాగు చేయగా ఎకరానికి 8 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. ఈ విత్తనాలను క్వింటా రూ.7 వేలకు కొని శుద్ధిచేసి తిరిగి రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌లో కిలో రూ.85కి విక్రయించారు. ఇవే విత్తనాలను ప్రైవేటు కంపెనీలు మార్కెట్‌లో కిలో రూ.110కి అమ్మాయి. ఈవిధానంలో విత్తన పంట సాగు చేసిన గిట్టుబాటు ధర రావడానికి బైబ్యాక్ ఒప్పందం పూచీకత్తు ఉంటుంది. విత్తనాలు కొనేందుకు ముందుకొచ్చే వారికి తక్కువ ధరతో పాటు నాణ్యతపై వ్యవసాయ వర్సిటీ పూచీకత్తు ఉంటుంది. నాసిరకం వల్ల రైతులు నష్టపోతే వర్సిటీనే బాధ్యత వహిస్తుంది.

సహకారం ద్వారా ఆర్థిక లాభం

వచ్చే జూన్ నుంచి ప్రారంభమయ్యే కొత్త వానాకాలం సీజన్‌లో వరి, కంది, మినుము, పెసర తదితర విత్తన పంటల సాగుకు కనీసం 50 గ్రామాల్లో వివిధ జిల్లాల్లో ప్రత్యేకంగా 'విత్తన రైతు సహకార సంఘాలు' ఏర్పాటు చేయాలని ప్రణాళిక తయారుచేశాం. రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, మార్కెట్‌కన్నా తక్కువ ధరకే రైతులు పరస్పర సహకారంతో సొంతంగా విత్తనాలు పండించుకుని ఆర్థికంగా లాభపడవచ్చని అవగాహన కల్పిస్తాం. ఈ పథకంవిజయవంతమైతే రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకుంటారు. వీటి శుద్ధి, నిల్వకు గోదాములు, ఇతర సదుపాయాలు కల్పించాలని వ్యవసాయశాఖను సంప్రదిస్తున్నాం. వ్యవసాయాధికారులు, వర్సిటీ శాస్త్రవేత్తలు ఈ పథకం విజయవంతానికి కృషి చేస్తారు.

– నగేశ్, ప్రధాన విత్తన శాస్త్రవేత్త, సంచాలకుడు, జయశంకర్ వర్సిటీ విత్తన విభాగం

అధికారంలోకొస్తే నిరుద్యోగులకు రూ.3 వేల భృతి

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకొస్తే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి చెల్లిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీంతోపాటు వరికి మద్దతు ధర క్వింటాకు రూ.2 వేలు ఇస్తామని, పింఛన్లు పెంచుతామని, రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల స్థాయి పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ పాలనలో చేపట్టిన సంస్కరణల వల్లే ఇప్పుడు నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతోందన్నారు. మూడున్నరేళ్ల పాలనలో తెరాస సర్కారు ప్రారంభించిన ఏ ప్రాజెక్టులోనైనా ఒక్క యూనిట్ విద్యుత్తును ఉత్పత్తి చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో జరుగుతున్న హడావిడి కమీషన్ల కోసమేనని ఆరోపించారు.

కేసీఆర్ మాటలను రైతులు నమ్మరు: కోదండరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎకరాకు రూ.4 వేలు, 24 గంటల విద్యుత్.. ఇవన్నీ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ వేస్తున్న ఎత్తుగడలేనని టీపీసీసీ కిసాన్‌సెల్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మూడున్నరేళ్లుగా రైతులను పట్టించుకోని సీఎం ఇప్పుడు ఓట్ల కోసం మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

మహిళల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి: నేరెళ్ల శారద

రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని.. ఈ అంశంపై సర్కారు దృష్టి పెట్టాలని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీభవన్‌లో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. శారద మాట్లాడుతూ.. మహిళా కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జీగా నమ్రతా జైస్వాల్‌ను నియమిస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్‌పై ప్రభుత్వ ప్రకటనలు అవాస్తవాలు: కోదండరాం

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు వాస్తవదూరాలని తెలంగాణ ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం విమర్శించారు. నిరుద్యోగ సమస్య, రెండు పడక గదుల ఇళ్లు, దళితులకు మూడెకరాలు, కేజీ టు పీజీ విద్య తదితర హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం.. రైతులకు 24 గంటల విద్యుత్ విషయంలో సఫలమైందని చెబుతోందంటే దాని వెనుక మతలబేంటో తెలుసుకోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. "దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రస్తుతం మిగులు విద్యుత్ ఉంది. అమ్ముదామనుకున్నా కొనేవారు లేరు. తెలంగాణ వచ్చిన తర్వాత మొదలుపెట్టిన ఒక్క ప్రాజెక్టు కూడా ఇప్పటి వరకూ విద్యుత్ ఉత్పత్తిని మొదలెట్టలేదు. రైతులు కూడా ప్రస్తుతానికి వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ చాలనీ, భూగర్భ జలాలు పెరిగిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నా.. సర్కారు పట్టించుకోవడం లేదు. 24 గంటల విద్యుత్ సరఫరాకు సుమారు రూ.10 వేల కోట్ల భారం విద్యుత్ సంస్థలపై పడుతుంటే.. ప్రభుత్వం రూ.5500 కోట్ల మేరకే భరిస్తానంటోంది. దీనివల్ల విద్యుత్ సంస్థలు నష్టాల బాటపడతాయి. తెలంగాణ వచ్చాక రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంటే కరెంటు షాకుల మరణాలెందుకు పెరుగుతున్నాయి?. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కోట్ల రూపాయల ప్రకటనలిచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు" అని కోదండరాం ఓ ప్రకటనలో విమర్శించారు.

మజ్దూర్ సంఘటన్ సమితిపై నిషేధాన్ని ఎత్తివేయాలి

వరవరరావు డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: ఝార్ఖండ్‌లో మజ్దూర్ సంఘటన్ సమితి (ఎంఎస్‌ఎస్)పై నిషేధం విధించడాన్ని విప్లవ ప్రజాస్వామ్య వేదిక తీవ్రంగా ఖండించింది. మావోయిస్టులను ఏరివేసే క్రమంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం సమితిపై నిషేధం విధించడం అమానుషమనీ, అదేమీ మావోయిస్టు అనుబంధ సంస్థ కాదని వేదిక అధ్యక్షులు వరవరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్‌ఎస్ చట్టబద్ధంగా నమోదైన కార్మిక సంఘమనీ, ప్రత్యేకంగా ఆసుపత్రిని నెలకొల్పి కార్మికులకు ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. మావోయిస్టుల పేరుతో సమితిపైనా, ఇతర సంస్థలపైనా విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఝార్ఖండ్‌లోని ప్రకృతి వనరుల దోపిడీకి 'కార్పొరేట్' ప్రయత్నాలు జరుగుతున్నాయనీ... కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని అక్కడి సర్కారు అణచివేస్తోందన్నారు.

చదువుకుంటూ.. కొలువు

- ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల చలో!
- ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచే ఆసక్తి
- అనుభవంతోపాటు వేతనాలు అందిస్తున్న ఐటీ కంపెనీలు
- ఆన్‌లైన్ పోర్టళ్ల ద్వారా దరఖాస్తు

ఈనాడు - హైదరాబాద్



ఉద్యోగమా?.. చదువు పూర్తయ్యాక చూద్దాం.. అనే భావన నుంచి విద్యార్థులు బయటికి వస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఈ మార్పు అధికంగా కనిపిస్తోంది. ఇంజినీరింగ్ చదువుతూనే కొద్ది వారాలపాటు ఐటీ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు విద్యార్థులు ముందుకొస్తున్నారు. బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని కంపెనీల్లో ఉద్యోగ అనుభవం పొందుతున్నారు. ఇంటర్న్‌షిప్ అందించేందుకు ప్రత్యేకంగా కొన్ని ఆన్‌లైన్ పోర్టళ్లు కూడా అందుబాటులోకి రావడం మరింత సులువుగా మారింది.

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగంలో చేరినప్పటి నుంచే శిక్షణ అవసరం లేకుండా పని చేయాలని పరిశ్రమలు కోరుకుంటున్నాయి. ఆ క్రమంలోనే ఇంటర్న్‌షిప్ విధానం తెరపైకి వచ్చింది. కొద్ది సంవత్సరాల నుంచి ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన వారికి బీటెక్ చివరి ఏడాది రెండో సెమిస్టర్‌లో కొద్ది నెలలపాటు ఇంటర్న్‌షిప్ పేరిట ఉద్యోగంలో నియమించుకుంటున్నాయి. ఆ సమయంలో వేతనాలూ ఇస్తున్నాయి. పరిశ్రమల స్థాయినిబట్టి నెల వేతనం రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు అందిస్తున్నాయి. ఇప్పటికే ఉద్యోగాలకు ఎంపికైన వారిని కాకుండా బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్‌లోనే ఇంటర్న్‌షిప్‌లకు ఎంపిక చేసుకుంటున్న పరిశ్రమల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతోంది. ఆ సమయంలో విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యాల ఆధారంగా వారిని నేరుగా ఉద్యోగానికి ఎంపిక చేస్తున్నారు. అలాంటి వారు ప్రాంగణ నియామకాల్లో నిర్వహించే రాత పరీక్ష, ముఖాముఖీలకు హాజరవ్వాల్సిన అవసరం లేదు. పరిశ్రమలు కోరుకుంటున్నట్లు ఇంజినీరింగ్ పూర్తయ్యేలోపు అసలు సిసలు ఉద్యోగిలాగానే పనిచేసేలా విద్య ఉండాలని భావిస్తున్న అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) సైతం గత ఏడాది కాలంగా ఇంటర్న్‌షిప్‌లపై దృష్టి సారించింది. ఇంటర్న్‌శాల, మరికొన్ని ఇతర సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది.

నిపుణులు ఏమంటున్నారు?

- కొన్ని కంపెనీలు బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులను ఆన్‌లైన్ పరీక్షల ద్వారా ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేసుకొని వారి పనితీరు ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయనీ, వారు మళ్లీ ప్రాంగణ నియామకాల్లో పోటీ పడాల్సిన అవసరం లేదని సీబీఐటీ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి ఎన్‌ఎల్‌ఎన్ రెడ్డి చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థ రూ.45 వేలు అందిస్తోందన్నారు.
- ఇంటర్న్‌శాల, మరికొన్ని ఆన్‌లైన్ పోర్టళ్లు అందుబాటులోకి రావడంతో ఇప్పుడు తమ కళాశాల విద్యార్థులు ఎంతో మంది బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారనీ, ఎంపికైన విద్యార్థికి అనుమతి ఇస్తారా అని తమకు ఆయా కంపెనీల నుంచి ఈ-మెయిళ్లు వస్తున్నాయని వాసవి కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి కిశోర్ చెప్పారు.
- ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి కావడంతో ఆ మేరకు సెమిస్టర్‌ను రూపకల్పన చేసుకుంటున్నారనీ, ఇక్కడ ఆ వెసులుబాటు లేకపోవడంతో రెండు మూడు నెలలు పంపించాలంటే ఇబ్బందిగా మారుతోందని ఎంవీఎస్ఆర్ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి ప్రసన్నకుమార్ తెలిపారు.
- ఈ సంవత్సరం 30 ఇంజినీరింగ్ కళాశాలలను ఎంపిక చేసుకొని బీటెక్ రెండు, మూడో సంవత్సరం విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్నామని సన్‌టెక్ కార్ప్ సంస్థ సీఈఓ వెంకట్ కాంచనపల్లి తెలిపారు. ఫలితాలను ఆయా ఐటీ కంపెనీలకు ఇస్తామని, వాటి ఆధారంగా ఇంటర్న్‌షిప్‌లకు ఎంపిక చేసుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

అన్ని కులాలకు పదెకరాలివ్వాలి: ఆర్.కృష్ణయ్య

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 66 బీసీ కుల సంఘాల భవనాలు, వసతిగృహాల నిర్మాణానికి పదెకరాల చొప్పున స్థలం, రూ.10కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల్లోని కులాలతో పాటు మాల, మాదిగ, లంబాడీ, ఎరుకల, యానాది, గోండు తదితర ఎస్సీ, ఎస్టీ కులాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం కేసీఆర్‌కు లేఖరాశారు.

ఎస్సీ వర్గీకరణ కోసం నేటి నుంచి ఉపవాస దీక్ష

మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గాంధేయ మార్గంలో మంగళవారం నుంచి ఉపవాస దీక్ష ప్రారంభించనున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రకటించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దీక్షకు ఇందిరా పార్కు, బాపూఘాట్‌లలో ఏ ప్రదేశాన్ని కేటాయిస్తారో మంగళవారం ఉదయం 10 గంటలలోపు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే తామే ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకుంటామన్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి దళితులను ఎప్పుడూ ఎదగనీయలేదన్నారు. తనతో సహా..ఎమ్మార్పీఎస్ నేతలను జైలుకు పంపేలా ముఖ్యమంత్రి అమలు చేసిన కుట్రలో ఆయన కూడా భాగస్వామి అయ్యారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయని, హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించడం ద్వారా వాటిని తిరగదోడుతామన్నారు. వర్గీకరణకు మద్దతిస్తున్న పార్టీలను కలుపుకుని పార్లమెంటులో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రాన్ని ఒప్పించాలని రాష్ట్ర భాజపా నేతలను కోరారు.

ఇది చేస్తే చాలు!

- ఆకలిని బట్టే తినండి
- నిదానంగా, నమిలి తినండి
- కడుపు నిండినట్లనిపిస్తే ఆపెయ్యండి
- కొద్దికొద్దిగా, ఎక్కువసార్లు తినండి
- పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువ తినండి
- రకరకాల రంగురంగుల పండ్లు, కాయగూరలు తినండి
- ముడిబియ్యం, ముడి ధాన్యం తినండి
- బాగా శుద్ధిచేసిన, రిఫైన్డ్‌వి తినొద్దు
- పంచదార, ఉప్పు బాగా తగ్గించండి
- నూనె చాలా మితంగా వాడండి
- తగినంత నీళ్లు రోజంతా తాగండి

తిండిని బట్టే!

మంచి పోషకాహారంతో

- రోజంతా శక్తి, ఉత్సాహం
- చక్కటి బరువుతో ఉంటారు
- మనసు ప్రశాంతంగా ఉంటుంది
- ముసలిరూపు త్వరగా రాదు
- నిద్ర హాయిగా పడుతుంది
- ముఖ్యంగా జబ్బులు దరిజేరవు
- వ్యాధులొచ్చినా ముదరవు
- ఆయుర్దాయం పెరుగుతుంది
- ఎముకలు దృఢంగా ఉంటాయి
- మలబద్ధకం బెడద ఉండదు
- మలివయసులోనూ మెరుగైన చూపు

ఆబగా కాదు.. ఆశతో తిందాం... బుద్ధిగా కాదు.. బుర్రతో తిందాం!

పోషకాహారమంటే? ఆకులూ అలమలూ.. గింజలూ కందమూలాలే అనుకోనక్కర్లేదు! మనందరిలో ఉన్న పెద్ద అపోహ ఇది. పోషకాహారం అంటే రుచిగా ఉండదనీ.. రుచిగా ఉండేదాన్లో పోషకాలుండవనీ... చాలామంది నమ్మకం. కానీ ఇంతకు మించిన పెద్ద అపోహ మరోటి లేదు.

చాలామంది ముందూవెనకా ఆలోచించకుండా.. వేగంగా ముక్కూనోటా కొట్టుకు తినేస్తుంటారు. ఇది అస్సలు మంచి పద్ధతి కాదు. మనకు ఎంత ఆకలి వేస్తోంది..? ఎంత తింటున్నాం? అన్న ధ్యాసతో తినాలి. మైండ్ ఫుల్ ఈటింగ్’లో ఇది ముఖ్య భాగం.

అందులో అనుమానమేం లేదు... మనందరం పోషకాహారమే తినాలి! ఆరోగ్య ప్రయోజనాలన్నీ పోషకాహారంతోనే ముడిపడి ఉన్నాయి. కాబట్టి దానికి మరో ప్రత్యామ్నాయమేం లేదు. పోషకాహారంలో ఆరోగ్యకరమైన, రుచికరమైన పదార్థాలు చాలానే ఉన్నాయి. వాటి మీద మనమే బుర్ర పెట్టటం లేదు. రెండోది- ఎంత పోషకాహారమైనా ‘అధికస్య అధికం బలం’ అనుకుంటూ తినెయ్యటానికి లేదు. మనకు ఎంత అవసరమో అంతే తినాలి. ఎంత మంచి ఆహారమైనా ఎక్కువ తింటే దాంతో దక్కాల్సిన ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువ. అందుకే ఏ పదార్థాలను తింటాం? ఎంత తింటాం? అన్నవి రెండూ కీలకమైన ప్రశ్నలే. పదార్థాల ఎంపిక నుంచి పరిమాణం ఎంతన్న దాని వరకూ ప్రతి విషయంలోనూ మనం కొద్దిగా ‘బుర్ర’ ఉపయోగించాల్సిన అవసరం ఉంది. అందుకే పోషకాహార నిపుణులంతా దీన్నిప్పుడు ‘మైండ్‌ఫుల్ ఈటింగ్’ అంటున్నారు! నేటికాలానికి చాలా అవసరమైన అవగాహన ఇది.

పోషకాలు - ఆహారం

‘ఆ.. తిండే కదా..’ అని మనం తేలిగ్గా తీసేస్తుంటాంగానీ.. ఆహారమంటే రకరకాల రసాయనాలు, వాటన్నింటి సంక్లిష్ట సమ్మేళనం! వీటిని జీర్ణం చేసుకునేందుకు మన ఒంట్లో తయారయ్యే ఆమ్లాలు, బోలెడన్ని ఎంజైములు.. ఇవన్నీ కలిసి లోపల బోలెడన్ని చర్యలు జరుపుతుంటాయి. మనం ఆహారం రూపంలో తీసుకున్న ఈ రసాయనాలు.. ఒంట్లో ఎక్కడెక్కడికి వెళ్లాలి... వీటిని ఏ కణాల వద్దకు చేర్చాలి? ఎంత చేర్చాలి? ఎప్పుడు చేర్చాలి? వంటివన్నీ నిర్ధారించేందుకు శరీరంలో నిరంతరాయంగా.. పరంపరగా.. బోలెడన్ని ప్రక్రియలు, చర్యలు ప్రతిచర్యలు జరుగుతుంటాయి. దీనికోసం లోపల భారీ యంత్రాంగం పని చేస్తుంటుంది. ఈ ప్రక్రియలన్నింటికీ ప్రకృతి సహజంగా లభ్యమయ్యే, ముఖ్యంగా ముడి పదార్థాలు చాలా అనువైనవి, పరిణామంలో మన శరీరాలు వీటికి బాగా అలవాటుపడి.. వేటిని ఎక్కడికి పంపాలి, వేటిని బయటకు విసర్జించాలన్నది క్షుణ్ణంగా అలవరచుకున్నాయి. ‘మంచి పోషకాహారం’ అనే దానికి పునాది ఇదే! మనం తీసుకునే ఆహారంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, పీచు వంటివే కాదు.. రకరకాల విటమిన్లు, ఖనిజాలు, అమైనో ఆమ్లాల వంటివెన్నో ఉంటాయి, ఉండాలి కూడా! మనం ఎన్ని రకాల విటమిన్ మాత్రలు, టానిక్కులు తాగినా.. అవేవీ కూడా ఈ సహజమైన ఆహార పదార్థాల దరిదాపుల్లోకి కూడా రావు. అందుకే మనం ఏదో దొరికింది తినెయ్యటం కాదు.. పోషకాలు దండిగా ఉండే పోషకాహారం తినాలి!

కొత్త సంవత్సరంలోనూ..
మళ్లీ అవే పాత తీర్మానాలు!
కచ్చితంగా నోరు కట్టుకుందామనీ..
లేవగానే ఒళ్లు ఒంచుదామనీ..
ఇకనైనా రంచనుగా నిద్రపోదామనీ..
మరికాస్త సమయం ఇంట్లో గడుపుదామనీ..
ఈ ఆశల జాబితాకు అంతేముంది?
కానీ ఇది తీరే ముచ్చటేనా!
ముద్దుగా ఒక్క రోజైనా పాటిస్తామా?
అయ్యో, ఇవేవీ చెయ్యలేకపోతున్నామని
కొత్తగా మళ్లీ అదో ఒత్తిడి!!
అసలీ తీర్మానాలు.. ఇంత గందరగోళం..
అవసరం అంటారా?
అంత అక్కర్లేదు!
అన్నపానీయాల విషయంలో అయోమయం అవసరమే లేదు.
పోషకాహారం పేరుతో ఎవరూ కష్టపడుతూ తినక్కర్లేదు.. అలాగని ఇష్టారాజ్యంగానూ తినకూడదు.
తీర్మానాలు చేసుకుని మరీ బుద్ధిగా నోరుకట్టేసుకోవాల్సిన పనిలేదు..
కొద్దిగా బుర్రపెట్టి తినాలి! అంతే!!
ఇదంత కష్టమేం కాదు.. అందుకే ఈ తిండి కథ ఏమిటో చూద్దాం.. రండి!!

నిండిందా? లేదా?

నిదానంగా.. నమిలి తినటం వల్ల మనసులో- మనం ఎంత తింటున్నాం, ఆకలి తీరిందా? లేదా? అన్న ఆలోచన, అవగాహన ఉంటాయి. మనం అలా తినేస్తూనే ఉండకుండా.. తినేప్పుడు మన శరీరం ఇస్తున్న సంకేతాలను పట్టించుకుంటూ ఉండాలి. కడుపు నిండిన సంకేతాలు మెదడుకు వెళ్లి, మనకు ఆ భావన (సెటైటీ) కలగటానికి కొద్దిసమయం పడుతుంది. మనం దానికా సమయం ఇవ్వకుండా వేగంగా తినేస్తుంటే.. అవసరాన్ని మించి చాలా ఎక్కువ తిన్న తర్వాత.. ఎప్పుడోగానీ పొట్ట ‘ఫుల్’ అయినట్లనిపించదు. దీనివల్ల జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోతుంది. అదే మనం మెల్లగా, మనసుపెట్టి తింటుంటే.. ఈ సంకేతాలు మెదడుకు చేరతాయి. మనం కూడా శరీరం ఇచ్చే సంకేతాలను గ్రహించి, వెంటనే ఆపేసే వీలుంటుంది. ఆకలి తీరినట్లు అనిపించగానే ఆపెయ్యటం... అన్నింటిలోకీ కీలకం!! కడుపు నిండుతున్నట్టు అనిపిస్తున్నా కూడా తింటూనే ఉండటం సరికాదు.

రెండోది- ఆహారం జీర్ణం కావటమన్నది ఎక్కడో పొట్టలోకి వెళ్లిన తర్వాతే కాదు.. నోట్లో, మనం నములుతున్నప్పుడే ఆరంభమవుతుంది. కొన్ని పదార్థాలు నోట్లో, లాలాజలంతో కలుస్తున్నప్పుడే జీర్ణమవటం మొదలుపెడతాయి. కాబట్టి మనసుపెట్టి.. నిదానంగా నమిలి తినటం అన్ని రకాలా ప్రయోజనకరం!

ఆహారమే మందా?

మనకు క్యాన్సర్ లాంటి కొన్నికొన్ని జబ్బులు జన్యుపరంగా రావచ్చు. మనలో పుట్టుకతోనే ఆ రకమైన జన్యు స్వభావం ఉన్నా.. ఆ స్వభావం బయటపడకుండా.. అంటే చాలాకాలం ఆ జబ్బు రాకుండా చూసే శక్తి మనం తినే ఆహారానికి ఉంటుంది! అందుకే ఆధునిక వైద్యరంగం ఆహారాన్ని కూడా ఒక రకంగా ఔషధంగానే పరిగణిస్తోంది. క్యాన్సర్, ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బుల వంటివాటన్నింటికీ జన్యువుల్లో ఎంతోకొంత మూలాలుంటాయి. మనం ఇష్టం వచ్చినట్టు ఆహారం తీసేసుకుంటే ఆ జన్యుస్వభావం ముందే బయటపడొచ్చు. చక్కటి పోషకాహారం తీసుకోవటం ద్వారా వాటిని మనం చాలాకాలం పాటు వాయిదా వేసుకోవచ్చు. ఒక్కోసారి జీవితాంతం కూడా వాయిదా వేసుకోవచ్చు.



ఇలా ఉండాలి..
మన పళ్లెం.. మన తిండి

మాంసం చాలదా?

మాంసంలో ప్రోటీన్లు.. అంటే మాంసకృత్తులు ఎక్కువ ఉంటాయి, అది అవసరమే. అలాగే శాకాహారంలో ఎక్కువగా దొరకని బి12 వంటి విటమిన్లూ ఉంటాయి. అయితే కూరగాయలు, పండ్ల వంటి వృక్ష సంబంధ ఆహారంలో బోలెడంత పీచు, రకరకాల ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్ల వంటివెన్నో ఉంటాయి. ఇన్ని రకాల పోషకాలు మాంసంలో ఉండవు. పైగా మాంసంలో కొవ్వు, కొలెస్ట్రాల్ ఎక్కువ ఉంటుంది. కాబట్టి ఏదో ఒక్కటి తినేస్తే చాలదు. మాంసం, శాకాహారం రెండూ ముఖ్యమేనని గ్రహించాలి.


అన్నింటికీ అదే..

ఏదో ఒక జబ్బు రాకుండానే కాదు.. చాలా రకాల జబ్బులకు ఒకటే విరుగుడుంది. అదే పోషకాహారం. మంచి పోషకాహారం తీసుకునే వారికి గుండెజబ్బులు, పక్షవాతం, క్యాన్సర్, ఊబకాయం, మధుమేహం.. ఇలా చాలా రకాల జబ్బులు అంత తేలికగా దరిజేరవు. ఒకవేళ ఈ జబ్బులేవన్నా తొలి దశలో ఉన్నా కూడా అవి ముదరకుండా చూడటానికీ పోషకాహారమే ఉపయోగపడుతుంది.


విషతుల్యాలకూ విరుగుడు!

ఎటుచూసినా రకరకాల కాలుష్యాలు, రసాయనాలు, విషతుల్యాల మధ్య ఆధునిక జీవితం క్యాన్సర్ వంటి నానా జబ్బుల మయం అయిపోతోందని రోజూ వార్తలు వింటూనే ఉన్నాం. అయితే ఈ జబ్బులన్నీ కూడా ఒక్కసారిగా ముంచుకొచ్చేవి కాదు. మంచి పోషకాహారం తీసుకుంటే వాటి ప్రభావాన్ని చాలా వరకూ నివారించుకోవచ్చు. కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తక్కువగా అంచనా వెయ్యొద్దు!


వంటింటి దినుసులతోనే వాపును ఎదుర్కొందాం!



అల్లం: వాపు రావటంలో.. ఒంట్లో విశృంఖలంగా తిరిగే ‘ఫ్రీర్యాడికల్స్’ పాత్ర ఎక్కువ. వీటి ఉత్పత్తిని ఎదుర్కొనే రసాయనాలు అల్లంలో ఉన్నాయి.



కారం: మిర్చిలోని క్యాప్సియాసిన్ అనే ప్రత్యేక రసాయనం వాపుల కారణంగా తలెత్తే నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.




దాల్చించెక్క: వాపు ప్రక్రియ తలెత్తితే ‘ఎన్ఎఫ్-కప్పా బి’ అనే ప్రోటీన్ విడుదలై చాలా నష్టం చేస్తుంది. దీన్ని అడ్డుకోవటంలో దాల్చినచెక్క ఉపయోగపడుతుంది.



లవంగాలు: లవంగాల్లోని ఇరోజినాల్ అనే ప్రత్యేక రసాయనానికి వాపులకు కారణమయ్యే కాక్స్2 అనే ఎంజైమ్‌ని అడ్డుకునే శక్తి ఉంది.



వెల్లుల్లి: ఆర్థరైటిస్ కారణంగా తలెత్తే నొప్పులు, వాపుల నివారణిగా వెల్లుల్లి చక్కగా ఉపకరిస్తుంది. నొప్పులకు కారణమయ్యే నైట్రిక్‌ఆక్సైడ్, ప్రోస్టోగ్లాడిన్స్ విడుదలని అడ్డుకుంటుంది.



నల్లమిరియాలు: మిరియాల్లోని పెపరైన్ నొప్పులని, వాపులని కూడా అదుపులో ఉంచుతుంది.

మనం ప్లేగు, క్షయ వంటి ఎన్నో రకాల మొండి వ్యాధులను జయించాం. యాంటీబయాటిక్స్‌తో ఇన్ఫెక్షన్లను తేలికగానే వదిలించుకుంటున్నాం. అత్యాధునికమైన చికిత్సలతో గుండె జబ్బులు, పక్షవాతం, ఉబ్బసం వంటి చాలా వ్యాధులనూ సమర్థంగానే ఎదుర్కొనగలుగుతున్నాం. కానీ ఒక రకంగా ఈ గుండెజబ్బుల వంటివన్నీ మనం తీసుకునే ఆహారం, మన రోజువారీ అలవాట్లు, శారీరక వ్యాయామం వంటివాటితో బలంగా ముడిపడిన వ్యాధులు. అందుకే వీటిని జీవనశైలీ వ్యాధులని కూడా అంటున్నారు. క్యాన్సర్‌తో సహా ఇలాంటి జీవనశైలీ జబ్బులను లోతుగా పరిశోధించినప్పుడు ఇలాంటి చాలా వ్యాధులకు మూలం.. మన ఒంట్లో తలెత్తే ‘వాపు’ ప్రక్రియలో కనబడుతోంది. ఒకరకంగా మనకు ‘వాపు’ అనేది తెలియనిదేం కాదు. దెబ్బ తగిలితే అక్కడ వాస్తుంది. బెణికితే వాస్తుంది. ఇదంతా బయటి నుంచి జరిగిన నష్టానికి మన శరీరం స్పందన. ఆ నష్టాన్ని పూడ్చుకునే, దెబ్బను మాన్పుకునే ప్రక్రియలో భాగం. ఈ వాపు పైకి కనిపిస్తుంది కాబట్టి మనం దీన్ని గుర్తిస్తున్నాం. అయితే ఇలా బయటకు కనిపించకుండా.. మన లోలోపల రకరకాల అవయవాల్లో, రకరకాల వ్యవస్థల్లో కూడా వాపు లాంటి మార్పు తలెత్తుతుంటుంది.



దీన్నే ‘ఇన్‌ఫ్లమేటరీ ప్రాసెస్’ అంటారు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న చాలా రకాల దీర్ఘకాలిక సమస్యలకు లోలోపల ఈ ‘వాపు’ తరహా మార్పులు కారణమవుతున్నాయని ఆధునిక వైద్యరంగం స్పష్టంగా గుర్తించింది. ముఖ్యంగా గుండె జబ్బులు, పక్షవాతం, కొన్ని రకాల క్యాన్సర్లు, కీళ్లవాపులు, కొన్ని రకాల చర్మవ్యాధులు.. వీటన్నింటి వెనకా... ఎంతోకొంత ఈ ‘వాపు’ మార్పుల పాత్ర ఉంటోందని తేలటం విశేషం. కాబట్టి వాపు తరహా మార్పులను ముందు నుంచీ సమర్థంగా ఎదుర్కొంటే మనం చాలా రకాల జబ్బులను మూలాల్లోనే నివారించుకోవచ్చు. అందుకోసమే ఈ ‘వాపు’కు తేలికైన విరుగుడు కనుగొనేందుకు వైద్యపరిశోధనా రంగం విస్తృతంగా కృషి చేస్తోంది. అదృష్టవశాత్తూ.. దీన్ని ఎదుర్కొనటంలో మనం రోజువారీ ఇంట్లో వాడుకునే రకరకాల ఆహార పదార్థాలు, ముఖ్యంగా కొన్ని రకాల దినుసులు, సుగంధ ద్రవ్యాలు బాగానే ఉపకరిస్తున్నాయని బయటపడింది. ముఖ్యంగా పసుపు, వెల్లుల్లి వంటి వాటిలో ఉండే మూల ద్రవ్యాలు- వాపునూ, మన శరీరంలో ఒక పరంపరగా అది సృష్టించే విలయాన్నీ నివారించటంలో కొంత ముఖ్యపాత్రే పోషిస్తున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో రోజూ పాలలో పసుపు వేసుకుని తాగటమన్నది ఇటీవలి కాలంలో తరచూ చర్చల్లోకి వస్తోంది. ఇది ఏకంగా ‘గోల్డెన్ మిల్క్’ పేరుతో విస్తృత ప్రాచుర్యంలోకి వస్తోంది. ఇవన్నీ చిరకాలంగా మనకు తెలిసినవే అయినా.. వీటికి సరికొత్త ఆరోగ్య ప్రయోజనాలున్నాయని, ఇవి ఆధునిక కాలంలో మనల్ని వేధిస్తున్న చాలా వ్యాధులకు విరుగుడుగా కూడా పని చేస్తాయని తేలటం.. మనం తప్పకుండా గుర్తించాల్సిన విశేషం.



పసిడిపాలు!

పాలల్లో చిటికెడు పసుపు వేసుకుని తాగడం... దీన్ని పాతకాలం నాటి బామ్మల చిట్కాగా కొట్టిపారేయకండి. ఎందుకంటే ఈ చిట్కా కేవలం దగ్గు, జలుబుల నుంచే కాకుండా.. శరీరంలోని అంతర్గత వాపుల (ఇన్‌ఫ్లమేషన్) నివారణకూ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రాచుర్యంలోకి వస్తోందే పసిడిపాలు!

పసిడిపాలు: దీన్నే గోల్డెన్ మిల్క్ అని వ్యవహరిస్తున్నారు. గోరువెచ్చని పాలల్లో అర చెంచా పసుపు వేసుకుని తాగితే ఇన్‌ఫ్లమేషన్ నుంచి ఉపశమనం కలుగుతుంది. పసుపులోని కర్క్యుమిన్ అనే శక్తివంతమైన పాలిఫినాల్‌కు గాయాలను మాన్పే గుణం, చీముపట్టకుండా చూసే లక్షణమే (యాంటిసెప్టిక్) కాదు.. యాంటిఆక్సిడెంట్ గుణాలూ దండిగా ఉన్నాయి. అందుకే పసుపు వేసిన పాలని తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. ఈ పాలల్లోనే అరచెంచా మిరియాల పొడి వేసుకుంటే మరీ మంచిది. వీటికి తోడు దాల్చిన చెక్క, తేనె, దంచిన అల్లం కూడా కలుపుకోవచ్చు. ఇవి పడని వారు.. గుండెల్లో మంట, అసిడిటీ బాధలున్నవారు పసుపు వేసుకుంటే చాలు.

ఈ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారా?

మంచి కెరీర్.. ఆర్థికపరంగా మెరుగైన జీవితం.. వీటికి కావల్సిన ప్రణాళికల్ని ఏడాది మొదట్లోనే ఓ చోట రాసిపెట్టుకుంటాం. వీటి కోసం ముందస్తు ప్రణాళికలూ వేసుకుంటాం. కానీ అన్ని భాగ్యాలకు మూలమైన ఆరోగ్య భాగ్యం మాటేంటి? దీని గురించీ మీ ప్రణాళికలు పక్కాగా ఉన్నాయో లేదో సంవత్సరం మొదట్లోనే సరిచూసుకోవటం ఉత్తమం.



ఏదో సమస్య ముంచుకొచ్చినప్పుడే డాక్టర్ దగ్గరకు పరుగెత్తుకు వెళ్లటం కాకుండా.. వయసుని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా కొన్ని కనీస ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం అవసరం. ఈ పని సంవత్సరం మొదట్లోనే చేయటం మరీ మంచిది. ముఖ్యంగా బరువు చూసుకోవాలి. రక్తపోటు (బీపీ) చూపించుకోవాలి. సంపూర్ణ రక్తపరీక్ష (సీబీపీ) చేయించుకుని రక్తహీనత వంటివేమీ లేవని నిర్ధారించుకోవాలి. అలాగే రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ స్థాయులు ఎలా ఉన్నాయో కూడా చూసుకోవటం అవసరం. అవసరమైన వాళ్లు థైరాయిడ్ పరీక్ష చేయించుకోవటం వల్ల సమస్య ఏదైనా ఉంటే ముందుగానే గుర్తించవచ్చు. దీనివల్ల ఏడాదంతా ఆత్మవిశ్వాసంతో హాయిగా గడపొచ్చు. ఆరోగ్యపరంగానే కాదు.. ఆర్థికంగానూ ఈ పరీక్షలు ఎంతో లాభం చేకూరుస్తాయి.

ఇది ఒకటో నెంబరు లుక్కూ...

జనవరి 1... అంటే అందరికీ ప్రత్యేకమే. కొత్త కలలకు, కొంగొత్త ఆలోచనలకు క్లాప్ కొట్టే ఘడియలివి. ఈ యేడాది అంతా శుభమే జరగాలని కోరుకుంటూ తొలి అడుగులు వేస్తారు. సినిమా వాళ్లకూ ఇలాంటి సెంటిమెంట్లు ఉంటాయి. తొలిరోజుని శుభప్రదంగా ఆరంభిస్తే... ఆ జోరు యేడాదంతా సాగుతుందని బలమైన నమ్మకం. తమ కొత్త సినిమా సంగతుల్ని చెప్పడానికీ, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయడానికి ఇంతకు మించిన తరుణం ఏముంటుంది? అందుకే జనవరి 1న... ఫస్ట్‌లుక్కులు వరుస కట్టాయి. అల్లుఅర్జున్, అనుష్క, విష్ణు, రానా చిత్రాలకు సంబంధించిన చిత్రాలు బయటకు వచ్చాయి.


అల్లు అర్జున్

ఓ సైనికుడి కోపం

అల్లు అర్జున్ అంటే హుషారైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్. తెరపై తన జోరునే చూశాం ఇన్నాళ్లు. బన్నీ కోపం ఎలా ఉంటుందో 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' టీజర్ చూపిస్తోంది. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఫస్ట్ ఇంపాక్ట్ టీజర్‌ని జనవరి 1న విడుదల చేశారు. మిలటరి దుస్తుల్లో బన్నీ చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నాడు. కండలు తిరిగిన దేహం, తీక్షణమైన చూపులతో ఆకట్టుకున్నాడు. బన్నీని చూపించిన దాదాపు అన్ని ఫ్రేముల్లోనూ ఆ పాత్ర తాలుకూ కోపం కనిపించింది. 'ఇలాగైతే కొన్ని రోజులకు చచ్చిపోతావ్‌రా' అంటూ రావు రమేష్ అంటే 'చచ్చిపోతాను గాడ్ ఫాదర్.. కానీ ఇక్కడ కాదు బోర్డర్‌'లో అంటూ బన్నీ సమాధానం ఇవ్వడం చూస్తుంటే ఇది దేశభక్తి నేపథ్యంలో సాగే చిత్రమని అర్థమవుతోంది. ఏప్రిల్‌లో 'నా పేరు సూర్య' ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

భాగమతి దర్శనం


అనుష్క


అనుష్క 'భాగమతి'గా సిద్ధం అవుతోంది. అశోక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇది వరకే తనకు తానే శిలువ వేసుకుంటున్న 'భాగమతి' రూపాన్ని బయటకు వదిలింది చిత్రబృందం. అందులో అనుష్క మోముని పూర్తి స్థాయిలో చూపించలేదు. అయితే ఈసారి.. 'భాగమతి'గా ఆమె ఎలా ఉంటుందో పూర్తి స్థాయిలో చూపించింది చిత్రబృందం. జుత్తు విరబూసుకుని, దేనికోసమో అన్వేషిస్తున్నట్టున్న అనుష్క చిత్రాన్ని 2018 తొలి రోజున విడుదల చేశారు. ఈ వారంలోనే ట్రైలర్‌ని ఆవిష్కరించనున్నారు.

శ్రీమతికి సేవలు చేస్తూ...


విష్ణు, శ్రియ

తొలి చిత్రాలంటే ఎలా ఉంటాయి? కథానాయకుడిలోని 'మాస్' కోణానికి నిలువెత్తు నిదర్శనంలా కనిపిస్తుంటాయి. కానీ 'గాయత్రి'లో విష్ణు లుక్ కాస్త విభిన్నంగా బయటకు వచ్చింది. నోట్లో దువ్వెన పెట్టుకొని, శ్రియకు శ్రద్ధగా జడ అల్లుతూ.. కనిపించారు. 'ఇకపై ఇద్దరిదీ ఒకే ప్రాణం' అనే క్యాప్షన్ జోడించారు. ఇదో కుటుంబతరహా చిత్రమని లుక్ చూడగానే అర్థమైపోయింది. మోహన్‌బాబు ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'గాయత్రి'. అందులో విష్ణు, శ్రియలు ఆలుమగలుగా కనిపించనున్నారు. మదన్ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

గజరాజు వచ్చాడు


రానా

'బాహుబలి'కి ముందే రానా జాతీయ స్థాయి నటుడు. 'ఘాజీ' హిందీలోనూ బాగానే ఆడింది. తమిళ, మలయాళ చిత్రాలపై ఫోకస్ పెట్టాడు. ప్రస్తుతం ఆయన ప్రభు సాల్మన్ దర్శకత్వం వహిస్తున్న 'హథీ మేరే సాథీ' చిత్రంలో నటిస్తున్నారు. ఏనుగుల నేపథ్యంలో సాగే కథ ఇది. దానికి తగ్గట్టుగానే ఏనుగుతో కలసిన రానా చిత్రాన్ని ఫస్ట్‌లుక్‌గా విడుదల చేశారు. తెలుగులోనూ ఈ చిత్రం విడుదల కాబోతోంది. దీనికి 'అడవి రాముడు' అనే టైటిల్ పరిశీలిస్తున్నట్టు సమాచారం.

ఈనాడు సినిమా


వెంకి కుడుముల, గౌతమ్, శంకర్‌ప్రసాద్, బుజ్జి, నాగశౌర్య, కాసర్ల శ్యామ్

ఛలో పాట

నాగశౌర్య, రష్మిక జంటగా నటించిన చిత్రం 'ఛలో'. వెంకి కుడుముల దర్శకుడు. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పకులు. ఉషా ముల్పూరి నిర్మాత. మహతి స్వరసాగర్ స్వరాలు అందించారు. సోమవారం హైదరాబాద్‌లో 'చూస్తుంటే పువ్వుల షేపు' పాటను పాత్రికేయులు పసుపులేటి రామారావు, బి.ఎ.రాజు విడుదల చేశారు. నటుడు నరేష్ మాట్లాడుతూ "కథ విన్నవెంటనే విజయం ఖాయమనిపించింది. నాగశౌర్యకి విజయం దక్కుతుంద"న్నారు నాగశౌర్య మాట్లాడుతూ "భాస్కరభట్ల రాసిన 'చూసీ చూడంగానే నచ్చేశావే' పాట ప్రేక్షకాదరణకి పొందింది. 'చూస్తుంటే నవ్వుల షేపు' గీతమూ బాగుందంటున్నార"ని చెప్పారు. ఫిబ్రవరి 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు నిర్మాత తెలిపారు. కార్యక్రమంలో గౌతమ్, బుజ్జి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పంచ్ డైలాగ్

కోపాన్ని, ఆయుధాన్ని ఎక్కడ వాడాలో తెలుసుకో!

చిత్రం: కాటమరాయుడు - పంపినవారు: వి.శివ, మియాపూర్, హైదరాబాద్


సూర్య

సూర్య చిత్రం ప్రారంభం

సెల్వ రాఘవన్ దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. సాయిపల్లవి కథానాయిక. ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్నారు. తెలుగులోనూ విడుదల కానున్న ఈ సినిమా చిత్రీకరణ సోమవారం చెన్నైలో ప్రారంభమైంది. సూర్య మాట్లాడుతూ "ఇదివరకు నేను చేసిన 35 చిత్రాలకి పూర్తి భిన్నమైన కథ, కథనాల్ని సిద్ధం చేశాడు దర్శకుడు. వాణిజ్యాంశాలతో అందరినీ అలరించేలా ఉంటుందీ చిత్రం. కథానాయిక పాత్రకి కూడా ఎంతో ప్రాధాన్యముంది" అన్నారు. "సూర్యనే చేయాల్సిన చిత్రమిది" అన్నారు దర్శకుడు. "మా సంస్థ నుంచి ఇటీవలే 'ఖాకీ' విడుదలై విజయవంతమైంది. సూర్య కెరీర్‌లోనే గుర్తుండిపోయేలా ఈచిత్రాన్ని రూపొందిస్తున్నారు సెల్వ రాఘవన్. జనవరి 18 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలుపెట్టి, దీపావళికి విడుదల చేస్తాం" అఆన్నరు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శివకుమార్ విజయన్.


సిద్ధు, శీరత్ కపూర్, లగడపాటి విక్రమ్, పృథ్వి

ఇది బృందావనం

రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిస్తున్న చిత్రం 'బృందావనం అందరిది'. శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు నిర్మాతలు. ఇటీవలే చిత్రం సెట్స్‌పైకి వెళ్లింది. కొత్త యేడాదిని పురస్కరించుకొని సోమవారం తారాగణాన్ని ప్రకటించింది చిత్రబృందం. ప్రధాన పాత్రధారులుగా సిద్ధు, లగడపాటి విక్రమ్, శీరత్ కపూర్, పృథ్వీ నటిస్తున్నట్టు తెలియజేశారు దర్శకుడు శ్రీధర్ సీపాన. ఆయన మాట్లాడుతూ "ప్రధాన తారాగణం మినహా మిగిలిన నటుల్లో చాలామంది కొత్తవాళ్లే. 'గుంటూరు టాకీస్'లో నటించిన సిద్ధు.. 'రుద్రమదేవి', 'రేసుగుర్రం', 'పటాస్' చిత్రాల్లో నటించిన లగడపాటి విక్రమ్‌లని చూశాక మా కథలోని పాత్రలకి తగ్గట్టుగా ఉన్నారని వాళ్లని ఎంపిక చేశాం. హాస్యనటుడు పృథ్వీతో పాటు, కథానాయిక శీరత్ కపూర్ కూడా కీలక పాత్రలు చేస్తున్నారు. సంక్రాంతికి ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: సి.రాంప్రసాద్, పాటలు: సిరివెన్నెల సీతారామశాస్త్రి, కూర్పు: ప్రవీణ్ పూడి, కళ: తిరుమల.


సందడంతా సీక్వెల్ చిత్రాలదే


గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ - వాల్యూమ్ 2


కోకో

ఎన్నో విభిన్నమైన హాలీవుడ్ చిత్రాలను సినీ ప్రేమికులకు అందించి మరీ వెళ్లింది 2017. సూపర్ హీరోల విన్యాసాలు, సీక్వెల్స్ మెరుపులు, యథార్థ గాథలు, యానిమేషన్ కథలతో గతేడాది సందడి సందడిగా గడిచింది. బాక్సాఫీసు వద్ద కాసుల కురిపించడంలో మాత్రం సీక్వెల్ చిత్రాలదే పైచేయిగా ఉంది. విమర్శకుల ప్రశంసలు అందుకున్న కొన్ని ఉత్తమ చిత్రాలూ ప్రేక్షకులను పలకరించాయి. 2017లో ఆసక్తిరేపిన చిత్రాలేంటో చూద్దాం.

టెర్మినేటర్ 2 - జడ్జ్‌మెంట్ డే(త్రీడీ): ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్ అనే ఓ యాక్షన్ హీరో సత్తాను ప్రపంచానికి పరిచయం చేసి, కోట్లాది మంది అభిమానులను తెచ్చిపెట్టాయి 'టెర్మినేటర్' సిరీస్ చిత్రాలు. ప్రధానంగా 1991లో వచ్చిన 'టెర్మినేటర్ 2: జడ్జ్‌మెంట్ డే' అద్భుత విజయాన్ని సాధించింది. పాతికేళ్ల తర్వాత దాన్ని ఈతరం ప్రేక్షకుల కోసం త్రీడీ సాంకేతిక హంగులతో తీసుకొచ్చాడు చిత్ర దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఆర్నాల్డ్ అద్భుతమైన పోరాటాలు కొత్త తరానికీ బాగా నచ్చేశాయి.


టెర్మినేటర్ 2 - జడ్జ్‌మెంట్ డే(త్రీడీ)

స్టార్‌వార్స్: ది లాస్ట్ జేడీ: హాలీవుడ్‌లో అత్యంత ప్రేక్షకాదరణ ఉన్న సిరీస్ 'స్టార్‌వార్స్'. ఈ సిరీస్ నుంచి ఈ ఏడాది 'ది లాస్ట్ జేడీ' విడుదలైంది. రియాన్ జాన్సన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో మార్క్ హామిల్, కారీ ఫిషర్ ప్రధాన పాత్రల్లో నటించారు. 200 మిలియన్ డాలర్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 777 మిలియన్లకు పైగా వసూళ్లు సాధించడం గమనార్హం.

స్పైడర్‌మ్యాన్ - హోమ్‌కమింగ్: సూపర్ హీరో చిత్రాల్లో 'స్పైడర్‌మ్యాన్'కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఈ ఏడాది ఈ సిరీస్ నుంచి 'స్పైడర్‌మ్యాన్: హోమ్‌కమింగ్' భారీ అంచనాలతో విడుదలైంది. టామ్ హోలాండ్స్ స్పైడర్‌మ్యాన్‌గా నటించాడు. జాన్ వాట్స్ తెరకెక్కించాడు. 175 మిలియన్ డాలర్ల బడ్జెట్‌కుగాను 880 మిలియన్ డాలర్లు వసూళ్లు సాధించింది.

గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ - వాల్యూమ్ 2: 2014లో విజయవంతమైన 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ'కి సీక్వెల్‌గా ఈ ఏడాది 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ: వాల్యూమ్ 2' విడుదలైంది. క్రిస్‌ప్రాట్ ప్రధాన పాత్రలో నటించాడు. జేమ్స్ గున్ దర్శకత్వం వహించారు. 200 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో తెరకెక్కిన దీనికి 863 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు దక్కాయి.

థోర్ - రగ్నరోక్: 2011లో వచ్చిన 'థోర్', 2013లో వచ్చిన 'థోర్: ది డార్క్ వరల్డ్' చక్కటి విజయం సాధించాయి. వాటికి సీక్వెల్‌గా ఈ ఏడాది 'థోర్: రగ్నరోక్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. క్రిస్ హెమ్‌వర్త్ ప్రధాన పాత్రలో నటించాడు. 180 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. 850 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు వచ్చాయి.

వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్: 'ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రమిది. ఆండీ సెర్కిస్ ప్రధాన పాత్రలో నటించాడు. మాట్ రీవెస్ తెరకెక్కించాడు. 150 మిలియన్ డాలర్లతో తెరకెక్కిన ఈ చిత్రం 490 మిలియన్ డాలర్లు వసూలు చేసింది.

డంకర్క్: ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ నుంచి ఈ ఏడాది 'డంకర్క్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఫిన్ వైట్‌హెడ్ ప్రధాన పాత్రలో నటించాడు. వంద మిలియన్ డాలర్లతో తెరకెక్కిన ఈ చిత్రం 525 మిలియన్ డాలర్లు వసూలు చేసింది.

లయన్: ఆస్కార్ బరిలో ఆరు నామినేషన్లు సాధించి సంచలనం సృష్టించిన 'లయన్' ఈ ఏడాది విడుదలైంది. ఓ భారతీయ కుర్రాడి నిజ జీవిత కథతో ఈ చిత్రం తెరకెక్కడం విశేషం. ఐదేళ్ల భారతీయ బాలుడు దత్తత ద్వారా ఆస్ట్రేలియా వెళ్లి మంచి స్థాయికి ఎదిగి తిరిగి తన కన్నతల్లిదండ్రులను ఎలా కలుసుకున్నాడనే కథతో తెరకెక్కిన ఈ చిత్రానికి మంచి ప్రశంసలొచ్చాయి. దేవ్ పటేల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి గర్త్ డేవిస్ దర్శకుడు.


బ్లేడ్ రన్నర్

బ్లేడ్ రన్నర్: ఓ సినిమాకు 25 ఏళ్ల తర్వాత సీక్వెల్ రావడమంటే విశేషమే. 1982లో వచ్చిన 'బ్లేడ్ రన్నర్'కు కొనసాగింపుగా ఈ ఏడాది 'బ్లేడ్ రన్నర్ 2049' విడుదలైంది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో ర్యాన్ గోస్లింగ్, హారిసన్ ఫోర్డ్ ప్రధాన పాత్రల్లో నటించారు. డెనిస్ విలెనెవు దర్శకత్వం వహించారు. 150 మిలియన్ డాలర్లతో తెరకెక్కించిన ఈ చిత్రం 260 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది.


కోకో: హాలీవుడ్‌లో బాలలనుద్దేశించి తీసే యానిమేషన్ చిత్రాలు పెద్దవారిని కూడా ఆకట్టుకుని కనకవర్షం కురిపిస్తుంటాయి. ఆ కోవలో వచ్చిందే 'కోకో'. లీ ఉంక్రిచ్ దర్శకుడు. పన్నెండేళ్ల కుర్రాడి నేపథ్యంలో సాగే ఈ చిత్రం సంగీత ప్రధానంగా తెరకెక్కింది. పిక్సర్ స్టూడియోస్ 175 మిలియన్ డాలర్లతో ఈ చిత్రాన్ని నిర్మించింది. 490 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది.



వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్


డంకర్క్


స్టార్‌వార్స్: ది లాస్ట్ జేడీ


స్పైడర్‌మ్యాన్ - హోమ్‌కమింగ్


థోర్ - రగ్నరోక్


లయన్

ఒక్కరే వెళ్తున్నారా?



అమ్మాయిలు ఒంటరి ప్రయాణాలు చేయడం ఈ మధ్య సర్వసాధారణమైన విషయం. అయితే వృత్తిరీత్యా ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్తున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

- మీరు వెళ్తున్న ప్రదేశానికి సంబంధించిన రూట్‌మ్యాప్ మీ దగ్గర ఉంచుకోండి. మీకు అంతర్జాలం అందుబాటులో లేనప్పుడు అది ఉపయోగపడుతుంది.
- సాధ్యమైనంత వరకు ఒంటరిగా క్యాబ్, ఆటోలో వెళ్లడానికి ప్రాధాన్యం ఇవ్వకండి. ప్రజా రవాణాకే ఓటేయ్యండి. మీకు ఆ ప్రాంతం గురించి ఎక్కువ విషయాలు తెలిసే అవకాశాలు కూడా ఉంటాయి.
- ఒంటరిగా ప్రయాణించాల్సి వస్తే మీరు ఎక్కబోయే వాహనం నంబరు, వివరాలు డ్రైవరుకు తెలిసే విధంగానే వేరే వాళ్లతో ఫోన్‌లో చెప్పండి. అది మీకు ఒక రక్షణలాగా పనిచేస్తుంది.
- మీరుండబోయే ప్రదేశం గురించి ముందుగానే విచారణ చేయండి. వీలైనన్ని ఎక్కువ విషయాలు తెలుసుకోడానికి ప్రయత్నించండి. ఇప్పుడు చాలా యాప్‌లు హోటళ్లకు సంబంధించిన అన్ని వివరాలూ అందుబాటులో ఉంచుతున్నాయి. ముందుగానే గదిని బుక్ చేసుకోండి. లేదంటే అక్కడికెళ్లాక సతమతమవ్వాల్సి వస్తుంది.
- సెల్‌ఫోన్ ఛార్జింగ్ విషయంలో శ్రద్ధ వహించండి. వీలైతే ఒక పవర్‌బ్యాంక్‌ను వెంటతీసుకెళ్లడం మంచిది. దానివల్ల ఇబ్బంది ఎదురుకాకుండా ఉంటుంది.

మన గుండె పదిలమిలా!




అపరిమితంగా ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం లాంటి వల్లే గుండె జబ్బులు వస్తాయని అనుకుంటే పొరపాటే. మన రోజువారీ అలవాట్లలో చేసే కొన్ని తప్పిదాల వల్ల కూడా గుండెకు ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా!

- కంటినిండా నిద్ర ప్రతి ఒక్కరికి అవసరమే. నిద్రకూ, గుండెకు సంబంధం ఉంది. సరైన నిద్ర లేకపోవడం వల్ల ఒత్తిడీ, అలసట తప్పదు. ఒకవేళ అధికరక్తపోటు ఉంటే.. అది కూడా నియంత్రణలో ఉండదు. అందుకే వేళకు నిద్రపోయేలా చూసుకోవాలి. అదీ కనీసం ఎనిమిది గంటలు సుమా.
- ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే గుండెసమస్యలు పెరగొచ్చు. అధికరక్తపోటూ తగ్గదు. అంతేకాదు వీటివల్ల గుండెలోని ధమనులకు అవరోధం ఏర్పడవచ్చు. కాబట్టి తప్పనిసరిగా ఒత్తిడిని తగ్గించుకోవాలి. శ్వాస మీద దృష్టి పెట్టాలి. ధ్యానం క్రమం తప్పకుండా చేయాలి.
- టీవీకి గంటలు గంటలు అతుక్కుపోవడం కూడా గుండెకు ప్రమాదమే. ఎలాగంటారా.. కదలకుండా కూర్చోవడం వల్ల బరువు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అదే గుండెజబ్బులకు దారితీయొచ్చు. అందుకే నడకకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్ని గంటలు కూర్చుంటున్నామనేదీ గమనించుకోవాలి.
- ఉప్పు ఎక్కువగా తీసుకోవడం కూడా గుండెకు ప్రమాదమే. ఉప్పులోని సోడియం బరువుతోపాటూ, అధికరక్తపోటుకూ దారితీస్తుంది. ఈ రెండూ గుండెకు హానిచేస్తాయి. కాబట్టి ఉప్పును వీలైనంత తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. అలాగే తాజా పండ్లూ, కూరగాయలూ, కొవ్వు తక్కువగా ఉండే పాల ఉత్పత్తులూ, చికెన్, చేపలూ, డ్రైఫ్రూట్స్, గింజలు ఎక్కువగా తీసుకునేలా చూసుకోవాలి.

రంగవల్లిక

మూడువైపులా ముగ్గు వేసి
ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.




18 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకూ



జి.అద్వైత,
చంపాపేట
హైదరాబాద్

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.





ప్రీతి,
హైదరాబాద్

17 చుక్కలు,
7 వరుసలు,
7 వచ్చేవరకూ

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
✦ email: vasundhara@eenadu.net

క్యాలెండర్ మీ ఆయుధం కావాలి!

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

? ఉద్యోగంలో చేరి ఎనిమిదేళ్లు అవుతోంది. నాకో బాబు. నా ఉద్యోగ జీవితం, వ్యక్తిగత జీవితం రెండూ పెద్దగా ఇబ్బందులు లేకుండానే సాగుతున్నాయి. నా సమస్య ఒక్కటే. ఏడాదిపొడవునా పరుగులు పెడుతున్నట్టుగానే ఉంటోంది. కిందటి సంవత్సరం ఎప్పుడు వచ్చి వెళ్లిపోయిందో తెలియదు. ఇలానే ఏళ్లు గడిచిపోతున్నాయి కానీ నేను ఏం సాధిస్తున్నానో అర్థం కావడం లేదు. పిల్లలు, కుటుంబం, ఆఫీసు వీటి మధ్య నా ఆశలేవి నెరవేరడం లేదు. కనీసం కొత్త ఏడాదిలోనైనా ఏదో సాధించాలని ఉంది. నాకంటూ సమయం మిగుల్చుకోవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి

✔ మనలో చాలామంది టైం మేనేజ్‌మెంట్ అనే పదం వాడతారు కానీ.. అది సరైన పదం కాదు. ఎందుకంటే టైంని ఎవ్వరూ మేనేజ్ చేయలేరు. దాని బదులు సెల్ఫ్‌మేనేజ్‌మెంట్ అనే పదాన్ని వాడుకోవచ్చేమో! నిజానికి అదో నైపుణ్యం అనొచ్చు. ఎవరికైనా ఆ 24 గంటలే ఉంటాయి. కానీ క్రమశిక్షణ, ముందుచూపుతో ఎవరు ముందుకెళ్తారో వాళ్లు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారు. చాలామంది ఉద్యోగినులు మాకు సమయం సరిపోవడం లేదని చెబుతుంటారు. కానీ విజయవంతమైన మహిళలు చెప్పిన దాని ప్రకారం.. వాళ్లంతా తమకు నచ్చిన పనిచేయడం కోసం సమయాన్ని సృష్టించుకుంటారు అని. నాకు సమయం లేదు అని తరచూ అనేవారంతా సమయానికి బానిసలే. అలా కాకుండా సమయాన్ని సృష్టించుకునేవాళ్లే సమయాన్ని నిర్దేశిస్తారు. ఇందుకోసం కొన్ని చిట్కాలున్నాయి.

- మీ రోజుని త్వరగా ప్రారంభించండి. ఆఫీసుకి తొమ్మిదికి వెళ్లాలంటే మామూలుగా కంటే గంట ముందు నిద్రలేవండి. ఇందుకోసం అవసరం అయితే గంట ముందు నిద్రపోయేలా చూసుకోవాలి. పిల్లలకు టిఫిన్ పెట్టడం, బాక్సు సర్దడం ఇవన్నీ రోజూ ఉండేవే. వాటికోసం ముందే ప్రణాళిక వేసుకోండి. కనీసం ముందే ఆలోచించి పెట్టుకోండి.
- క్యాలెండర్ అనేది సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మనుషులకున్న అద్భుతమైన ఆయుధం. ఒక నెలవారీ ప్రణాళిక (మంత్లీప్లానర్) కొనుక్కోండి. అందులో మరీ ఎక్కువ లక్ష్యాలు పెట్టుకోవద్దు. ముఖ్యమైనవి మూడు నాలుగు లక్ష్యాలు రాసుకోవాలి. ఆఫీసు సెలవులూ, వారాంతాలు రాసుకోండి. మీ పిల్లల స్కూలు క్యాలెండర్ కూడా చూడండి. అందులో పిల్లల సెలవులు, పరీక్షలు వంటి వివరాలు ఉంటాయి. దాన్ని బట్టి మీరు ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే క్యాలెండర్‌లో ఎవరికి ఇబ్బంది లేని రోజుని అందులో రాసుకోండి. మీరు ప్రతి సంక్రాంతికి ఊరు వెళ్తారనుకోండి.. నోట్ చేసుకుని టికెట్లు బుక్ చేసుకోండి. ముందే టిక్కెట్లు కొంటే డబ్బు ఆదానే కదా! ప్రతి ఒక్కరికి ఫిట్‌గా ఉండాలని ఉంటుంది. వారానికి నాలుగు రోజులు యోగా అని రాయండి. ఫ్యామిలీ ఫ్రెండ్స్, గెట్‌టుగెదర్ ఇలా తేదీలపై కచ్చితంగా రాసుకోండి. ఇలా ఎందుకు అంటున్నా అంటే... చాలామంది బరువు తగ్గాలి అని రాస్తారు. అది కోరిక మాత్రమే.. అది ఆచరణలోకి రావాలంటే క్యాలెండర్‌ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల్సిందే. కనీసం మీ ఫోన్‌లో ఉండే క్యాలెండంనయినా సద్వినియోగం చేసుకోండి. దీనివల్ల పక్కా ప్రొఫెషనలిజం ఏర్పడుతుంది. మీ లక్ష్యాలు కూడా నెరవేరతాయి.

ఏడాదంతా... మెరిసిపోదామా

కొత్త సంవత్సరం వస్తూనే సరి కొత్త ఫ్యాషన్లను మోసుకొచ్చింది. ఈ ఏడాది ఫ్యాషన్‌లో దుస్తులన్నీ తెలుపు, ఎరుపూ, లేత గులాబీ, ఊదా వంటి ఇంద్రధనస్సు వర్ణాల్లో తళుక్కుమననున్నాయి. డార్క్ డెనిమ్ ఫ్యాబ్రిక్ యువతను మెప్పించనుండగా, రచ్చింగ్ తరహా మరింతగా ఆకర్షించనుంది. అలాగే చుక్కల అందాలూ, అసిమెట్రికల్ నెక్ లైన్స్ వంటి డిజైన్లు ప్రముఖం కానున్నాయి. వీటిలో మనకేం నప్పుతాయో చూసేద్దాం. ఏడాదంతా కొత్తగా కనిపించేద్దాం. ఆ వివరాలే చెబుతున్నారు డిజైనర్ కవితాగుప్తా.



డెనిమ్‌లో ఎన్నిరంగులు వచ్చినా, డార్క్ డెనిమ్ ఈ ఏటి ట్రెండ్. దీన్ని క్రాప్‌టాప్‌గా ఎంపిక చేసుకుంటే, పొట్టిగా ఉండేలా చూడాలి. దీనిపై ఎంబ్రాయిడరీ పనితనం ఉంటే ఆకర్షణీయంగా కనిపిస్తుంది. పొడవాటి స్కర్టులూ, ఇంగ్లిషు వర్ణాల్లో పలాజోలను ఎంపిక చేసుకున్నా కూడా ఎంబ్రాయిడరీ ఉండేలా డెనిమ్ టాప్‌లను తీసుకోవాలి.

నలుపు, తెలుపు పోల్కా డాట్లు..



టాప్స్, స్కర్టులపైన ఈ డిజైన్ ఆకర్షణీయంగా ఉంటుంది. తెలుపు వస్త్రంపై నలుపు, అలాగే నలుపుపై తెలుపు చుక్కలు, చిన్న, పెద్ద వలయాల్లా కలిపి తీసుకుంటే పార్టీలకు ప్రత్యేకంగా ఉంటుంది. పాత మోడల్ అనుకోకుండా ఉంటే, ఈ డిజైన్‌లో లాంగ్ గౌన్లు సాయంత్రపు పార్టీకి బాగుంటాయి. సంప్రదాయంగా కనిపించాలంటే పరికిణీ, బ్లవుజు ఒకే డిజైన్‌లో ఉండి, ఓణీ మాత్రం నలుపు లేదా తెలుపులో పోల్కాడాట్లు తీసుకోవాలి. సిల్క్, షిఫాను ఎంచుకుంటే, చూడటానికి తేలికగా ఉన్నట్లున్నా, ఆడంబరంగా అనిపిస్తుంది. చుడీదార్లకు కూడా ఇదే మేళవింపు బాగుంటుంది.

రబ్బరు దుస్తులు..

రబ్బరులా అనిపించే ఈ రకమైన దుస్తులను ఎంపిక చేసుకోవాలంటే దాదాపు ముదురువర్ణంలో ఉండేలా చూసుకోవాలి. పెన్సిల్ కట్ మోడల్‌లో ప్యాంటు తీసుకుంటే, అదే రంగులో టాప్ కూడా ఎంచుకోవాలి. అలాగే పొడవు, పొట్టి రకాల్లో కూడా ప్రయత్నించవచ్చు. ఇందులో ఏదైనా సరే ఒంటికి పట్టినట్లుంటేనే చక్కగా అమరుతుంది. సాయంత్రపు పార్టీలకు నప్పుతాయి.

ఆకృతంటూ లేని మెడ డిజైన్లు..

పొడవు, పొట్టి టాప్స్‌లో ఈ తరహా మెడ డిజైన్లు ఎంపిక చేసుకోవాలంటే ఎంబ్రాయిడరీ ఉండేలా చూసుకోవాలి. వీటికి ప్యాంట్లూ, జీన్స్ స్కర్టులు అయితే సహజ లుక్ వస్తుంది. పార్టీలకైతే, స్కర్టులు జాలువారేలా ఉండే వస్త్రాన్ని ఎంచుకోవాలి. అలాగే చిన్న చిన్న పార్టీలకైతే వేరే డిజైన్‌లో ఎంపిక చేసుకోవాలి. ఇంక లెహెంగాలకు అసిమెట్రికల్ నెక్‌లైన్‌తో ముదురువర్ణంలో టాప్ తీసుకోవాలి. చతురస్రాకారం మెడ అయితే లోనెక్ లేకుండా చూసుకోవాలి.



బుట్ట చేతులు..

పాత స్టైల్ అయినా కూడా ఇప్పటికీ బుట్టచేతులు ఫ్యాషన్‌లో ప్రముఖ స్థానంలో ఉన్నాయి. చుడీదార్‌పై టాప్‌లకూ, క్రేప్‌టాప్‌లకూ బుట్టచేతులు ఆకర్షణీయంగా ఉంటాయి. అలాగే ప్యాంట్లపై టాప్‌లకు కూడా బుట్టచేతులు అందంగా అమరుతాయి. షిఫాన్, నెట్, సిల్క్, పట్టుచీరలపై జాకెట్లుకు బుట్టచేతులున్నట్లైతే అదనపు ఆకర్షణను తెస్తుంది. పెళ్లిళ్లకు నప్పుతాయి. బుట్టచేతులు వేసుకుంటే భుజం వెడల్పుగా అనిపించి, లావుగా కనిపిస్తున్నామనుకునే వారు చిన్న బుట్ట వచ్చేటట్లుగా, అలాగే ఒంటికి నప్పేలా సరిగ్గా కుట్టించుకుంటే చాలు.

ముదురు ఊదాతో..

ఈ ఏటి మేటి వర్ణంగా నిలవనున్న ముదురు ఊదా ఫ్యాషన్‌కు కొత్త అందాలను అద్దనుంది. వివాహ వేడుకలకు ఊదా వర్ణం చీరకు నారింజ రంగు బ్లవుజును ఎంచుకోవాలి. అలాగే పరికిణీ, బ్లవుజును ఊదా రంగులో తీసుకుని, దానికి లేత గులాబీ రంగు ఓణీ జతచేయాలి. పొడవాటి గౌనుకు ముదురు ఊదాను ఎంచుకుంటే అద్భుతం. నలుపు జీన్స్‌పై ఈ రంగు టాప్ బాగుంటుంది. ఇక గులాబీ, ఎరుపు వర్ణాల్లో టాప్స్ తీసుకోవాలంటే, జాలువారే వస్త్రాన్ని ఎంపిక చేసుకోవాలి. చొక్కాలైతే చైనీస్ కాలర్ మోడల్‌లో ఒకవైపు చీలిక ఉండేలా చూసుకోవాలి. అలాగే పట్టులో ఈ రంగు ఆడంబరంగా కనిపిస్తుంది. పరికిణీ, బ్లవుజును షిఫాను, జార్జెట్‌లో, ఓణీని భిన్నమైన వర్ణంలో, సన్నటి జరీ అంచుండేలా చూసుకుంటే, వేడులకు బాగుంటుంది. అలాగే ధవళ వర్ణంలో చుడీదార్, పలాజో సూట్‌కు సెల్ఫ్ డిజైన్లు ఎంపిక చేయాలి. చీరలకైతే అంచులు భారీగా ఉండి, బ్లవుజులు భిన్నమైన రంగుల్లో ఎంచుకుంటే, ఏ సందర్భానికైనా బాగుంటాయి. ఆకట్టుకునేలా కనిపించొచ్చు. మిగతా రంగులకు టస్సర్, ప్యూర్ సిల్కు, మధుబని చీరలను ఎంచుకుంటే ఆ అందమే వేరు.





రచ్చింగ్ సొగసులు..

వస్త్రాన్ని ఒకచోట నుంచి మరోచోటకు తీసి ముడివేసినట్లుగా అనిపించే రచ్చింగ్ డిజైనులో ప్రత్యేకత ఉంది. ఇందులో క్రాప్‌టాప్స్ కావాలనుకుంటే, ప్యూర్‌జార్జెట్, సిల్క్, షిఫాన్‌లో సాదాగా వచ్చేవి బాగుంటాయి. లెహెంగాలపై ఇవి సరిగ్గా సరిపోతాయి. పార్టీలకైతే లెహెంగాలు సాదాగా లేదా పూల డిజైన్‌లో ఉండి, పైన టాప్ మాత్రం రచ్చింగ్ ఉండేలా చూసుకోవాలి. మోకాళ్లవరకు వచ్చే గౌను మోడల్ అయితే ఒకే రంగులో ఉండేలా ఎంచుకోవాలి. సంప్రదాయంగా అయితే పరికిణీపైనా రచ్చింగ్‌ను ఎంచుకోవచ్చు.

మ్యాజిక్‌తో చైతన్యం తెస్తున్నా...

ఆసక్తి ఉండాలే కానీ... ఆర్థిక ఇబ్బందుల్నే కాదు... కాలం విసిరే సవాళ్లనూ సులువుగా ఎదుర్కోవచ్చు. అలా ఆసక్తిగా నేర్చుకున్న ఇంద్రజాల విద్యను పదిమందికీ ఉపయోగపడేలా చేయాలనుకుంది. ఆ విద్యతో మూఢనమ్మకాలను రూపుమాపడానికీ, సామాజికంగా చేయూతనిస్తోంది. ఆమే జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మాకుల రజిత.



ఒడుదొడుకులు లేని జీవితమే ఉండదేమో! కష్టాలొచ్చినప్పుడు కుంగిపోయి, సంతోషం వచ్చినప్పుడు పొంగిపోతే...కూడా మన ఎదుగుదల అక్కడే ఆగిపోతుందనేది నా భావన. దానికి నా జీవితమే ఉదాహరణ. ఇంద్రజాల ప్రదర్శనలు అంటేనే పీసీ సర్కార్, జాదూగర్ ఆనంద్, కె.లాల్ వంటి ఇంద్రజాలకులు గుర్తుకువస్తారు. పురుషాధిక్యత ఉండే ఈ రంగంలో నేను నిలదొక్కుకోవడం అంతా కలగా జరిగిపోయింది. మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్. మా అమ్మానాన్న సమ్మయ్య, సారమ్మ ఇద్దరూ వ్యవసాయ కూలీలే. రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితి. చిన్నప్పటి నుంచీ నాకు ఆటలంటే ఇష్టం. బాక్సింగ్ నేర్చుకున్నా. ఓ సారి మా స్కూల్లో ఓ మెజీషియన్ ప్రదర్శన ఇచ్చారు. దాన్ని చూసి నాకూ నేర్చుకోవాలని అనిపించింది. ఇంట్లో చెబితే తలకు మించిన భారం అన్నారు అమ్మానాన్న. కానీ పట్టు వదిలితేగా.. ఎలాగోలా ఒప్పించి శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. కొందరు ఇది తెలిసి 'ఈమెకు ఇది అవసరమా' అన్నారు. 'మ్యాజిక్ అమ్మాయిలకు కాదు. రాణించలేవు' అన్నారు ఇంకొందరు. నేను అవేవీ పట్టించుకోలేదు.

తెలంగాణ నుంచి నేనొక్కదాన్నే... నా లక్ష్యం స్థిరంగా ఉంది కాబట్టే నేను ముందడుగు వేయగలిగా. నెమ్మదిగా శిక్షణలో మెలకువలు తెలుసుకున్నా. గ్రామ స్థాయితో మొదలుపెట్టి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రదర్శనలు ఇచ్చా. దాంతో ఇంద్రజాలంలో రాణించలేవు అన్నవారే తరువాతి క్రమంలో ఔరా అనడం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చి, పోటీల్లోనూ పాల్గొన్నా. అవార్డులు కూడా వచ్చాయి. రెండేళ్లక్రితం బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో జనరల్ విభాగంలో ప్రత్యేక అవార్డు వచ్చింది. కిందటేడాది ఆగస్టులో ఇండియన్ బ్రదర్ హుడ్ ఆఫ్ మ్యాజిక్ (ఐబిఎం) అనే సంస్థ దిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మ్యాజిక్ పోటీల్లో పాల్గొని బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు తెచ్చుకున్నా.



ఇందులో భాగంగా ఇదే వేదికపై దేశంలో ఉన్న 250 మెజీషియన్లు ఒక్కచోటకు చేరాం. ఒకే ప్రదర్శనను ఒకేసారి ఒకేవిధంగా ఒక్కనిమిషంలో చేశాం. గిన్నిస్ రికార్డు సాధించాం. ఆ బృందంలో మహిళా మెజిషియన్‌గా తెలంగాణ రాష్ట్రం నుంచి నేను ఒక్కదాన్నే పాల్గొన్నా. ఇంద్రజాలంలో చాలా రకాల ఉన్నా ఇల్ల్యూజన్ ప్రదర్శనలు 106 ఇచ్చా. వ్యక్తుల్ని మాయం చేసి మళ్లీ సృష్టించడం, గాల్లో పడుకోబెట్టడం, తలా, మొండెం వేరుచేసి కలపడం.. నా ప్రత్యేకత. నాకు వచ్చిన ఈ విద్యతో జిల్లాల్లో మూఢనమ్మకాలపై చైతన్యం తీసుకొస్తున్నా. ఐదుగురు వృద్ధులను దత్తత తీసుకుని వారికి ప్రతినెలా రెండువందల రూపాయల్ని ఫించనుగా అందిస్తున్నా. ప్రతి ప్రదర్శన నుంచీ రూ. 2 వేల రూపాయల్ని విరాళంగా సేవ కార్యక్రమాలకు కేటాయిస్తున్నా. ఇద్దరు అనాథపిల్లలకు ముప్పైవేల రూపాయల చొప్పున ఇచ్చా. ఆసక్తి ఉన్న మహిళలకు ఉచితంగానూ నేర్పిస్తున్నా.

– సోగాల స్వామి, ఈనాడు డిజిటల్, జయశంకర్‌భూపాలపల్లి

నజరానా



చలికాలంలో చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపించాలంటే.. రెండు పెద్ద చెంచాల టొమాటోరసంలో కొద్దిగా సెనగపిండి వేసి ముఖానికి రాసుకోవాలి. బాగా ఆరాక కడిగేయాలి. ఇలా వారంలో రెండుసార్లు చేస్తే జిడ్డు సమస్య వదులుతుంది.

బంగారం-వెండి

Iన ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,390	-------	-------	30,450
ఆర్నమెంట్	28,400	-------	-------	28,300
వెండి (కిలో)	39,870	-------	-------	40,300
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,450	30,450	30,020	30,150
ఆర్నమెంట్	28,200	28,200	28,070	28,200
వెండి (కిలో)	40,100	40,100	39,100	39,400
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,220	30,320	-------	-------
ఆర్నమెంట్	28,100	28,200	2,807	2,820 గ్రా
వెండి (కిలో)	39,900	39,500	41.60	42.00 గ్రా



ఆత్మవిశ్వాసమే విజయ సూత్రం!

విజయానికి ఒక ప్రధానమైన సూత్రం ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసం పెరగాలంటే ఒకే ఒక మంత్రం సన్నద్ధత. అందుకే సరైన సన్నద్ధత ఉంటే విజయ సాధన కష్టం కాదు.

– ఆర్థర్ యాష్, ప్రసిద్ధ అమెరికన్ టెన్నిస్ ఆటగాడు, మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత

మా చిరునామా:
చదువు
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
■ edc@eenadu.net

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

లోక్‌నాయక్ హాస్పిటల్, న్యూదిల్లీ
పోస్టు: జూనియర్ రెసిడెంట్
ఖాళీలు: 201 అర్హత: ఎంబీబీఎస్
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
చివరితేది: 13. 01. 2018
వెబ్‌సైట్: http://delhi.gov.in/

జేఎన్‌యూ, న్యూదిల్లీ
పోస్టు: ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్
ఖాళీలు: 90 అర్హత: యూజీసీ నిబంధనల ప్రకారం
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ చివరితేది: 29. 01. 2018
వెబ్‌సైట్: https://www.jnu.ac.in/

ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రిసెర్చ్
పోస్టు: సైంటిఫిక్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ తదితర పోస్టులు
ఖాళీలు: 13 అర్హత: ఎంబీబీఎస్/ ఎంఎస్/ ఎండీ/ బీఈ/ బీటెక్.
ఎంపిక: నిబంధనల ప్రకారం
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ చివరితేది: 31. 01. 2018
వెబ్‌సైట్: http://www.igcar.gov.in/

ఫెలోషిప్స్ అండ్ స్కాలర్‌షిప్స్

కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్
ఖాళీలు: 650
స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ. 3,600 + ట్యూషన్ ఫీజుల కింద రూ. 9,000 అర్హత: 10 - 14 ఏళ్ల విద్యార్థులు.
విభాగాలు: మ్యూజిక్, డాన్స్, డ్రామా, పెయింటింగ్, స్కల్పచర్, క్రాఫ్ట్స్, లిటరరీ ఆర్ట్స్
దరఖాస్తు: ఆఫ్‌లైన్ చివరితేది: 31. 01. 2018
వెబ్‌సైట్: http://www.ccrtindia.gov.in/

డీఆర్‌డీవో - సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్
జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్
ఖాళీలు: 15
ఫెలోషిప్: రూ. 25,000
విభాగాలు: ఏరోడైనమిక్స్, స్ట్రక్చరల్ డిజైన్ అనాలిసిస్ తదితర విభాగాలు.
అర్హత: బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ నెట్/ గేట్.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
చివరితేది: 20. 01. 2018
వెబ్‌సైట్: https://www.drdo.gov.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

నేరుగా... నేర్పుగా!

వివిధ దశల్లో సుదీర్ఘంగా సాగే ఉద్యోగ నియామకాలకు భిన్నంగా స్వల్ప వ్యవధిలోనే తగిన అభ్యర్థులను ఎంచుకునే విధానం- వాక్ ఇన్స్. పెద్ద సంస్థలు కూడా తమ అవసరాలకు అనుగుణంగా ఇప్పుడీ విధానం వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ తరహా నియామకాల స్వభావం గ్రహించి వాటిలో మెరుగైన ప్రతిభను ప్రదర్శించి నెగ్గటం అభ్యర్థులకు సవాలే!



ముందస్తు అపాయింట్‌మెంట్ ఏదీ లేకుండా నేరుగా ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే వెసులుబాటును ఇస్తాయి, వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు. ముందుగా ప్రకటించిన తేదీ, సమయాల్లో సంస్థ ప్రతినిధులతో అభ్యర్థుల ముఖాముఖీ జరుగుతుంది.

ఈ తరహా ఇంటర్వ్యూలను చేపట్టడానికి చాలా కారణాలున్నాయి.

❒ ఒక సంస్థ వ్యాపారాభివృద్ధిలో భాగంగా ప్రాజెక్టుల కోసం చేసిన ప్రయత్నం ఫలించి ప్రాజెక్టు వచ్చినపుడు తక్కువ సమయంలో దాన్ని పూర్తిచేయడానికి కావాల్సిన మానవ వనరులను సమకూర్చుకోవాల్సి వస్తుంది.

❒ కొన్ని ప్రముఖ సంస్థలకు అవసరమైన ఉద్యోగ స్థానాలకు మామూలు ఎంపిక ప్రక్రియ ద్వారా అభ్యర్థులు దొరకృపోవచ్చు. అప్పుడు వారు అలాంటి అన్ని స్థానాలకూ ఒకేసారి వాక్‌ఇన్ నిర్వహిస్తుంటారు. దీనిద్వారా నిర్ణీత సమయం దాటిపోకముందే ఆ స్థానాలను నింపడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

❒ నియామకాలకు జరిగే వ్యయం కూడా కంపెనీలకు తగ్గుతుంది.

వివిధ విధానాలు

❒ ఒక సంస్థ అభ్యర్థులను తమ ప్రాంగణానికే నియామక ప్రక్రియ నిమిత్తం ఆహ్వానించవచ్చు.

❒ ఒకటికన్నా ఎక్కువ సంస్థలు ఒక ఉమ్మడి వేదికను ఎంపిక చేసుకుని, జాబ్ ఫేర్ ద్వారా అభ్యర్థులను వాక్‌ఇన్‌కు ఆహ్వానిస్తాయి.

❒ సంస్థ/ సంస్థలు నిర్వహించే పోటీల్లో పాల్గొన్నవారిలో ఉత్తమ అభ్యర్థులకూ వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇలాంటి ఇవెంట్స్‌లో ఉత్తమ ప్రతిభావంతులు ఎంపికవుతారని సంస్థల అభిప్రాయం.

మామూలు ఇంటర్వ్యూల కంటే వాక్‌ఇన్ ఇంటర్వ్యూల్లో పోటీ ఎక్కువ. ఉద్యోగ అవసరం ఉండి, అర్హత ఉన్న ఏ అభ్యర్థి అయినా పాల్గొనే వీలుండటమే ఇందుకు కారణం. పైగా ఇది ఒక కళాశాలకో, ప్రాంతానికో పరిమితం కాదు. దీంతో ఈ వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు హాజరైనప్పుడు చాలాసార్లు సంస్థలు మొదటి స్థాయిలోనే షార్ట్‌లిస్ట్ చేసి, చివరి రౌండ్‌కు తరువాత పిలుస్తారు.



వెంకట్ కాంచనపల్లి
సీఈఓ, సన్‌టెక్ కార్ప్

తక్కువ సమయంలో మెప్పించాలి

ప్రాంగణ నియామకాలైనా, సాధారణ రిక్రూట్‌మెంట్ అయినా ఎంపిక కోసం నిర్దేశించిన ఒక సమయం ఉంటుంది. కానీ వాక్‌ఇన్‌ల్లో పోటీ ఎక్కువ కాబట్టి, లభించేది తక్కువ సమయమే. అందుకని వీటికి ప్రత్యేకంగా సన్నద్ధమవ్వాలి.

❒ రెజ్యూమే చాలా ముఖ్యం. మొదటగా సంస్థ చూసేది దీన్నే. దాన్ని పక్కాగా తయారు చేసుకోవాలి. సంస్థ అవసరాలకు అనుగుణమైన సమాచారాన్ని రెజ్యూమేలో పొందుపరచుకోవాలి. అది నిర్దిష్టంగా, సూటిగా ఉంటే చాలా మంచిది. సంస్థ అడుగుతున్న అర్హతలు, నైపుణ్యాలు, ఇంటర్న్‌షిప్‌లు, అనుభవం మొదలైనవాటిని వరుసలో పొందుపరచాలి. మొత్తంగా రెజ్యూమేని చూడగానే ప్రొఫైల్ కళ్లముందు కదిలేలా ఉండాలి.

❒ వాక్‌ఇన్ ఇంటర్వ్యూ అన్నంత మాత్రాన సంస్థలు నేరుగా ఇంటర్వ్యూకు పిలవకపోవచ్చు. రాత పరీక్షలు, గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహించి, ఆ తరువాత ఇంటర్వ్యూకు పిలవొచ్చు. అందుకు ఆప్టిట్యూడ్, వెర్బల్, కమ్యూనికేషన్‌ల మీద పట్టు ఏర్పరచుకుని సిద్ధంగా ఉండాలి.

❒ మొత్తం మీద ప్రధానమైంది- ఇంటర్వ్యూ. ఇక్కడ చాలా అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి. పోటీ ఎక్కువ ఉండటం వల్ల ఫస్ట్ ఇంప్రెషన్ చాలా ముఖ్యం. అభ్యర్థి కనపడే తీరు సరిగా లేకపోతే టీవీలో చానెల్‌ను మార్చినంత సులువుగా తరువాతి అభ్యర్థిని పిలుస్తారు. ఈ 'విజిబిలిటీ'... రూపమో, అందమో కాదు. ఆహ్లాదకరమైన ముఖకవళికలు, ఆత్మీయమైన పలకరింపు, మర్యాదపూర్వకమైన శరీర భాష.. ఇవన్నీ! ఆ తరువాత ఇంటరాక్షన్. ఇది అర్థవంతంగా, బలంగా, ఆశావహంగా ఉండాలి. మొత్తంగా ఇంటర్వ్యూ చేసే వ్యక్తికి ఎదుట ఉన్నది ఆత్మవిశ్వాసమున్న అభ్యర్థి అనిపించాలి.

ఈ లక్షణాలు అభ్యర్థిని నైపుణ్యాల మదింపు కోసం తరువాతి అంచెకు పంపడానికి పునాది. ఇక కంపెనీ ఆశిస్తున్న నైపుణ్యాలను ఒక్కోటీ వివరించగలగాలి. ఇక్కడ గుర్తుంచుకోవల్సిన విషయం ఏమిటంటే.. రెజ్యూమేలో ఉన్నది ఉన్నట్టుగా కాకుండా అభ్యర్థి ఇంకా అదనంగా వివరించగలగాలి. ఉదాహరణకు- విద్యా సంబంధ విషయాలన్నీ రెజ్యూమేలో రాస్తారు. కానీ దానిలో అభ్యర్థి ప్రత్యేకతను వెల్లడించేవాటిని మాత్రమే ప్రస్తావించాలి. అంటే.. తాను కళాశాల్లో ప్రథమ ర్యాంకు సాధించినట్లో.. లేదా మరొకటో. అలాగే నైపుణ్యాలు, పాల్గొన్నవి, సాధించిన విజయాలు, ఇంటర్న్‌షిప్‌లు, అనుభవంలోని ప్రత్యేకతలను ప్రస్తావించవచ్చు.

ఏ విధంగా ఉపయోగకరం?

❒ జాబ్ ఫేర్‌ల ద్వారా వాక్‌ఇన్‌లు నిర్వహించినపుడు ఒకే వేదిక మీద ఒకేసారి వివిధ సంస్థల ఉద్యోగ ఎంపికల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది. అప్పుడు అభ్యర్థులకు తగిన సంస్థ కానీ, జాబ్ ప్రొఫైల్ కానీ ఫలానా అని నిర్ధారణకు వచ్చి దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. ఎందుకంటే జాబ్ ఫేర్‌ల ద్వారా నిర్వహించే వాక్‌ఇన్‌ల కన్నా ముందు చాలా సంస్థలు అక్కడికొచ్చినవారికి ప్రీ ప్లేస్‌మెంట్ టాక్‌ను నిర్వహిస్తాయి. అవి సంస్థ గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థుల ప్రశ్నలకు సమాధానాలు కూడా ఇస్తారు.

❒ వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు అర్హత ఉన్నవారెవరైనా పాల్గొనవచ్చు. కాబట్టి ఉద్యోగార్థులు ఇలాంటి ఓపెన్ కాంపిటిషన్‌ల ద్వారా మంచి స్థానాలకు ఎంపికయ్యే అవకాశముంటుంది.



చేయకూడనివి

- రెజ్యూమేను సంస్థకు అవసరంలేని సమాచారంతో నింపకూడదు.
- కాజువల్ దుస్తుల్లో వెళ్లకూడదు.
- ఇంటరాక్షన్ సమయంలో మాట్లాడే అంశంపైనే దృష్టి ఉండాలి. ఎలా మాట్లాడుతున్నాననే ఆలోచన రానీయకూడదు.
- ఇంటర్వ్యూయర్ అడిగిన సమాచారం తెలియకపోయినా, అర్థం కాకపోయినా తెలిసినట్టు మాట్లాడి ఆకట్టుకోవాలనే ప్రయత్నం చేయకూడదు.
- ఇంటర్వ్యూలో అభ్యర్థి ప్రవర్తన అనాసక్తిగానో, నిర్లక్ష్యం ప్రదర్శితమయ్యేలానో ఉండకూడదు.
- ఇంటర్వ్యూ చేసేవారు మాట్లాడటం పూర్తవకముందే జోక్యం చేసుకోవడం, మొండిగా వాదనకు దిగడం లాంటివి చేయకూడదు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ తనకు ఉద్యోగం అత్యవసరమనే భావనను వ్యక్తపరచకూడదు.
- చివర్లో 'ఏమైనా అడుగుతారా?' అన్నప్పుడు అత్యుత్సాహంతో అర్థంలేని ప్రశ్నలను వేయకూడదు.

చేయాల్సినవి

- రెజ్యూమేను క్లుప్తంగా.. ఒకటి- రెండు పేజీల్లో తయారు చేసుకోవాలి.
- డ్రెస్ కోడ్ తప్పనిసరి. ఫార్మల్స్ ముఖ్యం.
- ఎవరితో మాట్లాడినా ఆత్మవిశ్వాసం ప్రదర్శించాలి. ముఖ్యంగా మాట్లాడే అంశంపై స్పష్టతతో ఉండాలి.
- ఇంటర్వ్యూకు ముందు ఆ సంస్థ గురించిన సమాచారాన్ని సేకరించాలి.
- కనీసం ఒక అర్ధగంట ముందైనా ప్రాంగణానికి చేరుకోవాలి.
- ఇంటర్వ్యూకు కావాల్సిన డాక్యుమెంట్లు అన్నింటినీ ఒక ఫోల్డర్‌లో క్రమ పద్ధతిలో అమర్చుకుని వెంట తీసుకెళ్లాలి.
- ప్రాంగణంలోకి వెళ్లినప్పటి నుంచి అయిపోయేంతవరకూ అవసరమైనపుడు మౌనంగా, సరైన నడవడికతో ఉండాలి.
- ఎదుటివారు చెప్పేది ఆసక్తిగా ఆలకించే తీరును కనబర్చాలి.



ఈ సైన్స్ కోర్సుల్లో శాస్త్రవేత్తలే అధ్యాపకులు!

మౌలిక సైన్స్ కోర్సులను ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో అభ్యసించటానికి వీలు కల్పించే ప్రవేశపరీక్ష... నెస్ట్. దీనిలో నెగ్గి, ఐదేళ్ళ ఇంటిగ్రేటెడ్ కోర్సు పూర్తిచేస్తే విద్యార్థుల భవిత ఉజ్వలంగా ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యమున్న ఈ జాతీయ స్థాయి నెస్ట్‌కు సమగ్రంగా ఎలా సిద్ధం కావాలో తెలుసుకుందాం!

నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్)లో అర్హత సాధించినవారికి ప్రతిష్ఠాత్మకమైన నైసర్ (NISER) భువనేశ్వర్, ముంబయి యూనివర్సిటీ- ఎటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్‌సైన్స్ ముంబయి సంస్థల్లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో సీటు లభిస్తుంది. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్ మొదలైన సబ్జెక్టుల్లో పీజీని ఇక్కడ సెమిస్టర్ విధానంలో అందిస్తున్నారు.



ఎస్. కిరణ్‌కుమార్
డైరెక్టర్, కెమ్‌బయోసిస్ కోచింగ్ సెంటర్

ఈ విద్యాసంస్థల్లో అత్యాధునిక రిసెర్చ్ ల్యాబ్స్, కంప్యుటేషనల్ సౌకర్యాలున్నాయి. ప్రముఖ శాస్త్రవేత్తలు బోధించటం ఇక్కడి విశేషం. ఈ పీజీలో అర్హత సాధించిన విద్యార్థులు ప్రభుత్వం అందించే నెలకు 5000 రూ॥ల ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌లకూ, ఏడాదికి 20వేల రూపాయిల సమ్మర్ ప్రాజెక్టుకూ అర్హులు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అధిక వేతనాలతో కూడిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వస్తాయి. ఇంకా బాబా ఎటామిక్ రిసెర్చ్ సెంటర్లో అడ్మిషన్ ఇంటర్వ్యూకు నేరుగా అర్హత లభిస్తుంది.



➤➤ దరఖాస్తు చేసేదెలా?

ఈ ప్రవేశ పరీక్షకు ఇంటర్‌మీడియట్/ 10+2ను 2016/ 2017లో పూర్తి చేసిన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ విద్యార్థులూ, 2018 పరీక్షలు రాస్తున్న ఇదే గ్రూపుల విద్యార్థులూ అర్హులు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

నైసర్‌లోని 202 సీట్లలో జనరల్ కేటగిరిలో 101 సీట్లున్నాయి. సీబీఎస్‌లోని 47 సీట్లలో జనరల్ సీట్లు 23.

నెస్ట్ దరఖాస్తు ముగింపు: మార్చి 5, 2018

పరీక్ష తేదీ: జూన్ 2, 2018

➤➤ స్థాయి ఎక్కువే

ప్రవేశ పరీక్షల స్థాయి గణనీయంగా ఉంటుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్థాయిలో ప్రశ్నలుంటాయి. ఇవి విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉంటాయి.

తెలుగు అకాడమీ, సి. బి. ఎస్. ఇ. ఎన్. సి. ఇ. ఆర్. టి. పుస్తకాలను చదివి, బేసిక్ కాన్సెప్టులు నేర్చుకోవాలి. ఆపై టాపిక్ వారీ రిఫరెన్స్ పుస్తకాల ద్వారా సబ్జెక్టును చదవాలి.

బయాలజీ విభాగంలో జనరల్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, బయోటెక్నాలజీ, యానిమల్ ఫిజియాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, డీఎన్‌ఏ ధర్మాలు, ఆర్. డి. ఎన్. ఎ. టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్స్‌క్రిప్షన్ మొదలైనవాటి నుంచి అధిక ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి వీటిపై దృష్టి కేంద్రీకరించాలి.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నెమెడ్ రియాక్షన్స్, ఎరోమ్యాటిసిటి, కార్బోహైడ్రేట్స్, అమైనో యాసిడ్స్, పాలిమర్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, సాలిడ్‌స్టేట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలను సమగ్రంగా చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎస్, పి బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్ బ్లాక్ మూలకాలు, మెటలర్జీ మొదలైనవి ముఖ్యం.

ఫిజిక్స్ విభాగంలో జనరల్ ఫిజిక్స్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజమ్, మెకానిక్స్ సంబంధిత సిలబస్‌ను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.

మ్యాథమేటిక్స్‌లో కాల్‌క్యులస్, ట్రిగొనామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, ఆల్‌జీబ్రా, వెక్టర్స్ సంబంధిత సిలబస్‌ను సాధన చేయాలి. బట్టీ ధోరణిలో కాకుండా సబ్జెక్టును అవగాహన చేసుకొని విభిన్న అంశాలను అన్వయించగలిగితే నెస్ట్‌లో విజయం సాధ్యపడుతుంది. గత ప్రశ్నపత్రాలను www.nestexam.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

పరీక్ష విధానం

ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే నెస్ట్ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఆంగ్లంలోనే ఇస్తారు. 5 సెక్షన్లలో ప్రతి సెక్షనుకూ దాదాపు 50 మార్కుల వెయిటేజ్ ఉంటుంది.

సెక్షన్ –1: అన్ని గ్రూపులవారూ తప్పనిసరిగా రాయవలసిన విభాగమిది. దీనిలోని ప్రశ్నలకు నెగిటివ్ మార్కులుండవు.

సెక్షన్ –2 నుంచి సెక్షన్ –5: బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నల సెక్షన్లుంటాయి. విద్యార్థులు ఈ అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయవచ్చు. కానీ సరిగ్గా సమాధానం రాసిన 3 సెక్షన్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఇంకా ఈ విభాగాల్లోని ప్రశ్నలకు నెగిటివ్ మార్కులుంటాయి.

ఈ ప్రవేశపరీక్ష రాయడానికి దాదాపుగా 3 గంటలు సమయం కేటాయిస్తారు.

లైబ్రరీ

నీట్ సమాచారం



1) క్రాష్ కోర్స్ ఇన్ బయాలజీ ఫర్ నీట్, రూ. 450
2) క్రాష్ కోర్స్ ఇన్ ఫిజిక్స్ ఫర్ నీట్, రూ. 475
3) క్రాష్ కోర్స్ ఇన్ కెమిస్ట్రీ ఫర్ నీట్, ధర: రూ. 475
4) ప్రాక్టీస్ నీట్ బయాలజీ, ధర: రూ. 250
5) ప్రాక్టీస్ నీట్ ఫిజిక్స్, ధర: రూ. 295
6) ప్రాక్టీస్ నీట్ కెమిస్ట్రీ, ధర: రూ. 250

ప్రచురణ: సెంగేజ్ లెర్నింగ్



ఆంగ్ల మాధ్యమంలో!

1) టీఎస్‌పీఎస్సీ జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ (రెండు పుస్తకాలు), పేజీలు: 608+640, ధర: రూ. 699,

ప్రచురణ: విజేతకాంపిటీషన్స్

ప్రభుత్వ పథకాలు



తెలంగాణ మరియు కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలు
పేజీలు: 128
ధర: రూ. 60
ప్రచురణ: విజ్‌డమ్ పబ్లికేషన్స్

భారీ రుసుముల కోత ఉండదు

- ఇప్పటివరకూ వసూలు చేసిన అధిక ఫీజులు తగ్గవు
- ఇక నుంచి పెంచడంపైనే నియంత్రణ
- తిరుపతిరావు కమిటీ సిఫారసులు చెబుతున్నదిదే

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల.. ఇప్పటివరకూ ఏటా 15 శాతం నుంచి 20 శాతం వరకూ రుసుములు పెంచి తల్లిదండ్రులను పీల్చి పిప్పిచేసింది. ప్రస్తుతం అక్కడ వార్షిక రుసుం ఎల్‌కేజీకి రూ.60 వేలు ఉంటే పదో తరగతి విద్యార్థికి రూ.2 లక్షలకు పైగా వసూలు చేస్తోంది. తాజాగా ఆచార్య తిరుపతిరావు కమిటీ సిఫారసుల నేపథ్యంలో తగ్గుతుందా అంటే లేదనే చెప్పాలి. ఇప్పుడున్న భారీ రుసుములైతే తగ్గవని స్పష్టమవుతోంది. ఆచార్య తిరుపతిరావు కమిటీ కేవలం ఇప్పుడున్న రుసుములను ఎంతవరకూ పెంచుకోవచ్చు ఏం చేయాలన్నది చెబుతోంది. ఇప్పటికే హైదరాబాద్, వరంగల్ తదితర నగరాల్లో పలు పాఠశాలలు ఇష్టారాజ్యంగా రుసుములు వసూలు చేస్తున్నాయి. కొన్ని పాఠశాలలు ముందుగా తిరుపతిరావు కమిటీని దృష్టిలో పెట్టుకొని రుసుములు భారీగా పెంచాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం(2017-18)లో వసూలు చేసిన రుసుములపై వచ్చే ఏడాదికి 10 శాతం వరకు పెంచుకోవచ్చని, అందుకు ఎవరి అనుమతులు అవసరం లేదని కమిటీ స్పష్టం చేసింది. అంతకంటే పెంచాలంటే జోనల్ రుసుముల నియంత్రణ కమిటీ(జడ్‌ఎఫ్‌ఆర్‌సీ)కి ఆదాయ, వ్యయాలపై ఆడిట్ నివేదిక ఇవ్వాలని కమిటీ చెబుతోంది. హైదరాబాద్‌లోని కొన్ని పాఠశాలలు ఎనిమిదేళ్లలోనే 400 శాతం పెంచిన పరిస్థితిని హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్‌ఎస్‌పీఏ) ప్రతినిధులు ఇక్కడ ప్రస్తావిస్తున్నారు.



నగరంలో ఏటా రూ.3 లక్షల ఫీజు వసూలు చేస్తున్న పాఠశాలలూ ఉన్నాయి.

దొరికినపుడు సంగతి

ప్రతి పాఠశాల ఆదాయ వ్యయాలు చార్టెర్డ్ అకౌంటెంట్(సీఏ)చే ధ్రువీకరించి ఏటా పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌కు వివరాలు సమర్పించాలి. లేకుంటే 10 శాతం కూడా పెంచుకోవడానికి వీల్లేదు. ఒకవేళ సమర్పించినా.. వసూలు చేసిన వాటిని పాఠశాల అవసరాలకే ఖర్చు చేయకుండా లాభాలను వెనకేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించినా.. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం విచారణ చేయిస్తుందని కమిటీ ఛైర్మన్ తిరుపతిరావు చెబుతున్నారు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి భారీగా రుసుములు వసూలు చేస్తున్నాయని విద్యాశాఖ తనిఖీల్లో దొరికినా చర్యలు లేకపోవడాన్ని చూస్తున్నామని తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రైవేట్ విద్యార్థులు సగం ఇక్కడే

రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారు. వారిలో 48శాతం మంది(14.80 లక్షలు) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనేఉండటం విశేషం. 2016-17 లెక్కల ప్రకారం హైదరాబాద్ జిల్లాలో 6.69 లక్షలు, మేడ్చల్‌లో 4.26 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 3.85 లక్షలు మంది ప్రైవేట్ బడుల్లో చదువుతున్నారు.

పది నుంచే నైపుణ్యాభివృద్ధి

- వసతిగృహ విద్యార్థులకు శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఎస్సీ సంక్షేమశాఖ ప్రత్యేక పథకాన్ని అమలు చేయనుంది. వార్షిక పరీక్షలు ముగిసిన వెంటనే వారందరికీ ప్రత్యేక శిక్షణ ద్వారా సాంకేతిక వృత్తివిద్య నేర్పించాలని భావిస్తోంది. వారికి పాలిటెక్నిక్‌లో ప్రవేశం కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద 2018 మార్చిలో జిల్లాకు కనిష్ఠంగా 100 మంది విద్యార్థుల చొప్పున 3,100 నుంచి 3,500 మందిని ఎంపిక చేసి నిపుణులతో శిక్షణ ఇప్పించనుంది. ఏటా పదివేల మంది విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరిని పాలిటెక్నిక్ కోర్సుల్లో చేర్పిస్తే స్వయం ఉపాధి సాధించవచ్చు. ప్రతిభ చూపిస్తే ఇంజినీరింగ్ పూర్తిచేసి జీవితంలో స్థిరపడేందుకు వీలవుతుందని ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ పి.కరుణాకర్ తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, గైడ్‌లతో పాటు ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. వీరికి నాణ్యమైన భోజన, బస ఏర్పాట్లు వసతి గృహాల్లోనే ఉంటాయి. ప్రవేశ పరీక్ష పూర్తయిన తరువాతే విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. ఇందుకోసం రూ.కోటి వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని కమిషనర్ వెల్లడించారు.

పీఎఫ్ జమ చేయని ఆర్టీసీ

- 16 నెలలుగా రూ.400 కోట్లు బాకీ
- సమన్లు పంపిన భవిష్యనిధి అధికారులు

ఈనాడు, హైదరాబాద్: కార్మికుల భవిష్యనిధి ఖాతాల్లో జమ చేయాల్సిన సొమ్మును ఆర్టీసీ తన ఖజానాలో వేసుకుంది. 16 నెలల సొమ్ము రూ.400.67 కోట్లను సంస్థ అవసరాలకు వినియోగించుకుంది. పీఎఫ్ అధికారులు సమన్లు జారీ చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. తెలంగాణలోని సుమారు 54 వేల మంది ఆర్టీసీ కార్మికుల నుంచి ఆర్టీసీ ప్రతి నెలా పీఎఫ్ వసూలు చేస్తుంది. దీనికి మరో అంత మొత్తాన్ని యాజమాన్యం కలపాలి. యాజమాన్య వాటాలో 8.33 శాతాన్ని కార్మికుల పింఛను పథకానికి చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును కార్మికుల వాటాకు కలిపి పీఎఫ్‌కు జమ చేయాలి. ఈ మొత్తాన్ని ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి దానిలో జమ చేసే వెసులుబాటును పీఎఫ్ శాఖ ఆర్టీసీకి ఇచ్చింది. అయితే పింఛను పథకం సొమ్మును చెల్లిస్తున్నా.. మిగిలిన మొత్తాన్ని ట్రస్ట్ ఖాతాల్లో జమ చేయకుండా సంస్థ అవసరాల కోసం వాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీకల్లోతు అప్పుల్లో ఉన్నప్పుడు మొదలైన ఈ పద్ధతి ఇటీవల కాలంలో ఆర్థికంగా ఆర్టీసీ కుదుటపడుతున్నా కొనసాగుతుండడం గమనార్హం. ట్రస్ట్‌లో సొమ్ము జమ కావటం లేదని గుర్తించిన పీఎఫ్ అధికారులు లేఖలు రాసినా ఆర్టీసీ పట్టనట్లుగానే వ్యవహరిస్తోంది.

సమన్లతో హడావుడి: 2016 సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు జమ చేయాల్సిన రూ.400.67 కోట్లు ట్రస్ట్ ఖాతాలో జమ కాలేదని గుర్తించిన పీఎఫ్ శాఖ ఆర్టీసీకి సమన్లు జారీ చేసింది. కార్మికుల హాజరుపట్టీ, నగదు పుస్తకాలతో వ్యక్తిగతంగా హాజరుకావాలని పేర్కొంది. 16 నెలలుగా పీఎఫ్ చెల్లించకపోవటం ఆర్టీసీ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు విమర్శించారు.





తూర్పుపాలెంలో లీకవుతున్న గ్యాస్ ● గ్యాస్ లీకైన చోట పడిన గుంత

తూర్పుపాలెంలో ఎగసిపడ్డ సహజవాయువు

మలికిపురం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలోని ఓఎన్జీసీ వెస్ట్ స్ట్రక్చర్ పరిధిలోని తూర్పుపాలెం దిండపేటలో సహజ వాయువు (గ్యాస్) పైపులైనుకు సోమవారం లీకేజీ ఏర్పడింది. తీవ్రమైన ఒత్తిడితో సుమారు 20 మీటర్ల ఎత్తు వరకు సహజవాయువు ఎగసిపడింది. ఈ ప్రాంతమంతా పొగమంచులా సహజవాయువు అలుముకోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి పరుగులు తీశారు. లీకేజీ జరిగిన చోట సుమారు 5 అడుగుల లోతు, 3మీటర్ల వెడల్పుతో పెద్ద గుంత ఏర్పడి భూగర్భంలోని పైపులు బయట పడ్డాయి. సహజవాయువు లీకేజీ సమాచారాన్ని స్థానిక యువకులు గొల్లపాలెం జీజీఎస్(గ్రూపు గేదరింగ్ స్టేషన్) సిబ్బందికి తెలియజేయడంతో వారు స్పందించి తమ పరిధిలోని 17 బావులకు సంబంధించిన సరఫరాను నిలిపివేశారు. ఏ బావికి సంబంధించిన పైపు నుంచి సహజవాయువు లీకవుతుందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా ఒక్కో బావికి సంబంధించిన వాల్వ్‌లను విప్పి తనిఖీ చేశారు. 17వ బావికి సంబంధించిన పైపులైను ధ్వంసమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతలపై కేంద్రమంత్రి వివాదాస్పద వ్యాఖ్య

శివపురి: కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చేసిన వ్యాఖ్య వివాదాస్పదమయింది. మధ్యప్రదేశ్‌లోని కొలరాస్‌లో జరిగిన భాజపా కార్యకర్తల సమావేశంలో ఆయన ఉపయోగించిన హిందీ ముతక సామెత విమర్శలకు దారితీసింది. ''ప్రధానమంత్రికి, కాంగ్రెస్ నాయకులకు మధ్య చాలా తేడా ఉంది. అది గడ్డం వద్ద ఉన్న వెంట్రుకలకు-తోక వద్ద ఉన్న వెంట్రుకలకు ఎంత తేడా ఉంటుందో.. అంత ఉంది'' అని వ్యాఖ్యానించారు. అయితే తాను ఏ నాయకున్ని ఉద్దేశించి చేయలేదని, ప్రధానికి, కాంగ్రెస్ నాయకులకు మధ్య ఉన్న తేడాను మాత్రమే చెప్పానని అన్నారు.

వైద్యవిద్య క్రీడా సీట్లలో మాయ!

- తప్పుడు వివరాలతో కేటాయింపు
- భారీగా చేతులు మారిన డబ్బు
- శాట్స్ అధికారుల లీలలు

ఈనాడు, హైదరాబాద్: వైద్యవిద్య క్రీడా కోటా సీట్ల భర్తీలో తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) అధికారుల లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అర్హులైన క్రీడాకారుల్ని పక్కనపెట్టి, అనర్హులకు సీట్లు కట్టబెట్టిన శాట్స్ అధికారుల బాగోతంలో మరో కోణమిది! అర్హత లేకపోయినా, తప్పుడు వివరాలతో ఓ క్రీడాకారిణికి వైద్యవిద్య సీటును కట్టబెట్టినట్లు ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. 2017-18 వైద్యవిద్యలో ప్రవేశాల కోసం నిరుడు జులై 22న జరిగిన క్రీడల కోటా ధ్రువపత్రాల పరిశీలనలో శాట్స్ అధికారులు తప్పు మీద తప్పు చేశారు. భరత్, భరత్‌కుమార్, వర్షితరాజ్ అనే రోలర్ స్కేటింగ్ క్రీడాకారులు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొన్నారు. అయితే, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాప్రాధికార సంస్థకు గుర్తింపు లేదంటూ, ఆ ముగ్గురినీ పక్కన పెట్టేశారు. వారి స్థానంలో జాతీయస్థాయిలో ఆడిన మరో ముగ్గురికి ప్రాధాన్య జాబితాలో చోటు కల్పించారు. వీరిలో ఓ క్రీడాకారిణికి తప్పుడు వివరాలతో సీటిచ్చినట్లు స్పష్టమైంది. 2016 జనవరి 24-26 మధ్య విశాఖపట్నంలో జాతీయ రోలర్ స్కేటింగ్, ఇన్‌లైన్ హాకీ టోర్నీ జరిగింది. సదరు టోర్నీలో ఆ అమ్మాయి జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. కానీ, ఆమె సీనియర్ విభాగంలో పతకం సాధించినట్లుగా రికార్డుల్లో పేర్కొన్నారు. ప్రాధాన్య క్రమంలో ఆమెకు 25టి (టి అంటే టీమ్‌గేమ్) గ్రేడింగ్ ఇచ్చారు. నిజానికి ఆ అమ్మాయికి 41టి గ్రేడింగ్ ఇవ్వాలి. దీనివల్ల ఆ అమ్మాయికి సీటొచ్చే అవకాశం లేదు! 25టి గ్రేడ్‌తో ఆమెకు హైదరాబాద్‌లోనే వైద్యవిద్య సీటొచ్చింది. కొందరు క్రీడాకారుల విచారణలో... శాట్స్ అధికారుల బాగోతమంతా బయటపడింది. సదరు క్రీడాకారిణి నుంచి శాట్స్ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధ్రువపత్రాల పరిశీలన కమిటీలో ఉన్న డిప్యూటీ డైరెక్టర్లు, కోచ్‌లలో ఇద్దరికి కార్లు... మిగతావారికి లక్షల్లో నగదు ముట్టజెప్పినట్లు చెబుతున్నారు. దీనిపై శాట్స్ ఎండీ దినకర్‌బాబును 'ఈనాడు' సంప్రదించగా, రికార్డులను పరిశీలించిన తర్వాత మాట్లాడతానన్నారు.

'చిన్నారుల ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నాం'

ఈనాడు, హైదరాబాద్: శిశు విహార్, శిశుగృహ సంరక్షణలోని చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమం, పౌష్టికాహారం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ సంచాలకురాలు విజయేంద్ర బోయి తెలిపారు. తక్కువ బరువు, అనారోగ్య పరిస్థితుల్లోని చిన్నారులను సంరక్షణ గృహాల్లో తల్లిదండ్రులు వదిలేసి వెళ్తున్నారని, వీరికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నామని పేర్కొన్నారు. 'ఆడపిల్లలు పుట్టారని, అనారోగ్యంతో ఉన్నారని పుట్టినప్పటి నుంచి తల్లిదండ్రులు ఎలాంటి సంరక్షణ చర్యలూ తీసుకోవడం లేదు. క్లిష్ట పరిస్థితుల్లోని పిల్లలను గుర్తించి మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు సంరక్షణ కేంద్రాలకు తీసుకువస్తున్నారు. వీరికి మెరుగైన వైద్యం కోసం నీలోఫర్, రెయిన్‌బో ఆసుపత్రుల్లో చికిత్సలు అందిస్తున్నాం. చలి పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం' అని విజయేంద్ర బోయి చెప్పారు.

ఎస్వీబీసీలో అక్రమాలు జరిగాయంటూ వ్యాజ్యం

దర్యాప్తు స్థితేమిటో చెప్పండి: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: తితిదే ఆధ్వర్యంలో నడిచే ఎస్వీబీసీ(శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్) నిర్వహణలో నిధుల దుర్వినియోగం, పరిపాలనలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఆ ఛానల్ సీఈవో ఏవీ నర్సింహారావు నియామకం చట్ట విరుద్ధంగా జరిగిందంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఏర్పాటుచేసిన ముఖ్య నిఘా అధికారి, భద్రత అధికారి నివేదిక సమర్పించారా? లేదా? తెలియజేయాలని ఏపీ దేవాదాయశాఖ కమిషనర్, తితిదే ఈవోలను ఆదేశించింది. అసలు విచారణ జరిపారా? లేదా?.. జరిపితే ఆ విచారణ తాజా పరిస్థితి ఏమిటో కూడా తెలియజేయాలని స్పష్టం చేసింది. ఎస్వీబీసీలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ తిరుపతికి చెందిన భక్తుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఆ ఛానల్ సీఈవో నియామకమూ ఎలాంటి ప్రకటన జారీచేయకుండానే జరిగిందన్నారు. సీఈవో అక్రమాలకు పాల్పడ్డారని ఈ వ్యవహారంపై దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, దేవాదాయ కమిషనర్, తితిదే ఈవోలు.. ఆయనపై చర్యలు చేపట్టడం లేదన్నారు. ఎస్వీబీసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యాజ్యం ప్రచారం కోసం వేసిందన్నారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం.. దర్యాప్తు ప్రస్తుత పరిస్థితి ఏమిటో చెప్పాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఖాళీల భర్తీ ఆలస్యమేనా..!

- ప్రకటనల రూపం దాల్చని ఉద్యోగాలు
- టీఎస్‌పీఎస్సీ ద్వారా 40వేల ఖాళీలకు అనుమతులు
- ఇప్పటి వరకు భర్తీ చేసినవి 6,872 పోస్టులు
- అదనపు సిబ్బందిని నియమిస్తేనే వేగం పుంజుకునేది..

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి వెలువడుతున్న అనుమతులకు క్షేత్రస్థాయిలో అడుగులు ముందుకు పడటం లేదు. ప్రకటనలు వెలువడుతున్నా.. భర్తీ ఆలస్యమవుతోంది. పోస్టుల అర్హతలు నిర్ణయించడంలో ప్రభుత్వ విభాగాల తప్పటడుగులతో న్యాయవివాదాలు నెలకొంటూ సమస్యలు జఠిలమవుతున్నాయి. టీఎస్‌పీఎస్సీకి అదనపు సిబ్బందిని కేటాయించడంలోనూ సర్కారు ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. టీఎస్‌పీఎస్సీ నుంచి సాంకేతిక, వృత్తినైపుణ్య విభాగాలు, ఉపాధ్యాయ పోస్టులు మినహా సాధారణ కోర్సులు చదివిన నిరుద్యోగులకు ఆశాదీపమైన గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4, జూనియర్ అసిస్టెంట్, పరిపాలన పోస్టులపై ఉద్యోగ ప్రకటనలు వెలువడలేదు. ఇచ్చిన గ్రూప్-2 న్యాయవివాదాల్లో చిక్కుకుంది. ప్రభుత్వ విభాగాల్లోని దాదాపు 40 వేల పోస్టులకు అనుమతివ్వగా ఇప్పటికి దాదాపు 7వేల పోస్టులే భర్తీ అయ్యాయి.

నియామక ప్రక్రియలు ఆలస్యం


ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి ఇస్తున్న అనుమతులు... ఆయా విభాగాధిపతుల నిర్లక్ష్యంతో ప్రకటనల రూపం దాల్చడం లేదు. ఇప్పటికే విడుదల చేసిన ప్రకటనలకు సంబంధించి నియామక ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోంది. టీఎస్‌పీఎస్సీకి మొత్తం ఉన్న 80 మంది సిబ్బందితో పరిపాలన, పరీక్షల నిర్వహణ, ధ్రువీకరణ పత్రాల పరిశీలన, నియామకాల రహస్య విభాగ నిర్వహణ చేయాల్సి వస్తోంది. దీంతో ఒక ప్రకటన ఫలితాలు ప్రకటించిన తరువాత మరో ప్రకటన చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అదనపు సిబ్బందిని కేటాయించడమో... వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్, అదనపు బాధ్యతలపై తాత్కాలికంగా పంపిస్తేకాని నియామకాలు గాడిన పడే అవకాశాలు కనిపించడం లేదు.

ప్రభుత్వ విభాగాల అలసత్వం....

ఆర్థికశాఖ అనుమతులిచ్చినా పలు ప్రభుత్వ శాఖల్లోని పోస్టులు ప్రకటనల రూపం దాల్చడం లేదు. ఆర్థికశాఖ మంజూరు చేసిన తరువాత సంబంధిత విభాగాధిపతులు రోస్టర్, విద్యార్హతలు, వయోపరిమితి, సర్వీసు నిబంధనలు రూపొందించాలి. ఆ వివరాలను టీఎస్‌పీఎస్సీకి అందిస్తూ ప్రకటనలు ఇచ్చేందుకు మార్గం సుగమం చేయాలి. కానీ ప్రభుత్వ విభాగాలు ప్రతిపాదనలు పంపించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కొన్నిశాఖల్లో ఆర్థికశాఖ అనుమతులు ఇచ్చి నెలలు గడుస్తున్నా సరైన ప్రతిపాదనలు రూపొందడం లేదు.

ఇదీ పరిస్థితి...

టీఎస్‌పీఎస్సీలో నమోదైన అభ్యర్థులు	: 19లక్షలు
టీఎస్‌పీఎస్సీకి అప్పగించిన పోస్టులు	: 40వేలు
ప్రతిపాదనలు అందినవి	: 33వేలు
ప్రకటనలు జారీ చేసినవి	: 31వేలు
భర్తీ చేసిన పోస్టులు	: 6,872
పరీక్షలు పూర్తయినవి	: 12,925
ధ్రువీకరణ పత్రాల పరిశీలనలోనివి	: 7,717
ప్రతిపాదనలు అందిన వాటిలో ప్రకటనలు ఇవ్వాల్సినవి	: 3,878
ఉద్యోగ ప్రకటనలకు ఇప్పటి వరకు జరిగిన పరీక్షలు	: 165
దరఖాస్తు చేసిన నిరుద్యోగ అభ్యర్థులు	: 28 లక్షలు
పరీక్షలకు హాజరైన అభ్యర్థులు	: 20 లక్షలు



హాని చేయని హిమ క్రీములు!

లండన్: కళ్లెదురుగా నోరూరించే హిమక్రీములు.. అవేనండీ ఐస్‌క్రీంలు ఉంటే వాటిని లాగించేయాలని ఎవరికి ఉండదు చెప్పండి? అయితే వాటిలో ఉండే సంతృప్తికర కొవ్వుల వల్ల ఎక్కడ లావెక్కిపోతామో అనే భయంతో జిహ్వాచాపల్యాన్ని అణిచేసుకునేవారు అనేకమంది. కోపెన్‌హేగన్ విశ్వవిద్యాలయానికి చెందిన మెరెట్ మంక్ అనే శాస్త్రవేత్త మాత్రం దీనికొక విరుగుడును ఆవిష్కరిస్తున్నారు. ఆరోగ్య హానికారకాలు ఏమాత్రం ఉండకపోవడమే వీటి ప్రత్యేకత. సంతృప్తికర కొవ్వులు ఎక్కువగా ఉంటే కొలెస్ట్రాల్ పెరగడమే కాకుండా గుండెజబ్బులు వంటివి వస్తాయనే భయం అనేకమందిలో ఉండడంతో సంప్రదాయ ఐస్‌క్రీం తయారీ స్వరూపాన్నే మార్చేలా ఆమె కొన్ని ప్రయోగాలు చేస్తున్నారు. 'అసంతృప్త కొవ్వు బిందువుల'ను వీటి తయారీలో వాడనున్నారు. సంతృప్త కొవ్వు... ఘన రూపంలో ఉంటే ఇది ద్రవ రూపంలో ఉంటుంది. ఐస్‌క్రీం ముద్దగా ఉండేలా చూసేందుకు దాని తయారీలో వాడే నూనె విషయంలో కొన్ని అదనపు జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ తరహా ఐస్‌క్రీంల వల్ల ఆరోగ్యానికే కాకుండా పర్యావరణానికీ మేలు కలుగుతుంది. కొత్త ప్రక్రియలో ఐస్‌క్రీం తయారీని పెద్దఎత్తున చేపట్టేందుకు ఆమె సమాయత్తమవుతున్నారు. ఇది విజయవంతమైతే కొవ్వురహిత హిమక్రీముల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పేందుకు స్కాండినేవియాకు చెందిన ఓ సంస్థ సిద్ధంగా ఉంది.

అడ్డగోలుగా భవన నిర్మాణాలు

- అడ్డుకునేందుకు భవన నిర్మాణ ట్రైబ్యునల్ ప్రతిపాదన
- ఏడాదిగా ముందుకు కదలని దస్త్రం

ఈనాడు- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి: హైదరాబాద్ మహానగరంలో భవన నిర్మాణాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటు చేయదల్చిన భవన నిర్మాణ ట్రైబ్యునల్ దస్త్రానికి సచివాలయంలో బూజుపట్టింది. ట్రైబ్యునల్ ఏర్పాటుకు సంబంధించి అన్ని వివరాలతో దస్త్రాన్ని హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) రాష్ట్ర పురపాలక శాఖకు పంపించింది. దీనికి నేతృత్వం వహించేందుకు అవకాశం ఉన్న ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తుల పేర్లను కూడా నివేదించింది. అయితే అక్కడి నుంచి ఈ దస్త్రం ముందుకు కదలడం లేదు. దీంతో నగరంలో భవన నిర్మాణ అక్రమాలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగిపోతున్నాయి.

రాజధానిలో బల్దియా లెక్కల ప్రకారం 14 లక్షల భవనాలున్నాయి. ఏటా వేలాది కొత్త నిర్మాణాలు వస్తున్నాయి. ఇందులో అనధికారికంగా నిర్మించేవి రెండు వేల వరకు ఉంటాయి. భవన నిర్మాణాల్లో అక్రమాలు రెండు రకాలు. మొదటిది ఎటువంటి అనుమతులు లేకుండానే అతి పెద్ద భవనాలను నిర్మించేస్తున్నారు. అయ్యప్ప సొసైటీ, గోకుల్ ఫ్లాట్స్, హఫీజ్‌పేట లాంటి అనేక వివాదాస్పద ప్రాంతాల్లో బల్దియా పూర్తిగా భవన నిర్మాణాలకు అనుమతివ్వడం లేదు. దీంతో అనేకమంది భవన నిర్మాణదారులు ఇక్కడ స్థలాలు కొనేసి నిర్భయంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. మరోవైపు నగరంలో వేలాది మంది గృహ యజమానులు బల్దియా నుంచి అనుమతి తీసుకోకుండా పాతభవనాలపై మరికొన్ని అంతస్తులు నిర్మిస్తున్నారు. నగర ప్రణాళికా విభాగంలో దిగువ స్థాయి సిబ్బంది కొరతతో వాటిని నిరోధించలేకపోతున్నారు. కొన్నిచోట్ల కింది స్థాయి అధికారులు అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై తోడ్పాటు అందిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నిర్మాణాలపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వని ట్రైబునల్ వ్యవస్థను పదేళ్ల క్రితం కోల్‌కతాలో ఏర్పాటు చేశారు. అక్కడి ట్రైబ్యునల్‌కు ఎవరైనా నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తే అధికారులను పంపించి వాస్తవ పరిస్థితిని తెలుసుకున్నాకే ఆదేశాలు ఇస్తోంది. ఇలాంటి వ్యవస్థను హైదరాబాద్‌లోనూ ఏర్పాటు చేయాలని రెండేళ్ల కిందట జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం నగరంలో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలకు ప్రయత్నిస్తే నిర్మాణదారులు కోర్టుకు వెళ్లి అప్పటికప్పుడు చర్యలు లేకుండా ఆదేశాలు తెచ్చుకుంటున్నారు. అదే ఎవరైనా ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే ఇలాంటి ఆదేశాలు ఇవ్వదు. పూర్తి రికార్డును పంపించమని ఆదేశించి, క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించాకే తగిన ఆదేశాలిస్తుంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే ట్రైబ్యునల్‌కు ఒక విశ్రాంత న్యాయమూర్తి, మరో ఉన్నతస్థాయి నగర ప్రణాళికా విశ్రాంత అధికారిని బెంచ్‌గా నిర్ణయించారు. ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తుల పేర్లతోపాటు ఏర్పాటు ప్రతిపాదన ఫైలు సచివాలయానికి పంపించారు. ఏడాదిగా ఈ దస్త్రం అక్కడే మూలుగుతోంది. ట్రైబ్యునల్ ఏర్పాటు చేయకపోవడంతో అక్రమ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి.

ఎన్‌ఎంసీ బిల్లుపై నేడు ఐఎంఏ నిరసన

ఓపీ సేవలకు తప్పని అంతరాయం!

దిల్లీ: భారత వైద్య మండలి(ఎంసీఐ) స్థానంలో 'జాతీయ వైద్య కమిషన్' (ఎన్‌ఎంసీ) ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన బిల్లును వ్యతిరేకిస్తూ భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) మంగళవారం నిరసన దినం పాటించనుంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు రోజువారీ సేవల్ని దేశవ్యాప్తంగా నిలిపివేయాలని వైద్యులకు పిలుపునిచ్చింది. దీంతో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో బాహ్య రోగుల (ఓపీ) సేవలకు అంతరాయం తప్పేలా లేదు. అత్యవసర సేవలు మాత్రం కొనసాగుతాయి. ఎన్‌ఎంసీ ఏర్పాటుతో పాటు హోమియోపతి, ఆయుర్వేదం వంటి కోర్సుల్ని పూర్తి చేసినవారు వేరేగా ఒక అనుసంధాన కోర్సును పూర్తి చేసి, అల్లోపతి అభ్యసించడానికి అనుమతించడం వంటి అంశాలతో కూడిన బిల్లు మంగళవారం పార్లమెంటులో చర్చకు వచ్చే అవకాశం ఉంది. కొత్త బిల్లు వల్ల వైద్యపరమైన విధుల నిర్వహణకు ఆటంకం వాటిల్లుతుందనీ, వైద్యంతో సంబంధం లేని అధికారస్వామ్యానికి తాము జవాబుదారీ కావాల్సి వస్తుందనీ ఐఎంఏ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. తమపరంగానైనా, పేద రోగుల కోణంలో చూసినా కొత్త బిల్లు నష్టాన్ని కలిగించేదేనని ఆందోళన వెలిబుచ్చింది.

అంతరాయం లేకుండా చూడాలని ఆదేశం: ఐఎంఏ చేపట్టిన ఆందోళన నేపథ్యంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు వాటిల్లకుండా తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆసుపత్రులకు ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చింది.

సెన్సెక్స్ ▼ 244 **33813**

నిఫ్టీ ▼ 95 **10436**

రూపాయి 63.68 ▲ (ఒక అమెరికా డాలరుకు) 19 పైసలు

బంగారం 29,525 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 135

వెండి 38,720 ▲ ముంబయిలో కిలో రూ.లలో 235

ముడి చమురు 66.62 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,719	−118
నాస్డాక్	6,903	−47
నిక్కీ 225 (జపాన్)	22,765	−19
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,403	+04
షాంఘై (చైనా)	3,308	+12
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,688	+65
డాక్స్ (జర్మనీ)	12,918	−62

అంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం అమెరికా మార్కెట్లు పని చేయలేదు.


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.10	67.37
పౌండ్ స్టెర్లింగ్	78.39	90.92
యూరో	69.73	80.89
జపనీస్ యెన్/100	51.56	59.80
ఆస్ట్రేలియా డాలర్	45.30	52.44
సింగపూర్ డాలర్	43.43	51.45
థాయ్ బాత్/100	178.57	213.56
బహ్రెయిన్ దీనార్	157.35	180.31
కువైట్ దీనార్	174.71	217.49
సౌదీ రియాల్	15.42	18.31
యూఏఈ దిర్హమ్	15.81	18.48
మలేషియా రింగిట్	14.05	17.29
చైనీస్ యువాన్	6.94	11.26



సోమవారం నిఫ్టీ కదలికలు



మార్కెట్ కబుర్లు

- హెచ్‌పీసీఎల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.2,100 కోట్ల కాంట్రాక్టులను అనుబంధ సంస్థ ఎల్&టీ హైడ్రోకార్బన్ ఇంజినీరింగ్ దక్కించుకుందని **ఎల్ అండ్ టీ** ప్రకటించింది.
- అరేబియా సముద్రంలోని ముంబయి హైఫీల్డ్స్‌లో భారీ చమురు-గ్యాస్ నిల్వలను **ఓఎన్‌జీసీ** కనుగొన్నట్లు చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభకు తెలిపారు.
- జైప్రకాశ్ పవర్ వెంచర్స్‌కు చెందిన 500 మెగావాట్ల బినా థర్మల్ విద్యుత్ ప్లాంట్ కొనుగోలు లావాదేవీని సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని **జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ** రద్దు చేసుకుంది. గడువులోగా లావాదేవీ పూర్తికాకపోవడాన్ని ఇందుకు కారణంగా పేర్కొంది.
- పబ్లిక్ ఇష్యూ ద్వారా దాదాపు రూ.2,500 కోట్లు సమీకరించేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసినట్లు **బంధన్ బ్యాంక్** వెల్లడించింది.
- **ఇన్ఫోసిస్** ముఖ్యకార్యనిర్వాహక అధికారి (సీఈఓ)గా సలీల్ పరేఖ్ నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.
- ప్రిఫరెన్షియల్, రైట్ ఇష్యూ లేదా ఇతర మార్గాల ద్వారా నిధుల సమీకరణ ప్రతిపాదనను పరిశీలించేందుకు ఈనెల 4న **ఐడియా సెల్యులార్** బోర్డు సమావేశం కానుంది.
- వివిమెడ్ ల్యాబ్స్ అనుబంధ సంస్థ వివిమెడ్ ల్యాబ్స్ (మాస్కారేన్)లో **ఆర్బిమెడ్ ఆసియా** 75 లక్షల డాలర్ల అదనపు పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివిమెడ్ వెల్లడించింది.
- ఎన్‌హెచ్ఏఐ నుంచి ఒడిశాలో రహదారి అభివృద్ధికి రూ.583 కోట్ల విలువైన పనులు **గాయత్రీ ప్రాజెక్ట్స్**కు లభించాయి.

ఒక్కసారిగా అమ్మేశారు

- **నూతన సంవత్సరాదిన చేదు ఆరంభం**
- **244 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్**
- **వాహన, బ్యాంకింగ్ షేర్లు డీలా**

కొత్త ఏడాదిని స్టాక్‌మార్కెట్లు నష్టాలతో మొదలుపెట్టాయి. ట్రేడింగ్ చివర్లో వాహన, బ్యాంకింగ్, ఐటీ షేర్లకు ఒక్కసారిగా అమ్మకాలు వెల్లువెత్తడమే ఇందుకు నేపథ్యం. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 1.45 శాతం వరకు నష్టపోయాయి. గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడమూ కారణమైంది. ముడిచమురు ధరలు పెరగడం ఇందుకు తోడైంది. డిసెంబరు వాహన విక్రయ గణాంకాలు మదుపర్లను మెప్పించలేక పోయాయి. అంతర్జాతీయ మార్కెట్లకు సెలవు కావడంతో దిశానిర్దేశం కరవైంది.

34000 దిగువకు: సెన్సెక్స్ ఉదయం 34059.99 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకుల మధ్య కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 34,101.13 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆఖరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఒకానొకదశలో 33,766.15 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 244.08 పాయింట్ల నష్టంతో 33,812.75 వద్ద ముగిసింది. డిసెంబరు 1 తర్వాత సూచీకిదే అత్యధిక ఒకరోజు నష్టం కావడం గమనార్హం. నిఫ్టీ సైతం 10,500 పాయింట్ల దిగువకు చేరింది. 10,423.10 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరకు 95.15 పాయింట్లు కోల్పోయి 10,435.55 దగ్గర స్థిరపడింది.



సమీక్ష

రిలయన్స్ గ్రూప్ జోరు: అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ షేర్ల జోరు కొనసాగింది. రిలయన్స్ నేవల్ 32.28 శాతం, రిలయన్స్ పవర్ 20.70 శాతం, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 9.11 శాతం, రిలయన్స్ కేపిటల్ 3.48 శాతం, రిలయన్స్ ఇన్‌ఫ్రా 3.45 శాతం మేర లాభాలు నమోదు చేశాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్ జోరుకు మాత్రం కళ్లెం పడింది. 2.26 శాతం తగ్గిన షేరు రూ.35.40 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 25 నష్టపోయాయి. టీసీఎస్ 1.69%, హిందుస్థాన్ యునిలీవర్ 1.52%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.45%, హెచ్‌డీఎఫ్‌సీ 1.35%, టాటా మోటార్స్ 1.35%, టాటా స్టీల్ 1.19%, ఓఎన్‌జీసీ 1.16%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.10%, అదానీ పోర్ట్స్ 1.05%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.03%, ఏషియన్ పెయింట్స్ 0.98%, బజాజ్ ఆటో 0.90% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. విప్రో 1.39%, కోల్ ఇండియా 1.31%, సన్‌ఫార్మా 0.49%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో వాహన 0.78% నీరసపడింది. బ్యాంకింగ్, టెక్, ఐటీ, లోహ, చమురు-గ్యాస్ షేర్లు సైతం అదే బాటలో నడిచాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు బలహీనంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కీలక పరిణామాలు, అంతర్జాతీయ సంకేతాలు కొరవడటమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఔషధ, లోహ, ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు సూచీలకు మద్దతు ఇవ్వొచ్చని, ఇదే సమయంలో బ్యాంకింగ్, ఐటీ షేర్లకు నష్టాలు కొనసాగొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2018-19 సాధారణ బడ్జెట్‌కు ముందు సూచీలు కొంత స్థిరీకరించుకోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలు శుక్రవారం వెలువడనుండటంతో మదుపర్లు ఆచితూచి అడుగేయొచ్చు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ తరవాత ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంపై ఈ గణాంకాలు సంకేతాలు అందివ్వొచ్చు. 10400 పాయింట్ల వద్ద నిఫ్టీకి కీలక మద్దతు లభించొచ్చని, 10600 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డిసెంబరు విక్రయ గణాంకాల నేపథ్యంలో వాహన షేర్ల నష్టాలు కొనసాగొచ్చు.

ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులకు ఎంఆర్‌పీ, ఇతర వివరాలు తప్పనిసరి

దిల్లీ: ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువుల ప్యాకెట్‌పై గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ), గడువు (ఎక్స్‌పైరీ) తేదీ, కస్టమర్ కేర్ వివరాలు వంటి సమాచారం ముద్రించడం తప్పనిసరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి తూనికలు, కొలతల విభాగం నిబంధనలను వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సవరించింది. ఇ-కామర్స్ కంపెనీలు ఆరునెలల్లోగా కొత్త నిబంధనలను అమలుచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌పై విక్రయించే వస్తువుల వివరాలను విక్రేతలు తెలియజేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం ఎంఆర్‌పీతో పాటు తయారీ తేదీ, గడువు తేదీ, నికర పరిమాణం, తయారైన దేశం, కస్టమర్ కేర్ వివరాలు లేబుల్‌పై తప్పనిసరిగా ఉండాలి.

ఆస్తుల విలువ లెక్కగట్టే వృత్తి నిపుణులకు ఐబీబీఐ నమోదు ఉండాల్సిందే

దిల్లీ: కంపెనీల చట్టం, దివాలా స్మృతి(ఐబీసీ) కింద ఆస్తుల మూల్యాంకన చేసే వృత్తి నిపుణులకు భారత దివాలా బోర్డు(ఐబీబీఐ)లో నమోదు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధన అమలులోకి వస్తుందని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం.. విలువ లెక్క గట్టే వ్యక్తికి తగిన అర్హతలు, అనుభవంతో పాటు గుర్తింపు పొందిన సంస్థలో సభ్యుడిగా ఉండాలి. వీటికి తోడు ఐబీబీఐ వద్ద నమోదై ఉంటేనే ఆ తరహా కార్యకలాపాలు చేయడానికి అర్హత ఉంటుంది.

ఎన్‌సీఎల్‌టీకే ఆ 24 పెద్ద ఖాతాలు

దిల్లీ: మొండి బకాయిల్లోని 24 పెద్ద ఖాతాలను కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి నివేదించేందుకు బ్యాంకులు సమాయత్తం అవుతున్నాయి. ఈ ఖాతాలను పరిష్కరించడం, లేదా ఎన్‌సీఎల్‌టీకి నివేదించడానికి గడువు ముగిసినందున, అన్‌రాక్ అల్యూమినియం, జయస్వాల్ నెకో, సోమా ఎంటర్‌ప్రైజెస్, జైప్రకాశ్ అసోసియేట్స్ మినహా, మిగిలిన సంస్థలన్నిటినీ ఎన్‌సీఎల్‌టీకి నివేదించవచ్చని సమాచారం. ఐవీఆర్‌సీఎల్, కాస్టెక్స్ టెక్నాలజీస్, కోస్టల్ ప్రాజెక్ట్స్, ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ, ఆర్కిడ్ ఫార్మా, సెల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఉత్తమ్ గాల్వా, ఉత్తమ్‌గాల్వా స్టీల్, వీసా స్టీల్, ఎస్సార్ ప్రాజెక్ట్స్, జైబాలాజీ ఇండస్ట్రీస్, మానెత్ పవర్, రుచిసోయా, విండ్ వరల్డ్, నాగార్జున ఆయిల్‌రిఫైనరీ వంటి సంస్థలు ఎన్‌సీఎల్‌టీకి చేరనున్నాయి.

'హెచ్-1బీ' సవరణతో తీవ్ర ప్రభావం

- దేశీయ ఐటీ పరిశ్రమ, ఖాతాదారులకు కష్టాలు
- నాస్‌కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్



దిల్లీ: అమెరికన్ల ఉపాధికి రక్షణ కల్పించడంతో పాటు వారికి ఉద్యోగావకాశాలు పెంచేందుకు, హెచ్-1బీ వీసా నిబంధనలు సవరించాలంటూ ప్రతిపాదించిన బిల్లు వల్ల దేశీయ ఐటీ రంగంతో పాటు ఖాతాదార్లపైనా తీవ్ర ప్రభావం పడుతుందని పరిశ్రమ సంఘం నాస్‌కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్) పేర్కొంది. హెచ్-1బీ ఉద్యోగుల సాయంతో ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటున్న ఖాతాదారుల (అమెరికా కంపెనీలు)కూ కష్టాలు తప్పవని వివరించింది. అమెరికా చట్టసభల సభ్యులైన సెనెటర్లు, కాంగ్రెస్ సభ్యులు, ప్రభుత్వ అధికారులకు తమ ఆందోళనలను వివరించామని, రాబోయే కొన్ని వారాల పాటు మరింత విస్తృతంగా దీనిపై సంప్రదింపులు జరుపుతామని తెలిపింది. హెచ్-1బీ వీసాలు దుర్వినియోగం కాకుండా చూడాలంటూ, కొత్త నిబంధనలను తాజా సవరణల్లో ప్రతిపాదించారు. వీసా ఆధారిత కంపెనీలంటే ఏమిటనే నిర్వచనాన్ని మరింత పటిష్ఠం చేయనున్నారు. వీసాపై వచ్చే వారికి ఇవ్వాల్సిన కనీస వేతనం, నిపుణుల తరలింపు ఏ పరిస్థితుల్లో జరగాలనే అంశాల్లోనూ మార్పులు చేయనున్నారు. ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగిని తొలగించి హెచ్-1బీ వీసాదారుడితో 5-6 ఏళ్లపాటు భర్తీ చేయడం లేదని సదరు ఖాతాదారు తెలపాల్సి వస్తుంది. తాజా ప్రతిపాదనలు ఆమోదం పొందితే, వీసా పొందడానికి కష్టపడాల్సి రావడంతో పాటు దానిని వినియోగించడం కూడా కష్టం కానుందని నాస్‌కామ్ పేర్కొంది. న్యాయ సంఘం ఆమోదం పొందిన ఈ బిల్లును అమెరికా సెనెట్ ఆమోదానికి పంపనున్న సంగతి విదితమే. ఈ ఏడాది ప్రారంభంలోనే ఈ బిల్లును సెనెట్‌లో ప్రవేశ పెట్టే అవకాశం ఉందని నాస్‌కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. అమెరికన్ల ఉద్యోగాలు కాపాడే పేరిట రూపొందించిన ఈ బిల్లును, వీసా ఆధారిత కంపెనీలకే వర్తింప చేస్తున్నారని, ఇందువల్ల భారతీయ కంపెనీలకు ఇబ్బందులు వస్తాయని వివరించారు. ఒకవైపు అంతర్జాతీయకరణ అంటూనే, రక్షణాత్మక విధానాలు అవలంబించడం పెరిగిపోతోందని, అందుకు ఈ బిల్లే ఉదాహరణ అని పేర్కొన్నారు.

భారతీయులకు 10,000లోపు వీసాలే: వీసా పరిశీలన ప్రక్రియలు పెంచడం, ప్రీమియం వీసా ప్రాసెసింగ్‌ను కొన్ని నెలల పాటు నిలిపివేయడం వల్ల దేశీయ ఐటీ సంస్థలపై ప్రభావం పడుతోందని చంద్రశేఖర్ అన్నారు. దేశీయ ఐటీ సంస్థలు వినియోగించే వీసాల సంఖ్య గత రెండేళ్లలో 50 శాతం తగ్గి, ప్రస్తుతం ఏడాదికి 10,000 లోపే ఉన్నాయని స్పష్టం చేశారు. ఏటా జరీ అవుతున్న 85,000 హెచ్-1బీ వీసాల్లో ఇవి ఎంత తక్కువో గమనించాలని సూచించారు. కార్మిక ధ్రువీకరణ అవసరాల నుంచి మినహాయింపు పొందాలంటే, హెచ్-1బీ ఉద్యోగి కనీస వేతనం ఏడాదికి లక్ష డాలర్లు ఉండాలని నూతన బిల్లు ప్రతిపాదిస్తోందన్నారు. ఆర్థిక కారణాలతో కాక, రాజకీయ అంశాలతోనే ఇలాంటివి తెస్తున్నారని పేర్కొన్నారు. భారత, అమెరికా ప్రభుత్వాలకు తమ ఆందోళనలను తెలుపడం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ ఏడాది ఐటీలో 2 లక్షల నియామకాలు

- **ఆర్థిక సేవలు, మొబైల్ తయారీ, అంకురాల్లో భేష్**
- **మానవ వనరుల నియామక సంస్థల అంచనా**



దిల్లీ: నూతన నియామకాల పరంగా సమాచార సాంకేతిక (ఐటీ) రంగం 2017లో నిరాశపరచినా, కొత్త ఏడాదిలో పరిస్థితులు మెరుగవుతాయని మానవ వనరుల నియామాక సంస్థలు అంచనా వేస్తున్నాయి. దేశీయ ఐటీ రంగం ఈ ఏడాది 2 లక్షల మందికి కొత్తగా ఉపాధి కల్పిస్తుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. అయితే తమ ఉద్యోగం కాపాడుకోవాలంటే నూతన నైపుణ్యాలను అభ్యసించడం కొన్ని రంగాల ఉద్యోగులకు తప్పనిసరని వివరించింది. కొన్ని రంగాల్లో మాత్రం యాంత్రీకరణ (ఆటోమేషన్) సాంకేతికతల వల్ల ఉద్యోగాలు తగ్గుతాయని పేర్కొంది. మొబైల్ తయారీ, ఆర్థిక సేవల సాంకేతికత, అంకురాల్లో అవకాశాలు బాగుంటాయని వివరించింది.

ఆర్థిక సేవల రంగం మెరుగుపడటం, డిజిటల్ వ్యాపారాలు పెరగడం, డిజిటలీకరణ-యాంత్రీకరణలో పెట్టుబడులు పెరగడం వంటివి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ ఐటీ నియామకాల విభాగం జనరల్ మేనేజర్ అల్కాధింగ్రా పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ఉద్యోగాలిచ్చే సంస్థలు 20 శాతం పెరుగుతాయని, ఫలితంగా 1.8-2.0 లక్షల ఉద్యోగాలు రావచ్చని అంచనా వేశారు. డిజిటలీకరణ కోసం డిజిటల్ సాంకేతికతలో నైపుణ్యం ఉన్న 50 శాతం మంది అదనంగా అవసరమని పేర్కొన్నారు. 2030 నాటికి అంతర్జాతీయంగా కృత్రిమమేధ ఒక్కటే 23 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు.

డిజిటల్ నైపుణ్యాలు కావాలి


కొత్తతరం సాంకేతికతల వినియోగానికి డిజిటల్ నైపుణ్యాలున్న ఉద్యోగుల అవసరం ఉందని అడోబ్ ఇండియా ఉపాధ్యక్షుడు అబ్దుల్ జలీల్ వివరించారు. అనుభవం, అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగులను కాపాడుకోవడం సంస్థలకు సవాలుగా మారుతుందని తెలిపారు.

ఇండియాబుల్స్ హౌసింగ్



రూ.1196.60 వద్ద ప్రారంభమై రూ.1194.85-1243.90 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.1196.60తో పోలిస్తే రూ.21.55(1.80%) లాభంతో రూ.1218.15 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 13,23,659.

భారతీ ఇన్‌ఫ్రాటెల్



రూ.379.90 వద్ద మొదలై రూ.366.35-379.90 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.378.75తో పోలిస్తే రూ.8.80 (2.32%) నష్టంతో రూ.369.95 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 17,88,442 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

కంటైనర్ కార్పొరేషన్	1425.00	ఆర్తి డ్రగ్స్	658.00
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్	1337.85	కోరమాండల్ ఇంటర్నేషనల్	586.75
ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్	1159.90	యాక్సిస్ బ్యాంక్	569.80
సీఈఎస్‌సీ	1080.00	విప్రో	320.00
జెట్ ఎయిర్‌వేస్	856.00		
వరుణ్ బెవరేజెస్	666.90		


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

జనరల్ ఇన్సూరెన్స్	752.30

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
01/01	770	444	326	2,499	3,800	−1,300
29/12	3,587	2,992	595	4,283	3,821	461
28/12	5,486	4,923	563	5,562	6,336	−774
26/12	2029	2073	−44	4487	3943	544

1వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	380
బెంగళూరు	365	చెన్నై	385
2న		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	372	నమక్కల్	375

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 399.65 (405.65) 2701537
AMBUJA CEMEN 268.05 (272.05) 1408955
ASIAN PAINTS 1143.65 (1158.50) 591349
AUROBIND PHA 683.95 (687.95) 1629631
AXIS BANK LT 565.50 (563.95) 6943234
BAJAJ AUTO L 3289.25 (3333.60) 174560
BAJAJ FINANC 1725.65 (1756.70) 535319
BHARTI AIRTE 527.90 (529.65) 4333190
BHARTI INFRA 369.95 (378.75) 1788442
BOSCH LTD 19791.90 (20165.55) 20401
BPCL 508.60 (517.70) 1940293
CIPLA 611.50 (608.50) 873546
COAL INDIA L 266.65 (262.95) 3079260
DR. REDDYS 2404.15 (2414.20) 242081
EICHER MOTOR 29893.15 (30340.85) 19847
GAIL 498.65 (499.65) 1639410
HCL TECH 878.70 (890.50) 643144
HDFC 1683.75 (1710.40) 1387222
HDFC BANK 1854.50 (1872.40) 1645129
HERO MOTOCOR 3749.10 (3785.15) 201102
HINDALCO IND 271.15 (273.55) 4614411
HINDUSTAN UN 1344.50 (1367.85) 746852
HPCL 413.75 (418.60) 2087052
ICICI BANK 310.30 (314.00) 7739502
INDIABULLS H 1218.15 (1196.60) 1323659
INDIAN OIL 389.95 (388.55) 2218462
INDUSINDBANK 1623.85 (1648.90) 771099
INFOSYS LTD 1033.55 (1042.05) 2715670
ITC 262.30 (263.25) 10461011
KOTAK MAHIND 999.95 (1010.20) 1317415
LARSEN & TOU 1260.70 (1258.25) 2048058
LUPIN 883.25 (885.10) 1032734
M&M 744.65 (751.10) 2476302
MARUTI SUZIK 9651.90 (9729.55) 426354
NTPC LTD 176.55 (177.00) 5574802
ONGC 192.35 (195.20) 5899565
POWER GRID C 200.20 (200.35) 3593261
RELIANCE IND 909.75 (921.05) 4321686
SBI 307.10 (309.90) 12182400
SUN PHARMA 574.05 (571.15) 5314142
TATA CONSULT 2645.60 (2701.20) 675880
TATA MOTORS 424.45 (431.85) 6807536
TATA STEEL L 722.20 (732.40) 1833942
TECH MAHINDR 503.10 (504.05) 1115837
ULTRATECH 4256.05 (4320.60) 166780
UPL LIMITED 755.75 (762.70) 1068067
VEDANTA LIMI 325.45 (329.90) 5729566
WIPRO 316.55 (314.25) 3350397
YES BANK LTD 312.60 (315.15) 4019878
ZEE ENTERTAI 579.20 (581.80) 1102118

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1399.65 (1402.90) 44720
ACC 1731.35 (1758.40) 123565
ASHOK LEYLAN 118.65 (119.10) 10218058
AVENUE SUPER 1170.50 (1181.35) 334392
BAJAJ FINSER 5171.85 (5230.40) 44899
BANK OFBAROD 161.50 (160.65) 7408273
BEL 181.45 (182.15) 2722272
BHEL 95.15 (92.50) 14221778
BRITANNIA 4738.25 (4709.25) 56160
CADILA HEALT 432.55 (433.50) 803342
COLGATE PALM 1102.60 (1100.00) 334274
CONTAINER 1370.75 (1379.35) 68768
CUMMINS INDI 913.05 (901.90) 339746
DABUR INDIA 349.00 (349.70) 272884
DLF LIMITED 256.70 (259.35) 4935049
EMAMI LIMITE 1335.80 (1330.20) 54222
GLAXOSMI CON 6477.15 (6538.00) 13341
GLAXOSMI PHA 2463.00 (2489.30) 8292
GLENMARK PHA 596.10 (594.75) 512502
GODREJ CONSU 986.25 (999.45) 150338
HAVELLS INDI 554.45 (562.45) 466717
HINDUSTAN ZI 308.95 (308.85) 637405
ICICI PRU LI 382.30 (383.60) 399791
IDEA CELLULR 104.60 (108.15) 10465979
INTERGLOBE A 1203.00 (1205.50) 287162
JSW STEEL LT 265.80 (269.80) 1261616
LIC HOUS.FIN 565.70 (563.50) 919832
MARICO LIMIT 320.70 (322.50) 346559
MCDOWELL 3643.80 (3668.85) 180738
MOTHERSON 379.10 (379.25) 1834837
MRF 72402.85 (72357.05) 7348
NHPC LTD 32.20 (32.65) 9844325
NMDC LTD 141.05 (137.80) 5570533
OIL INDIA 372.95 (371.50) 471037
ORACLE FIN S 4066.75 (4098.05) 6804
P&G HYG&HEAL 9475.00 (9395.80) 2646
PETRONET LNG 255.90 (254.75) 2140136
PIDILITE IND 900.00 (902.20) 160477
PIRAMAL ENTE 2844.50 (2867.25) 48303
PNB 169.75 (171.40) 7869149
POWER FIN CO 123.80 (121.75) 6640773
RURAL ELEC C 158.40 (155.75) 4545949
SAIL 92.70 (92.15) 11912572
SHREE CEMENT 17929.05 (18074.50) 3570
SHRIRAM TRAN 1473.45 (1481.40) 212924
SIEMENS 1238.20 (1238.05) 92957
SUN TV LTD 998.00 (990.15) 743452
TATA POWER 97.15 (93.50) 33659894
TITAN IND 852.45 (858.15) 472607
TORRENT PHAR 1390.45 (1418.55) 70969

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 201.30 (202.95) 624616
ADANI ENTERP 166.05 (166.35) 4220395
ADANI POWER 42.60 (41.70) 34368848
ALL BANK 73.75 (73.45) 977504
AMARA RAJA 834.45 (840.20) 228683
ANANT RAJIND 72.20 (71.70) 3998139
ANDHRA BANK 58.40 (58.15) 988753
APOLLO HOSPI 1202.55 (1204.80) 117565
APOLLO TYRES 268.85 (268.25) 1308125
APTECH 365.35 (364.40) 289472
BAJAJ ELECT. 489.25 (497.70) 111959
BAJAJ HIND 16.10 (15.40) 11337498
BAJAJ HOLDIN 2864.45 (2867.35) 7651
BALAJI TELE 153.40 (154.90) 96681
BALLARPUR IN 19.05 (18.00) 18445068
BALRAMPUR CH 135.30 (132.40) 2687573
BANK OF MAHA 23.30 (22.85) 1850925
BANK OFINDIA 169.90 (169.75) 4712424
BATA INDIA 755.30 (747.30) 556099
BGR ENERGY S 140.95 (137.45) 445161
BHARAT FORGE 723.00 (731.50) 372741
BHUSHAN STEE 69.60 (70.05) 2958295
BIOCON LTD 538.00 (537.30) 642155
BOMBAY DYE 286.05 (277.90) 6708713
CANARA BANK 360.70 (360.40) 876655
CEAT LIMITED 1943.70 (1950.85) 405491
CENTRAL BANK 74.70 (72.15) 8051264
CHAMBAL FERT 157.05 (152.45) 1529319
CHENNAI PETR 431.90 (428.60) 192488
CITY UNIBANK 178.35 (179.80) 195467
CORPO BANK 40.40 (39.20) 452777
COX & KINGS 273.45 (272.00) 275016
D B REALTY L 63.65 (57.90) 2226298
DELTA CORP L 307.15 (308.20) 1500573
DENA BANK 25.55 (24.95) 2964555
DHANALAKBANK 30.20 (29.85) 310455
DIVIS LAB 1099.05 (1098.35) 429620
EDELWEISS CA 292.90 (297.00) 1135857
EID PARRY 379.20 (371.10) 170864
EIH 147.05 (145.10) 127847
ESSAR SHIPPI 31.40 (32.80) 214653
ESTER INDUST 63.90 (61.55) 684013
EXIDE INDUST 219.75 (223.35) 756083
FEDERAL BANK 108.70 (108.50) 2320304
FINOLEX CABL 702.45 (707.50) 17353
G E SHIP LTD 403.65 (399.35) 113210
GAMMON INFRA 3.80 (3.85) 25409355
GATI LIMITED 134.80 (135.75) 1423465
GAYATRI PROJ 227.20 (226.15) 753889
GITANJALIGEM 71.05 (68.25) 4451713
GMR INFRASTR 22.30 (22.45) 104419392
GODREJ IND 602.25 (606.45) 286411
GRASIM IND 1143.95 (1165.75) 187524
GUJ ALK&CHEM 749.00 (745.55) 161946
GUJ NRE COKE 2.00 (1.95) 16184661
HCL INFOSYS 60.15 (58.25) 11197819
HEXA TECH 341.65 (340.65) 792011
HIMACHAL FUT 32.25 (28.65) 39161526
HINDU MOTORS 9.75 (9.65) 2056216
HOUSING DEV 64.30 (65.55) 26430235
IDBI 60.35 (59.85) 3765530
IDFC 63.00 (62.90) 4893132
IFCI 30.25 (30.80) 22756110
IL&FS TRANS 82.55 (83.70) 526457
IND SWIFTLAB 75.15 (76.60) 491274
INDBULLS REL 219.20 (223.30) 3212698
INDIA CEM 180.60 (183.45) 1350029
INDIAN BANK 377.15 (376.70) 343125
INDO RAMA SY 43.45 (43.80) 552714
INDRAPRASTHA 339.75 (335.80) 2618659
INGERSOLL-R 818.20 (805.70) 35368
IOB 22.45 (22.10) 970208
IPCA LAB 599.80 (598.30) 282968
IRB INFRA DE 234.15 (238.00) 663061
J&K BANK 78.55 (78.55) 168386
JAI CORP 191.80 (174.40) 6079563
JAIN IRRIGAT 126.20 (125.75) 5957340
JAYPEE INFRA 23.60 (23.80) 17022676
JET AIRWAYS 841.75 (831.95) 4088653
JINDAL SAW 142.50 (139.85) 3383118
JINDAL STEEL 206.20 (205.05) 6556125
JK LAKSHMI C 440.15 (439.90) 31627
JK PAPER LIM 138.80 (136.95) 1555593
JM FINANCIAL 157.95 (157.20) 1262594
JP ASSOCIATS 25.10 (26.00) 140366939
JSW ENERGY L 91.05 (92.40) 11091487
JUBILANT FOO 1776.60 (1761.10) 466361
JUBILANT ORG 777.60 (788.30) 184178
JYOTHY LABS 378.40 (382.20) 44862
JYOTI STRUC 13.95 (12.85) 4369320

ఘనం (+)

నిఫ్టీ	1న	మార్పు %
INDIABULLS HSG	1218.15	1.80
COAL INDIA	266.65	1.41
WIPRO	316.55	0.73
SUN PHARMA	574.05	0.51
CIPLA	611.50	0.49
INDIAN OIL CORP	389.95	0.36
AXIS BANK	565.50	0.27

గ్రహణం (-)

నిఫ్టీ	1న	మార్పు %
BHARTI INFRATEL	369.95	-2.32
TCS	2645.60	-2.06
BOSCH	19791.90	-1.85
BAJAJ FINANCE	1725.65	-1.77
BPCL	508.60	-1.76
TATA MOTORS	424.45	-1.71
HUL	1344.50	-1.71

KARNATA BANK 154.75 (151.65) 2789232
KEC INTL LTD 383.15 (383.40) 364834
KOLTE PATIL 364.90 (365.95) 208037
KPIT CUMMINS 184.75 (180.75) 2692705
L&TFIN.HOLD 172.90 (174.00) 2468910
LAK VIL BANK 149.45 (148.05) 432830
M & M FINANC 470.70 (473.10) 403973
MANAPPURAM G 121.30 (123.40) 3480443
MMTC LIMITED 72.95 (73.30) 2515869
MOSER-BEAR 5.45 (4.80) 4840709
MPHASIS LTD 738.25 (725.65) 51609
MRPL 127.15 (128.85) 569509
MTNL 28.15 (24.90) 19430540
NAGARJUNA OI 4.25 (4.15) 1440879
NCC LIMITED 131.35 (133.75) 4165441
NETWORK18 FI 59.85 (60.95) 2012239
NEULAND LAB 885.30 (892.85) 21656
NIIT LTD 101.85 (103.00) 637152
NIIT TECHNOL 653.80 (645.05) 213259
OMAXE LTD 229.00 (230.50) 537780
ONMOBILE GLO 58.45 (56.75) 445511
ORIENT PAPER 154.20 (141.50) 3106347
ORIENTALBANK 121.90 (120.70) 1441221
PARSVNATH DE 30.05 (30.25) 103348
PATEL ENGG 77.00 (77.90) 767510
PFIZER 2046.65 (2062.95) 7453
POLARIS SOFT 393.20 (392.60) 50819
POWERTRADING 119.75 (118.70) 3292484
PRAJ IND 111.75 (111.85) 1466241
PRISM CEMENT 117.05 (112.95) 328528
PUNJ LLOYD 27.50 (24.20) 25972959
PUNJAB & SIN 48.60 (49.00) 131172
PURAVANKARA 164.85 (167.15) 577781
PVP VENTURES 8.20 (8.10) 1294394
PVR LIMITED 1423.75 (1411.05) 182104
RADICO KHAIT 294.85 (293.90) 1688847
RAJESH EXPOR 804.70 (804.00) 346745
RALLIS INDIA 270.85 (265.05) 632669
RAMCO IND 293.15 (290.50) 154091
RAMCO SYS 525.85 (526.70) 31225
RAMKY INFRA 225.85 (223.05) 118646
RAYMOND 1051.20 (1057.45) 210005
RELIANCE CAP 600.35 (579.15) 20042075
RELIANCE COM 35.35 (36.15) 352686945
RELIANCE INF 572.65 (553.85) 9340782
RELIANCE POW 60.65 (50.25) 193482359
ROLTA INDIA 62.75 (59.60) 4882272
SAGAR CEMENT 884.75 (842.30) 71068
SAREGAMA 814.65 (829.75) 78887
SHANTHI GEAR 160.50 (162.95) 27633
SHIPPNG CORP 94.20 (94.60) 1004745
SHREE RENUKA 16.90 (16.35) 7134944
SINTEX IND 27.10 (27.25) 14195144
SOBHA DEVELO 606.70 (619.00) 143180
SOUTHINDBANK 31.45 (31.00) 9850786
SRS LIMITED 1.70 (1.70) 6697201
STERLITE TEC 293.85 (292.55) 376618
SUN PHARMA 500.25 (507.70) 315612
SUND FASTNER 580.65 (585.25) 120145
SUZLON ENERG 15.80 (15.55) 69982189
SYND. BANK 79.75 (80.15) 1819393
TATA CHEM 726.00 (731.55) 186817
TATA COFFEE 164.70 (166.95) 506856
TATA COMMUN 677.95 (681.55) 340111
TATA GLOBAL 312.90 (316.40) 1602814
TATA METALIK 864.30 (884.15) 134281
TATA MOT DVR 242.35 (244.10) 1779400
THE INDIAN H 118.50 (117.80) 442715
TORRENT POWE 284.95 (283.25) 2175223
TRIVENI ENGG 78.25 (77.55) 465073
TTK PRESTIGE 7938.25 (7702.25) 5393
TV TODAY NET 435.15 (431.00) 217465
TV18 BROADCA 60.70 (61.40) 7343069
TVS MOTOR 766.45 (770.70) 240613
UCO BANK 30.60 (29.30) 2226297
UNION BANK 144.90 (144.30) 1583719
UNITECH 11.30 (9.60) 268376516
UNITED BANK 18.20 (17.70) 1184139
UNITED BREWE 1060.30 (1079.00) 135482
USHA MARTIN 24.10 (24.80) 609426
VADILAL INDU 979.50 (978.65) 8146
VENKYS 2799.70 (2786.60) 46922
V-GUARD IND 239.75 (243.80) 928536
VIJAYA BANK 69.05 (68.35) 2851576
VIP 351.25 (351.35) 165930
VOLTAS 648.95 (655.90) 511241
ZEE LEARN LI 44.10 (44.35) 314210
ZUARI GLOBAL 250.25 (253.25) 97579
ZYDUS WELLNE 1041.80 (1043.20) 7737

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 916.75 (922.15) 2924
AMAR RAJA BA 833.60 (840.55) 17087
ANDHRA BANK 58.35 (58.15) 82738
ANDHRA CEMEN 13.90 (13.72) 86340
ANDHRA PAPER 317.40 (319.75) 7012
ANDHRA PETRO 64.15 (64) 98759
ANDHRA SUGAR 535.25 (533.60) 1160
ASTRA MICROW 118.75 (114.10) 173940
AUROBINDO PH 685.15 (688.30) 88861
AVANTI FEEDS 2586.10 (2533.35) 12288
BALAJI AMIN 631.55 (636.05) 8352
BARTRONICS 15.17 (14.87) 41003
BHAGIRA CHEM 299.05 (302.30) 1283
BHAGYA NAG 52.10 (52.20) 55000
BN RATHI SEC 54.15 (52.50) 79190
BRILLIANT SE 11.08 (10.56) 69333
CAMBRIDGE TE 79.85 (78.30) 1557
CONT COFFEE 298.95 (299.30) 2311
COROMAN FERT 559.80 (576.40) 21987
CYBERMATE 3.62 (3.80) 126803
CYIENT LIMIT 577.50 (579.20) 6901
DECCAN CEMEN 556.50 (555.10) 605
DIVI'S LAB 1098.85 (1098.20) 64841
DIVYA GRANIT 101.20 (104.40) 352
DR REDDY 2411.50 (2414.40) 19391
GATI CORPN 134.95 (135.55) 317947
GAYATRI PROJ 226.85 (226.40) 37727
GMR INFRASTR 22.30 (22.45) 8716955
GOLDST INFRA 206.85 (198.05) 137666
GRANULES (I) 137.10 (137.30) 85602
GVK POWER 19.40 (18.55) 1539265
HBL NIFE POW 73.60 (71.85) 541046
HIND FLUROCA 12.16 (11.59) 22684
HYD INDUS 1524.20 (1496.10) 2175
ILFS ENGINEE 55 (54.70) 23436
INNAREDY COM 3.92 (3.57) 191333
IVRCL INFRAS 7.02 (5.95) 4829208
KAKATIYA CEM 396.90 (392.65) 10078
KALLAM SPG 23.95 (23.15) 33359
KAVERI SEED 548.40 (549) 19239
KCP LTD 138.20 (137.35) 65444
KNR CONSTRUC 319.80 (324.30) 21252
LANCO INDUS 398.20 (399.75) 28741
LAURUS LABS 539.15 (542.90) 17308
LOKESH MACH 72.70 (72.85) 36451
MADHUCON PRO 35.90 (35.65) 155458
MIC ELECTRON 9.66 (9.39) 118541
MOLD-TEK.TEC 76.80 (78.25) 10492
MOLDTK PLA 316.60 (314.85) 4277
NAGARJAGRICH 57.05 (55.85) 43725
NATCO PHARMA 987.85 (961.05) 19946
NAVA BH VENT 151.65 (146.35) 260613
NCC 131.55 (133.80) 918841
NCL IND 249.90 (251.05) 10477
NEHA INTER 10.05 (11.07) 272145
NEULAND LAB 886.55 (891.75) 7767
OIL COUNTRY 53.95 (51.90) 35865
PANYAM CEMEN 62.15 (62.60) 21448
PENNER IND 68.20 (68.80) 136914
PIONEER DIST 206.35 (206.05) 2643
PITTI LAMIN 102.85 (106.65) 28820
PRAJAY ENGS 15.32 (14.95) 111137
PREMIER EXPL 430.55 (432.30) 1020
PRISM CEMENT 116.45 (112.15) 66386
PRUDENTL PHA 6.25 (5.73) 1036350
RAIN INDUSTR 372.15 (371) 397354
SAGAR CEM 887.85 (848.40) 11104
SAMKRG PIST 348.90 (349.10) 12125
SATVAH. ISPA 34.80 (34.65) 18011
SMS PHARMA 102.95 (103.60) 6207
SPHERE GLOBA 47.60 (49.55) 37992
SREE RAYAL A 71.40 (67) 731926
STEEL EXCHAN 44.15 (42.15) 193289
SUJANA METAL 1.74 (1.66) 120916
SUJANA TOWER 4.82 (4.74) 42296
SUJANA UNIVE 0.90 (0.88) 332530
SURYALATA SP 160.80 (150.55) 5265
SUVEN PHARMA 205.05 (203.30) 81850
TAJ GVK HOTE 175.80 (176) 2024
TANLA 40.50 (40.25) 307500
TERA SOFTWAR 72.30 (73.10) 4558
VICEROY HOTE 17.90 (17.85) 44072
VIMTA LABS 167.45 (167.85) 9864
VISAKA IND 655.60 (652.80) 15483
VIVIMED LABS 105.90 (103.95) 252094
YBRANT DIGIT 6.27 (5.61) 3441017
ZENTECH 153 (151.20) 189546


సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్



సరిగ్గా ఆరు నెలల క్రితం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ కొత్త విధానం దేశంలో మరో 50 సంవత్సరాల పాటు కొనసాగొచ్చని అంచనా. గత ఆరు నెలల్లో సుమారు 300 నోటిఫికేషన్ల జారీ ద్వారా చట్టంలో పలు మార్పుచేర్పులను ప్రభుత్వం చేసింది. అయితే ఈ చట్టంపై ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్రజలు, వ్యాపార వర్గాలకు అవగాహన కలగలేదు. వీరికి ఇంకా ఎన్నో సందేహాలు నెలకొన్నాయి. అందుకే రాజకీయ, వ్యాపారపరమైన కారణాలతో చట్టంలో చీటికిమాటికీ మార్పులు చేయకుండా దానిలో స్థిరత్వం తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి.



సంశయం తీరాలి.. ఆశయం నెరవేరాలి

పన్నురేటు శ్లాబ్‌లు పరిమితం కావాలి ● తరచు మార్పులు వద్దు ● రిటర్నులపై మరింత పరిశీలన

'ఏకీకృత పన్నుల విధానం'గా భారత్‌లో జీఎస్టీని అమల్లోకి తేవాలనే సిఫారసును తొలిసారిగా 2004లో విజయ్ కేల్కర్ ప్రతిపాదించారు. ఆ సిఫారసుకు అనుగుణంగా భారత్‌లో జీఎస్టీ అమలుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసేందుకు భారత ప్రభుత్వం కొన్ని కమిటీలను ఏర్పాటు చేసింది. అలా 2009లో 'జీఎస్టీపై తొలి చర్చాపత్రం' జారీ అయ్యింది. పూర్తి స్థాయి జీఎస్టీని ఈ పత్రంలో పొందుపరిచారు. కేంద్రం అమల్లోకి తెచ్చిందీ ఇదే. అయితే ఆ తరవాత చట్టంలో వివిధ మార్పులు చోటు చేసుకున్నాయి.

గత ఆరు నెలల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్‌లో పూర్తి స్థాయి జీఎస్టీని ప్రభుత్వం అమల్లోకి తెస్తుందని ఆశిద్దాం. జీఎస్టీకి సంబంధించి కొత్త ఏడాదిలో ప్రభుత్వం, జీఎస్టీ మండలి ఈకింది చర్యలను చేపడితే బాగుంటుంది. మన దేశం ప్రపంచశక్తిగా ఎదగాలంటే ఇవి తక్షణావసరం. ఎందుకంటే అంతర్గతంగా మనం శక్తిమంతంగా లేకుంటే, ప్రపంచదేశాలతో పోటీపడలేం కదా.



పన్ను రేట్ల సరళీకరణ..

పన్నుల నిర్వహణ సులభతరం కావాలి. అవసరమైతే మరింత సరళం చేయాలి. ప్రస్తుతం 0%, 3%, 5%, 12%, 18%, 28% శ్లాబుల్లో పన్ను రేట్లు ఉన్నాయి. ఇన్ని కాకుండా ఒకటి లేదా రెండు శ్లాబులకు పన్ను రేట్లను పరిమితం చేస్తే బాగుంటుంది. ఇలా చేస్తే పన్ను ఎగవేతలు పరిమితం అవుతాయి. సామాన్య ప్రజలకూ ప్రయోజనం కలుగుతుంది.

రిటర్న్‌ల దాఖలు సరళీకరణ

వ్యాపార లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని పన్ను రిటర్న్‌ల ద్వారా ప్రభుత్వం తెలుసుకుంటుంది. అయితే గతేడాది జులైకు సంబంధించిన రిటర్న్‌ల ప్రక్రియ ఇంతవరకు పూర్తి కాలేదు. రిటర్న్‌ల దాఖలు జాప్యం కాకుండా ప్రభుత్వం సరైన నిర్వహణ చర్యలు తీసుకోలేదనే మాట వినిపిస్తోంది. భారత్‌లో జీఎస్టీ విజయవంతానికి రిటర్న్‌ల దాఖలు ప్రధాన అవరోధంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రెండు మూడు రిటర్న్‌లు కాకుండా జీఎస్టీఆర్-3 రిటర్న్‌ను మాత్రమే నెలకోసారి దాఖలు చేసే వీలు కల్పించాలి. ఇలా చేస్తే రిటర్న్‌ల దాఖలు సులభతరం కావడంతో పాటు జీఎస్టీ అమలూ విజయవంతం అవుతుంది. అయితే ఒకవేళ ఒక్కటే రిటర్న్ విధానాన్ని తీసుకొచ్చిన సందర్భంలో గడువు తేదీలను ప్రభుత్వం మార్చకుండా ఉంటే బాగుంటుంది.

పన్ను పరిధిలోకి పెట్రోలియమ్ ఉత్పత్తులు

ప్రస్తుతం హైస్పీడ్ డీజిల్, పెట్రోలు లాంటి పెట్రోలియమ్ ఉత్పత్తులు జీఎస్టీ పరిధిలో లేవు. వీటికి కూడా జీఎస్టీని వర్తింపజేస్తే ధరలు మరింత తగ్గుతాయి. రవాణా రంగంపై ఆధారపడే ఇతర ఉత్పత్తుల ధరలూ దిగివస్తాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తొలి ఐదేళ్లలో పెట్రోలియమ్ ఉత్పత్తులను కూడా జీఎస్టీ కిందకు తేవాలని ప్రభుత్వం ప్రణాళికలో పెట్టుకుంది. అయితే జీఎస్టీ ప్రతికూలతల నివారణ, వస్తువుల ధరల నియంత్రణకు ఈ ఏడాదే వీటిని జీఎస్టీలోకి తేవాల్సిన అవసరం ఉంది.

నగదు నిల్వ అంతర్గత సర్దుబాటు

ఎలక్ట్రానిక్ క్యాష్ లెడ్జర్‌లో ఉన్న నగదు నిల్వలను అంతర్గతంగా ఇతరత్రా పద్దులకు సర్దుబాటు చేసుకునే చేసుకునే వీలు కల్పించాలి. ప్రస్తుతం ఈ వెసులుబాటు లేదు. అందువల్ల చాలా మంది వ్యాపారులు ఈ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో ఐజీఎస్టీ, సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ అని వర్గీకరణ సరైనదే కాని.. నగదు నిల్వ విషయంలో ఇది సరిపోదు. అందువల్ల నగదు నిల్వ సర్దుబాటుకు సంబంధించి పన్ను చెల్లింపుదారుకే అధికారం కల్పించడం ఉత్తమం.

ఆ నిబంధనను పునరుద్ధరించాలి

జీఎస్టీ మండలి సిఫారసుల మేరకు ముందస్తు చెల్లింపులకు సంబంధించి ఉన్న నిబంధనలను కూడా ప్రభుత్వం నిరవధికంగా వాయిదా వేసింది. ఈ నిబంధనలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలి. లేదంటే ప్రభుత్వ ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

స్టాంప్ డ్యూటీ.. విద్యుత్ కూడా

అద్దె, భాగస్వామ్యం ఒప్పందం, తనఖా తదితరాలకు వ్యాపార సంస్థలు స్టాంప్ డ్యూటీ చెల్లిస్తాయి. ఈ స్టాంప్ డ్యూటీని జీఎస్టీ పరిధిలోకి తెస్తే వ్యాపార లావాదేవీలపై పన్ను మీద పన్ను చెల్లించడం తగ్గుతుంది. ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుంది. విద్యుత్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉంది. విద్యుత్ పన్ను కింద చెల్లించిన మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద తిరిగి పొందే వీలు కల్పిస్తే చాల ఉత్పత్తుల ధరలు గణనీయ స్థాయిలో తగ్గుతాయి. అందువల్ల విద్యుత్తును జీఎస్టీలోకి తీసుకొచ్చేందుకు ఉన్న అవకాశాలపై ప్రభుత్వం అధ్యయనం చేయాలి.

ఇ-వే బిల్లులు

దేశంలోని వ్యాపారులకు వేబిల్లులు కొత్తేమీ కాదు. 60 ఏళ్లకు పైగా వీటిని వాడుతున్నారు. వ్యాపార లావాదేవీల ఆధారాల కోసం వేబిల్లులను ఉపయోగిస్తారు. పన్ను ఎగవేతల నియంత్రణకూ ఇవి తోడ్పడతాయి. అంతర్రాష్ట్ర వస్తువుల సరఫరా సమయంలో ఇ-వేబిల్లుల వాడకం ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటికే దీనిని ప్రభుత్వం నోటిఫై చేసింది. అయితే రాష్ట్రాల జీఎస్టీ చట్టం కింద కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఇ-వేబిల్లులను నోటిఫై చేయడం గందరగోళానికి దారితీసింది. ముఖ్యంగా ఇ-వేబిల్లులను నోటిఫై చేయని రాష్ట్రాల నుంచి సరఫరా జరిగినప్పుడు ఇబ్బందులేర్పడుతున్నాయి. మరోవైపు రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ కూడా సులువుగా ముందుకు వెళ్లడం లేదు. ఇప్పుడు ఇ-వేబిల్లులకు కూడా ఇదే ఇంటర్‌ఫేస్‌ను ఉపయోగిస్తే, వేబిల్లులకు వీడ్కోలు పలకడమే మంచిది. ఎందుకంటే రిటర్న్‌లను దాఖలు చేయడం కోసం కొన్ని రోజులు ఆగమంటే ఆగుతారేమో కాని.. వ్యాపార లావాదేవీలను ఆపమంటే వ్యాపారులు ఆపరు. అందువల్ల సరళవంత ఇంటర్‌ఫేస్‌తో బ్యాండ్‌విడ్త్‌ను ప్రభుత్వం పెంచాలి. అలాగే ఇ-వేబిల్లుల రూకకల్పనకు ఆఫ్‌లైన్ మార్గాలను దూరం పెట్టాలి. ఎందుకంటే ఈ తరహా ప్రక్రియలో వివరాలను అప్‌లోడ్ చేయడానికి అధిక సమయం అవసరం అవుతుంది.

రివర్స్ ఛార్జీ విధానం గడువు పొడిగించొద్దు

జీఎస్టీ కింద నమోదుకాని వ్యక్తి నుంచి కొనుగోళ్లు జరిపినప్పుడు రివర్స్ ఛార్జీ కింద కొనుగోలుదారు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ రివర్స్ ఛార్జీ విధానాన్ని ఈ ఏడాది మార్చి 31 వరకు ప్రభుత్వం వాయిదా వేసింది. ఇలాంటి కీలక నిబంధనలను వాయిదావేయడం జీఎస్టీని తేవడం వెనక ఉన్న ఉద్దేశానికే విరుద్ధం. అందువల్ల ఇప్పటికే ఇచ్చిన గడువు చాలు. దీనిని మరింత పొడిగించకుంటే మంచిది. ఎందుకంటే రివర్స్ ఛార్జీ విధానం వల్ల ఎక్కువ మంది పన్ను పరిధిలోకి వస్తారు. తద్వారా ప్రభుత్వ ఆదాయం కూడా మెరుగవుతుంది.

ముగింపు

పైన పేర్కొన్న అంశాలు నిజంగానే ఆచరణలోకి వస్తే ప్రభుత్వ ఆదాయం పెరగడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత ముందుకు వెళుతుంది. వ్యాపారుల్లో నెలకొన్న ఆందోళన తగ్గుముఖం పట్టేందుకూ ఉపకరిస్తుంది.

జీఎస్టీ రిటర్నుల్లో సవరణకు వీలు

నిబంధనల సడలింపు

దిల్లీ: ప్రతినెలా వ్యాపారులు దాఖలు చేసే జీఎస్టీఆర్-3బీలో తప్పులు సరిదిద్దుకుని, పన్ను చెల్లించేందుకు నిబంధనలను ఆర్థిక శాఖ సడలించింది. తాజా సడలింపు ద్వారా వ్యాపారులు రిటర్న్‌లలో తప్పులను సరిదిద్దుకుని, సరైన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కోరే సౌలభ్యం లభించనుంది. జరిమానా విధిస్తారనే భయం కూడా తగ్గుతుంది. ఈ నిబంధనలను సడలించమని గత కొంతకాలంగా పరిశ్రమ సంఘాలు కోరుతున్నాయి. ఇప్పుడు దీనిపై ఆదేశాలు ఇచ్చింది.

ఐటీ ఇ ఫైలింగ్‌కు కొత్త హెల్ప్‌లైన్

దిల్లీ: ఆన్‌లైన్‌లో రిటర్నులు (ఇ ఫైలింగ్) దాఖలు చేసే పన్ను చెల్లింపుదార్లు, పన్ను సంబంధిత వ్యాపారాలు చేసే వారికి సహాయపడేందుకు కొత్త హెల్ప్‌లైన్ నెంబరును ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది. టోల్‌ఫ్రీ నెంబరు 18001030025, నేరుగా చేసుకునేందుకు +918046122000 నెంబరును వినియోగించుకోవాలని కోరింది. ఆదాయపు పన్ను విభాగం నిర్వహించే పోర్టల్ ద్వారా రిటర్నులు ఇఫైలింగ్ చేస్తుంటారు. ఆదాయపు పన్నుకు సంబంధించి ఇతర కార్యకలాపాలను https:///www.incometaxindiaefiling.gov.in. వెబ్‌సైట్‌లో చేస్తుంటారు. ఇ ఫైలింగ్‌లో ఇబ్బందులేర్పడితే ఈ నెంబర్లలో కాల్ చేయొచ్చు. ఇతర ప్రశ్నలకు మరికొన్ని హెల్ప్‌లైన్ నెంబర్లున్నాయి.

కీలక రంగాలు కూతేశాయ్


నవంబరులో 6.8% వృద్ధి ● ఇది ఏడాది గరిష్ఠ స్థాయి

దిల్లీ: రిఫైనరీ, ఉక్కు, సిమెంట్ వంటి విభాగాలు బలమైన పనితీరు కనబరచడంతో కీలకమైన ఎనిమిది రంగాలు 2017 నవంబరులో 6.8 శాతం మేర వృద్ధి చెందాయి. ఇది ఏడాది గరిష్ఠ స్థాయి కావడం విశేషం. గత అక్టోబరులో పారిశ్రామికోత్పత్తి సూచీ 2.2 శాతం మేర క్షీణించగా, మరుసటి నెలలోనే మౌలిక రంగం పుంజుకోవడం ఊరటనిచ్చే అంశమే. అదీ కాక 13 నెలల గరిష్ఠ స్థాయికి చేరడం గమనార్హం. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్‌లతో కూడిన మౌలిక రంగం 2016 నవంబరులో 3.2 శాతం; 2017 అక్టోబరులో 5 శాతం మేర వృద్ధి చెందాయి. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

- రిఫైనరీ, ఉక్కు, సిమెంటు రంగాల్లో ఉత్పత్తి అంతక్రితం ఏడాది నవంబరుతో పోలిస్తే 2017 నవంబరులో వరుసగా 8.2%, 16.6%, 17.3% చొప్పున పెరిగింది.
- ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తులు సైతం సానుకూల వృద్ధినే కనబరచాయి. కానీ బొగ్గు ఉత్పత్తి మాత్రం ప్రతికూల వృద్ధి నమోదు చేసింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో ఎనిమిది రంగాల వృద్ధి 3.9 శాతం మేర మాత్రమే రాణించింది.. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో 5.3 శాతం మేర వృద్ధి నమోదు కావడం గమనార్హం.

రిటైల్ ద్రవ్యోల్బణం 3.97%

ఆహార వస్తువులు, కిరోసిన్, వంట గ్యాస్ ధరలు పెరగడంతో నవంబరులో పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ-ఐడబ్ల్యూ) 3.97 శాతం పెరిగింది. అంతక్రితం నెలలో ఇది 3.24 శాతం(2017 అక్టోబరు); 2016 నవంబరులో 2.59 శాతం మేర నమోదైంది. కార్మిక శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం.. ఆహార ద్రవ్యోల్బణం 3.91% మేర పెరిగింది. 2017 అక్టోబరులో ఇది 2.26%; 2016 నవంబరులో ఇది 1.66 శాతంగానే ఉంది. నవంబరు నెలలో అఖిల భారత సీపీఐ-ఐడబ్ల్యూ 1 పాయింటు పెరిగి 288కి చేరింది. గోధుమ పిండి, గుడ్లు, పాలు, మాంసం, క్యాబేజీ, క్యారట్, బంగాళా దుంప, విద్యుత్ ఛార్జీలు, ప్రైవేటు ట్యూషన్ ఫీజు, పెట్రోలు, క్షవర ఖర్చులు, తదితరాలు సూచీ పెరగడానికి కారణమయ్యాయి. అయితే మినప పప్పు, పెసర పప్పు, చేపలు, పచ్చి మిరప, అల్లం, వెల్లుల్లి, వంకాయలు, కొత్తిమీర, పాలకూర, యాపిల్, అరటి పండ్లు, తదితరాలు చౌకగా మారి సూచీ ఎక్కువగా పెరగకుండా ఒత్తిడి తీసుకువచ్చాయి.



డెబిట్ కార్డు కొనుగోళ్లపై ఛార్జీల్లేవ్

రూ.2000 వరకు లావాదేవీలపై ● నిన్నటి నుంచే అమల్లోకి

దిల్లీ: డెబిట్ కార్డు, భీమ్ యాప్, ఇతర చెల్లింపు పద్ధతుల ద్వారా చేసే లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలను వినియోగదార్లు కట్టనక్కర్లేదు. దీనిని ఈనెల 1 నుంచే అమల్లోకి తీసుకొచ్చారు. అయితే రూ.2000 వరకు లావాదేవీలపై మాత్రమే దీనికి ఆమోదించారు. గత నెలలో ఆ మేరకు ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదన ప్రకారం రూ.2000 వరకు జరిగే లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు(ఎమ్‌డీఆర్) భారాన్ని ప్రభుత్వం భరిస్తుంది. '2018కి డిజిటల్ శుభాకాంక్షలు. డిసెంబరు త్రైమాసికంలో భీమ్ లావాదేవీలు 86 శాతం పెరిగి 14.56 కోట్లకు చేరాయి. వీటి విలువ రూ.13,714 కోట్లు' అని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు. 'డిజిటల్ చెల్లింపులకు మరింత ఊతం ఇవ్వడం కోసం డెబిట్/భీమ్ ద్వారా చేసే రూ.2000 వరకు లావాదేవీలపై వ్యాపారస్తులపై ఛార్జీలు పడవు. డిజిటల్ మార్గం పట్టండి. పారదర్శకతను పెంచండి' అని ఆయన అన్నారు.

ఎస్‌బీఐ బేస్ రేటు 0.3% తగ్గింది

● 80 లక్షల మందికి ప్రయోజనం

ముంబయి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బేస్ రేటును 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీనివల్ల పాత వడ్డీ రేటు బీపీఎల్ఆర్ (బెంచ్‌మార్క్ ప్రైం లెండింగ్ రేటు) విధానంలో కొనసాగుతున్న 80 లక్షల మంది రుణగ్రహీతలకు కొంత భారం తగ్గనుంది. ఎస్‌బీఐలో ఇప్పటివరకు బీపీఎల్ఆర్ 13.70% ఉండగా.. ఈ తగ్గింపుతో ప్రస్తుతం 13.40%కు చేరింది. బేస్‌రేటు 8.95% నుంచి 8.65% చేరుకుంది. అయితే, బ్యాంకు ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ లెడింగ్ రేట్)లో మాత్రం ఏ మార్పూ చేయలేదు. కొత్త వడ్డీ రేట్లు ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ తగ్గింపుతో బేస్ రేటు, ఎంసీఎల్ఆర్‌ల మధ్య అంతరం కొంత తగ్గనుందని రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ ఎండీ పీకే గుప్తా చెప్పారు. కొత్తగా ఇంటి రుణం తీసుకోవడం, ఇతర బ్యాంకుల నుంచి ఎస్‌బీఐకు మారాలనుకునే వారికి పరిశీలనా రుసుము రద్దు పథకాన్ని మార్చి 31 వరకూ పొడిగించినట్లు బ్యాంకు తెలిపింది.

ప్రభుత్వ పొదుపు బాండ్ల అమ్మకం నేటి వరకే

దిల్లీ: రిటైల్ మదుపర్లకు 8 శాతం వడ్డీ అందించే ప్రభుత్వ పొదుపు బాండ్లు-2003 అమ్మకాన్ని ఈనెల 2వ తేదీ సాయంత్రం నుంచి నిలిపివేస్తున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. 6 ఏళ్ల కాలావాధి ఉండే ఈ బాండ్లను 2003 ఏప్రిల్ 21 నుంచి విక్రయిస్తున్నారు. వీటిల్లో పెట్టుబడి పెట్టేందుకు గరిష్ఠ పరిమితి లేదు. పోస్టాఫీస్ చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్లు తగ్గించిన నేపథ్యంలో, ఈ బాండ్ల అమ్మకాలను నిలిపి వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

లాభాల బాట పట్టండి.. లేకపోతే మూసివేస్తాం

● 300 శాఖలకు

పీఎన్‌బీ హెచ్చరిక ఉత్తర్వులు


దిల్లీ: బ్యాంకు శాఖల హేతుబద్ధీకరణ ప్రణాళికను వేగంగా అమలు చేసే దిశలో పంజాబ్ నేషనల్ బ్యాంకు చర్యలు ప్రారంభించింది. పనితీరు మెరుగుపరచుకోవాల్సిందిగా హెచ్చరిస్తూ, 300 శాఖలకు నోటీసులు ఇచ్చింది. దేశవ్యాప్తంగా నష్టాల్లో ఉన్న శాఖలను గుర్తించి, ఏడాదిలోగా లాభాల్లోకి వచ్చేలా కార్యాచరణలో మార్పులు రావాలని హెచ్చరికలు జారీ చేసినట్లు బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా పీటీఐకి వెల్లడించారు. లేకపోతే మూసివేయడం, ఇతర శాఖల్లో విలీనం లాంటి పరిణామాలు ఉంటాయని తెలిపారు. అయితే, ఇందులో అన్నింటికీ పూర్తి నష్టాలే రావడం లేదనీ, కొన్ని నామమాత్రపు లాభాలతో ఉన్నట్లు పేర్కొన్నారు. పీఎన్‌బీ దేశంలో రెండో అతిపెద్ద బ్యాంకు. దీనికి దేశవ్యాప్తంగా 7వేలకు పైగా శాఖలు ఉన్నాయి. గత నెలలో ఆర్థిక శాఖతో జరిగిన 'పీఎస్‌బీ మంథన్' కార్యక్రమంలో ఈ హేతుబద్ధీకరణ ప్రస్తావన వచ్చింది. విదేశాల్లో ఉన్న శాఖలకు సంబంధించి మెహతా మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా, చైనాల్లో ఉన్న బ్యాంకు కార్యాలయాలను మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. యూకేలో ఉన్న అనుబంధ శాఖ పీఎన్‌బీ ఇంటర్నేషనల్ ఇప్పుడిప్పుడే కాస్త లాభాల బాట పడుతోందనీ, ఇది స్థిరీకరణ దశకు వచ్చాకే.. పెట్టుబడుల ఉపసంహరణ గురించి ఆలోచిస్తామని తెలిపారు.

చలిలోనూ ఇంజిన్ వేడెక్కింది

రాణించిన మారుతీ, హోండా విక్రయాలు ● రెండంకెల్లో అమ్మకాల వృద్ధి

దిల్లీ

సంవత్సరాంతంలో వాహన విక్రయాలు రాణించాయి. మారుతీ సుజుకీ, హోండా కార్స్ ఇండియా(హెచ్‌సీఐఎల్) తదితర సంస్థల విక్రయాల్లో రెండంకెల వృద్ధి సాధించాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా కాస్తంత వృద్ధినే కనబరచగా.. మహీంద్రా అండ్ మహీంద్రా(ఎం అండ్ ఎం) అమ్మకాలు 7 శాతం క్షీణించాయి. మారుతీ సుజుకీ దేశీయ విక్రయాలు 12.1 శాతం హెచ్చి 1,19,286కు చేరుకున్నాయి. ముఖ్యంగా స్విఫ్ట్, డిజైర్, బాలెనోలతో కూడిన కాంప్యాక్ట్ విభాగ విక్రయాలు 23.2 శాతం రాణించడం కంపెనీకి మద్దతుగా నిలిచింది. జిప్సీ, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎస్ క్రాస్, విటారా బ్రెజా వంటి వినియోగ వాహన విక్రయాలు 19.9 శాతం వృద్ధి చెంది 19,276కు; ఆల్టో, వ్యాగన్ ఆర్‌లతో కూడిన


చిన్నకార్ల విభాగం అమ్మకాలు 2% పెరిగి 32,146కు చేరాయి. ఇక హెచ్‌సీఐఎల్ సైతం 26% మేర అమ్మకాల్లో రాణించింది.

దేశీయ విక్రయాలు

కంపెనీ	డిసెంబరు 2016	డిసెంబరు 2017	వృద్ధి/(క్షీణత)
మారుతీ సుజుకీ	1,06,414	1,19,286	12.1
హోండా కార్స్	10,071	12,642	26.0
హ్యుందాయ్ మోటార్	40,057	40,158	--
మహీంద్రా అండ్ మహీంద్రా	16,799	15,543	(7.0)
ఎస్కార్ట్స్ అగ్రి మెషినరీ	3,187	3,606	13.1
వీఈ కమర్షియల్	4,071	6,087	49.5
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటార్	1,84,944	2,56,909	39.0


పూలతోటల మధ్య రాష్ట్రపతి భవనం

నేటి నుంచి రాష్ట్రపతి నిలయం సందర్శనకు అవకాశం

ఈనెల 15 వరకు సామాన్య ప్రజలకు అనుమతి

బొల్లారం(అల్వాల్), న్యూస్‌టుడే: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలోకి మంగళవారం నుంచి సామాన్య ప్రజలను అనుమతించనున్నారు. ఈ నెల 15 వరకు రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలు సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సందర్శించేందుకు అవకాశముంటుంది. అయితే సాయంత్రం 4 గంటల నుంచి ప్రవేశ అనుమతిని నిలిపివేస్తారు. రాష్ట్రపతి నిలయం చరిత్ర, ఉద్యాన వనాల వివరాలు, ఇప్పటి వరకు ఇక్కడ విడిది చేసిన రాష్ట్రపతుల వివరాలు, భవనాల నిర్మాణం, ప్రత్యేకతలు తదితర ఆసక్తికర అంశాలను వివరించేందుకు ప్రత్యేక గైడ్‌లను సైతం ఈ ఏడాది నియమించనున్నారు. నిలయం సందర్శనను తీపి గుర్తుగా మార్చుకోవడానికి సందర్శకులు కెమెరాలతో ఛాయాచిత్రాలు తీసుకోవడానికి అనుమతి ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే వాహనాల ద్వారా నిలయంలోకి ప్రవేశం ఉంటుంది. మిగతా వారందరూ నిలయం ముందు ఉన్న మైదానంలో వాహనాలు నిలిపాల్సి ఉంటుంది. క్యాంటీన్ సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి నిలయం సందర్శనకు అనుమతి ఇచ్చే సంప్రదాయనికి 2011లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ శ్రీకారం చుట్టారు.

విద్యుత్కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా చూడాలి

ఈనాడు, హైదరాబాద్ : వ్యవసాయానికి 24 గంటల సరఫరా ప్రారంభించినందున వినియోగానికి అనుగుణంగా విద్యుదుత్పత్తి కోసం విద్యుత్కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా చూడాలని సింగరేణి అధికారులకు ఆ సంస్థ సీఎండీ శ్రీధర్ సూచించారు. బొగ్గు తవ్వకాలు, రవాణాపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. గత 9 నెలల్లో గనుల నుంచి 4.67 కోట్ల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు అధికారులు వివరించారు. ఇది గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 9 శాతం అధికమని చెప్పారు. వచ్చే మార్చి వరకు రోజుకు 2.10 లక్షల టన్నులు బొగ్గు తవ్వితేనే ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలు నెరవేరతాయని సీఎండీ తెలిపారు. గత నెల 27న ఒక్కరోజులోనే 2.12 లక్షల టన్నులు తవ్వారని ఇదే అత్యధిక రికార్డుగా అధికారులు వివరించారు.

వేగం పుంజుకున్న ఉదయసముద్రం పనులు

ఈనాడు, హైదరాబాద్: లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా చేపట్టిన ఉదయసముద్రం ప్రాజెక్టు పనులు వేగం పుంజుకున్నట్లు నీటిపారుదల శాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారని తెలిపింది. పనుల్లో వేగం పెంచాలని గుత్తేదారులను, ఇంజినీర్లను ఆదేశించడంతో పనులు ఊపందుకున్నాని వెల్లడించింది. జనవరి మాసాంతానికి బ్రాహ్మణవెల్లం రిజర్వాయర్‌లోకి నీళ్లు పడాలన్న మంత్రి సూచనలమేరకు జలాశయం పనులు పూర్తిచేస్తున్నట్లు పేర్కొంది. అప్రోచ్ కాల్వ, సబ్‌స్టేషన్, విద్యుత్తు టవర్ల పనులు పూర్తియ్యాయని, టన్నెల్ నిర్మాణం చివరిదశలో ఉందంది. నల్గొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించింది. నల్గొండ, నార్కెట్‌పల్లి, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, నకిరికల్ మండలాల్లోని 107 ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీరు అందుతుందని స్పష్టం చేసింది.


జాతీయ రహదారి వెంబడి ఆవిష్కరించిన జాతీయ పతాకాలు, హాజరైన ప్రజలు

ఎగిరింది విజయ 'పతాకం'

- కోరుట్లలో ఒకేసారి 101 జాతీయ జెండాల ఆవిష్కరణ
- నిత్య 'జనగణమన'కు శ్రీకారం

కోరుట్ల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలన్న లక్ష్యంతో కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో ఒకేసారి 101 జాతీయ పతాకాలను ఆవిష్కరించడం ద్వారా నిత్య జనగణమన ఆలాపనకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన 101 జాతీయ జెండాలను వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు చింతపట్ల వెంకటాచారి దీన్ని జాతీయ రికార్డుగా ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు అందజేశారు. దీన్ని లిమ్కాబుక్ ఆఫ్ రికార్డు పరిశీలనకూ పంపనున్నట్టు దాని ప్రతినిధులు పేర్కొన్నారు.

సినిమా టికెట్ ధరల నిర్ణయ కమిటీ నుంచి వారిని తొలగించండి

హైకోర్టులో పిటిషన్ దాఖలు

ఈనాడు, హైదరాబాద్: సినిమా టికెట్ ధరలను నిర్ణయించే కమిటీలో ఫిల్మ్‌ఛాంబర్ సభ్యులు, నిర్మాతలు దగ్గుబాటి సురేష్‌బాబు, సి.కల్యాణ్‌లకు సభ్యులుగా స్థానం కల్పించడాన్ని సవాల్జేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. వారిద్దరినీ కమిటీ నుంచి తొలగించాలని, కమిటీలో సభ్యులైన హోం అండ్ సినిమాటోగ్రఫీశాఖ ముఖ్యకార్యదర్శిని చేర్చాలని అభ్యర్థిస్తూ 'సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం' అధ్యక్షుడు జి.ఎల్.నర్సింహారావు వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఓ కమిటీని వేస్తూ జీవో44ను 2017 మార్చిలో జారీ చేసిందన్నారు. ఆ ప్రకారం ధరలను నిర్ణయించే కమిటీలో సురేష్‌బాబు, కల్యాణ్‌లకు సభ్యులుగా స్థానం కల్పించారన్నారు. కమిటీలో నిర్మాతలే సభ్యులుగా ఉండటం తగదన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం, సినిమాటోగ్రఫీ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ హోం, సినిమాటోగ్రఫీ ముఖ్య కార్యదర్శి, నిర్మాతలు దగ్గుబాటి సురేష్‌బాబు, సి.కల్యాణ్‌లను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

నేడు దిల్లీకి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర మంత్రికి వినతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం దిల్లీకి వెళ్లనున్నారు. తెరాస ఎంపీలతో కలిసి ఆయన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర గిరిజనశాఖ మంత్రి జువల్ ఓరమ్‌ను కలువనున్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని అభ్యర్థించనున్నారు. ఈ అంశంపై ఇప్పటికే తెలంగాణ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గిరిజన జాతరకు పలు రాష్ట్రాల నుంచి లక్షల మంది గిరిజనులు, ప్రజలు హాజరవుతారని, జాతీయ పండుగకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నందున కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరతామని ఇంద్రకరణ్‌రెడ్డి 'ఈనాడు'కు తెలిపారు.

శివారు బడిపై శీతకన్ను

- రాజధాని పరిసర పాఠశాలల్లో విద్యార్థుల కిటకిట
- వసతుల్లేవు.. బడుల సంఖ్యా పెరగదు
- వలసలే ప్రధాన కారణం

ఈనాడు, హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు బడులు వెలవెలబోతుంటే... గ్రేటర్ హైదరాబాద్ శివారు జిల్లాల్లోని పాఠశాలలు మాత్రం విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. ఉన్నత పాఠశాలలను పరిశీలిస్తే విద్యార్థుల సంఖ్య వందల నుంచి వేలకు చేరుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పొట్ట చేతపట్టుకొని వస్తున్న కుటుంబాలు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పిస్తున్నాయి. ఫలితం ఏటా బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. విద్యాశాఖ మాత్రం ఆ పాఠశాలలను అభివృద్ధి చేయటం లేదు...శివార్లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త బడులనూ ప్రారంభించడం లేదు. ఒక వైపు విద్యార్థులు తక్కువ మంది ఉంటున్నారని విలీనం చేస్తామంటూ ప్రణాళికలు రూపొందిస్తున్న విద్యాశాఖ...మరో వైపు భారీ సంఖ్యలో పిల్లలున్న బడులనూ చిన్నచూపు చూస్తోందని విద్యావేత్తలు ఆవేదన చెందుతున్నారు.


కూకట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి గది ఇది. నిలుచున్న వారంతా వలస కుటుంబాలకు చెందిన, ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులు

హైదరాబాద్‌కు తెలంగాణ నుంచే కాదు.. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాల నుంచీ వేలాది కుటుంబాలు ఏటా వలస వస్తుంటాయి. ఫలితంగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో గత 15 సంవత్సరాలుగా జనాభా భారీగా పెరిగింది. 2001లో రంగారెడ్డి జిల్లా జనాభా 35,75,064 ఉండగా...2011 నాటికి అది 52,96,741కు చేరుకుంది. ఫలితంగా ఏటా కూకట్‌పల్లి, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, ఎల్‌బీనగర్, ఉప్పల్, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లోని బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.


మాదాపూర్ చంద్రనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో ఆగిపోయిన గదుల నిర్మాణం

మాదాపూర్‌లోని హైటెక్ సిటీ సమీపంలోని చంద్రనాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో 170 మంది పిల్లలున్నారు. ఇక్కడ రెండే గదులున్నాయి. మరో రెండు గదుల నిర్మాణం ఏడాదిన్నరగా పూర్తికాకుండా ఆగిపోయింది. కనీసం ప్రహరీ గేటు కూడా లేదు. ప్రధానోపాధ్యాయుడు, మరో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా...ప్రమాదంలో గాయపడి ప్రధానోపాధ్యాయుడు నెలన్నర నుంచి సెలవులో ఉన్నారు. మరో ఉపాధ్యాయుడు ఉన్నత చదువుల కోసం రెండేళ్లపాటు సెలవుపై వెళ్లారు. అయినా వారి స్థానంలో విద్యావాలంటీర్‌ను నియమించలేదు. మాదాపూర్‌లోనే ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. ప్రాథమిక బడికి గదుల నిర్మాణం నాలుగేళ్లుగా పూర్తికాలేదు. ప్రాథమికోన్నత పాఠశాల భవనానికి 2014 నవంబరులో మంత్రి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేసినా ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదు.

ఇదీ పరిస్థితి...

నగర శివారు ప్రాంతాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను 'ఈనాడు' ప్రతినిధి పరిశీలించినపుడు.. ఏటా పిల్లల సంఖ్య పెరుగుతున్నా అందుకు తగినట్లు వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదని స్పష్టమైంది. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేస్తే ఎవరో ఒకరికి ఇన్‌ఛార్జి బాధ్యత అప్పగిస్తున్నారు. వారు ఒకవైపు పాఠాలు చెబుతూ.. మరో వైపు పర్యవేక్షణ చేయడం సమస్యగా మారింది.

- కూకట్‌పల్లి ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం 802 మంది ఉండగా ఇప్పుడు ఆసంఖ్య 846కు పెరిగింది. అక్కడ 6వ తరగతి విద్యార్థులకు బల్లలు కూడా లేవు. భద్రతా సిబ్బంది లేరు. అదే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతిలో 'కొత్తగా వచ్చిన విద్యార్థులు ఎంతమంది?' అని అడినపుడు సగం మంది లేచి నిలబడ్డారు. వారి తల్లిదండ్రులు నగరానికి వలస రావడంతో ఆ విద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొందారు.
- మేడ్చల్ జిల్లాలో దాదాపు 500-1500 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలున్నాయి. దాదాపు 15 ఉన్నత పాఠశాలలకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులే ఉండటం గమనార్హం. రంగారెడ్డి పరిధిలోకి వచ్చే మన్సూరాబాద్ పాఠశాలలను పరిశీలిస్తే అక్కడా ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడే ఉన్నారు. ఒక్క శేరిలింగంపల్లి మండలంలోని 17 మంది ఉపాధ్యాయ ఖాళీలున్నాయి.
- తక్కువ పిల్లలున్న పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం చూస్తోంది. మరో వైపు ఎక్కువ విద్యార్థులున్న వాటిపైనా దృష్టి సారించడం లేదని అఖిల భారత విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు విమర్శించారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అధ్యయనం చేసి కొత్త పాఠశాలలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

భారీగా ఉపాధ్యాయ ఖాళీలు

పాత జిల్లాల ప్రకారం చూస్తే... రంగారెడ్డి జిల్లాలో కేవలం 2015 సెప్టెంబరు నాటి లెక్కల ప్రకారమే 1,269 ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల తర్వాత అత్యధిక ఖాళీలున్నది రంగారెడ్డి జిల్లాలోనే కావడం గమనార్హం. తాజా గణాంకాలను పరిశీలిస్తే మరిన్ని ఖాళీలు ఉంటాయి. కొత్త జిల్లాల ప్రకారం చూసినా.. మేడ్చల్ జిల్లాలో 199, రంగారెడ్డి జిల్లాలో 521 ఖాళీలున్నాయి.

రెండు జిల్లాల్లో సర్కారు పాఠశాలలు.. విద్యార్థుల సంఖ్య

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం
మేడ్చల్	370	25	105	500
విద్యార్థుల సంఖ్య	38,900	4,053	40,474	83,427
రంగారెడ్డి	879	180	241	1300
విద్యార్థుల సంఖ్య	62,249	19,034	68,694	1,49,977

గొట్టిపాడులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

కర్రలు, రాళ్లతో పరస్పర దాడులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుక సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులో చోటుచేసుకున్న సంఘటన ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసు బలగాలు, అడిషనల్ ఎస్పీ వైటీ నాయుడు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆదివారం అర్ధరాత్రి ఓ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు యువకులు గ్రామ వీధిలో ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతూ, విన్యాసాలు చేశారు. ఆ సమయంలో ఓ ఇంటి ముందు మరో సామాజిక వర్గానికి చెందిన మహిళ, బాలిక ముగ్గులు వేస్తున్నారు. కొద్ది సేపటికి విన్యాసాలు చేస్తున్న యువకులు జారి కిందపడ్డారు. ఆ శబ్దానికి భయపడిన మహిళ, బాలిక ఒకరిపై ఒకరు పడి స్వల్పంగా గాయపడ్డారు. అక్కడున్న పెద్దలు యువకులను గట్టిగా మందలించి పంపారు. సోమవారం ఉదయం ఆ యువకులు తమ పెద్దలను తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఇరు సామాజిక వర్గాల మధ్య వాగ్వాదం మొదలై, ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, 144 సెక్షన్ విధించారు. కలెక్టరు కోన శశిధర్, అర్బన్ ఎస్పీ విజయరావు గ్రామానికి చేరుకొని, ఇరువర్గాలతో మాట్లాడి ఘర్షణకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకున్నారు.


ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

లండన్‌లో కత్తిపోట్లతో నలుగురు యువకుల మృతి

- నూతన సంవత్సర వేడుకల్లో దారుణాలు

లండన్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా లండన్‌లోని వేర్వేరు ఘటనల్లో నలుగురు యువకులు కత్తిపోట్లకు గురై మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బ్రిటీష్ రాజధాని నగరంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మృతులంతా 17-20 ఏళ్ల వయసు వారే కాగా.. అధికారులు వేర్వేరుగా దర్యాప్తు చేపట్టారు. లండన్‌లో యువకులపై కత్తులతో దాడులు అధికమవుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. 2017లో దాదాపు 80 మంది కత్తిపోట్లకు గురై మృతిచెందారు.

పీఆర్‌టీయూ తెలంగాణ దైనందిని ఆవిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర సంఘం దైనందినిని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సచివాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. మండలి చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి, సంఘంఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, చెన్నయ్యతోపాటు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

భూదస్త్రాల ప్రక్షాళనపై ఉన్నతస్థాయి పరిశీలన

- సీనియర్ అధికారుల నేతృత్వంలో బృందాలు
- లోపాలు సరిదిద్దేందుకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: భూదస్త్రాల ప్రక్షాళన ప్రక్రియను మరోసారి తరచి చూసేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు జరిగిన ప్రక్రియను, రెవెన్యూ బృందాలు అనుసరించిన విధానాలను ఈ బృందాలు పరిశీలించనున్నాయి. సీనియర్ అధికారులకు ఈ బృందాల బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్లకు సూచిస్తూ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లాలకు ప్రత్యేక సర్క్యులర్ జారీ అయింది. సంయుక్త కలెక్టర్, డీఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలో బృందాలు ఏర్పాటు చేస్తారు. ఒక్కో బృందానికి రెండు, మూడు మండలాలు కేటాయిస్తారు. డిసెంబర్ 31 వరకు 30 జిల్లాల్లో నిర్వహించిన ప్రక్షాళన, అనంతరం బృందాలు తయారుచేసిన దస్త్రాలను నిశితంగా పరిశీలిస్తారు. ఎక్కడైనా పొరపాట్లు చోటుచేసుకున్నా, ఇంకా చేయాల్సిన పనులు మిగిలి ఉన్నా త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక అధికారులు చొరవచూపాలి. సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి సమర్పించేందుకు 24 అంశాలతో కూడిన ప్రత్యేక నమూనాను మండలాలకు పంపించారు.


సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కార్యాలయంలో భూదస్త్రాల ప్రక్షాళన పత్రాలు

పునఃపరిశీలన బృందాలు ఏమేం చేస్తాయంటే..

- సర్వే నెంబర్ల వారీగా విస్తీర్ణం, సేత్వారీ లేదా ఖాస్రా లేదా సెస్లా పహాణీ ఆధారంగా పునఃపరిశీలన
- 1బీ నకలు పంపిణీ, మొదటి గ్రామసభ నిర్వహణపై సమీక్ష, క్షేత్రస్థాయిలో వచ్చిన ఫిర్యాదుల పరిశీలన
- రైతుల అభ్యంతరాలు సరిచేశాక పంపిణీ చేసిన 1బీ ప్రక్రియ, చివరి గ్రామసభలో మినిట్స్ పరిశీలన

సేకరించనున్న సమాచారం

- గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఆస్తుల వివరాలు
- ప్రభుత్వ భూముల వివరాలు, సాగుకు పనికొచ్చేవి, పనికిరాని(అసైన్డ్‌తో కలిపి) వాటి సమాచారం.
- ఇతరుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూముల వివరాలు. ఆ భూముల్లో ఉన్నవారి సామాజిక,ఆర్థిక పరిస్థితి.
- అటవీ భూములు, వక్ఫ్ ఆస్తులు.
- వ్యవసాయేతర ప్రయోజనాల కోసం పక్కన పెట్టిన ప్రభుత్వ, పట్టా భూములు.
- భూసేకరణ పూర్తయిన భూములు, అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలు.

దస్త్రాలకు ప్రత్యేక భద్రత

1956 అనంతరం దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టడం, క్షేత్రస్థాయిలో అనేక మార్పుచేర్పులు నమోదు చేస్తున్న దృష్ట్యా పత్రాలన్నింటినీ భద్రపరిచేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి దస్త్రాన్ని స్కానింగ్ చేయించాలని, తర్వాత ట్రంకుపెట్టెల్లో పెట్టి భద్రత ఉన్న గదుల్లో ఉంచాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.

అట్టుడుకుతున్న ఇరాన్

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేలాది మంది వీధుల్లోకి
- ఘర్షణల్లో 12 మంది మృతి

టెహ్రాన్: నిరసనలతో ఇరాన్ అట్టుడుకుతోంది. దేశవ్యాప్తంగా హింస చెలరేగుతోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేలాది మంది వీధుల్లో ప్రదర్శనలకు దిగుతున్నారు. ఉక్కుపాదం మోపుతామనే హెచ్చరికలను తోసిరాజని వీరు నిరసనలు చేపడుతున్నారు. ఘర్షణల్లో ఇప్పటివరకూ 12 మంది మరణించారు. సాయుధ నిరసనకారులు సోమవారం పోలీసు స్టేషన్లు, సైనిక స్థావరాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఇస్ఫాహన్, మష్హాద్ సహా పలు పట్టణాల్లో నిరసనలు హింసాత్మకంగా మారినట్లు సామాజిక అనుసంధాన వేదికల్లోని వీడియోలు చెబుతున్నాయి. మరోవైపు టెలిగ్రాం, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సామాజిక అనుసంధాన వేదికలను ప్రభుత్వం బ్లాక్ చేసింది. దీంతో స్పష్టమైన సమాచారం అందడంలేదు.

నాలుగు రోజుల నుంచీ: చతికిలబడుతున్న ఆర్థిక వ్యవస్థ.. వేళ్లూనుకున్న అవినీతి.. నిత్యావసరాలు, ఇంధన ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా గురువారమే మష్హాద్ పట్టణంలో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. వీధుల్లోకి వస్తున్న నిరసనకారుల సంఖ్య క్రమంగా భారీ స్థాయికి పెరుగుతోంది. అత్యున్నత పాలకుడు అయతుల్లా ఖమేనీ విధానాలను వీరు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

'ఇవన్నీ సౌదీ కల్పించిన కథలే' : నిరసనలు, ఘర్షణలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఇరాన్ ఖండిస్తోంది. ఆ వార్తలన్నీ సౌదీ అరేబియా, ఐరోపాలో తిష్టవేసిన కొన్ని అజ్ఞాత ముఠాలు సృష్టిస్తున్నాయని చెబుతోంది. నిరసనకారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అంతర్గత మంత్రి అబ్దుల్ రెహమాన్ ఫాజిల్ హెచ్చరికలూ జారీచేశారు. మరోవైపు నిరసనలు కొనసాగితే ఉక్కుపాదం మోపుతామని ఇరాన్ రివొల్యూషనరీ గార్డ్స్ సైతం హెచ్చరించింది.

ఈ నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. 'ఇరాన్ ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ విఫలమైంది. అక్కడి ప్రజలను ఏళ్లుగా అణచివేస్తున్నారు. వారు ఆకలితో అలమటిస్తున్నారు. స్వేచ్ఛ, మానవ హక్కుల ఊసేలేదు. వారి సొత్తును కొల్లగొడుతున్నారు. మార్పునకు సమయం ఆసన్నమైంది'అని ట్రంప్ తాజాగా ట్వీట్‌చేశారు.

అటక మీదే ఆనకట్టల భద్రతా సిఫార్సులు

- శ్రీశైలం విషయంలోనూ అంతే..
- త్వరలో 'భద్రతా బిల్లు'కు తుదిరూపు ఇవ్వనున్న కేంద్ర జలసంఘం

ఈనాడు, హైదరాబాద్: ఆనకట్టల భద్రత విషయంలో చర్యలకు ఎన్ని సిఫార్సులు వస్తున్నా.. అవి అమలుకు నోచుకోవడం లేదు. శ్రీశైలం డ్యాం వరద ప్రవాహం ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డ్యాం భద్రత కమిటీ సిఫార్సు చేసినా.. ఇప్పటివరకు దీని అమలుకు కార్యాచరణ ప్రారంభం కాలేదు. ఒక్క శ్రీశైలమే కాదు దేశంలోని అనేక భారీ ఆనకట్టల విషయంలోనూ పరిస్థితి అలాగే ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర జలసంఘం త్వరలో జాతీయ ఆనకట్టల భద్రతా బిల్లుకు తుదిరూపు ఇవ్వనుంది. ఆ తర్వాత దాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఆనకట్టలకు నష్టం వాటిల్లితే ప్రజల ప్రాణాలు, ఆస్తులతోపాటు పర్యావరణంపై కూడా ప్రభావం పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఏటా వర్షాకాలం ముందు, తర్వాత వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవడం తదితర అనేక అంశాలపై దృష్టి పెట్టిన కేంద్ర జలసంఘం..జాతీయ డ్యాం సేఫ్టీ బిల్లును సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ముసాయిదాను తెచ్చిన జలసంఘం, ఈ నెల 22న త్రివేండ్రంలో జరిగే జాతీయ ఆనకట్టల భద్రాతా కమిటీ సమావేశంలో చర్చించి తుది బిల్లును ఖరారు చేయనుంది.

- దేశంలో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న ప్రాజెక్టులను జాతీయ ప్రాధాన్యత గలవిగా జలసంఘం గుర్తించింది. వీటితో పాటు ఆయా రాష్ట్రాల్లోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల భద్రతపై కూడా దృష్టి పెట్టనుంది.
- జాతీయ ప్రాధాన్య ప్రాజెక్టులు 59 ఉన్నట్లు గుర్తించగా, ఇందులో తెలుగు రాష్ట్రాల్లో శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉన్నాయి. జాతీయ ప్రాధాన్యం గలవాటితో పాటు అన్ని ప్రాజెక్టులకు అత్యవసర కార్యాచరణ ప్రణాళిక - రిజర్వాయర్ నిర్వహణకు ఓ కార్యాచరణను రూపొందించనున్నారు. దేశవ్యాప్తంగా ఓ విధానం ఉండేలా జలసంఘం చూడనుంది.
- భూకంప తీవ్రత ఉన్న ప్రాంతాల్లోని డ్యాంలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఇతర డ్యాంల వద్ద ఎలాంటి పరికరాలు ఉండాలి.. ఇలా అనేక అంశాలు బిల్లులో ఉన్నాయి.
- శ్రీశైలం ద్వారా 19 లక్షల నుంచి 30 లక్షల క్యూసెక్కుల వరకు వరద నీటిని బయటకు పంపడానికి ఏం చేయాలన్నదానిపై పలు పద్ధతుల్లో అధ్యయనం జరిగింది. శ్రీశైలానికి ఎక్కువ వరద వచ్చినపుడు వెనక భాగం నుంచి పాములపాడు ద్వారా మళ్లించడానికి సంబంధించిన అధ్యయనం కూడా పూర్తయిందని సంబంధిత ఇంజినీర్లు నివేదించారు. అయితే స్పిల్‌వే సామర్థ్యం పెంచడానికి సంబంధించిన అధ్యయనం పూర్తి కాకపోవడాన్ని జాతీయ కమిటీ ప్రశ్నించింది.
- నాగార్జునసాగర్ డ్యాంకు అత్యవసర కార్యాచరణ ప్రణాళిక ఖరారు తుది దశలో ఉందని తెలంగాణ ఇంజినీర్లు కమిటీకి నివేదించారు.
- ఆంధ్రప్రదేశ్‌లో 142, తెలంగాణలో 162 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు సంబంధించిన అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయాల్సి ఉంది. డ్యాంల భద్రతకు సంబంధించి ప్రత్యేక కమిటీలు నియమించి వీటి ద్వారా తనిఖీ చేయించనున్నారు.
- ఈ నెల 22న జాతీయ డ్యాం భద్రత కమిటీ సమావేశం, 23, 24వ తేదీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులతో వివిధ అంశాలపై చర్చించిన తర్వాత బిల్లుకు తుది రూపం ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఛాంపియన్స్



స్టోక్స్ వన్డేల్లోనూ ఆడడు

లండన్: అంతర్జాతీయ క్రికెట్లో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ భవితవ్యం మరింత సందిగ్ధంలో పడింది. ఓ దాడి కేసులో చిక్కుకున్న స్టోక్స్ మూడు నెలలకు పైగా ఇంగ్లాండ్ జట్టుకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రతిష్టాత్మక యాషెస్ టెస్టు సిరీస్‌లో కూడా ఆడలేకపోయాడతను. ఐతే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం స్టోక్స్‌ను ఇంగ్లాండ్ జట్టులోకి ఎంపిక చేయడంతో అంతర్జాతీయ క్రికెట్లోకి అతడి పునరాగమనం లాంఛనమే అని భావించారంతా. కానీ ఇప్పుడు ఆ అవకాశం కూడా స్టోక్స్ చేజారింది. యాషెస్ తర్వాత జరగాల్సిన వన్డే సిరీస్‌కు ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) స్టోక్స్‌ను దూరం పెట్టింది. యాషెస్ సిరీస్‌లో సత్తా చాటుతున్న డేవిడ్ మలన్‌ను స్టోక్స్ స్థానంలో ఎంపిక చేసినట్లు ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో బ్రిస్టల్ నైట్‌క్లబ్ దగ్గర జరిగిన గొడవలో ఇరుక్కున్న స్టోక్స్‌పై ఈసీబీ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి స్టోక్స్‌పై విచారణ నడుస్తున్నప్పటికీ.. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసింది ఈసీబీ. ఐతే ఈ కేసు విషయమై క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ (సీపీఎస్) నిర్ణయం వెలువడితే అందుకనుగుణంగా స్టోక్స్‌పై నిర్ణయం తీసుకోవాలని ఈసీబీ భావించింది. కానీ సీపీఎస్ ఇంకా నిర్ణయం వెలువరించకపోవడంతో స్టోక్స్‌ను పక్కన పెట్టక తప్పలేదు. ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మధ్య ఐదు వన్డేల సిరీస్ ఈ నెల 14న ఆరంభమవుతుంది.

ఐపీఎల్‌లో ఆడుకోవచ్చు: మరోవైపు స్టోక్స్.. ఐపీఎల్‌లో ఆడుకోవడానికి తమకు అభ్యంతరం లేదని ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు తెలిపింది. దాడి కేసులో పోలీసు దర్యాప్తు పూర్తయ్యే వరకు స్టోక్స్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం కుదరదని.. అప్పటి వరకు ఐపీఎల్‌తో పాటు న్యూజిలాండ్‌లో దేశవాళీ పోటీల్లో కూడా అతను ఆడుకోవచ్చని ఈసీబీ పేర్కొంది. 2016 ఐపీఎల్‌లో పుణె సూపర్ జెయింట్స్ స్టోక్స్‌ను రూ. 14.5 కోట్లకు కొన్న సంగతి తెలిసిందే.

తెలుగు రాష్ట్రాల జోరు

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు రాష్ట్రాల జోరు కొనసాగుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్లు చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ 46-19తో చండీగఢ్‌పై ఘనవిజయం సాధించి ప్రిక్వార్టర్‌ఫైనల్ అవకాశాల్ని మెరుగుపర్చుకుంది. అంతకుముందు తెలంగాణ 23-35తో తమిళనాడు చేతిలో ఓడింది. ఐతే బిహార్‌తో జరిగిన మ్యాచ్‌ను 32-32తో డ్రా చేసుకోవడంతో తెలంగాణ నాకౌట్ ఆశలు సజీవంగా నిలిచాయి. తర్వాత చండీగఢ్‌పై విజయంతో ఆతిథ్య జట్టుకు అవకాశాలు మెరుగయ్యాయి. ఆంధ్రప్రదేశ్ 50-18తో బెంగాల్‌పై నెగ్గింది. మహిళల విభాగంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు నిరాశ ఎదురైంది. తెలంగాణ 27-42తో బెంగాల్ చేతిలో, ఆంధ్రప్రదేశ్ 15-31తో బిహార్ చేతిలో ఓడాయి.

బెంగళూరు అదరహో..



సిక్కి రెడ్డి

లఖ్‌నవూ: పీడబ్ల్యూఎల్‌లో బెంగళూరు బ్లాస్టర్స్ సోమవారం 6-(-1)తో ముంబయి రాకెట్స్‌ను మట్టికరిపించింది. మూడో మ్యాచ్‌ను బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకోగా ప్రపంచ ఛాంపియన్ విక్టర్ అక్సెల్సెన్ 15-6, 15-13తో సన్ వాన్ హో (ముంబయి)ను ఓడించాడు. దీంతో 4-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన బెంగళూరు.. పోరులో విజయాన్ని ఖాయం చేసుకుంది. ముంబయి ఒక్క మ్యాచ్‌లోనూ నెగ్గలేదు. ట్రంప్ మ్యాచ్‌లోనూ ఓడిపోయి మైనస్ స్కోరులోకి వెళ్లిపోయింది. తొలి మ్యాచ్ (మిక్స్‌డ్ డబుల్స్)లో సిక్కి రెడ్డి-రంగ్ జంట 15-8, 10-15, 15-10తో అర్జున్, గాబ్రియెలా స్టొయెవా జోడీని ఓడించడం ద్వారా బెంగళూరుకు శుభారంభాన్నిచ్చింది. రెండో మ్యాచ్‌లో గిల్మోర్ (బెంగళూరు) 15-14, 15-8తో బీవెన్ జాంగ్‌పై గెలిచింది. ఐదో మ్యాచ్‌ను ముంబయి ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకోగా.. సమీర్ వర్మ 15-9, 8-15, 6-15తో ఫెంగ్ (బెంగళూరు) చేతిలో ఓడిపోయాడు. ఆఖరుగా పురుషుల డబుల్స్‌లో మ్యాచ్‌లో మతియాస్ బూ, కిమ్ రంగ్ ద్వయం 9-15, 15-10, 15-14తో లి యోంగ్ డే, హ్యోంగ్ తాన్ (ముంబయి) జంటపై నెగ్గింది.

ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్నా అదో అనామక జట్టు. ఆటగాళ్లూ అంతే. రంజీ ట్రోఫీ మొదలైందంటే అతి తక్కువ లేదా అంచనాలే లేని జట్ల జాబితాలో అది తప్పక ఉంటుంది. ఏనాడూ క్వార్టర్‌ఫైనల్ దాటి ఎరగదు. ఎప్పుడూ టైటిల్ పోటీదారు కాదు. కానీ ఈసారి ఆ అనామక జట్టే కసితో రగిలిపోయింది. అచంచల ఆత్మవిశ్వాసంతో, సమష్టి కృషితో పెను ప్రకంపనలు సృష్టించింది. చెత్త నేపథ్యాన్ని చరిత్రలో కలిపేస్తూ, దిగ్గజ జట్లను తోసిరాజంటూ విదర్భ జట్టు తొలిసారి రంజీ ఛాంపియన్‌గా అవతరించింది. యువ పేస్ బౌలర్ రజ్‌నీష్ గుర్బాని సంచలన బౌలింగ్‌తో విదర్భ చారిత్రక విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు.

విదర్భకు పట్టం

- తొలిసారి రంజీ టైటిల్ కైవసం
- ఫైనల్లో దిల్లీపై ఘనవిజయం

ఇండోర్

రంజీ ట్రోఫీలో కొత్త అధ్యాయం మొదలైంది. పట్టుదలతో ఆడిన విదర్భ జట్టు రంజీ ట్రోఫీ సరికొత్తగా విజేతగా నిలిచింది. నాలుగో రోజు రోజు, సోమవారం ముగిసిన రంజీ ఫైనల్లో విదర్భ 9 వికెట్ల తేడాతో ఏడుసార్లు ఛాంపియన్ దిల్లీపై ఘనవిజయం సాధించింది. 29 పరుగుల నామమాత్రమైన లక్ష్యాన్ని విదర్భ ఒక వికెట్ కోల్పోయి అలవోకగా ఛేదించింది. జాఫర్ (17), సంజయ్ (9) అజేయంగా నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో దిల్లీ 295 పరుగులకు ఆలౌట్‌కాగా.. విదర్భ 547 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో దిల్లీ 280 పరుగులు చేసింది. ఆరు వికెట్లతో తొలి ఇన్నింగ్స్‌లో దిల్లీ పతనాన్ని శాసించిన గుర్బాని "మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్" అవార్డును అందుకున్నాడు.

విజృంభించిన వాఖరె, సర్వతె: ఓవర్‌నైట్ స్కోరు 528/7తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ.. మరో 19 పరుగులు జోడించి 547 పరుగులకు ఆలౌటైంది. సెంచరీ హీరో అక్షయ్ వాడ్కర్ (133) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు ఒక్క పరుగూ జోడించకుండానే నిష్క్రమించాడు. నవ్‌దీప్ సైని ఐదు వికెట్లు పడగొట్టాడు. 252 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన విదర్భ, అనంతరం బంతితోనూ విజృంభించింది. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దిల్లీ.. ఏ దశలోనూ ఓటమి తప్పించుకునేలా కనిపించలేదు. వాఖరె (4/95), సర్వతె (3/30)ల ధాటికి 76 ఓవర్లలో 280 పరుగులకే ఆలౌటైంది. నితీష్ రాణా (64), ధ్రువ్ షోరె (62) చక్కని బ్యాటింగ్‌తో మంచి ఆధిక్యంపై దిల్లీలో ఆశలు రేపారు. ఐతే షోరెను సర్వతె ఔట్ చేయడంతో దిల్లీ ఇన్నింగ్స్ మళ్లీ గతి తప్పింది. రంజీ ట్రోఫీ గెలిచిన విదర్భ జట్టుకు ఆ రాష్ట్ర క్రికెట్ సంఘం రూ.5 కోట్ల నజరానా ప్రకటించడం విశేషం.



"గుర్బాని కచ్చితంగా భారత జట్టుకు ఆడతాడు. ఆ విషయంలో 110 శాతం నమ్మకంతో ఉన్నా" – మాజీ స్పిన్నర్ నరేంద్ర హిర్వాణీ

గుర్బాని

దిల్లీ తొలి ఇన్నింగ్స్: 295
విదర్భ తొలి ఇన్నింగ్స్: 547
దిల్లీ రెండో ఇన్నింగ్స్: చందేలా (సి) గుర్బాని (బి) వాఖరె 9; గంభీర్ ఎల్బీ (బి) గుర్బాని 36; షోరే (సి) వాడ్కర్ (బి) సర్వతె 62; రాణా (సి) వాడ్కర్ (బి) గుర్బాని 64; రిషబ్ పంత్ (సి) వాంఖడె (బి) నెరాల్ 32; హిమ్మత్ సింగ్ (బి) వాఖరె 0; మనన్ శర్మ (బి) వాఖరె 8; వికాస్ మిశ్రా (స్టంప్డ్) వాడ్కర్ (బి) సర్వతె 34; సైని (సి) సర్వతె (బి) వాఖరె 5; ఆకాశ్ సుదన్ (సి) వాంఖడె (బి) సర్వతె 18; ఖెజ్రోలియా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (76 ఓవర్లలో ఆలౌట్) **280; వికెట్ల పతనం:** 1-32, 2-50, 3-164, 4-189, 5-190, 6-222, 7-228, 8-234, 9-279; **బౌలింగ్:** గుర్బాని 8-2-92-2; ఠాకరె 12-6-14-0; వాఖరె 8-2-95-4; సర్వతె 9-1-30-3; నెరాల్ 9-1-39-1
విదర్భ రెండో ఇన్నింగ్స్: ఫైజల్ ఎల్బీ (బి) ఖెజ్రోలియా 2; సంజయ్ నాటౌట్ 9; జాఫర్ నాటౌట్ 17; ఎక్స్‌ట్రాలు 4 మొత్తం: (5 ఓవర్లలో వికెట్ నష్టానికి) **32; వికెట్ల పతనం:** 1-2; **బౌలింగ్:** ఖెజ్రోలియా 3-0-21-1; ఆకాశ్ సుదన్ 2-0-7-0

నాన్న సివిల్ ఇంజినీర్.. అమ్మ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్.. తమ్ముడు ఐఐటీలో చదువుతున్నాడు. ఇలా విద్యావంతులు కుటుంబం నుంచి వచ్చిన అతను కూడా సివిల్ ఇంజినీరింగ్ చేశాడు. కానీ మనసంతా క్రికెట్‌పైనే. అందుకే సివిల్ ఇంజినీర్‌గా ఏ నిర్మాణం కోసమో కాకుండా తన రంజీ జట్టు విజయాల కోసం ప్రణాళికలు రచించాడు. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశాడు. అనామక జట్టయిన విదర్భ తొలిసారి రంజీ ట్రోఫీ ఛాంపియన్‌గా నిలిచిందంటే ప్రధాన కారణం అతడే. ఫైనల్లోనూ అదరగొట్టి దిల్లీ వెన్నువిరిచిన ఆ పేస్ బౌలింగ్ సంచలనం రజ్‌నీష్ గుర్బాని. భవిష్యత్తులో భారత జట్టుకు ఆడే బౌలర్‌గా ప్రశంసలందుకుంటున్నాడు.

గుభాళించిన గుర్బాని


ఈనాడు డిజిటల్, హైదరాబాద్

అది కర్ణాటక, విదర్భ మధ్య రంజీ సెమీఫైనల్ మ్యాచ్.. కర్ణాటక గెలవాలంటే 198 పరుగులు చేయాలి. చేతిలో పది వికెట్లు ఉన్నాయి. ఇక ఆ జట్టుదే విజయమని అంతా అనుకున్నారు. కానీ నాలుగో రోజు ఏడు వికెట్లు పడడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఆ రోజు రాత్రి గుర్బాని సరిగా నిద్ర పోలేదు. ఎప్పుడు తెల్లారుతుందా.. ఎప్పుడు బౌలింగ్ చేద్దామా? తన జట్టుకు విజయాన్ని అందిద్దామా అనే ఆలోచనలోనే ఉన్నాడు. ఉదయం ఐదు గంటలకే లేచి ఎప్పుడు లేనిది ఆరు గంటల కల్లా జెర్సీ వేసుకుని మ్యాచ్‌కు సిద్ధమయ్యాడు. చివరి రోజు కర్ణాటక టెయిలెండర్లు పోరాడడంతో మ్యాచ్ విదర్భ చేతుల్లోంచి పోతున్నట్లు అనిపించింది. కానీ గుర్బాని చివరి మూడు వికెట్లు పడగొట్టి సంచలన విజయాన్ని అందించాడు. విదర్భను తొలిసారిగా రంజీ ఫైనల్‌కు చేర్చాడు.

దిల్లీతో ఫైనల్ మ్యాచ్.. దిల్లీ స్కోరు 290/6. అప్పటికే ధ్రువ్ భారీ సెంచరీ చేసి ఊపుమీద ఉన్నాడు. దిల్లీకి భారీ స్కోరు ఖాయం అని అంతా భావించారు. కానీ అప్పుడే గుర్బాని మళ్లీ తన బౌలింగ్‌తో మాయ చేశాడు. ఆరు పరుగుల వ్యవధిలో చివరి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అందులో హ్యాట్రిక్ ఉండడం విశేషం. రంజీ ఫైనల్ మ్యాచ్‌లో హ్యాట్రిక్ తీసిన రెండో బౌలర్‌గా అతడు రికార్డు సృష్టించాడు.

అనామకుడిగా అడుగుపెట్టి..: *ఈ రంజీ సీజన్ ఆరంభమయ్యే సమయానికి రజ్‌నీష్ గుర్బాని అనేవాడు విదర్భ జట్టుకే పరిమితం. బయట ఎవరికీ అతడి పేరు పెద్దగా తెలియదు. గత సీజన్‌లో అరంగేట్రం చేసిన అతడు నాలుగు మ్యాచ్‌లాడి 13 వికెట్లు పడగొట్టాడు. ఈసారి కూడా గుర్బాని మీద ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. అందుకు తగినట్లే ఆరంభ మ్యాచ్‌ల్లో ప్రభావం చూపలేకపోయాడు. కానీ నాకౌట్ నుంచి అతడి జోరు మొదలైంది. అతడి పేస్‌కు ఎదురే లేకుండా పోయింది. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, పదునైన స్వింగ్‌తో విజృంభించిన గుర్బాని.. బ్యాట్స్‌మెన్‌ను ముప్పుతిప్పలు పెట్టాడు. కేరళతో క్వార్టర్‌ఫైనల్లో ఏడు వికెట్లు పడగొట్టి విదర్భను గెలిపించిన అతడు.. సెమీఫైనల్లో 12 వికెట్లతో, దాదాపు ఒంటి చేత్తో కర్ణాటకపై విదర్భను విజేతగా నిలిపాడు. దీంతో అతడి పేరు మార్మోగిపోయింది. అదే జోరు కొనసాగిస్తూ దిల్లీతో ఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టి విదర్భ విజయానికి గట్టి పునాది వేశాడు. గుర్బాని ఆత్మస్థైర్యం, పట్టుదల, పోరాటతత్వం గాయాలను కూడా లెక్క చెయ్యవు. దిల్లీతో మ్యాచ్ తొలిరోజు రెండు వికెట్లు తీసిన తర్వాత మోకాలి గాయంతో మైదానాన్ని వీడాడు. రెండో రోజు బౌలింగ్ చేస్తాడో లేదో అని అనుమానం కలిగింది. కానీ జట్టుకు అవసరమైన సమయంలో వచ్చి గుర్బాని అద్భుత ప్రదర్శన చేశాడు. హ్యాట్రిక్ సహా నాలుగు వికెట్లు పడగొట్టాడు. సహచరులతో కలిసి సగర్వంగా ట్రోఫీని అందుకున్నాడు.*

మరో భువి!: *బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలిగే సామర్థ్యం కారణంగా ఇప్పుడు అందరూ గుర్బానిని టీమ్ ఇండియా పేసర్ భువనేశ్వర్ కుమార్‌తో పోలుస్తున్నారు. "అతడు భారత జట్టుకు కచ్చితంగా ఆడతాడు. ఆ విషయంలో 110 శాతం నమ్మకంతో ఉన్నా" అని గుర్బానిపై విశ్వాసాన్ని ప్రకటించాడు మాజీ లెగ్‌స్పిన్నర్ నరేంద్ర హిర్వాణీ. "గుర్బాని ఈ సీజన్‌లో దొరికిన ఆణిముత్యం" అన్నది మాజీ పేసర్ అతుల్ వాసన్ మాట. నిజమే సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ (37 వికెట్లు) బౌలర్‌గా నిలిచిన అతడు.. ముందు ముందూ ఈ నిలకడను కొనసాగిస్తే భారత క్రికెట్‌కు ఆణిముత్యం దొరికినట్లే. వచ్చే ఐపీఎల్ వేలంలో ఈ విదర్భ వీరుడి పంట పండితే ఆశ్చర్యం లేదు.*



మోర్కెల్



ఆమ్లా

గత ఏడాదిలో టెస్టుల్లో ఎవరెలా?

బ్యాట్స్‌మన్	మ్యాచ్‌లు	పరుగులు	సగటు	ఉత్తమం
ఆమ్లా	12	947	47.35	137
ఎల్గర్	12	1128	53.71	199
డుప్లెసిస్	10	706	54.30	135*
బౌలర్	**మ్యాచ్‌లు**	**వికెట్లు**	**సగటు**	**ఉత్తమం**
మోర్కెల్	9	39	23.02	7/179
ఫిలాండర్	9	25	24.24	7/75
రబాడ	11	41	29.58	10/63

"సొంతగడ్డపై ఎదురొచ్చిన ప్రతి ప్రత్యర్థినీ ఓడించారు. ఇక కఠినమైన విదేశీ పర్యటనల్లోనూ గెలిచి సత్తా చాటండి"

దక్షిణాఫ్రికాలో భారత జట్టు పర్యటన నేపథ్యంలో అభిమానుల ఆంకాక్ష ఇది! టీమ్‌ఇండియాది వాపు కాదు, బలుపే అని చూపించాల్సిన సమయం ఆసన్నమైంది! ఇంకో మూడు రోజుల్లోనే సఫారీ జట్టుతో మహాపోరు మొదలవబోతోంది. అక్కడి పిచ్‌ల, పరిస్థితులు.. భారత్‌కు సవాలు విసురుతాయనడంలో సందేహమే లేదు. ఐతే పిచ్‌లు, పరిస్థితుల సంగతి తర్వాత.. ముందు దక్షిణాఫ్రికా జట్టు సంగతేంటి..? ఆ జట్టు బలాబలాలేంటి..? ప్రత్యర్థి ఫామ్ ఎలా ఉంది..?

శత్రు సేన.. బహు భీకరం!

ఈనాడు క్రీడావిభాగం

సొంతగడ్డపై ఏ జట్టయినా బలమైందే. దక్షిణాఫ్రికా కూడా అందుకు మినహాయింపేమీ కాదు. ఇక ఆ జట్టు బలం గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. గత దశాబ్ద కాలంలో ప్రపంచ అత్యుత్తమ జట్లలో ఒకటిగా కొనసాగుతోంది దక్షిణాఫ్రికా సేన. మధ్యలో కొన్నాళ్ల పాటు నంబర్‌వన్ జట్టుగా కూడా కొనసాగింది. ఐతే మూడేళ్ల కిందట భారత పర్యటనలో పరాభవం ఎదుర్కొన్నాక దక్షిణాఫ్రికా కొంచెం గాడి తప్పింది. కెప్టెన్సీ మార్పు.. డివిలియర్స్ టెస్టులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం.. స్టెయిన్ గాయంతో ఏడాది పాటు జట్టుకు దూరం కావడం ఆ జట్టును కొంత దెబ్బ తీశాయి. అయినప్పటికీ ఆ జట్టు ఫామ్ తీసిపడేసేలా అయితే లేదు. గత ఏడాది కాలంలో దక్షిణాఫ్రికా 12 టెస్టులాడి 7 మ్యాచ్‌లు గెలిచింది. మూడు ఓడింది. రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. సొంతగడ్డపై ఆడిన ఐదు టెస్టుల్లోనూ నెగ్గింది. కాకపోతే ఆ జట్టుకు సొంతగడ్డపై బలమైన ప్రత్యర్థులెవరూ ఎదురు కాలేదు. ఫామ్ సంగతలా ఉంచితే.. భారత్‌తో సిరీస్‌కు భీకరమైన జట్టుతో బరిలోకి దిగుతోంది దక్షిణాఫ్రికా. డుప్లెసిస్ కెప్టెన్‌గా కుదురుకున్నాడు. డివిలియర్స్ మళ్లీ టెస్టు జట్టులోకి వచ్చాడు. స్టెయిన్ కూడా ఫిట్‌నెస్ సాధించాడు. మొత్తంగా భారత్‌తో సిరీస్‌కు పూర్తి బలంతో సిద్ధమైంది సఫారీ జట్టు.

ఏడో స్థానంలో అతడు: క్వింటన్ డికాక్.. వన్డేల్లో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఆరంభించే బ్యాట్స్‌మన్. భారత్‌పై వన్డేల్లో పరుగుల వరద పారించిన రికార్డు (10 మ్యాచ్‌ల్లో 72 సగటు, 5 సెంచరీలతో 720 పరుగులు) అతడికుంది. అలాంటి ఆటగాడు దక్షిణాఫ్రికా టెస్టు జట్టులో ఏడో స్థానంలో ఆడుతున్నాడు. దీన్ని బట్టే దక్షిణాఫ్రికా బ్యాటింగ్ బలం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది పరుగుల వరద పారించిన ఓపెనర్ ఎల్గర్.. నిలకడకు మారుపేరైన ఆమ్లా.. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా చెలరేగి ఆడే డివిలియర్స్.. ఇటీవలి కాలంలో టెస్టుల్లో నిలకడ అందుకుని కెప్టెన్‌గా ఎంతో బాధ్యతాయుతంగా ఆడుతున్న డుప్లెసిస్.. ఇలా దక్షిణాఫ్రికా బ్యాటింగ్ దుర్భేద్యంగా ఉంది. కొత్త ఓపెనర్ మర్క్రమ్, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ బవుమా కూడా భారత్ ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన ఆటగాళ్లే.

ఎటు చూసినా..: దక్షిణాఫ్రికా పిచ్‌లంటేనే ఫాస్ట్‌బౌలర్లకు స్వర్గధామాలు. అలాంటి పిచ్‌లపై ప్రపంచంలోనే మేటి పేస్ దళంతో బరిలోకి దిగుతోంది సఫారీ జట్టు. ఇంతకుముందైతే అందరి కళ్లూ స్టెయిన్ మీదే ఉండేవి. ఐతే ఇప్పుడు స్టెయిన్ కంటే మిగతా బౌలర్లే ఎక్కువ ప్రమాదకరంగా కనిపిస్తున్నారు. సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మోర్నీ మోర్కెల్‌తోనే భారత్‌కు ఎక్కువ ముప్పు పొంచి ఉంది. ఆరున్నర అడుగుల పొడగరి అయిన మోర్నీ.. పేస్, బౌన్స్‌తో బెంబేలెత్తిస్తాడు. అతను ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవలే జింబాబ్వేతో నాలుగు రోజుల టెస్టులో మోర్నీ నిప్పులు చెరిగాడు. ఆ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసిపోవడానికి అతనే కారణం. ఇక యువ పేసర్ కాగిసో రబాడ గత రెండు మూడేళ్లలో అంతర్జాతీయ క్రికెట్లో తనదైన ముద్ర వేశాడు. భారత్‌పై అతనాడిన మూడు టెస్టుల్లో రాణించలేదు కానీ.. సొంతగడ్డపై పేసర్లకు అనుకూలించే పరిస్థితుల్లో అతను ఎంతో ప్రమాదకారే. అలాగే ఫిలాండర్ కూడా నాణ్యమైన ఫాస్ట్‌బౌలరే. రబాడతో పాటు ఫిలాండర్ కూడా గత ఏడాది చక్కటి ప్రదర్శన చేశారు. ఆల్‌రౌండర్ ఫెహ్లుక్వాయో కూడా కొంత కాలంగా నిలకడగా రాణిస్తున్నాడు. అతను పేస్‌తో బాగానే ప్రభావం చూపిస్తున్నాడు. ఇంకా మరో ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్ కూడా అందుబాటులో ఉన్నాడు. స్పిన్ విషయంలో దక్షిణాఫ్రికా అంత పట్టింపుతో లేదు. భారత సంతతి స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఒక్కడినే జట్టులోకి ఎంపిక చేసింది. అతను నిలకడగా రాణిస్తూ దక్షిణాఫ్రికా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

భారత్‌పై టెస్టుల్లో ఎవరెలా?

బ్యాట్స్‌మన్	మ్యాచ్‌లు	పరుగులు	సగటు	ఉత్తమం
ఆమ్లా	18	1325	45.68	253*
డుప్లెసిస్	6	257	25.70	134
డివిలియర్స్	17	1123	40.10	217*
ఎల్గర్	4	137	19.57	38
బౌలర్	**మ్యాచ్‌లు**	**వికెట్లు**	**సగటు**	**ఉత్తమం**
స్టెయిన్	13	63	21.41	10/108
మోర్కెల్	14	45	28.31	7/114
ఫిలాండర్	3	13	22.23	7/129
రబాడ	3	2	55.50	1/30

అభిమానిని కొట్టినందుకు...




షబ్బీర్ రెహ్మాన్

ఢాకా: అభిమానిని కొట్టినందుకు బంగ్లాదేశ్ క్రికెటర్ షబ్బీర్ రెహ్మాన్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ పోగొట్టుకున్నాడు. ఇటీవల ఎన్‌సీఎల్ లీగ్‌లో ఓ మ్యాచ్‌లో ఈ ఘటన జరిగింది. ఇన్నింగ్స్ విరామంలో ఒక అభిమాని తనను ఎగతాళి చేశాడని భావించిన షబ్బీర్ ఉడికిపోయాడు. మ్యాచ్ మధ్యలో పెవిలియన్‌కు వచ్చిన షబ్బీర్... సైట్ స్క్రీన్ దగ్గరికి ఆ 12 ఏళ్ల బాలుడిని పిలిపించి కొట్టాడు. ఇది గమనించిన రిజర్వ్ అంపైర్ షబ్బీర్‌ను సంజాయిషీ కోరగా.. అతడినీ దూషించాడు. షబ్బీర్ చర్యల్ని తీవ్ర క్రమశిక్షణ రాహిత్యంగా భావించిన బంగ్లా బోర్డు.. అతని సెంట్రల్ కాంట్రాక్ట్ రద్దు చేయడమే కాక, దేశవాళీ పోటీల్లో పాల్గొనకుండా ఆరు నెలల నిషేధం, రూ.15 లక్షల జరిమానా కూడా వేసింది.

ఒక్క లెవల్ క్రాసింగ్ కూడా లేకుండా..!

- అమరావతి రైలు మార్గంలో భద్రతకు ప్రాధాన్యం
- 106 కి.మీ. 200 వంతెనలు
- రెండు మార్గాల్లో భవిష్యత్తులో రెండో లైను నిర్మాణానికి అవకాశం?
- ఆ మేరకు ఇప్పుడే భూసేకరణకు రైల్వేశాఖ నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అనుసంధానించే రైలు మార్గాల నిర్మాణంలో భద్రతకు కీలక ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు(56.8కి.మీ., రెండు లైన్లు), అమరావతి-పెదకూరపాడు(24.5కి.మీ., సింగిల్‌లైను), సత్తెనపల్లి-నరసరావుపేట(25కి.మీ., సింగిల్ లైను)... మూడు నూతన మార్గాలు కలిపి 106 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. ఇందులో ఒక్కచోట కూడా లెవల్‌క్రాసింగ్ రాకుండా దక్షిణ మధ్య రైల్వే భద్రతకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా ఆయా మార్గాల అలైన్‌మెంట్లను ఖరారు చేసింది.

రైలు ప్రమాదాల్లో ఎక్కువ భాగం లెవల్ క్రాసింగ్‌ల వద్ద జరుగుతుంటాయి. పట్టాలను దాటేక్రమంలో చాలా వాహనాలు రైలు ప్రమాదాలకు గురవుతుంటాయి. హైదరాబాద్ సమీపంలోని మాసాయిపేట లెవల్‌క్రాసింగ్ వద్ద మూడేళ్లక్రితం రైలు ఢీకొన్న ప్రమాదంలో 19 మంది పాఠశాల విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా మూడోవంతు రైలు ప్రమాదాలు లెవల్‌క్రాసింగ్‌ల వద్దే జరుగుతున్నట్లు అంచనా. దేశంలో 28 వేల పైచిలుకు లెవల్ క్రాసింగ్‌లు ఉండగా 9వేలకుపైగా కాపలా లేని క్రాసింగ్‌లున్నాయి.

ఆర్వోబీలు, ఆర్‌యూబీలు

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి.. ఉత్తర, దక్షిణ భారతం నుంచి రాకపోకలకు వీలుగా అమరావతికి మూడు కొత్త రైలు మార్గాలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి తుది సర్వేని పూర్తిచేసి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను దక్షిణ మధ్య రైల్వే.. రైల్వే బోర్డుకు నవంబరులో పంపింది. పలు చోట్ల రోడ్డు మార్గాలు ఉన్న ప్రాంతాల నుంచి కొత్త రైలు మార్గాలు రానున్నాయి. లెవల్ క్రాసింగ్‌లు ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండటంతో.. ఆయా ప్రాంతాల్లో రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ), రోడ్ అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)లను నిర్మించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. తద్వారా ఆయా మార్గాల్లో రైలు వచ్చేటప్పుడు గేటువేయడం, వాహనాల రాకపోకలకు ఆటంకం వంటి ఇబ్బందులు ఉండవు. వాహనాల రాకపోకలు ఆర్వోబీల మీదుగా, ఆర్‌యూబీల నుంచి సాఫీగా సాగిపోతాయని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

కిలోమీటరుకు రెండు వంతెనలు

మొత్తం వంతెనలు	200
భారీ వంతెన 1. కృష్ణా నదిపై	2.5 కిమీ
పెద్ద వంతెనలు	52
చిన్న వంతెనలు	147
ఆర్వోబీలు	23
ఆర్‌యూబీలు	3
మూడు రైలు మార్గాల దూరం	106 కిమీ
మొత్తం అంచనా	రూ. 3,272.03 కోట్లు

687 హెక్టార్ల భూసేకరణ

మొత్తం మూడు లైన్లకు కలిపి 687 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని రైల్వేశాఖ తుది సర్వేలో గుర్తించింది. అమరావతి-పెద్దకూరపాడు, సత్తెనపల్లి-నరసరావుపేట లైన్లను ప్రస్తుతం సింగిల్‌లైన్‌గానే నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. అయితే భవిష్యత్తులో వివిధ ప్రాంతాల నుంచి రాజధాని అమరావతికి పెరిగే రాకపోకల్ని దృష్టిలో పెట్టుకుని భూసేకరణకు ఇబ్బంది రాకుండా.. రెండో లైనుకూ అవసరమైన భూమిని కూడా గుర్తించింది. రెండు లైన్లకు అవసరమైన భూసేకరణ లెక్కల్ని పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌లో పేర్కొంది.

మానవత్వానికి మరోరూపం!

- ఆత్మహత్య చేసుకునేందుకు పట్టాలపై పడుకున్న వ్యక్తి
- రైలు ఆపి కాపాడిన కేరళ ఎక్స్‌ప్రెస్ చోదకుడు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై పడుకున్న వ్యక్తిని కాపాడేందుకు రైలు చోదకుడు సూపర్‌ఫాస్ట్ రైలును ఆపి మానవత్వాన్ని చాటుకున్న ఉదంతమిది. ఈ అరుదైన ఘటనకు పెద్దపల్లి జిల్లా వేదికైంది. మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల సత్యరవీందర్‌గౌడ్‌కు పదహారేళ్ల కిందట శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన శోభారాణితో వివాహమైంది. కుటుంబంలో కలతల కారణంగా దంపతులు పదిహేనేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. ఇటీవల ఆస్తి పంపకాల విషయంలోనూ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయానికొచ్చాడు.


సత్యరవీందర్‌గౌడ్

సోమవారం చివరిసారిగా భార్యను చూసేందుకు కూనారం వెళ్లాడు. ఆమె లేకపోవడంతో.. కుమారుణ్ని కలిశాడు. తర్వాత గొల్లపల్లి రైల్వేగేటు సమీపంలో పట్టాలపై పడుకున్నాడు. కాజీపేట నుంచి బల్హార్షా వైపు వెళ్తున్న కేరళ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ దూరం నుంచి గమనించి సమీపంలో రైలు ఆపాడు. బాధితుణ్ని అటుగా వెళ్తున్న స్థానికులకు అప్పగించాడు. కదులుతున్న రైలు కింద పడేందుకు మరోసారి యత్నించిన సత్యరవీందర్‌గౌడ్‌ను స్థానికులు అడ్డుకుని బంధువులకు అప్పగించారు.

పసిమొగ్గపై.. పైశాచికం

- అపహరించి.. మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం
- పోలీసులకు చిక్కిన కామాంధుడు

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో మూడేళ్ల బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడ్డాడో కామాంధుడు. ఆర్టీసీ డ్రైవర్ చొరవతో చిన్నారి ప్రాణాలతో బయటపడింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న మహిళ ఆదివారం సాయంత్రం కూరగాయలు కొనేందుకు మూడేళ్ల కుమార్తెతోపాటు సంతకు వెళ్లింది. కూరగాయలు కొంటున్న సమయంలో పాపను కిందకు దించగా.. కొన్ని నిముషాల వ్యవధిలోనే చిన్నారి అదృశ్యమైంది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరుగెడుతూ పట్టుబడిన నిందితుడు

ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఓ వ్యక్తి రక్తపు మరకలు అంటిన దుస్తులు ధరించిన చిన్నారిని ఎత్తుకొని పరుగులు తీస్తుండగా భెల్ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ గమనించాడు. అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ ప్రాంతలోనే గస్తీకాస్తున్న పోలీసులు నిందితుణ్ని అదుపులోకి తీసుకుని చిన్నారిని రక్షించారు. నిందితుడు అమీన్‌పూర్ గ్రామపరిధి మారుతీనగర్ వాసి శ్రీనివాస్(47)గా గుర్తించారు. సంతలో బాలికను అపహరించిన అనంతరం కిలోమీటరు దూరంలో ఉన్న భెల్ డిపో వెనక్కి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్టు విచారణలో తేలిందని సీఐ భాస్కర్ వివరించారు. బాధిత చిన్నారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చినట్టు చెప్పారు.


పవిత్ర మాఘమేళాను పురస్కరించుకుని సంప్రదాయ పద్ధతిలో కుండల్లోని నీటితో స్నానం చేయడానికి సిద్ధమైన అహ్మదాబాద్ బాలలు

చక్కెర మార్కెట్ మాయాజాలం

- పతనమవుతున్న టోకు ధరలు
- వినియోగదారులకు తగ్గని చిల్లర ధర
- డిమాండు లేదని పంట ధర పెంచని మిల్లులు
- 2.51 కోట్ల టన్నుల ఉత్పత్తి అంచనా

ఈనాడు, హైదరాబాద్: చక్కెర మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలంలో చిక్కుకోవడంతో చెరకు రైతులు నష్టపోతున్నారు. గత నెలన్నరగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చెరకు పంటను రైతులకు మిల్లులకు తెచ్చి అమ్ముతున్నారు. దీనిని గానుగాడి కొత్త చక్కెర ఉత్పత్తి రావడంతో టోకు ధరల పతనం ప్రారంభమైంది. గత దీపావళి సమయంలో క్వింటా చక్కెర ధర రూ. 3500 ఉండగా ఇప్పుడు రూ. 3100కు తగ్గింది. ఇది మరింత పతనమై రూ. 2900కు రావచ్చని టోకు వ్యాపారుల అంచనా. దేశంలో చక్కెర ఏడాదిలో రికార్డు స్థాయిలో 2.51 కోట్ల టన్నుల చక్కెర ఉత్పత్తి కావచ్చని 'భారత చక్కెర మిల్లుల సంఘం'(ఇస్మా) వెల్లడించింది. గతేడాది 2.03 కోట్ల టన్నులే ఉత్పత్తి అయింది. 40 లక్షల టన్నుల చక్కెర పాత నిల్వలు ఉన్నందున టోకు మార్కెట్‌లో డిమాండు లేదని వ్యాపారులు ధరలు తగ్గించేస్తున్నారు. దీపావళి సమయంలో చిల్లర మార్కెట్‌లో కిలో రూ. 38 వరకూ ఉండగా ఇప్పుడూ చాలాచోట్ల దానికి కాస్త అటు ఇటూగా అమ్ముతున్నారు. కానీ టోకు ధరలు తగ్గాయంటూ రైతులకు పంటకిచ్చే ధరను మిల్లులు పెంచడం లేదు.

సాగు వ్యయానికి పొంతనే లేదు

తెలంగాణలో టన్ను చెరకు పండించడానికి రూ. 3300 వ్యయమవుతున్నట్లు చక్కెర శాఖ అధ్యయనంలో గుర్తించారు. ఇప్పుడు రాష్ట్రంలో మొత్తం ఏడు ప్రైవేటు మిల్లులు గానుగాడుతుండగా ఒకదానిలో టన్నుకు రూ. 2,550 మాత్రమే ఇస్తున్నారు. మిగతావాటిలోనూ రికవరీ శాతం ఆధారంగా రూ. 2700 నుంచి 3005 రూపాయల వరకూ చెల్లిస్తామని చెబుతున్నారు. 9.5 శాతం చక్కెర ఉత్పత్తి(రికవరీ) అయితే టన్నుకు రూ. 2550 ఇవ్వాలని కేంద్రం 'పారదర్శక గిట్టుబాటు ధర'(ఎఫ్ఆర్‌పీ)ని నిర్ణయించింది. ఇంతకన్నా పెరిగేకొద్దీ ఒక్కో శాతానికి రూ. 268 చొప్పున చెల్లించాలి. కామారెడ్డి ప్రాంతంలో పండించే చెరకు పంట నాణ్యతమైనది కావడంతో అధిక రికవరీ వస్తున్నందున రూ. 3005 దాకా చెల్లిస్తున్నారు. గతేడాది వరకూ రికవరీ శాతంపై ఇచ్చే సొమ్ముకు అదనంగా రూ. 300 దాకా మిల్లులు చెల్లించేవి. చక్కెరకు డిమాండు లేనందున అధిక ధర ఇచ్చేది లేదంటున్నాయి. రైతు చెరకును మిల్లుకు ఇచ్చిన 15 రోజుల్లో సొమ్మును అతని బ్యాంకు ఖాతాలో వేయాలి. కానీ పలు మిల్లులు నిబంధనను పాటించడంలేదు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 25 లక్షల టన్నుల దాకా చెరకు మిల్లులకు వస్తుందని, ఇప్పటికే 7.40 లక్షల టన్నులను గానుగాడినట్లు చక్కెర కమిషనర్ భద్రు మాళోత్ 'ఈనాడు'కు చెప్పారు.

ప్రాణాలు తీసిన అతివేగం

కడప జిల్లాలో అయిదుగురు మృతి

ఈనాడు, కడప: కడప జిల్లా పెండ్లిమర్రి మండలం ఇందిరానగర్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు యువకులు. చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లికి చెందిన బ్రహ్మానందరెడ్డి మరో ఇద్దరితో కలిసి వేంపల్లె సమీపంలో జరిగిన ఓ విందుకు హాజరయ్యాడు. అక్కడి నుంచి కారులో తిరిగి కడప వస్తుండగా సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఇందిరానగర్ వద్ద ప్రమాదం జరిగింది. అదే కాలనీకి చెందిన భాస్కర్(27), గిరి(16), లక్ష్మీనరసింహ(14), కార్తీక్(12) నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని రోడ్డుపక్కన చలిమంట వేసుకుని కూర్చున్నారు. కారు అదుపుతప్పి వారిపైకి దూసుకెళ్లడంతో వాహనం కిందపడి నలిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. కారు బోల్తాపడి అనేక పల్టీలు కొట్టింది. వాహనం నడుపుతున్న బ్రహ్మానందరెడ్డి కూడా ప్రాణాలు విడిచాడు. వెంకటసుమంత్ అనే మరో చిన్నారికి తీవ్రగాయాలు కాగా.. తిరుపతిలో చికిత్స పొందుతున్నారు.


మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని పొక్కూరులో ముంపునకు గురికానున్న భూములు

పరిహారంలో వ్యత్యాసం

- భూపాలపల్లి జిల్లాలో ఎకరాకు రు.10.5 లక్షలు.. మంచిర్యాలలో రు.7.8 లక్షలు
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా భూపాలపల్లి-మంచిర్యాల జిల్లాల సరిహద్దున గోదావరిపై నిర్మిస్తున్న అన్నారం బ్యారేజీకి భూసేకరణ పరిహారం చెల్లింపుల్లో వ్యత్యాసాలు చోటుచేసుకుంటున్నాయి. జీవో ఒక్కటే అయినా పక్కపక్కజిల్లాల్లోనే అందించే పరిహారం మాత్రం వేర్వేరుగా ఉంటోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎకరాకు రు. 10.5 లక్షలు, మంచిర్యాల జిల్లాలో మాత్రం ఎకరాకు రు. 7.8 లక్షలు చెల్లిస్తూ పరిహారంలో వ్యత్యాసం చూపుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఉన్నవి తెల్లబంగారం పండించే నల్లరేగడి భూములైనా తమకు తక్కువ పరిహారం ఇస్తున్నారంటూ రైతులు వాపోతున్నారు. బ్యారేజీ నిర్మాణంలో మంచిర్యాల జిల్లా సరిహద్దున ఉన్న చెన్నూరు మండలంలోని పలు గ్రామాల్లో 385 మంది రైతులకు చెందిన 462.11 ఎకరాల భూములు, భూపాలపల్లి జిల్లాలో సుమారు 350 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. పరిహారం విషయంలో పక్క జిల్లా రైతులతో పోల్చుకుంటే తమకు తీరని అన్యాయం జరిగిందని.. తమ భూములు సారవంతమైనవని మంచిర్యాల జిల్లా రైతులు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు భూములకు ప్రాథమిక విలువను గుర్తించడంతోపాటు రైతులతో మాట్లాడి పరిహారాన్ని నిర్ణయించామని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో పరిహారం ఎలా ఇస్తున్నారో తమకు తెలియదన్నారు.

పట్టుబడితే చాలు.. విమాన మెక్కిస్తారు!

- బెంగళూరులో నైజీరియన్లపై సరికొత్త అస్త్రం
- అదే హైదరాబాద్‌లో తీవ్ర నిర్లక్ష్యం
- దీంతో పెరిగిపోతున్న మత్తుమందుల విక్రయం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

హైదరాబాద్ మహానగరంలో కొంతమంది నైజీరియన్లు అసాంఘిక శక్తులుగా మారి యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి పెద్దఎత్తున మత్తుమందులను రాజధానికి తీసుకువచ్చి యువతకు ఎరగా వేస్తున్నారు. కొంతమంది నైజీరియన్లు అనేక కేసుల్లో అరెస్టయినా భయం లేకుండా మళ్లీ వాటిని విక్రయించి భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. నేరాల్లో పాల్గొంటున్న నైజీరియన్లను వారి దేశానికి పంపించే ఏర్పాటు లేకపోవడంతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. బెంగళూరు పోలీసులు నేరాల్లో పాల్గొంటున్న నైజీరియన్లను బలవంతంగా విమానం టిక్కెట్ తీసుకుని వారి దేశానికి పంపించేస్తున్నారు. ఇదే విధంగా హైదరాబాద్ పోలీసులు వ్యవహరిస్తేనే ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

రాజధానిలో మత్తుమందుల విక్రయాలు కొనుగోళ్ల కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. 2015లో ఈ తరహా కేసులు 27 నమోదైతే.. 2017 డిసెంబర్ రెండో వారం వరకు 94 కేసులు నమోదయ్యాయి. 2015లో 274 కేజీల గంజాయి పట్టుబడితే 2017లో 914 కేజీలను పట్టుకున్నారు. కొకైన్ వినియోగం కూడా నగరంలో పెరుగుతోంది. ఓపీయం 2015లో 1850 గ్రాములు దొరికితే.. గత ఏడాది 8 వేల గ్రాములను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2015లో మత్తుమందులకు సంబంధించి 66 మందిని అరెస్టు చేయగా ఇందులో 10 మంది నైజీరియన్లు ఉన్నారు. గత ఏడాది 187 మందిని అరెస్టు చేస్తే 18 మంది నైజీరియన్లు ఇతర విదేశీయులున్నారు. నైజీరియన్లు ఇక్కడి వారిని కూడా మత్తుమందుల వ్యాపారంలోకి దించి కళాశాల విద్యార్థులకు ఇతరులకు వీటిని పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. బెంగళూరులో ఈ మత్తుమందుల విక్రయంలో నైజీరియా, ఘనా, సూడాన్ తదితర దేశాలకు చెందిన యువకులు అధికంగాగి పట్టుబడుతున్నారు. దీనిని మొగ్గలోనే తుంచేయాలన్న ఉద్దేశంతో ఏదైనా కేసుల్లో ఈ దేశాలవారు పట్టుబడితే ఆ మరునాడే వీరికి విమాన టిక్కెట్ తీసి బలవంతంగా వారి దేశాలకు పంపించేస్తున్నారు. దీంతో అక్కడ మత్తుమందుల విక్రయం చాలా వరకు తగ్గిందని బెంగళూరు పోలీసులు చెబుతున్నారు. అదే హైదరాబాద్‌కు వచ్చేటప్పటికి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నారు. ఈ కేసుల్లో నిందితులు బెయిల్ పొంది బయటకు వచ్చిన తరువాత తిరిగి మత్తుమందుల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా 15 మందికిపైగా నైజీరియన్లపై అయిదారు కేసులు నమోదై ఉన్నాయంటే వీరు ఈ వ్యాపారంలో ఎంతగా ఆరితేరారో ఇట్టే తెలుస్తోంది. దేశం నుంచి వీరిని పంపించే ఏర్పాట్లను హైదరాబాద్ పోలీసులు చేయడం లేదు. విదేశీయులను అధికారికంగా దేశం తరఫున వారి దేశాలకు పంపించాలంటే వారిని డిపోర్టింగ్ సెంటర్‌కు పంపి అక్కడి నుంచి మన విదేశాంగ శాఖ ద్వారా సంబంధిత దేశాలకు పంపించాల్సి ఉంది. ఇప్పటి వరకు నైజీరియా తదితర దేశాలకు సంబంధించి దిల్లీలో గానీ ఇతరత్రా ప్రాంతాల్లోను డిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా దేశస్థులను వారి దేశాలకు వెంటనే పంపించడానికి వీలుపడటం లేదని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో మత్తు మందుల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బెంగళూరు తరహాలో వెనక్కి పంపిస్తేనే ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో మన విదేశాంగ శాఖకు వాస్తవ పరిస్థితిని వివరించి వారిని అధికారికంగా పంపించడానికి ఏర్పాట్లు చేస్తేనే మత్తుమందుల నేరాలు తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఏడో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

పుట్టినరోజు వేడుకలకు రూ.500 ఇవ్వలేదన్న మనస్తాపంతోనే


శిరీష (పాతచిత్రం)

రాయపర్తి, న్యూస్‌టుడే: పుట్టిన రోజు వేడుకలు చేసుకోవాలన్న కుమార్తె ఆశ ఒక వైపు.. దాన్ని నెరవేర్చలేని తల్లిదండ్రుల నిస్సహాయత ఇంకోవైపు. రెండింటి మధ్య నలిగిన పసి మనసు ఆత్మహత్య వైపే మొగ్గుచూపింది. రూ. 500 కోసం అకారణంగా మృత్యువు పాలైంది. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలంలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఏకేతండా శివారు ర్యాగెట్లతండాకు చెందిన గుగులోతు యాకూబ్ దంపతులు రోజువారీ కూలీలు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె శిరీష(12) వర్ధన్నపేటలోని ఎస్టీ వసతి గృహంలో ఏడో తరగతి చదువుతూ సెలవులకు ఇంటికొచ్చింది. బుధవారం శిరీష పుట్టిన రోజు. స్నేహితులతో కలిసి వేడుకలు చేసుకునేందుకు రూ. 500 ఇవ్వాలంటూ సోమవారం తల్లిని కోరగా.. ఆమె రూ. 100 ఇచ్చి సరిపెట్టుకోమంది. మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లోనే పురుగుమందు తాగింది. వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వాయిదాపై హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: నిర్దేశిత షెడ్యూలు ప్రకారం ఈనెల 3 నుంచి 7వతేదీ వరకు ఉస్మానియా వర్సిటీలోనే 105 ఇండియన్ సైన్స్ కాంగ్రెస్(ఐఎస్‌సీ)ను నిర్వహించేలా అధికారుల్ని ఆదేశించాలంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఉస్మానియా వర్సిటీ పర్యావరణ సైన్స్ పీహెచ్‌డీ స్కాలర్ ఎస్. కిరణ్‌కుమార్, మరొకరు ఈవ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రూ. 50 కోట్ల వర్సిటీ నిధుల్ని ఖర్చుచేసి వర్సిటీ ఉపకులపతి, రిజిస్ట్రార్ ఐఎస్‌సీని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్ పోలీసు కమిషనర్‌లు భద్రత కారణాలు చూపుతూ కేంద్రప్రభుత్వానికి, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్(ఐఎస్‌సీఏ) కార్యదర్శికి తప్పుడు నివేదిక ఇవ్వడం వల్ల ఐఎస్‌సీ వాయిదా పడిందన్నారు. ఓసారి కార్యక్రమం నిర్వహణకు తేదీలను ఖరారు చేసి వాయిదా వేయడం వల్ల వర్సిటీ విద్యార్థులకు నష్టం వాటిల్లడంతో పాటు వర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. ముందుగా నిర్ధారించిన షెడ్యూలు ప్రకారం ఐఎస్‌సీని వర్సిటీలో నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ కార్యదర్శి, తెలంగాణ సీఎస్, హోంశాఖ కార్యదర్శి, ఉస్మానియా వీసీ, రిజిస్ట్రార్, తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ పోలీసు కమిషనర్‌లను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

వారసుడొచ్చాడు

- మరోసారి తండ్రయిన మంచు విష్ణు
- రెండో కాన్పులో మగబిడ్డను ప్రసవించిన వెరోనికా

ఈనాడు, హైదరాబాద్: మంచు కుటుంబంలో వారసుడు జన్మించాడు. మోహన్‌బాబు పెద్ద కుమారుడు, సినీ కథానాయకుడు మంచు విష్ణు సతీమణి వెరోనికా సోమవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఇప్పటికే ఈ దంపతులకు అరియానా, వివియానా అనే కవలు జన్మించిన విషయం తెలిసిందే. ఇటీవల విష్ణు తన ట్విట్టర్‌లో 'ఆడపిల్లయినా, మగ బిడ్డయినా తనకు సమానమేనని.. ఎవరు పుట్టినా వారసులుగానే పరిగణిస్తానంటూ' ట్వీటారు.

18 నుంచి 'పల్లెపల్లెకు తెదేపా'

- పార్లమెంటు స్థానాలకు సమన్వయకర్తలు, పరిశీలకుల నియామకం

ఈనాడు, హైదరాబాద్ : ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ నెల 18 నుంచి 'పల్లెపల్లెకు తెదేపా' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయనతో పాటు నేతలు పెద్దిరెడ్డి, బుచ్చిలింగం, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ.. పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమం నిర్వహణకు ప్రతి రెండు పార్లమెంటు స్థానాలకు సమన్వయకర్తను, ఒక్కో స్థానానికి ఒక పరిశీలకుడిని నియమించినట్లు తెలిపారు. ఆదిలాబాద్, పెద్దపల్లికి సమన్వయకర్తగా ఎండీ తాజుద్దీన్, పరిశీలకులుగా టి. వీరేందర్‌గౌడ్, బీఎన్‌రెడ్డిలను నియమించారు. ఇలాగే వరసగా కరీంనగర్, నిజామాబాద్‌లకు బొట్ల శ్రీనివాస్, వంగల స్వామిగౌడ్, బొల్లం మల్లయ్య యాదవ్‌ను, మెదక్, మల్కాజ్‌గిరికి సీహెచ్ కాశీనాథ్, కొత్తకోట దయాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డిని, చేవెళ్ల-మహబూబ్‌నగర్‌కు లక్ష్మణ్ నాయక్ రామావత్, అరవిందకుమార్ గౌడ్, గరికపాటి మోహన్‌రావును, నాగర్‌కర్నూలు-నల్గొండకు బక్కని నర్సింహులు, రేవూరి ప్రకాష్‌రెడ్డిని, భువనగిరి, వరంగల్‌కు ఎన్. నర్సిరెడ్డి, చాడ సురేష్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్యను, మహబూబాబాద్-ఖమ్మంకు నల్లూరి దుర్గాప్రసాద్, లక్ష్మణ్ నాయక్ రామావత్, సామ భూపాల్‌రెడ్డిని, జహీరాబాద్, సికింద్రాబాద్, హైదారాబాద్‌కు సమన్వయకర్తగా అట్లూరి రమాదేవి, పరిశీలకులుగా ఎం. అమర్‌నాథ్‌బాబు, రావుల చంద్రశేఖరరెడ్డి, మస్కతీని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ నియమించారు.

పోలీసుల అదుపులో మౌజన్ హత్యకేసు నిందితుడు

ఈనాడు - అనంతపురం, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని ఓ ప్రార్థనా మందిరంలో మౌజన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. కరడుగట్టిన ఓ దొంగే ఈ హత్య చేసినట్టుగా తేల్చారు. నిందితుడిని అనంతపురం పోలీసులు అదుపులోకి తీసుకుని తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు అప్పగించారు. రాజమహేంద్రవరంలోని లాలాచెరువు ప్రాంతంలో ఉన్న ఓ ప్రార్థనామందిరంలో మౌజన్ మహమ్మద్ ఫరూక్ గత గురువారం అర్ధరాత్రి దాటాకా హత్యకు గురైన సంగతి తెలిసిందే. సదరు మందిరంలో దొంగతనానికి వచ్చిన నిందితుడు ఫరూక్‌ను హతమార్చి అక్కడ నగదు, విలువైన వస్తువులు తస్కరణకు పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరిపి అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన పాతనేరస్థుడు మణిని నిందితుడుగా గుర్తించారు. అనంతపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. నేరం అనంతరం తమిళనాడు వెళ్లిన నిందితుడు సోమవారం అనంతపురం జిల్లా ఉరవకొండకు రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కాట్పాడి, రాజమహేంద్రవరంలోనే మకాం: గుంతకల్లులోని శ్రీలంక కాలనీకి చెందిన మణి ఓ హత్య సహా పలు చోరీలు, ఇతర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. 2013కు ముందు అనంతపురం జిల్లాలో పలు చోరీలకు పాల్పడ్డాడు. ఓ ఇంట్లో చోరీకి వెళ్లిన సమయంలో అడ్డువచ్చిన ఒకరిని హత్య చేసిన కేసు ఇతడిపై నమోదైంది. అతడి సోదరి తమిళనాడులోని కాట్పాడిలోనూ, సోదరుడు రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటాడని సమాచారం. రాజమహేంద్రవరం ప్రాంతంలో కూడా అతనిపై పలు కేసులు ఉన్నట్లు తెలిసింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.